# శ్రీకృష్ణరాయల ఆముక్తమాల్యద

౨

వచనానువాదం

ఆచార్య పాపిరెడ్డి నరసింహా రెడ్డి

# శ్రీకృష్ణరాయల ఆముక్తమాల్యద

వచనానువాదం

ఆచార్య పాపిరెడ్డి నరసింహారెడ్డి

తిరుమల తిరుపతి దేవస్థానాల
ఆర్థిక సాయంతో ప్రచురితం

శ్రీనివాస మురళీ పబ్లికేషన్స్
తిరుపతి - 517 502.

శ్రీకృష్ణరాయలు ఆముక్తమాల్యద

వచనానువాదం - ఆచార్య పి. నరసింహారెడ్డి

శ్రీనివాస మురళి పబ్లికేషన్స్ - 11

సర్వస్వామ్య సంకలితం


ప్రథమ ముద్రణ - 1997
ప్రతులు : 1000

వెల : రూ. 60/-

ప్రతులకు
శ్రీమతి పి ప్రభావతమ్మ
*W/o.* ఆచార్య పి. నరసింహారెడ్డి
తెలుగు అధ్యయన శాఖ
యస్. వి. యూనివర్సిటి
తిరుపతి - 517 502

ముఖ పత్ర చిత్రణ - పేటశ్రీ

ముద్రణ :
బాలాజీ ప్రింటర్స్
138, ప్రకాశం రోడ్డు,
తిరుపతి - 517 501.



కృష్ణరాయులు ఎవరిక

అంకితమిచ్చాడో .

ఆ ఏడు కొండల

వెంకన్నకే ... ...

# విషయ సూచిక

## వచన ఆముక్తమాల్యద


| | | |
|---|---|---|
| ప్ర థ మా శ్వా స ం | - | 1 |
| ఇష్ట దేవతా స్తుతి | - | 1 |
| కృతికర్త వంశ వర్ణన | - | 6 |
| కథా ప్రారంభం | - | 12 |
| విలుబుత్తూరు వర్ణన | - | 12 |
| విష్ణుచిత్తుడు | - | 19 |
| ద్వి తీ యా శ్వా స ం | - | 22 |
| మధురాపుర వర్ణన | - | 23 |
| మత్స్య ధ్వజుడు | - | 35 |
| గ్రీష్మఋతు వర్ణన | - | 37 |
| తృ తీ యా శ్వా స ం | - | 48 |
| విష్ణుచిత్తుని వాదం | - | 49 |
| ఖాండిక్యకేశిధ్వజ సంవాదం | - | 52 |
| చ తు ర్థా శ్వా స ం | - | 69 |
| విష్ణుచిత్తుని విజయం | - | 69 |
| దశావతార స్తుతి | - | 73 |
| విష్ణుచిత్తుని విలిబుత్తూరు ప్రవేశం | - | 79 |


(PTO.)

యామునాచార్యుని చరిత్ర - 84
వర్షాకాల వర్ణన - 92
శరదృతు వర్ణన - 108
యామున ప్రభుని రాజనీతి - 125

పంచమాశ్వాసం - 146
గోదాదేవి చరిత్ర - 146
గోదాదేవి విరహ వర్ణన - 156
వసంత ఋతువర్ణన - 168

షష్ఠాశ్వాసం - 189
దాసరి కథ - 189
దాసరి బ్రహ్మరాక్షసుల సంవాదం - 193

సప్తమాశ్వాసం - 207
బ్రహ్మరాక్షసుని పూర్వజన్మ వృత్తాంతం - 207
గోదాదేవి విష్ణుచిత్తులు శ్రీరంగం వెళ్లడం - 215
శ్రీరంగనాథస్వామి వర్ణన - 216
గోదాదేవి రంగనాథుల కళ్యాణం - 223

# ఆముక్తమాల్యద - వచనం

## ఇష్టదేవతా స్తుతి

విష్ణుస్తుతి : శ్రీలక్ష్మీ వేంకటేశ్వరులు ఎదురెదురుగా ఆసీనులై ఉన్నపుడు లక్ష్మీదేవి సుందర హారమణిలో, స్వామి ప్రతిబింబించారు. స్వామి ఎదమీది కౌస్తుభమణిలో అమ్మవారు ప్రతిబింబించారు. అమ్మవారి హృదయం స్వచ్ఛమైంది - కాబట్టే ఆమె హృదయంలోని స్వామి బయటికి కనిపించి- ఆమె హారనాయక మణిలో దర్శనమిచ్చారు. స్వామి హృదయంలోని శ్రీదేవి స్వామి హృదయ స్వచ్ఛత చేత బయటికి కనిపించినందువల్లనే- వెలుపలి కౌస్తుభమణిలో ప్రతిబింబించింది. అమ్మవారితో అలా కలిసి మెలిసి మహానందంలో ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామిని సేవిస్తాను[1] !

అనంతుని స్తుతి : శ్రీదేవిని అప్పుడప్పుడు ఏమార్చి శ్రీవారి తనను చేరినపుడు భూదేవి ఎంతో ఆనందపడుతుంటుంది. వారిద్దరి సంగమానికి విశాలమైన శేషుని పడగల వరుసలే-ప్రకాశించే చంద్రకాంతల వరుసలయ్యాయి అలాంటి జితేంద్రియుడయిన అనంతుణ్ణి కీర్తిస్తాను[2].

గరుడ స్తుతి : గరుత్మంతుని రెక్కలగాలి తాకిడికి సముద్రాల్లోని నీళ్ళు ఎగిసి-ఆకాశంలో అల్లకల్లోలంగా దుముకుతున్నాయి. వాటిని చూచి పాతాళంలోని పాములు - గరుడుడు శత్రువు కావడం వల్ల భయపడి-ఒకదాని నొకటి చుట్టుకొని ముడుచుకున్నాయి.

గరుత్మంతుని రెక్కల గాలులు మేరు పర్వతం, మందర పర్వతాల గుహల్లో ప్రతిధ్వనించడం వల్ల - అన్ని లోకాలకు వినిపింప జేయడానికి మ్రోగే జంట భేరుల్లాగా - ఆ రెండు పర్వతాలు ఉన్నాయి.

మిక్కిలి వేగంగా వీచే వైనతేయుని రెక్కల గాలి వల్ల - అష్ట దిక్పాలకులు తమకెదురుగా ఉండే దిక్కుల్లోని నగరాల్లో వెళ్ళిపడ్డారు.

గరుడుని రెక్కల గాలి దెబ్బకు మేఘాలలోని జ్యోతి, సముద్రం అడుగున ఉండే బడబానల స్థానంలో పోయి పడింది. బడబానలం మేఘాల్లో ఉండే జ్యోతిస్థానంలో పోయి పడింది. అలాంటి గరుత్మంతుని రెక్కల గాలులు పాపాలనే దూది పింజెల్ని ఎగుర గొట్టుగాక[3] !

విష్వక్సేన స్తుతి : శ్రీ మహావిష్ణువు సేనాపతి అయిన విష్వక్సేనుని చేతిబెత్తం కదిలినపుడు బ్రహ్మాండాలు సృష్టింపబడతాయి. ఆగినపుడు సృష్టి నిలిచిపోతుంది. ఆ బెత్తమే స్వామివారి కనుబొమల సైగను బట్టి ఈ కార్యాల్ని నిర్వర్తిస్తున్నదేమో అన్నట్లుంది. అలాంటి విష్వక్సేనుని బంగారు బెత్తాన్ని ఆశ్రయిస్తాను.

పాంచజన్యస్తుతి : శ్రీహరి పాంచజన్యాన్ని పూరించేటపుడు ఆయన నిశ్వాస వాయువు సువాసనకు-స్వామి బొడ్డులో ఉండే కమలంలోని తుమ్మెదలు బారులుగా ఎగిరివచ్చి పాంచజన్యంపై పడ్డాయి. స్వామి శంఖమైన పాంచజన్యం-పాపాల వల్ల మలినమైన రాక్షసుల ప్రాణాల వరుసల్ని తనవైపునకు లాక్కుంటూ ఉందేమో అన్నట్టుగా ఆ దృశ్యం ఉంది. పున్నమి రేయి చల్లని చందమామలాగా తెల్లనిదైన ఆ శంఖం-సకల మంగళాల్ని ఇచ్చుగాక !

నందక స్తుతి : పిడికిటికి కిందామీదా ఉండే గుండ్రని చదును బిళ్లలతో ఉండే ఖడ్గంపిడి దీప స్తంభంలా ఉంది. మొసలి నోటి ఆకారంతో ఉండి, 'మొసలివాయి' అని పిలువబడే బంగారు ఖడ్గ భాగం దీప జ్వాలలా ఉంది అలుగు పొగరేఖలా ఉంది. విజ్ఞాన దీపాంకురంలాగా అందంగా ఒప్పుతున్నది శ్రీహరి ఖడ్గం అయిన నందకం. ఆనందకం మా పాపాలనే తీగల వరుసల్ని కోసివేస్తుంది.

కౌమోదకీ స్తుతి : పూర్వం సాళ్వుడనే రాక్షసరాజు ఆకాశగామి అయిన సౌభకం అనే పట్టణంతో వచ్చి ద్వారకపై పడ్డాడు. శ్రీకృష్ణుడు తన కఠినమైన విశాలమైన బాహువుతో కౌమోదకి గదను ప్రయోగించి ఆ పురాన్ని ఛేదించాడు. అప్పుడు ఆపురం ఆ గదకు ఉండే కంకణాల్లో ఒక కంకణమై అలరారింది. ఆ కౌమోదకీ గదను కల్పవృక్షపు పూలహారాలతో దేవతలు అలంకరించారు. అలాంటి కౌమోదకీ గదను సేవిస్తాను.

శార్ఙ్గ స్తుతి : శ్రీహరి సుమాలితో యుద్ధంచేస్తూ బాణవర్షం కురిపించేటపుడు స్వామివారి విల్లు శార్ఙ్గం ఇలా అంది. "ఓ స్వామీ ! నీవు

పిడికెడు నడుమును, కొప్పును కలిగిఉంది మరుగుజ్జదైన త్రివక్రను ప్రేమతో సుందరిని చేశావు. నాకు పిడికెడు నడుమూ, కొప్పు ఉండడమే కాదు దానితో పాటు గుణం (వక్రత్వం లేకపోవడం) (నారి) కూడా ఉంది. కాబట్టి నన్నుకూడా ఒక సుందరిగా చేసి రక్షించు" అని అభ్యర్థిస్తూ ఉన్నట్లుంది. అలాంటి ఆ శార్ఙ్గం మమ్మల్ని రక్షించు గాక[8] !

సుదర్శన స్తుతి : శ్రీమహా విష్ణువు మోహినీ రూపం ఎత్తి రాక్షసుల్ని వంచన చేసి దేవతలకు అమృతం పంచుతూ ఉండే సమయంలో రాహువు అనే రాక్షసుడు దేవత వేషంలో వారితో కలిసి అమృతం త్రాగుతూ ఉన్నాడు. ఈ మోసం తెలిసిన మహావిష్ణువు సుదర్శన చక్రంతో వాని తలను నరికాడు. రాహువు కంఠం నుంచి పైకెగజిమ్మిన రక్తధారలు మంటలాగా- వాని నోటిలో నుండి బయటికి ఉమియబడిన అమృతం ఎనటి పొంగులాగా- వాని తల దోనపు కుండలాగా ఉంది. అలాంటి ఆ రాక్షసుని తలనరికిన సుదర్శన దేవుని సేవిస్తాను[9].

ఆళ్వార్ల స్తుతి : శ్రీమహావిష్ణువు ద్వాదశ సూర్య మండలాల్లోను నివసించడం వల్ల మిక్కిలి తాపాన్ని పొందాడు. అలాంటి స్వామి భూమిమీద అవతరించిన పన్నెండు మంది ఆళ్వార్ల మనః పద్మాలలోని మకరంద ప్రవాహం వల్ల సుఖించాడు. అలాంటి జ్ఞానులైన పన్నెండుగురు ఆళ్వార్లను మోక్షం కోసం స్మరిస్తాను[10] - అని ఇష్టదేవతా వందనం చేసి - (శ్రీకృష్ణదేవ రాయలు తర్వాతి కథను ఇలా చెప్పుతున్నాడు.)

''నేను కళింగ దేశాన్ని జయించే బుద్ధితో దండెత్తిపోయి. బెజవాడలో కొన్ని దినాలుండి, శ్రీకాకుళంలోని ఆంధ్ర మహావిష్ణువును సేవించడానికి పోయి అక్కడ ఏకాదశీ వ్రత ఉపవాసం చేశాను. ఆ పుణ్య రాత్రి వెల్లవ జాములో'' నా స్వప్నంలో ఆంధ్రమహావిష్ణువు దర్శనమిచ్చాడు.

ఆంధ్రమహావిష్ణువు వర్ణన : ఆ స్వామి-నీలమేఘశ్యామ వర్ణాన్ని డీలు చేయగలిగే దామనచాయ దేహం కలవాడు. పద్మాల్ని తిరస్కరించే విశాల నేత్రాలు కలవాడు. పక్షీంద్రుడయిన గరుడుని రెక్కల వర్ణాన్ని మించే

హొంబట్టు తెలుగు వస్త్రాన్ని ధరించినవాడు. ఉదయ సూర్యబింబపు అందాన్ని మించే కౌస్తుభమణి ధరించినవాడు. అలాంటి స్వామికి శ్రీదేవి ఒక చేత పద్మాన్ని ధరించి, మరొకచేత కైదండ ఇస్తూఉంది. ఆమెతో కలిసిఉంది తొణికిసలాడే శ్రియను తెలిపే చిరునవ్వుతో ఆంధ్రమహావిష్ణువు నాకు ఇలా ఆనతిచ్చారు[12]''

ఆంధ్రమహావిష్ణువు పలుకులు : " ఓ కృష్ణరాయా ! రసికులు ఔననేటట్లు అతిశయించే 'మదాలస చరిత్ర'ను పలికావు. భావానికి ధ్వనికి, వ్యంజనా వృత్తికి నిధిగా ఉండేట్లు 'సత్యవధూప్రీణనము' చెప్పావు. వేదాలు పురాణాలు, ఉపసంహితలు శోధించి 'సకల కథా సార సంగ్రహము'ను కూర్చావు శ్రోతల పాప పుంజాలు విచ్చిపోయేటట్లు సూక్తి నైపుణితో 'జ్ఞాన చింతామణి' కృతిని రచించావు ఇంకా 'రసమంజరి' మొదలైన మధుర కావ్యాల రచనతో సంస్కృత భాషలో మెప్పుగొన్నావు అలాంటి నీకు ఆంధ్ర భాష అసాధ్యమైంది కాదు, కాబట్టి ఆ భాషలో మాకు ప్రియంగా ఒక కృతిని నిర్మించు[13] !

అనేక అర్చావతారాలు గల స్వామివి నీవు ఏ అవతారాన్ని గురించి కావ్యం రచించేది? అంటావేమో ! విను! నేను కృష్ణావతారంలో-సుధాముడు అనే మగవాడు పూలదండను సమర్పించినపుడు గ్రహించాను. ఆ ఏవగింపు ఇంకా నా మనస్సులో అలాగే ఉంది. ఆ కొరత తీరేటట్లు - తానుకొప్పున ధరించిన పూదండనే సమర్పించిన చిన్నది అయిన గోదాదేవిని, నేను రంగనాయకునిగా శ్రీరంగంలో పెండ్లాడిన కళ్యాణ వృత్తాంతం చెప్పు ! నేను తెలుగురాయణ్ణి. ఓ కన్నడరాయా ! ప్రేయసి తలదాల్చి సమర్పించిన మాల్యాన్ని దాల్చిన రంగమన్నారు కథ చెప్పి. కృష్ణావతారం నాటి కొదువను తీర్చు[14] !

తెలుగులోనే ఎందుకు రచించాలి? అంటావేమో! ఈ దేశం తెలుగు దేశం. నేను తెలుగు రాయణ్ణి. తెలుగు భాష కలకండతో సమానమైంది. రాజులందరూ నిన్ను కొలిచేటపుడు వారితో బాసాడి తెలుగొక్కటే గొప్పదని

నేను రచించే కావ్యం ఎవరికి అంకితం చేసేది? అంటావేమో! ఏ ఇష్టదైవం శ్రీవేంకటేశ్వరుడు కాబట్టి. అతనికే అంకితం ఇవ్వు! పేర్లలో భేదం ఉండవచ్చు గాని ఈ భూమి మీద నేనే అతణ్ణి గదా[16]!

నేను చెప్పినట్లు నీవు ప్రబంధం విరచిస్తే నీకు అభ్యుదయాలు కలుగుతాయి''-అని పలికి స్వామి అదృశ్యమయ్యాడు. నేను ఆశ్చర్యపడుతూ మేలుకొని భక్తితో స్వామి ఆలయగోపురానికి నమస్కరించి తెల్లవారగానే వేకువ జాములో చేయవలసిన సంధ్యావందనం మొదలైన అనుష్ఠానాల్ని ముగించుకున్నాను[17] తరువాత నిండుకొలువుండి సేనాపతుల్ని, సామంతుల్ని వెంటలకడనే వారివారి నెలవులకు పంపించి, వేదాల్ని పాంచరాత్రాది ఆగమాల్ని తెలిసిన విద్వాంసుల్ని కానిపించుకొని, వారికి మ్రొక్కి ఆ శుభస్వప్నం వినిపించాను వారు సంతోషించి ఆశ్చర్యంతో నిండిన మనస్సుగలవారై ఇలా అన్నారు- "దేవా! దేవదేవుడు విచ్చేసిన ఆ స్వప్నం అనేకాలైన శుభ పరంపరల్ని తెలుపుతూ ఉంది. ఎలాగంటే - ఆ పద్మాక్షుడు స్వప్నంలో సాక్షాత్కరించడం నీకు ఇంతకంటే గొప్ప భక్తిని ప్రసాదిస్తుంది. ప్రబంధం నిబంధించమని నీకు చెప్పడం ఇంతకంటే లోతైన విద్యాప్రాప్తినిస్తుంది. కలలో స్వామి దేవేరి కూడా కనిపించడం - ఇప్పటికంటే ఎక్కువ భాండాగార సమృద్ధిని చేకూరుస్తుంది ఆమె చేతి తెల్లని నూరురేకుల తామరపువ్వు. ఇంతకంటె ఎక్కువైన అద్వితీయమైన వెల్లగొడుగును కలిగి ఉండే ఏకచ్ఛత్రాధిపత్యాన్ని ప్రసాదిస్తుంది. అనేక రాజుల సేవద్వారా ఆయా భాషలు తెలుసుకొన్నావుగదా! అనడం ఇంకా ఎక్కువగా సామంతరాజ సమూహాన్ని రప్పించుకోవడాన్ని సూచిస్తూ ఉంది ప్రేయసి అనుభవించగా మిగిలిన దానిని అనుభవించడం తనకు ఇంపు అని చెప్పడం ఇంకా బహు ప్రేయసీ ప్రాప్తినిస్తుంది. ప్రబంధం చెప్పితే ఉత్తరోత్తరాభివృద్ధి కలుగుతుంది అనడం నీ కింకా అధిక సంతానాన్ని, పూర్ణాయుష్షును కలిగిస్తుంది. అధిక మహాత్త్వం వల్ల మిక్కిలి దురంధరుడైన తుర్వసుని వంశంలో పుట్టిన నీకు ఇలాంటి శుభ పరంపరలు కలగడంలో అద్భుతమేముంది? చిత్తగించండి[18].''

కృతికర్త వంశవర్ణన : క్షీర సముద్రంలోని శ్రేష్ఠమైన తరంగం అతన్ని కడుపార కన్నతల్లి - ముక్కంటి దట్టమైన జడలనే అడవి వరుసకు అతడు వన్నెగలిగించే వర్ష ఋతువులలో పూచే పుష్పం. దేవతలందరి ఆకలి తీరడానికి మొలవడం, మార్పడం లేని మెట్ట పంట. అతడు కటిక చీకటి. తీండిగా కలిగిన్న కిరణాల గిలిగింతతో కలువ కన్నెను నవ్విస్తుంటాడు అతడు విష్ణుని శాశ్వమరది. కళలకు ఉనికిపట్టు; చుక్కలరాజు. కాంతికి అవతలి హద్దు. మన్మథుని మేనమామ. వేయివెలుగుల దొర అయిన సూర్యునికి తోడు అలాంటి రేవెలుగు అయిన చంద్రుడు స్తుతింపబడు తుంటాడు[19].

ఆ చంద్రుని ఐశ్వర్యమనే మహాసముద్రానికి పొంగుమీరేట్లు కుమారుడు ఉదయించాడు. అతడే వేదవేదాంగ శాస్త్రార్థాల స్వచ్ఛ సంస్కారం చేత గొప్ప బుద్ధిమంతుడైన బుధుడు[20].

బుధునికి సింహాసముడు, త్రికాల జ్ఞాని అయిన పురూరవుడు జన్మించాడు. [illegible] కొడుకు ఆయువు. ఆయువుకు యయాతి కుమారుడు [21]

యయాతికి కీర్తిమంతులైన యదువు, తుర్వసుడు అనే ఇద్దరు కుమారులు పుట్టారు. వారిలో తుర్వసుడు గుణనిధి అయి కీర్తిమంతుడయ్యాడు.[22]

తుర్వసుని వంశ[illegible]వ కూతమైంది. ఆ వంశంలో అనేక మంది రాజులు పుట్టారు. సమస్త జగాల్లో నిండిన కీర్తితో వారు గొప్పవారయ్యారు.[23]

ఆ రాజుల వంశంలో పుట్టిన తిమ్మరాజు ఘనుడై - ఆదికూర్మం, ఏడుకులపర్వతాలు, ఆదిశేషుడు, అష్టదిగ్గజాలు, ఆదివరాహం-అనే ఈ పద్దెనిమిదీ భూమిని మోయలేక, మోయగలమని చెప్పక, డంబం కోసం మోస్తూ భూదేవిని శ్రమపరుస్తూ ఉండగా, వాళ్ళ ఆడంబరాన్ని తొలగించి, ఆమెను దండంలాంటి తన [illegible] అనవం ఊద పోయగా నెలకొల్పాడు. లోకులు అంతా తనకీర్తిని [illegible] చేస్తూ, శత్రువులు తనకు వందనాలు చేస్తూ పక్కన కొలుస్తూ ఉండగా-తీవ్ర ప్రతాపాన్ని చూపాడు.[24]

దానవిధి అయిన ఆ తిమ్మరాజుకు, దేవకి దేవికి మహనీయదేహంతో ఎంతో పుణ్యవంతుడు, సాధుజన సంరక్షణ శ్రద్ధగలవాడు అయిన ఈశ్వర దేవరాయలు జన్మించాడు[25].

పూర్వం ఈశ్వరుడు రాక్షసుల త్రిపురాల్ని కాల్చి పార్వతిని ఏలు కోగా-నేడు ఈశ్వరరాయలు దుష్టశాత్రవుల పురాల్ని కూల్చివేసి సాధుజనుల్ని కాపాడాడు. [పరిపాలిత అర్యుడు = పార్వతిని ఏలుకొన్నవాడు శివుడు. సజ్జనులను కాపాడినవాడు-ఈశ్వరరాయలు] మన్మథుని భస్మం చేసిన నాటి ఈశ్వరుడే ఈశ్వరరాయలుగా పుట్టినందువల్ల - పద్మనేత్రలైన భార్యల్ని వదలి-కొండలలో, అడవులలో భీతిచెందిన మనస్సు గలవారై సంచరించే శత్రురాజుల శరీరాల మీద పూర్వం ఉండిన ఆలింగనాదుల వల్ల కలిగిన కుచ కస్తూరి ముద్రలలాంటి మన్మథ చిహ్నాలు మాసిపోయాయి [26]

తిమ్మరాజు కుమారుడైన ఈశ్వరరాజు - రాజులు సమర్పించిన కానుకల వల్ల అధిక సంపద గలవాడై - ఇంద్రుని ఐశ్వర్యాన్నే జయించాడు. అతడు తన భుజాన్ని ఆశ్రయించిన భూదేవికి వజ్రకవచం. దుష్టజనులనే పాములకు పాములవాడు. ఎంతో సొగసుకాడైనందువల్ల పద్మనేత్రల మనస్సు లనే సిరులకు ప్రత్యక్ష చోరుడు [చూచే వాళ్ణే పమార్చి దొంగలించేవాడు-పశ్యతోహరుడు]. శత్రువులనే హంసల్ని వర్షఋతువై తరిమేవాడు. యాచ కుల గుంపులనే కోయిలలకు వసంత ఋతువులాంటి సంతోషకరుడు. గుణా లనే రత్నాలకు రోహణ పర్వతంలాంటివాడు. బంధుసమూహం అనే కమల వనానికి సూర్యుడు. దయ అనే నీటికి సముద్రుడు- అని ప్రజలు భావిస్తూ ఉండగా లోకాల్లో మిక్కిలి కీర్తి పొందాడు.[27]

ఆ ఈశ్వర రాజుకు పుణ్యకాల్యాల్లో ఎంతో ఆసక్తి చూపే బుక్క మాంబకు సూర్యతేజులు, ప్రజ్ఞావంతులు అయిన నరసింహరాజు, తిమ్మరాజు జన్మించారు[28]. వారిద్దరిలో నరసరాజు తన నిర్మల కీర్తి - శ్రీగంధంతో, పారి జాతాలతో, మల్లెలతో, చంద్రకిరణాలతో సమానమైన - దిక్కుల చివరల వరకు వ్యాపిస్తూ ఉండగా పాపాలు నశించిపోయేట్లు భూమిని పాలించాడు[29].

నరసింహారాయలు మిక్కిలి పదునైన తన ఖడ్గంతో కుండలాలు, కిరీటాలతో కూడిన శత్రురాజుల తలలనే పూలదండల్ని పరంపరగా చేసి ఈశ్వరుణ్ణి పూజించాడు. సముద్రమే వస్త్రంగా కలిగిన భూవలయాన్ని తనగొప్ప బాహువులకు ధరించే భుజకీర్తిలోని మరకతంగా చేశాడు. దిగంతాల వరకు ఉన్న సకలరాజ సమూహాన్ని తన పాదానికి ధరించే గండపెండేరంలో పాలభంజికలుగా (బొమ్మలుగా) చేశాడు. తన శుభకీర్తి అనే సరసుకు ఆకాశాన్నే రాజహంసగా చేశాడు. ఎడతెగని దానమనే జడివాన సమృద్ధికి కవుల సమూహాన్నే చాతక పక్షులుగా చేశాడు[30]

ఆ నరసింహదేవరాయలు తిప్పాంబవల్ల వీరనరసింహారాయల్ని, నాగమాంబిక వల్ల శ్రీకృష్ణరాయలనైన నిన్ను నందనులుగా పొందాడు [31]

వీరనరసింహారాయలు తన దారుణ ఖడ్గం యొక్క కఠినమైన వాదరతో శత్రువుల్ని తుదముట్టించి, వారింపరాని ప్రభావంతో ఏకచ్ఛత్రాధిపత్యంగా భూమిని ఏలాడు[32].

సోదరుడైన వీరనరసింహారాయల తరువాత నీవు భూమండలాన్ని వహించావు. తిరుమలదేవిని, అన్నపూర్ణా దేవిని పట్టపు రాణులుగా చేసుకొన్నావు[33].

ఈశ్వర రాజు పుత్రుడైన నరసింహరాజుకు కుమారుడైన ఓ కృష్ణ రాయా! నీవు అభ్యుదయం పొంది భూమిని పాలిస్తూ ఉండగా - ప్రజలకు అనావృష్టి సూచకమైన తోకచుక్క బాధ తొలగింది. అతివృష్టి భయం పోయింది. పిండారి దండులాంటి శత్రువుల భీతి గడచి పోయింది. గర్వితులైన రాజుల రాజధానులు బలహీనమయ్యాయి. పాపాల అతిశయం రూపుమాసింది. ఎడారి నేలల్లో కూడా నెలకు మూడువానలు విందార కురిశాయి. ఆ బాల గోపాలం, అఖిల సజ్జన సమూహం సుఖజీవితంతో నిరంతరానందాన్ని పొందారు. నీ రాజ్యం బాలమరణాది పీడలు లేని రామరాజ్యం అయింది[34].

ఈ భూమి తొమ్మిది తునియలుగా ఉంది. కాని మోసేవాళ్ళు మాత్రం పద్దెనిమిదిమంది అష్టదిగ్గజాలు, ఆదివరాహం, కూర్మం, సప్తపర్వతాలు, ఆదిశేషుడు ఏమి బలవంతులు? అని నీ కుడిభుజం ఒక్కటే మొత్తం భూమండలాన్ని భరించింది[35].

కృష్ణరాయా! ఉదయగిరి దుర్గమనే చెకుముకి రాతిని తగిలి నీ కత్తి అనుములో రాటరాని, క్రీడిస్తూ ఉండే ఉగ్రమైన ప్రతాపాగ్ని పుట్టింది. ఆ ప్రతాపాగ్ని కొండవీడెక్కి మార్కొని వలివంటి కసవా పాత్రుని సంహరించింది. అక్కడి నుండి సాగి జమ్మిచెట్టు సమూహంలాంటి జమ్మిలోయను దహించింది. కోనసీమను, కొట్టం అనే పురిని గాల్చింది. కనకగిరి ప్రకాశాన్ని కరగించింది. గోదావరిని కాగజేసింది. అవతల పొట్టుతో సమానమైన పొట్నూరులో రగులుకొంది. మాడెమనే మన్నెదేశాన్ని కాల్చి, ఒడ్డాదిని మసిచేసింది. గజపతి బెదిరిపారిపోయేటట్లు ఉత్కళ రాజధానియైన కటక పురిని తోక చిచ్చులాగా కాల్చివేసింది.[36]

రాజశేఖరుడవైన ఓ కృష్ణరాయా! నీ ధాటికి వెరచి ఉత్కళదేశ క్షత్రియ పాత్రులు కొంచెమైనా యుద్ధం చేయకుండానే-కసుగందని దేహాలతో కొండవీటి నుండి వీరస్వర్గంలోని దేవస్త్రీల వాడలకు కాపురం పోయారు. ఇది చిత్రం! స్వర్గానికి, కొండవీటికి వీరి పెద్దలు పూర్వం పరవాన్య మార్గాన్ని వన్నారో గదా! [యుద్ధం చేయకుండానే పలాయితులై రాజమహేంద్రవరం అడవులలో చెంచుగూడేలలో దాగారు అని ఇంకో అర్థం.][37]

కృష్ణరాయా! కళింగరాజ్యలక్ష్మి వీరరుద్రుని చేరకుండా - మిక్కిలి అనురాగంతో కూడిన ఆశలతో (మిన్నులు ముట్టిన ఏనుగులతో మోహనాలతో అవిఅర్థం) నిన్నే చేరింది. కారణం సమంజసమైందే! లక్ష్మి ఎంతో వేడుకతో కృష్ణుని చేరుతుంది. అంతేగానీ వానిచెడి సోదరుడైన రుద్రుని చేరదు కదా[38]!

కృష్ణరాయా! నీ ధాటికి భయపడి గజపతి కళింగదేశం వదిలి వింధ్య పర్వతానికి పలపపోయాడు. అక్కడ పసులకాపరి వేషంతో - ఒక అరణ్యంలోని చీకటి గుహలో ప్రవేశించి త్వరత్వరగా నడుస్తూ ఉండగా-ఒక రాయి నొసటికి తగిలి నెత్తురు స్రవించి పేరుకొంది. ఆ రాజు మరునటి ఉదయమే నిద్రమేల్కొని-సెలయేటిలో తననీడను చూచి - తాను వేసుకున్న గోపవేషం చెడిపోయి-తన తొల్లిటి రాజవేషం వచ్చిందని భ్రమపడ్డాడు.

ఈ మార్పు జరగడం ఆ వన మహిమగా తోచింది. భయపడి ఆ వింధ్య పర్వత ప్రాంతాన్నే వదలి పెట్టారు. రాత్రి తాను నిద్రించిన గుహలోని పాము కుబుసం-జుట్టుకంటుకొని రజరంగోచితమైన పీనకేదారపు పాగలాగా ఒప్పింది. తనదేహానికంతా తగులుకున్న పాలెపురుగులు గూర్కు-పట్టురవసెల్లాగా కనిపించింది. రాత్రి రాయి నొసటికి తగిలి గడ్డకట్టిన నెత్తురు-సింధూర తిలకంలాగా కనబడింది శ్రమవల్ల తాను పొర్లినపుడు అంటుకొన్న నెమలిపురి - మూడు రంగుల ఉత్తరీయం చెంగులాగా కనిపించింది. అందువల్లనే గణపతి అలా భ్రమపడ్డాడు[39].

కృష్ణరాయా! నీవు పొట్నూరు వద్ద తాటిచెట్టు ఎత్తున జయ స్తంభాన్ని నాటించి జయశాసనాలు రాయించావు. సింహాచల నృసింహ స్వామి తిరునాళ్ళకు వస్తూ ఉండే ఇంద్రాది దేవతలు నీ జయ శాసనంలోని అక్షరాలు స్పష్టంగా తెలుసుకోవడం కోసం గణపతి అపకీర్తి అనే మసిని చాలా సార్లు శాసనం మీద పూసి చదువుకొంటూ ఉంటారు[40].

ఓ కృష్ణరాయా! కల్బరిగ [నేటి గుల్బర్గా], సాగరు పట్టణాల మహమ్మదీయరాజుల ముస్లింవీరులు దండు యుద్ధంలో నీ కత్తి చేత మరణించి స్వర్గమేగింది. అక్కడ వారు విచ్చలవిడిగా తిరుగుతూ సనకాదిమునుల నొసటి గోపిచందన త్రిపుండ్రాల్ని నాకుతుంటారు. దేవగాయకులైన హాహా హూహూల చేతి వీణలు లాక్కొని పింగిణీ విండ్లలాగా గుండ్రంగా చేసి తంతులు తెగేటట్లు చెరలాగుతుంటారు. ఆకాశ గంగా తీరంలో సప్తర్షులు చేసిన ఇసుక లింగాల్ని ముచ్చెల కాళ్ళతో మాటిమాటికీ త్రొక్కివేస్తూ ఉంటారు. రంభ మొదలైన అప్సరస భామల పెద్దవైన కుచ కుంభాల్ని మాటిమాటికీ మర్దిస్తూ ఉంటారు అమరావతిలోని కల్పవృక్షం మధువుల్ని మరిగి విచ్చలవిడిగా సంచరిస్తూ ఉంటారు[41].

కృష్ణరాయా! నీ ప్రతాపాన్ని ఏమని పొగిడేది? ఒక్కదాడిలోనే నీ గుర్రం గిట్టలతో బాగేళ్ళతో లాగా-ఖురాసాను మహమ్మదీయుల తలల్ని

పుచ్ఛలతో టల్ని దున్నినట్లు దున్నావు. ఏనుగుల దండుల మదజలమనే వానతో ఉత్తర దిగ్భాగమంత మెట్ట చేలను లాగా తడిపావు. ఆ పదునులో నీ కీర్తి పైరును నాటావు ఆ పైరుకు పదులంతాను ఉగ్రమైన తలపుర్రెనే దిష్టి పిడతగా నిలిపావు[42].

ఓ రాజా! మాట మాటకి నీవుచేసే పదహారు విధాల దానాల పరంపరల వసంతాల్లో-కడలేని ధనాన్ని, భూమిని, గొప్ప అగ్రహార సమూహాన్ని మంచి మనసుతో ఇస్తూ ఉన్నావు. అలాంటి నీతో పోటీపడి పాటి రాలేక కల్పవృక్షాలు-తుమ్మెదలు, కోయిలలు అనే నెపంతో - అపకీర్తిని ధరించి ఉన్నాయి[43].

ప్రబల రాజాధిరాజా! వీరప్రతాపా! రాజపరమేశ్వరా! అగ్రదుర్గా వశేరా! సాహితీ సమరాంగణ సార్వభౌమా! కృష్ణరాయేంద్రా! కృతిని వినిర్మింపుము''-అన్నారు[44].

## దృష్యంతాలు

ఈ విధంగా విద్వాంసులు విన్నవించగా నేను (రాయలు) సంతోషాంతరంగుణ్ణి అయి[45]-

లక్ష్మి వక్షోజాల నిండుగా పూయబడిన నిగ్గుదేరిన కుంకుమం అంటుకొన్న విశాల వక్షునికి, ఇంద్రాది దేవతలకు దొర అయిన వానికి, పద్మ నేత్రునికి, నరసింహావతారునికి[46], కాళీయసర్పాన్ని మర్దించిన వానికి, జటాజూట ధారి అయిన శివుడు, బ్రహ్మదేవుడు పాదాలకు నమస్కరిస్తూ ఉండేటప్పుడు-వారి ప్రతిబింబాలు కనిపిస్తూ ఉండే పరిశుద్ధమైన పాదాల గోర్లకాంతులు గలవానికి, శార్ఙ్గ ధనుస్సు ఒరుసుకోవడం వల్ల కాయలు గాచిన బాహుదండం కలవానికి, పాపాలనే చీకటికి సూర్యుడైన వానికి, రక్కసులనే మేటి ఏనుగులకు అంకుశం అయిన వానికి[47], కుమార పుష్కరిణి తీరంలో దట్టమైన అడవితో

వేటాడే కపట చెంచు వేషధారికి, కొజ్జలో బిచ్చమెత్తాలనుండే వానికి, విడువు లైన కడగన్నులలో సదా దయారసం ప్రసరించే వానికి, సొంపైన చక్రపు వాదర అనే అగ్ని యొక్క మండుతూ ఉన్న జ్వాలా సమూహపు పునస్సం ధుక్షణ (మళ్ళీ మండించడం) కర్మలో రాహువనే రాక్షసుని రక్త ప్రవాహాన్నే ఆజ్యంగా సుకొన్న వేంకటాచలపతికి -

## -కథా ప్రారంభం-

నేను విన్నవించాలని పూనుకొన్న ఆముక్తమాల్యద అనే మహా ప్రబంధానికి కథాక్రమం ఎలాంటిది? అంటే[50]-

విలుబుత్తూరు వర్ణన : పాండ్యదేశంలోని నగరాలన్నిటికి మాణిక్యపు పాపటబొట్టుగా శ్రీవిలుబుత్తూరు-ఆకాశాన్నంటే మేడలతో విలసిల్లుతూ ఉంటుంది. ఆ మేడల వాచూరుల్లో నీలమణులతో చెక్కిన కోయిలలు, పచ్చలతో చెక్కిన చిలుకలు కూస్తూ ఉంటే-ఆ మేడలు ప్రతిధ్వనిస్తుంటాయి. బాటసారులు మణులతో చెక్కిన కోయిలలు, చిలుకలే ఆ ధ్వనులను చేస్తూ ఉన్నాయని భ్రమిస్తూ ఉంటారు[51].

ఆ విలుబుత్తూరు పురంలోని మేడలు తామర మొగ్గల్లాగా చేసిన కెంపుల కలశాలు అనే ఎఱ్ఱని కాంతి గల శిరస్త్రాణాలతో, మేలిమి బంగారు టనులిక్కలనే కవచాలతో. స్వర్గంలోని ఇంద్రుని భవనమైన వైజయంతంతో యుద్ధం చేసేందుకు సిద్ధపడి నిలబడి ఉన్నట్లు విరాజిల్లుతుంటాయి[52].

విలువుత్తూరులోని వీధులు సూత్రం పట్టినట్లు వంపులు లేకుండా చక్కగా ఉంటాయి. ద్వారాల మెట్లకు అలంకారం కోసం శశ్యంతో చెక్కిన ముగ్గులు ఉంటాయి. ఆ పసరు వన్నెలో ఉన్నందు వల్ల - పొదిపట్టిన తిగ్గ

జాలేమో అన్నట్లు ఒప్పారుతూ ఉంటాయి. ఏనుగుల తొండాన్ని మాత్రం మిగిలించి-మిగిలిన శరీరాన్నంతా మింగిన సింహాలలాగా-మరకతాలతో చెక్కిన సింహాలు మెట్లకు చెక్కబడి ఉంటాయి. ద్వారం పైన శ్రీమహాలక్ష్మిని రెండు ఏనుగులు జలకమాడిస్తూ ఉన్నట్లు-బంగారు నీటి చేత చిత్రింపబడిన ప్రతిమలుంటాయి లక్ష్మీప్రతిమకు ఇరువైపులా ఉండే శంఖ చక్రాల నీడలు దిగువన ఉండే రత్నమయ వేదికల్లో ప్రతిఫలిస్తూ ఉంటాయి. ప్రతి గృహ ద్వారానికి ప్రకాశించే మణితోరణాలు ఇతర నగర గృహశ్రీలను పెండ్లాడ డానికి ఆపురిలోని గృహరాజులు ధరించిన బాసికాలేమో అన్నట్లు ఒప్పు తుంటాయి[53].

నగరపురంగు సిందూరాన్ని అలదిన పాండ్యస్త్రీల కుచాల్ని పరిహ సించే ఎర్రని బొండ్లాలతో టెంకాయ చెట్లు-వజ్రాల చేత గట్టింపబడిన మార్గం పక్కనే ప్రకాశిస్తూ ఉంటాయి. విలుపుత్తూరులోని భవన నిర్మాణంలో నివి యోగం కాగా-మిగిలిన రత్నాల్ని సముద్రుడు తనదగ్గర ఉంచుకొని - తన సంతానమయిన కల్పవృక్షాన్ని. పెద్దభార్య అయిన గంగాదేవిని-ఆనగరంలో పూటగా ఉంచాడేమో అన్నట్లు-కల్పవృక్షాల లాగా ఉన్న నారికేళాలు, గంగా నది లాగా వజ్రమయమైన దారీ-కన్పడుతూ ఉంటుంది[54].

శ్రీవిల్లి పుత్తూరులోని ద్వారాల ముందు రత్నమయాలైన ప్రదేశాల్లో పచ్చని ఆకులతో, తెల్లని మొగ్గంతో కొబ్బరి చెట్లు ప్రతిబింబిస్తూ ఉంటాయి. ఆ ప్రతిఫలనం ఆ ఇంటివారు అలికకుండానే, ముగ్గులు పెట్టి అలంకరించినట్లు ఉంటుంది. [చెట్ల మట్టల నీడ పట్టెలు పట్టెలుగా అలికినట్లు-విడుదకుచ్చులుగా ఉండే కొబ్బరి చెట్లపూలు ముగ్గుల్లాగా ఉంటాయి. అందు వల్ల ఇంటివాళ్ళ ప్రయత్నం లేకుండా టెంకాయ చెట్ల నీడతో అలికి ముగ్గు పెట్టినట్లుండడం వల్ల అలంకారం ఏర్పడుతూ ఉంటుంది.][55]

విలుపుత్తూరులోని ద్రావిడస్త్రీలు ఉద్యాన వనాల్లోని చెంగల్వ దిగుడు బావులలో పసుపుతో స్నానమాడి, స్వామిని స్నానం చేయించడా నికి తీర్థపు బిందెలను నడుము మీద ధరించి- చేతులలో తామరతూడులు పట్టు కొని నడుస్తూ ఉంటే-స్వామి పూజార్థం తెచ్చే పద్మాలు కడవలలోని నీటిలో తడబడుతూ ఉంటాయి. స్తనభారంతో వారి నడుములు అసియాడుతూ ఉంటాయి.

'తిరువాయ్ మొళి' వారి నాలుక మీద ఆడుతూ ఉండగా-అలా ఉద్యానవనపు లో తోవలలో పాదరక్షలు ధరించని పాదాలు ఒప్పుతూ ఉండగా నడిచి వెళ్తూ ఉంటారు66.

వీధుల్లోని ఒక బావులలో-కిరణాలు తాపినతల్లి ఒక దాని వెంటగా ఉండే తటస్థలో కనిపించే చేపల్ని చూచి-చంద్రకాంతం దూరం దాకా వ్యాపించి ఉన్న విడుపాటి చెట్లకొమ్మలలో దాగి ఉన్న లకుముకి పిట్టలు గుంపులు గుంపులుగా గబాలున ఆ బావులలో దుముకుతూ లేస్తూ ఉంటాయి. ఆ దృశ్యం చూడటానికి ఎలాగుంటుందంటే-గృహలక్ష్మి ప్రధాన స్త్రీల పరిచయం కలిగి-వారితో తన శరీరం కనిపించకుండా అదృశ్యంగా చెండాట ఆడుతూ ఉన్నట్లుంటుంది67.

ఆ నగరంలోని శ్రీరంగనాథ, నారాయణునికి చెరి ఒక రథమూ ఉన్నాయి. ఆ రథాలపైన వరదదంపతుల చిత్రాలున్నాయి. మేరు పర్వతం దేవతలకు నివాసమిచ్చింది-మందర పర్వతం వారికి ఆహారమైన అమృతాన్ని ఇచ్చింది. ఈ రెండు పర్వతాలలోను పెద్ద దంపతుల రతికేళి నిలయాలైన గుహాలున్నాయి. అపురి మేదలందామా! దేవతలకు నివాసం, ఆహారం రెండూ ఇస్తూ ఉన్నాయి. ఆ మేరు, మందర పర్వతాలు తమలో ఎవరు గొప్ప ఆపురిలోని మేదల నడిగి తెల్సుకోవడానికి వచ్చాయా అన్నట్లు ఆ రెండు తేరులు శోభిల్లుతున్నాయి. తేరుల మీద చెక్కబడిన వరదదంపతుల ప్రతిమలు ఆ పర్వతాల గుహాంతరాలలోని పెద్ద దంపతులలాగా సొంపుగా ఉన్నాయి68.

శ్రీవిల్లిపుత్తూరులోని అరుగుల మీద వేశ్యలు కంకణాలు మ్రోగుతూ ఉండగా అభినయించి పాడుతూ ఉంటే-యతులకైనా గుండెల్లని మదన వికారం కలుగక మానదు. ఎదురైన వారిని మొగమెత్తి చూడకుండా ఉండేవాళ్ళ వరాహపుష్పాలకైన మనశ్శాంతి సరే కుదురుదిగా చేస్తుంది. భగవంతుని కైంకర్యంలో ఆసక్తి గలవాళ్ళని చూచి, లేచి మ్రొక్కుతూ ఉంటే అలాంటి కోసం-భగవత్కైంకర్యం చేయడానికి వచ్చి-ఆ వసుహృద్రాలను అందుకోవాలని ఇంద్రుడే కోరుకుంటూ ఉంటారు. స్వామి ఆలయం నుంచి పూజా సమయాల్లో కంబారం ఎదిరం వక్కలు ఇచ్చినపుడు వాళ్ళ కనకంటి కాంతుల ప్రతిల్ని తూట్లు వేస్తుంటాయి. పారెలా ఉంచి

వేసేటపుడు వదులైన కొప్పును రెండో చేత సవరించుకోవడానికి చేయి ఎత్తిన పుడు-పట్టురవికలో నుండి మన్మథుని బిల్ల తలగడలాంటి బిగువుచన్నులు నిక్క-తూ ఉండగా-వేశ్యలు పాచికలాడుతూ ఉంటారు[59].

ఆ వేశ్యలు తమ పలువరుసల మీద నున్న తాంబూలపు ఎరుపురసం పోయి వెన్నెలలాగా తెల్లబడేందుకు - పరిగింజతో పలువరుస తోముతూ ఉంటారు. స్నానం చేసేటపుడు రాసుకున్న పసుపు-పచ్చంతో రాచిన వస్త్రాల్ని అంటకుండా, వారి దేహాల్ని నిగ్గుదేరేటట్లు చేయగా-జలక మాడతారు. మాతక కాకుండా పయ్యెదలోపల్నే చేయాడించి శరీరానికి, స్తనాలకు కాశ్మీర, కస్తూరి, కర్పూరాది సుగంధ ద్రవ్యాల కలపం పూసుకొంటారు. తమ హారాల ముత్యాలు-తెగిన దారంతో ఉండకుండా రాలి పోయేటంతటి తీవ్రవేగంతో ఉపరతి చేస్తూ-ఆ ముత్యాల సంగతి పట్టించుకోరు. తారసిల్లిన వెంటనే విటుని కులం తెలుసుకోగలరు. విటుడు పేదవాడితే పోషిస్తారు. రాజుల వెలిరాణి వాసమని భావించేంతటి వైభవంతో ఉంటారు. ఆ పద్మముఖులు వివిధ భాషలలో కావ్యాలు చెప్పగల సమర్థులు[60].

అపురి వేశ్యలు ముత్యాల హారాల్ని, కంకణాల్ని ధరిస్తారే గాని, లోహం తాకట్టి-చిలుము పట్టుందని బంగారు నగలు ధరించరు శరీరానికి కస్తూరిని అందు కొంటారే గాని, శర్కని జవాదిని తోసేస్తారు. పుష్పాలు తల మీద తలనీలాలు చెమ్మగిల్లుతాయని ధరించకుండా-సువాసనలెక్కేట్లు ధూపం వేసుకొంటారు. తెలుగువలువలు ధరిస్తారే గాని-శరీరం ఒత్తుకొనే ఇతర రకాలైన వస్త్రాల్ని ధరించరు[61].

ఆనిలాబుత్తూరు నగరంలో-తెల్లవారగనే వారవనితలు మేడమీద చూరు పెరట కూర్చొని-స్తనాలమీద పరిచేట్లు వేసుకొన్న తమ జడలు విప్పు కొంటూ, జడల్లోని పువ్వుల్ని గోటితో మీటుతూ ఉంటారు. ఆ పూల సువాసన కోసం - ముసురుకొంటూ, మళ్ళీ విచ్చిపోతూ - తుమ్మెదలు రొదచేస్తూ ఉండగా-ఆ తుమ్మెదల ఝంకారం విని వీధిలో వెళ్ళే కాముకులు విరిపుష్పాలు దంతపు-మెట్లలాగా, జడవీణలాగా ఉండగా చూచి-ఆ స్త్రీలు వీణ వాయిస్తున్నారేమోనని భ్రమిస్తూ ఉంటారు[62].

తక్కువ కులం వాళ్ళు, వృద్ధులు, అందవికారులైన విటులు ఎక్కువ ధనం ఇస్తారని చెలులు ఆశపెట్టినా జవ్వనులైన ఆ వెలయాండ్రు వాళ్ళ మాటల్ని చెవిని పెట్టరు. కారణం-వాళ్ళ చెవులు శ్రీలు కావడమే. (శ్రీ లాంటి ఆకారం కలవికావడం)

ద్రావిడ గృహిణులు తమ గృహాల వెనుక ఉండే కొలనులలో రత్నపు తావల మీద పసుపు కొమ్మును అరగదీసి, పూసుకొని స్నానంచేస్తూ ఉంటారు. ఆ రత్నపుతావల కింద నిద్రపోతూ ఉండిన హంసల రెక్కలు ఆ పసుపునీరు అంటుకొని పచ్చబారాయి. ఆ హంసలు పురంలో విహరిస్తూ ఉంటే-దేవనదిలోని పసిడిరెక్కల హంసలేమోనని-చూచేవాళ్ళను భ్రమింపచేస్తూ ఉంటాయి.

విల్లిపుత్తూరు సమీపంలోని వరిమళ్ళకు తీసిన కాలువల్లో బాతులు వాటి సహజగుణంచేత తలలు రెక్కలలో దూర్చుకొని-నిద్రిస్తూ ఉంటాయి. ప్రాతఃకాల స్నానానంతరం తమ వస్త్రాల్లోని నీటిని పిండి బ్రాహ్మణులు పిడచలుగా పెడుతుంటారు. నిద్రపోయే బాతుల్ని చూచి తలారులు బ్రాహ్మణుల వస్త్రాలేమోనని భ్రమించి స్వంతదారుల ఇండ్లకు చేరుద్దాం-అని వాటిని అందుకోవడానికి రేవులలో దిగుతూ ఉంటారు. ఆ అలికిడికి బాతులు లేచి త్వరత్వరగా పరుగెత్తుతుంటాయి. చుట్టుపట్ల ఉండే పైరు కాపరులైన గోపికలు-తలారులు భ్రాంతిపడ్డం చూసి హేళనగా నవ్వుతూ ఉంటారు.

తీగమల్లెలు, ఖర్జూరాలు, పుష్పమంజరులు, మామిడి పూగుత్తులు-ఇతర పుష్పాలు, సంపెగలు, పచ్చగన్నేరులు, లోకపాలెం అనేవి పూలతోటలలో ఉన్నాయి. పై పేర్లుగల వరిరకాలు వరిమళ్ళలో ఉన్నాయి. "రాజనం" అనే పేరు గలిగిన వరి ధాన్యం వరిమళ్ళలో అదనంగా ఉంది. ఆ పేరుతో పుష్పాలు లేనందువల్ల తోటలో రాజనానికి ఉండే ముల్లు అనే త్రాసు ముల్లు చూపి, కొంగల తెలుపు రంగనే నెపంతో, వరి చేలు పూల తోటల్ని పరిహసిస్తూ ఉంటాయి.

వరి పైర్లు పండి కోతకు రాగా రైతులు మళ్ళలో నుంచి నీళ్లు తీసేవారు. ఎప్పుడూ నీళ్ళలోనే ఉండేవి కాబట్టి వరిపైర్లు-దప్పితో వంగి తమ జుంజుమ ముండ్లతో గూడా ఆ మళ్ళలోని చెంగలువల మీద వాలాయి.

వాలి గాలికి కదలాడుతున్నాయి. అలా వాలడం-దప్పితో ఇంతకు ముందు నీళ్ళు తాగడానికి ఉపయోగిస్తూ ఉండిన తమ కిందటి వేళ్ళను పైకి తెచ్చుకొని చెంగలువ పూలలోని పూదేనెను తాగుతున్నాయా అన్నట్లుంది[67].

విలుబుత్తూరు పురిలో గండశిలలంతటి పేరు పనస పండ్లు నేలలోనే పండి, పగిలి, ఆ రసం పగిలిన నేలలో నుంచి పైకి ఉబికి వచ్చి బురద అయ్యింది. ఆ రసాన్ని తాగడానికి తుమ్మెదలు పెనగొని ముసురుకొన్నాయి. ఆ పనస పండ్లు వసంతుని మదపుటేనుగుల చెక్కిళ్ళ మీద స్రవించే-అమిత మైన మద ధారలతో కలిసిన-దుమ్ముతో కూడిన బురదలాగా-పనసల ఫలరసం ఉంది. చుట్టుకొన్న తుమ్మెదలు ఏనుగును కట్టి వేసిన కదులుతున్న ఇనుప సంకెలల్లాగా కనబడుతున్నాయి[68].

ఆ నగరంలోని అరటితోటలలో 'సుగంధులు' అనే పేరు గలిగిన అరటి పండ్ల పెద్ద గెలలు నేలతాకేట్లు వేలాడుతూ ఉంటాయి. అరటి పండ్లు బాగా పండి-విరిసి కొనలు నల్లగా ఉంటాయి. అరటిపండ్ల గెలలు-బొంకు తోమా లెలాగా, పండ్లు విరిసిన సంపెంగ పువ్వుల్లాగా, పండ్ల కొనల నలుపు-సంపెంగల మీద వాలి మూర్ఛిల్లిన తుమ్మెదల లాగా ఉంటాయి[69].

ఆ పట్టణంలోని చెరుకు తోటలలో కొట్టకొన దాకా తములపాకుల తీగలు పాకి ఉండే పోక చెట్లుంటాయి. పోకమట్టలు ముదిరి, చెట్టు నుంచి రాలిపడగా-వాటి బరువుకు చెరకు గడలు విరిగి, వాటిలోని ముత్యాలు చెదిరి, ఆ దగ్గరలో ఉండే బెల్లం పొయ్యిలోపడి, సున్నం అవుతూ ఉంటాయి. అలా సున్నం కావడం-తములపు తీగ అనే నాయిక పోక వృక్షం అనే నాయకుని మెడను కౌగలించుకొని-'ఈ కింద ఉండే చెరకు గడలలోని ముత్యాల సున్నమే మన అనురాగాన్ని పెంచడానికి మందు' అని హెచ్చరిస్తూ ఉన్నట్లు ఉంటుంది. ఆ హెచ్చరిక వల్లనే పోకచెట్టు బరువైన మట్టల్ని రాల్చి చెరకు గడల్ని విరిచి-వాటిలోని ముత్యాల్ని ఆ దగ్గరిలోని బెల్లపు పొయ్యిలోకి చెదిరి పడేటట్లు చేసి, సున్నంగా చేస్తూ ఉన్నట్లుంది[70]. అవిలుబుత్తూరు పురంలో మామిడి చెట్లతోపులలో పాత బావులు ఉన్నాయి. వాటి నుండి పాచి, అంతర దామరల, కలువల కప్పురపు వాసనలు అతిశయంగా వస్తుంటాయి ఆ బావులలోతునీళ్ళలో పెద్దపెద్ద వాలుగ చేపలు పొట్లాడుతూ ఉంటాయి. నీటి కోళ్ళు 'కొం కొం' మని శబ్దం చేస్తూ మునుగుతూ తేలుతూ ఉంచే-

వాటి వంపు మెడలు మాత్రం పైకి కనిపిస్తూ ఉంటాయి. బావిలోని నీళ్ళు కనిపించనంతటి దట్టంగా మామిడి పూత రాలి ఉన్నందు వల్ల వాటి మీద వరచి వేోగలమేమో అన్నట్లుంటుంది[71].

సాయం సమయాల్లో శ్రీవిల్లిపుత్తూరులో ఆ ఊరి దేవుడైన మన్నారు స్వామి దేవళంలో భేరి వాయిస్తుంటారు. కాహళలు ఊదుతుంటారు. ఆ ఊరి ఉద్యాన వనాల్లో విహరించడం మాని 'క్రేం క్రేం' అని కూస్తూ తెల్లని రెక్కల్ని పటపటా కొట్టుకుంటూ హంసలు గూళ్ళకు వెళ్ళుతుంటాయి. వాటి రెక్కల పటపటాత్కారం స్వామి గుడిలోని భేరి ధ్వనిగా, క్రేంకారాలు కాహళల ధ్వనిగా, ప్రజలు భ్రమ పడుతూ ఉంటారు[72].

శ్రీవిల్లిపుత్తూరులోని పిల్లగాలులు - 'వడపెరుంగోవిలుడయారు' అనే తమిళనామం కలిగిన మన్నారు కృష్ణస్వామి వక్షస్థలంలోని తులసిహారం మకరంద బిందువులవల్ల-చలువను సంతరించుకున్నాయి. స్వామి గుడిలోని పణ్యారపు పుణ్యపు కంపుల (సువాసనల) చేత పరిమళాన్ని తెచ్చుకున్నాయి. స్వామి ఎదుట నాట్యం చేయటానికి అలంకరించుకుంటూ, ఎడమ వైపు ఒరిగేట్లు పెట్టుకొన్న దేవదాసీల కొప్పుల్లోని చెంగలువల్ని అల్లనల్లన కదిలించడం వల్ల మందగతిని సంతరించుకొన్నాయి[73] అలాంటి పిల్లగాలులు ప్రజల ఆధ్యాత్మికం, ఆధిదైవికం, ఆధిభౌతికం అనే తాపత్రయాన్ని పోగొడుతూ వీస్తూ ఉంటాయి. రాత్రుళ్లలో ఆ పట్టణంలో మలయమారుతం మన్నారు స్వామి కోవెల ధ్వజస్తంభం పతాకానికున్న బంగారు మువ్వల్ని అప్పుడప్పుడు కదిలిస్తూ ఉంటుంది. ఆ చప్పుడుకు గుడి ప్రాకారం అంచులదాకా పెరిగి ఉన్న సంపెంగ కొమ్మలలోని పక్షులు బెదరి కూస్తుంటాయి. ఆ రొదవిని వేకువజాములో చేసే పక్షుల రొదగా భావించి, తెల్లవారిందని భ్రమపడి దంపతులు అలుకలు మాని రమిస్తూ ఉంటారు[74]

శ్రీవిల్లిపుత్తూరులో ద్రవిడ కన్యలు ముంగిళ్ళలో సన్నవడ్లను ఎండ బోస్తూంటారు. స్వామి కోవెల జింకపిల్ల ఆ వడ్లను మాటి మాటికి బొక్కుతూ ఉంటుంది. సిగల్లో ధరించడానికి చేమ గంపల నిండుగా పల్లెటూరి పడుచులు చెంగలువ దండలు తెచ్చి ముంగిళ్ళలో దించి ఉంటారు. ఆ చెంగలువ దండలు తీసుకుని ద్రవిడకన్యలు ఆ గుడి జింక పిల్లను తరుముతూ ఉంటారు[75].

# భాగవతులు

ఆ పట్టణంలోని భాగవతులు అతిథులుగా వచ్చే భాగవతులకు ఎదురువెళ్ళి సాష్టాంగ నమస్కారంచేసి పాదాలు కడుక్కోవడానికి నీళ్ళిచ్చి, తెంకాయ ఆకుల్తో అల్లిన చాపమీద ఆసీనుల్ని చేస్తారు. మృదువైన లేత మట్టలతో కుట్టిన దొన్నెల్ని పెట్టి, పెద్ద అరిటాకులు పరిచి వరిఅన్నం, పప్పు, దండిగా నెయ్యి, అనేక రకాలైన కూరలు, పాలు, పెరుగు వడ్డిస్తారు. అతిథులు భోంచేసి వార్చిన తర్వాత వాళ్ళ పాదాలు ఒత్తుతూ తాంబూలం సమర్పిస్తారు. అతిథులు తాము వెళ్తాము-అని చెప్పినపుడు-వారివెంట సుదూరం వెళ్ళి, సాగనంపి, అలాంటి గొప్ప అతిథుల్ని ఎడబాసిన దుఃఖంతో వెనుకకు తిరిగి వస్తూ ఉంటారు. ఇలా ప్రతి నిత్యం భాగవతులైన (భగవద్భక్తులైన) అతిథులకు ఆ పురంలోని భాగవతులు అర్చగావిస్తుంటారు.76

# విష్ణుచిత్తుడు

శ్రీవిల్లిపుత్తూరులో విష్ణు చిత్తుడు అనే విప్రాగరిష్ఠుడు నివసిస్తూ ఉన్నాడు. అతడు సదా 'ద్వయం' అనే వైష్ణవ మంత్రాన్ని జపిస్తూ ఉంటాడు. విరిసిన పద్మంలాంటి ముఖవర్చస్సు గలిగినవాడు. శీతోష్ణం, సుఖదుఃఖాలు లాంటి ద్వంద్వాలకు అతీతుడు. ఎప్పుడూ నిరంతర ధ్యానయోగం అనే సంకెలతో శ్రీహరిని-ఏనుగును కట్టివేసినట్లు-హృదయంలోనే కట్టివేసినవాడు. అనంతాలైన వేదవేదాంతాల్ని పఠించకుండానే (తన పూర్వ పుణ్య విశేషం వల్ల)-వాటివల్ల కలగవలసిన జీవేశ్వర భేద జ్ఞానం తెలిసినవాడు. విష్ణుచిత్తుడు అనేది అతనికి సార్థక నామధేయం.77

ఆ విప్రశ్రేష్ఠుడు ఇరవై నాలుగు తత్త్వాలు కలిగిన 'అచిత్తు' కంటే వేరైన జీవుడయిన తనను తనకన్నా వేరైన సర్వాంతర్యామి అయిన పరమేశ్వరుణ్ణి తెలుసుకున్నాడు. భగవత్కృపవల్ల కలిగిన పూర్వజన్మల ఫలం వల్ల లభించిన ఆచార్యుని అనుగ్రహం-పూర్వజన్మలో చేసిన గుప్తదానం మరుజన్మలో నిక్షేపాన్ని చూపినట్లు-ప్రకృతి జీవేశ్వర తత్త్వ జ్ఞానాన్ని తెలుపగా, తనకూ ఆ పరమేశ్వరునికి అనాదిగా ఉండే సేవక స్వామి సంబంధాన్ని తెలుసుకొన్నాడు. ఈ జ్ఞానాన్ని కలిగి అఖండానందం పొంది సుఖించే పరమ యోగి అయిన వానికి బహు ప్రయాసకరాలయిన చదువులతో పనేమి ? ఈ జ్ఞానంలేని వారి కార్యకారణ జ్ఞానం రసవాద విద్యలాగా నిరర్థకం, తర్కశాస్త్రం ప్రాణాంతకమైంది. సాంఖ్యశాస్త్రం అస్థిరమైంది. పూర్వ

మీమాంసాశాస్త్రం యజ్ఞాల్లో పశువుల్ని చంపమని బోధించేది. వ్యాకరణశాస్త్రం సాధనం కానిది. అలాగాకుండా, వరుసు చదువడానికి మొదలు పెట్టినా కాలం చాలదు. అంతరాయాలు సర్వకార్య నాశకాలు. చదవడానికి లభించే సామాగ్రి తక్కువ. జ్ఞానం అల్పంగా అబ్బుతూనే మదం తలకెక్కుతుంది. కుదముట్ట చదివినా. శాస్త్రి జ్ఞానం కలవాడై-వడ్లు తీసుకొన్నవాడు గడ్డిని వదలినట్లు, తేనె తీసుకొన్నవాడు మైనం వదలి పెట్టినట్లు- సత్త్వరజస్తమోగుణ సంబంధాలైన విషయాల్ని వర్జించాలి కాబట్టి 'శాంతి' అనే బహిరింద్రియ నిగ్రహానికి, 'దాంతి' అని పిలవబడే అంతరింద్రియ నిగ్రహానికి స్వాధీనుణ్ణి అయిన-కేవల విరక్తుణ్ణి, విష్ణుభక్తుణ్ణి అయిన నాకు మొదట ఈ శాస్త్రాలు చదవడం, చివరికి త్యజించడంవల్ల ప్రయోజనమేముంది? ప్రతివాదుల్ని ఓడిస్తూ రాజుల్ని మెప్పిస్తూ పునర్జన్మలకు విసిగిపోని జనం ఇలాంటి ప్రయత్నాలు చేస్తే చేయని! మాబోటి వాళ్ళకి ఆ వేదశాస్త్రి జ్ఞాన సంబంధం అయిన కీర్తి దేహోపద్రవం లాంటిది, అనవసరం అయినది. లాభం లోభను కలిగించేది. పూజనం భయం కలిగించేది-అని విశేషంగా తర్కించి, తత్త్వోపదేశం చేసి ముక్తికి అంపిన జడభరతుడనే బ్రాహ్మణోత్తమునిలాగా - ఇతరులకు ఊహించరాని జ్ఞానం కలవాడై, భాగవతులకు అవ్యే ప్రకృతి పరిణామం చెందని శుభ రూపాల్ని పరమ పదంలోనే ధరించి, దేవుని సేవచేయడమే పరమ పురుషార్థం అని తెలుసుకొని, శ్రీవిల్లిపుత్తూరులోని మన్నారుస్వామి కోసం దండలు కట్టడంలో ఆసక్తి కలిగినవాడై సేవచేస్తూ ఉన్నాడు[78] - ఇంకా

ఆ యోగీశ్వరుడయిన విష్ణుచిత్తుడు హిమాలయం, మలయపర్వతం-మార్గంలో వస్తూ పోతూ ఉండే వైష్ణవ సమూహాలకు న్యాయంగా సంపాదించిన ధనంతో తన ఇంట్లో అన్నదానం చేస్తూ ఉంటాడు[79].

వర్షాకాలంలో ఆకాశం నీటిబుగ్గతో సమానంగా జడిపట్టిన వాళ్ళలో భాగవతుడైన విష్ణుచిత్తుని ఇల్లాలు కంటిలో పొగజొరబడకుండా, ఎండిన కొబ్బరి బొండాలను వంట చెరకుగా మండించి వంట చేస్తూ ఉంటుంది. టెంకాయ చిప్పల గరిటెలతో వరి అన్నం, చాయపప్పు, వాలుగైదు కాళింపు కూరలు, వెల్లువలాగా నెయ్యి కుమ్మరిస్తూ ఆ యిల్లాలు భోజనం వడ్డిస్తూ ఉంటుంది[80].

వేసవి కాలంలో విష్ణుచిత్తుని గృహిణి తెల్లని న[illegible]వెన్నెలని అన్నం, తియ్యనిచారులు, మజ్జిగ పులుసులు, పలుచని అంబళ్ళు, చెరకుపాలు, [illegible] పళ్ళు, భక్ష్యవిశేషాలు, వడపోగొట్టకలిగే ఊరవేసిన మామిడి పిందెలు, నీళ్ళ మజ్జిగ నిండారేట్లుగా భోజనం పెడుతుంటుంది[81].

శీతకాలంలో విష్ణుచిత్తుని శ్రీమతి-ఘుమఘుమవాసన కలిగిన వేడి రాజనాల వరి అన్నం మిరియం పొళ్లువేసి 'చుయ్యి' అనే ధ్వని ఆరని చట్టి నుండి దించిన కూరలు, ముక్కు వ్యాధుల్ని పోగొట్టేంతటి-ఘాటైన 'చుఱ్ఱు' మనే ఆవపిండి పెట్టడం వల్ల రుచి గొలుపుతూ ఉన్న ఊరగాయలు, పాయసాలు, చేయి మునుక్కునే అప్పుడే కాచిన నెయ్యి- ఇగురగాచిన పాలు వెల్లువగా పోస్తూ అతిథులకు అన్నం పెడుతుంటుంది[82].

ఆ విష్ణుచిత్తుని ఇంట్లో-పలువురు పరదేశులైన వైష్ణవులు ప్రతి శనివారం అభ్యంగన స్నానం చేయడానికి నూరిన ఇప్ప పిండి ముద్ద చేతిలో పెట్టుకొని, దానిని కుదురుగా చేసి దానిపై లేతైన అరటి దొన్నెలు పెట్టుకొని, గూనలలో సిద్ధంగా ఉండే నూనెను వాటిలో పోసుకొని - ముందుగానే శుభ్రంగా ఉతికి దాటిపై వేలాడే వస్త్రాల్ని తీసుకొని, ఒక్కసారే అందరూ నదికి వెళ్ళి స్నానం చేసి భోజనానికి వస్తూ ఉంటారు[83]

సదాచారసిద్ధుడైన విష్ణుచిత్తుని ఇంట్లో అర్ధరాత్రి వేళలో కూడా హరికథలు, ద్రావిడ వేద పారాయణం వినిపిస్తూ ఉంటాయి. అంతేకాదు. "అయ్యా! కూరలు ఎక్కువగా లేవు. భోజన పదార్థాలు వేడిగా లేవు. పిండి వంటలు లేవు. అన్నం కూడా అంత బాగా లేదు. అయినా దయచేసి ఆరగించండి." [నాస్తి శాక బహుతా, నాస్త్యుష్ణతా, నాస్త్యపూపో, నాస్త్యోదన సౌష్ఠవంచ కృపయా భోక్తవ్యమ్] అనే మాటలు అన్ని ప్రాంతాల వారికి అర్థమయ్యేందుకు గాను దేవ భాష అయిన సంస్కృతంలో ముందుగా వినిపిస్తూ ఉంటాయి[84].

ఈ విధంగా విష్ణుచిత్తుడు ఎంతో జాగ్రత్తతో తీర్థ యాత్రలు చేసే భాగవతులకు వేరే కోరిక లేని వాడై, ఎవరే పదార్థాలడిగితే వాటిని వారికి అర్పిస్తూ-సంతృప్తి పరుస్తూ ఉంటాడు[85].

## ఆశ్వాసాంత పద్యాలు

లేత సూర్యుని కిరణాల వల్ల వికసించిన ఎర్రతామర పద్మాల కాంతి నేత్రాలు కలవాడా! శ్రీదేవి, భూదేవి, నీళాదేవులకు నాథుడవైన స్వామీ! ఇంద్రుడు, బ్రహ్మ, దిక్పాలకుల అమూల్య శిరోమణి కాంతులతో వెలుగుతున్న పాదపద్మాలు కలవాడా! చవితి చంద్రునిలాగా సుందరమైన లలాటానికి అలంకారాలైన ముంగురుల వరుస కలవాడా! ప్రకాశిస్తూ ఉన్న కుండలాల వల్ల అందగించిన ముఖం గల స్వామీ[86]!

మీన, కూర్మ, వరాహ, వామన, పరశురామ, శ్రీరామ, బలరామ, బుద్ధ, కల్కి మొదలైన అవతారాల ద్వారా ప్రజా సంరక్షణ చేసేవాడా! అలమేల్మంగ అనే పేరు గల్గిన లక్ష్మీదేవికి నివాసమైన వక్షస్థలం గల స్వామీ[87]!

దేవేంద్రుడు నియోగించిన మేఘాల గొప్పరాళ్ళ జడివానకు గోవర్ధనగిరిని గొడుగుగా చేసినవాడా! చాణూరమల్లుని శిరస్సు ఉగ్రబాహులతో పగల గొట్టి సంహరించిన వాడా! నిమిషంలో ముప్పయవ భాగం అయిన 'కలా' సమయంలోనే కంసుని వధించినవాడా! నెమలి పింఛం శిరోభూషణంగా గల స్వామీ[88]!

## కృతికర్త స్వవిషయం

కర్ణాట రాజ్యాన్ని ధరించడంలో నిశ్చలమైన బాహువుల విలాసం కలిగిన-రుద్రగజపతి ఉదయగిరిని పొంది, ఆ గజపతి పినతండ్రి అయిన ప్రహరేశ్వర పాత్రుని చేత కానుకగా సమర్పింపబడిన కిరీటంలోని రత్నాలనే దృష్టిలో ఒప్పే పాదాలు కలిగిన-సార్వభౌముడయిన శ్రీకృష్ణరాయల చేత చెప్పబడిన 'ఆముక్తమాల్యద'లో మనోజ్ఞాలైన పద్యాలతో ఒప్పుతూ ఉన్న ప్రథమాశ్వాసం ఇది[89].

## ద్వితీయాశ్వాసం

శ్రీలక్ష్మి కలువ కన్నుల జంటకు వెన్నెలవంటి చిరునవ్వుతో ప్రకాశించే మోముగల స్వామీ! రాక్షసుల చేత అపహరింపబడిన దేవతల సంపదను తిరిగితెచ్చే పాదవిక్షేపం (అంగలు) గలవాడా! వేంకటాచల రమణా[1]!

## మధురాపురవర్ణన

చిత్తగించండి. విష్ణుచిత్తుడు శ్రీవిల్లిపుత్తూరులో నివసించేకాలంలో పాండ్యదేశంలో[2]

మధురాపురం అతిశయిస్తూ ఎలాగా ఉంది? అంటే - తామ్రపర్ణి నది నుండి తాజాగా తెప్పించిన ముత్తపు చిప్పల నీచు వాసన ఆ హారాలకు కూడా వచ్చింది. ఆ స్త్రీలు పాలిండ్లపై అలదుకొన్న కర్పూరం ఆ వాసనను పోగొడ్తూ ఉంటుంది. మలయ పర్వతంలో పెరిగిన చందనపు చెట్ల తొలి చెక్కతీసి మధురలోని మేడలు కట్టడానికి ఉపయోగించిన తర్వాత మిగిలిన కఱ్ఱ మాత్రమే ఇతర దేశాలకు వెళ్తూ ఉంటుంది. ఆ పట్టణంలోని సింహళ ఏనుగుల (మదజలం యొక్క వాసనతో కూడినది.) గాలి చైత్రమాసంలో ఉత్తర దిక్కును మోసే ఏనుగు ('అంగన' అని ఆ ఏనుగు పేరు)ను కలత పెడ్తూ ఉంటుంది. ఆ నగరపు పూర్వరాజులు ధరించి వదిలేసిన హారాల్లోని మరకతాల్ని ఇతర రాజులు ధరిస్తూ ఉంటారు. సుగ్రీవునిచే నియోగింపబడిన పర్వత సదృశాలైన కపులు ప్రవేశించ గలిగినంత ఉన్నతం అయిన, బంగారు మయమైన ముత్యాల తలుపులు కలిగిన గోపురాలతో మధుర కోలుపుచ్చరానిది వీలుకాని కోటను కలిగిఉంది దట్టంగా ఉండే చెట్లవల్ల మనోహరంగా ఉంది మధురాపురి[3].

శివుడు త్రిపురాల్ని సాధించడానికి మేరుపర్వతాన్ని విల్లుగా చేసుకొని దానిని గుండ్రంగా వచ్చేట్లుగా వారి పారిందాడు. త్రిపురాల్ని గెలిచిం తర్వాత ఆ విల్లును అలాగే వదిలేశాడు. అలా గుండ్రంగా పారించి వదిలేసిన మేరుపర్వతం ఏమో అనేట్లు మధుర చుట్టూ బంగారుకోట వలయాకారంగా ఉంటుంది[4].

మధురాపురికోట చాలా పొడవైనది. కోటకొమ్మలు స్వర్ణమయాలు. దూరంగా నుండి చూసేటపుడు కోట బురుజుల వరస ఆకాశలక్ష్మి ధరించిన పంచంగి దండలాగా ప్రకాశిస్తూ ఉంటుంది[5].

ఆ మధురాపుర స్త్రీలు పాతాళందాకా వ్యాపించి ఉన్న అగడ్తనీటిలో జలకేళులాడతారు వారు స్తనాలకు పూసుకొన్న జవ్వాది, కస్తూరితో కూడిన

శ్రీగంధం, అగరుమైపూతల సువాసనల వల్లనే నాగలోకంలోని గంగానదికి 'భోగవతి' అనే సార్థకనామం కలిగింది[6].

కద్రువ తనయులైన నాగులు భూమిని కూడా ఆక్రమించడానికి నాగలోకం నుండి ఆ అగడ్త నీటిదారి వెంబడి పైకెగసి వచ్చి-అగడ్తదరుల్లో కావడం చేసిన గరుడపక్షుల్ని చూసి భయపడి నిలువలేక వెంటనే నీటిలో క్రుంకుతూ ఉంటాయి[7].

లేత నాచుతీగలూ, తామరాకులూ కప్పుకొన్నందు వల్ల అగడ్త నీరు మరకతం రంగులో ఉంటాయి. నగర నిర్మాణ కాలంలో బ్రహ్మ ఆ కోటను బంగారు మయం చేయడానికి పిండిన మందాకు పసరేమో అన్నట్లు అగడ్త నీళ్ళు ఒప్పుతుంటాయి.

ఆకాశ గంగ స్వర్గపురానికి అగడ్తలాగా చుట్టుకొని ఉంటుంది. మధురాపురి కోట బురుజుల మీద ఉండే పెద్ద పెద్ద ఫిరంగులు ఆ గంగకు స్వర్గానికి మధ్య చొచ్చుకు పోతున్నట్లున్నాయి. ఈ దృశ్యం ఎలా ఉందంటే-స్వర్గపురంతో పరికావడానికి మధురాపురం పోరాడి గంగావతి అనే కాసెలో ఫిరంగులనే చేతుల్ని దూర్చి-స్వర్గపురం బలిమి చెడేట్లుగా కిందికి వేయడానికి ఎత్తి పట్టుకొని ఉందేమో అన్నట్లుంది[9]

మధురాపురి ఒక యువతిలాగా ఉంది. ఎలాగంటే-కోట తలుపులే రొమ్ము-దానికి ఉండే గుబ్బలే నిక్కబొడుచుకొని గుండ్రనివైన చనుగుబ్బలు. తలుపుల మీద అమర్చిన గంధపు పట్టెలు గంధం గీరల్లాగా ఉన్నాయి. తలుపులకు తాపబడిన బంగారు తగడులే ఆ స్త్రీ ధరించిన నగల్లాగా ఉన్నాయి. ఇవన్నీ చూసి మధురాపురిని ఒక యువతిగా భావించి సూర్యుడూ, చంద్రుడూ ఆ పురం వాకిటివద్దే చుట్లు పెడుతూ ఉంటారు[10].

మేఘ మండలంకంటే పైకి ఉన్నాయి మధురాపురంలోని మేడలు. ఆ మేడల మీద జవ్వనులు రతిక్రీడ సలిపే వేళ వారి తేట ముత్యపు హారాలు తెగి-తారళ్యవంతాలైన పెద్ద పెద్ద ముత్యాలు రాలిపోతూ ఉంటాయి. మరు నాటి ఉదయమే చెలికత్తెలు ఆ ముత్యాల్ని వాడిన పూలతో పాటు తోసి కిందికి పారవేస్తుంటారు. అవి మేఘాల్లో చిక్కుకొని వర్షాకాలంలో వర్షం

చినుకులతో పాటు నేల మీదికి రాలుతూ ఉంటాయి. అందువల్లే లోకులు ముత్యాలకు జన్మస్థానం మేఘాలు అని అనుకుంటారు - కానీ నిజానికి సముద్రంలో తప్ప వేరేచోట్ల ముత్యాలు పుట్టవు గదా[11]!

ఆకాశ గంగ కంటే ఉన్నతంగా ఉన్న మధురాపురంలోని మేడలు స్త్రీ జనంతోనూ, జెండాలతోనూ ఆకాశగంగా నదిలో ప్రతిబింబిస్తూ ఉంటాయి. అలాగే-స్వర్గపురంలోని మేడలు అక్కడి స్త్రీలతోను, తమ జెండాలతోనూ ఆకాశగంగలో ప్రతి ఫలిస్తూ ఉంటాయి. గాలివీచినపుడు స్వర్గపురి మేడల జెండాల నీడలు మధురాపురి జెండాల నీడల మీదికి, మధురాపురి జెండాల నీడలు స్వర్గపురి జెండాల నీడల మీదికి వాలుతూ ఉంటాయి. ఈ సన్నివేశం ఎలా ఉందంటే-ఆకాశగంగ సముద్రంలాగా ఉంది. మధురాపురి మేడల ప్రతిబింబాలు ఒక దీవి ఓడలలాగా ఉన్నాయి. స్వర్గపురి మేడల ప్రతిబింబాలు మరోదీవి ఓడలలాగా ఉన్నాయి. స్త్రీల ప్రతిబింబాలు వర్తకుల్లాగా ఉన్నాయి. ఆ జెండాల నీడలు ఒక దానిని ఒకటి తాకడం - ఒక దీవి వర్తకులు మరో దీవి వర్తకులకు తమ సరుకు నమూనాల్ని రంగు రంగుల పట్టుబట్టల్లో ముడిచి గడలకు కట్టి ఇతరదీవి వ్యాపారుల వద్దకు వాల్చుతున్నట్లు ఉంది[12].

మధురాపురిలోని మేడలు నక్షత్ర మండలాన్ని అతిక్రమించి ఉండడం వల్ల పిల్లచుక్కలు గవాక్షాల గుండా మేడలలోకి ప్రవేశిస్తుంటాయి అప్పుడు అక్కడి జవ్వనులు వాటిని పట్టుకోడానికి తలుపులు మూస్తారు తమని ముత్యాలను కొని హారంలో వేసుకోవడానికి రంధ్రాలు వేస్తారేమో అని భయపడి-ఆ పిల్లచుక్కలు సుందరమైన మేల్కట్టుల హారాలలో కొంత సేపు వ్రేలాడుతుంటాయి. అప్పుడు యువతులు ఏమారి పోతారు. కొంత సేపయిన తర్వాత రతిక్రీడలతో అలిసి చల్లగాలి కోసం గవాక్షాలు తెరిచినపుడు హార రూపంలో ఉన్న పిల్లచుక్కలు చెదిరి పారి పోతూ ఉంటాయి[13].

మధురాపురిలోని మేడలు మేఘ మండలం కంటే అత్యున్నతాలు అయినందువల్ల-మేడల కింది అంతస్తుల వద్దనే ఉన్న మేఘాల గర్జనలు-నెమలి పురుల్లాంటి తలనీలాలుగల విలాసవతులు ఉండే మేడల పై అంతస్తులకు వినిపించవు వారు మేఘరంజిరాగాన్ని ఆలపించి మేఘాల్ని పై అంతస్తులకు రప్పించి-విలాసాసక్తితో తమ పెంపుడు నెమళ్ళచేత నాట్యం చేయిస్తుంటారు[14].

స్వర్గపుర గృహాల వరసలపై తామర పుష్పాల ఆకారంలో కలశాలున్నాయి. మధురాపురి మేడల మీద పతాకాలు ఆ కలశాలను మువ్వల ధ్వనితో కప్పుతూ ఉంటే-మువ్వల మోతవిని చేవరిపిణుల మోత ఎవరిదో

అని శంకతో స్వర్గపురలక్ష్మి తలఎత్తి చూడగా-మధురాపుర లక్ష్మి వినోదం కోసం తనచేతుల్లో స్వర్గపురలక్ష్మి కళ్ళు మూస్తూ ఉండగా-ఆ చేతుల కింద ఉన్నట్లు ఉంటుంది[15].

మధురాపురిలోని మేడలు సప్తర్షిమండల పర్యంతం ఉన్నతాలై ఉంటాయి. ఆ మేడలలోని గృహిణులు-సప్తర్షుల వృద్ధ భార్యలు దయతో ప్రణయకలహం తీర్చగా-వేకువజాములో మేఘాల్లోని మెరుపు అనే దీపం మీద కంచం ఉంచి-దానికి అంటిన మసితో కాటుక దీస్తారు. ఉదయిస్తూ ఉన్న సూర్యుని కిరణాల వేడితో కరిగిన తట్టు పునుగును అందుకొంటారు. ప్రభాత చంద్రునికి అంటించి, చెంగలువల్ని వికసింపజేసి-వాటితో కొప్పుల్ని అలంకరించుకొంటారు. ఇలా అలంకరించుకొని పతితో క్రీడిస్తూ ఉంటారు[16].

మధురాపురంలోని జెండా గుడ్డలు సూర్యుని కప్పగా, మదన చేతులలో కురుజాలు మిన్నుముట్టగా, జలయంత్రాలు చిమ్ముతూ ఉండగా, ధూపాల పొగలు మెరవగా మధురాపురలక్ష్మి ఆకాశాన్ని స్పృశిస్తూ ఉంటుంది. ఇది ఎలా ఉందంటే-లోకంలో నవ వధువు రాత్రివేళ పడకటింట్లో ఉన్న భర్త వద్దకు-చెలికత్తెలు చేతుల్తో లాక్కొని పోయి తార్చగా, ఎట్టకేలకు చేరి దీపానికి చెరగు చాటు పెట్టి, చెమటలు క్రక్కుకుంటూ-పావురాల పలుకుల వంటి మనుపలుకులు పలుకుతూ-చేతులతో భర్తకు పాదాలొత్తుతుంది. అలాగే మధురాపుర గృహలక్ష్మి కొత్త పెండ్లి కూతురా అన్నట్లు - కురుంజులనే చెలికత్తెలు మదన చేతులనే చేతుల్తో-ఆమె భర్త అయిన విష్ణుదేవుని వద్దకు కిటికీల నుండి వెలువడే సువాసన ధూమాలు అనే రాత్రిలో నేర్పుతో తార్చగా-సూర్యుడనే దీపాన్ని జెండావస్త్రం అనే కొంగుతో మరుగుచేసి జల యంత్రాల నీటితుంపరలు అనే క్రొంజెమట కలిగినదై-పావురాల మనుపల్కులతో-ఆకాశం అనే శ్రీమహావిష్ణువు పాదాన్ని ఒత్తుతూ ఉంటుంది[17]

మధురా పట్టణ గోపురాల మీదుగా ఆకాశంలో సంచరించే సూర్యుడు-గోపురాలకు తాపిన పద్మరాగాల కాంతితో మిక్కిలి ఎర్రనివాడై కనబడతాడు. ఆ విధంగా సూర్యుడు ఎర్రబడడం ఎలా ఉందంటే - బ్రహ్మదేవుడు ఉదయ సంధ్య, సాయంసంధ్యలలో మాత్రమే సూర్యునికి అరుణిమ ప్రసాదించి, మధ్యాహ్నంవేళ ఇవ్వడం మరిచిపోయి-ఆ కొరతను ఈవిధంగా

తిరుస్తూ ఉన్నారేమో అన్నట్లుంటుంది. (ఈ పద్యంలో కృష్ణరాయలు పుష్పలావికా విటుల సంభాషణను రెండర్థాల్లో సాగేట్లు వర్ణించారు.) విటుడు ; ఓ వెండీ! నీ దండ వెల ఎంత? పుష్పలావిక : నా దండకు వెల కట్టడం ఎవరి తరం? (దండ అంటే పూలదండ-బాహువు అని రెండర్థాలు. అలాగే పుష్పలావికా పరంగా-పూలదండ విలువను, తన బొందు విలువను వెల కట్టడానికి ఎవరి తరమూ కాదని పుష్పలావిక జవాబు )

అలివేణీ! కలువ తావులు కావమే అని విటుని ప్రశ్న. వాడకుండానే కలువతావులు ఎలా కలుగుతాయి? అని పుష్పలావిక ఉత్తరం (విటుని పరంగా ప్రశ్న : కలువ వాసనలు రాలేదేమి? అని పైకి అర్థం-మనం కలిసేందుకు తావులు చెప్పవా? అని అంతరార్థం. అలాగే పుష్పలావిక పరంగా జవాబు: కలువలు వాడకుండానే ఎలా వస్తాయి? అని పైకి అర్థం. మనకు పరిచయం కలగనిదే కలిసేందుకు తావులు ఎలా కలుగుతాయి? అని అంతరార్థం.)

ఓ సుదతీ కడిపోదు! ఈ మొగలి పువ్వు నాకివ్వవా? అని విటుని ప్రశ్న. 'కడిపోకుండడం ముందుంది' అని పుష్పలావిక జవాబు (విటునిపరంగా ప్రశ్న : సుదతీ! వాసన పోవట్ట ఈ మొగలి పువ్వు నాకివ్వవా? అని పైకి అర్థం. 'మొగలి పువ్వులాంటి నీ దేహాన్ని నాకివ్వు' అని అంతరార్థం. అలాగే పుష్పలావికాపరంగా జవాబు-వాడిన తర్వాతనే మొగలి పువ్వు వాసన పోనితనం (కడి నీకు తెలుస్తుంది. అని పైకి అర్థం. నన్ను కలిసిన తర్వాత నీకు నోట కడి దిగదు అని అంతరార్థం)

'పద్మనేత్ర! జాతులేవి?' అన్న విటుని ప్రశ్నకు పద్మినులు ఉండే చోట జాతులుండడం అరుదా? అని పుష్పలావిక సమాధానం ఇచ్చింది. (విటుని పరంగా ప్రశ్న : జాజి పూలేవి? అని పైకి అర్థం. పద్మిని మొదలైన స్త్రీ జాతుల్లో నీ జాతి ఏది అని అంతరార్థం. పుష్పలావికా పరంగా జవాబు-పద్మాలుండే చోట జాజిపూలుండడం అరుదేమి కాదు అని పైకి అర్థం. పద్మినీ జాతిస్త్రీలే ఉన్నప్పుడు ఇతర జాతి స్త్రీలు దక్క పోతారా? అని అంతరార్థం.)

ఇలా ఆ మధురాపురిలో పుష్పాల మీద, పుష్పలావికల మీద కోరికలు పుట్టగా వాటిని కమ్ముకొని విటులు మొదటి మాటను పలికిన

వెంటనే-పుష్పలావికలు నర్మగర్భంగా పైకి పువ్వుల్ని గురించినట్లు చెప్తూనే-మరోవైపు శృంగారార్థం వచ్చేట్లు జవాబిస్తూ పూలు అమ్ముతూ ఉంటారు[19].

కదంబపు దండ కట్టుతూ ఉండేప్పుడు సరసులైన విటుల పరిహాసం తమకు ప్రీతికరం కాగా, తమ మనస్సు కరుగుతోందని తెలిపేవారి కన్నుల తళుకులే కలువ పువ్వులుగాను, విటులకు జవాబులు చెప్తూ మధ్య మధ్య నవ్వే తమ నవ్వులు మొల్లలుగాను భ్రమించి-కలువల్ని, మొల్లల్ని కలిపి కదంబపు దండగా తాము కడుతూ ఉన్నట్లు పుష్పలావికలు భ్రమిస్తూ-శూన్యాన్నే కట్టి ఇస్తూ ఉంటారు. కానీ, కదంబపు దండకు బదులు-వట్టి దారం మాత్రమే ఉండడం చూసి సిగ్గుపడుతూ ఉంటారు. ఆ పురిలోని పుష్పలావికలు ఎంతటి నెరజాణలైనా వారిని కూడా మోహంతో మునిగేట్లు చేయగలరు ఆ ఊరిలోని విటులు[2].

మధురాపురిలో ఉండే విటులు పుష్పలావికల్తో ఇలా అంటూ ఉంటారు. ఓ పద్మముఖీ! భోగించే వానికి నీవు (దండల్ని అనుభవించే వానికి) పూవు ఎత్తులు కట్టి ఇస్తావు-అంటూ ఉంటే విని నీ వద్దకు వచ్చాను. (నిన్ను సుఖవించే వానికి నీవే ధనం ఎదురిస్తావని నిన్ను సంతృప్తి పరిచి నీవల్ల ఎదురు ధనం గ్రహించాలని వచ్చాను అని రెండో అర్థం.)

కంబుకంఠీ! రెండు ఘడియల కాలం కంటే జాముకాలం పరిమళం చెడని పూవు ఇంపు. అలాంటి అలరులు నీ వద్ద ఉన్నాయని వచ్చాను. (ఇతరులు రెండు ఘడియల సంభోగం ఇవ్వగలరు. నేనో జాము సేపుండే సంభోగం ఇవ్వగలను-కాబట్టి నన్నే సేవించు అని రెండో అర్థం.)

ఓ జవరాలా! ఏ పువ్వును అడిగినా వాటి ఋతు కాలంలో ఇస్తానంటున్నావు. మేమందాక వేచి ఉండలేము. దోహద కార్యాల ద్వారా ఇపుడే పుష్పించజేసి ఆ పుష్పాల్ని నాకివ్వలేవా? అని విటులు పుష్పలావికలను అడుగుతున్నారు. [నేను నీ పొందును కోరుకుంటుండగా ఋతుస్నానమైనంతవరకు వేచి ఉండమంటున్నావు. నేను అంతవరకు వేచి ఉండలేను ఇప్పుడే నీ సంభోగాన్నివ్వు! అని అంతరార్థం.]

నేను నీ పుష్పాల వద్దకు చేరరాకూడదా! నా చేయి తగిలినంతనే నీవు సిద్ధంచేసి అమ్మకం కోసం ఉంచిన బోర జాపికం చెడుతుందా! [నేను నిన్ను తగులకూడదా! నీ ఊరు మూలం నా చేయి తగిలితేనే వికృతి పొందుతుందా? అని అంతరార్థం.]

అని పై విధంగా సంకేతపు మాటలతో లాగా పుష్పలావికల మీద కోరిక పొంగి పొర్లుతుండగా విటులు పలికినపుడు ఆ పుష్పలావికలు తమ పెదవులపై చెరగు అడ్డం పెట్టుకొని అపుడునే నవ్వు-చూపుల చంచల కాంతులలో కనిపించగా-పువ్వుల్ని తడపడానికి అనేమిషతో విటుల మీద కూడా పడేట్లు నీళ్ళు చిలకరిస్తారు. ఆ పరసపు జలమే బాణాలైన ఆ విటులను మరులు గొల్పుతుంటుంది[21].

'ఇదిగో! పూవులను తీసుకో' అని పుష్పలావికలు పలికేటపుడు- మొల్ల పూలలాంటి దంత కాంతిని కూడుకొని విశాలమైన చూపులు మొదటనే తొట్రుపడి-విటులకు కనుల పండుగ చేస్తాయి. చెప్పిన వెల అంగీకారం కాక వారు మరొక అంగడికి పోతుండగా-పెదవి విరిచి కోపాన్ని కనబరిచే దృష్టి విటుడు మొగమాటంతో వెనక్కి వచ్చేట్లు చేసింది అతడలాగా తిరిగి రాగా చిరునవ్వుతో కూడిన పలుకులు, వయ్యారపు చూపులు ధర ఎక్కువ తక్కువ అన నీయకుండా చెప్పిన వెలకే కొనేట్లు చేస్తాయి. 'అవి' [పుష్పాలు ఇతర పుష్పలావికలు] కాక 'ఇవి' [నా పుష్పాలు-నేను] పనికిరావా? అని ఇతర పుష్పలావికలతో సవతి తనం కలిపించుకొనే పలుకులు విటుని ఇష్టాన్ని వృద్ధి చేస్తాయి.

చతురమైన పలుకులతో, విలాసాలతో అంగసౌష్ఠవంతో ఇంతకు ముందు పుష్పాల కోసం ధనమిచ్చిన ఇంకొక పుష్పలావికను కూడా మరిపించి మన్మథుని చేతికి ఆయుధాలైన పూలను అందించే రతిదేవిలాగా- ఆ నగరంలోని పుష్పలావికలు విటులకు పూలనందిస్తారు ఈ విధంగా రతిదేవిలాంటి సౌందర్యవంతులైన పుష్పలావికలు తమ వద్దకు వచ్చిన మన్మథుని లాంటి విటులను ఏదో విధంగా వలపించి-జాణ తనంతో తమ దగ్గరే తాము చెప్పిన ధరకే పుష్పాలు కొనిపిస్తారు[22].

ఆ పట్టణంలోని బయటి వీధులలో చంద్రకాంతమయమైన అరుగుల మీద పండె పొద్దుల్లో పరిమళ ద్రవ్యాలమ్మే గట్టి వాల్పరులు-మెండైన కర్పూరపు తునకలు కలిగి జవ్వాదితో నిండివిగసిగలాడే తెలుపు ఎరుపు కలిసిన పాటల వర్ణంతో ఒప్పుతూ ఉండే దంతపు బరిణెలతోను - కుంకుమం అంటిన చీరల ఎరుపు కాంతితోను విలసిల్లుతుంటారు. ఈ దృశ్యం ఎలా

ఉండంటే ఒకటే అయినటువంటి సంధ్య పెక్కుసంధ్యలైనట్లు. సంధ్యే చంద్రకాంతపు అరుగుల మీద పెక్కు నక్షత్రాలు. మచ్చతో కూడిన చంద్రబింబం. అరుణిమ కలిగినదై అక్కడ కన్పిస్తున్నదేమో అన్నట్లు శోభిల్లుతుంటుంది[23].

మధురాపురంలోని మదపుటేనుగులు-వాటి ఇష్టం వచ్చినట్లు పోనీక అదిలించినందువల్ల-కూన్యాల్ని కోరలతో చిమ్ముతుంటాయి. బరిగోలతో పొడుస్తూ ప్రక్కనే నడుస్తూ ఉండే వాళ్ళ-బందాల దాంట్ల [బంధాలలో ఉండికూడా దాట్లువేయడం]తోనే ఊరి గవను వరకు-తరుముతుంటాయి. ఇండ్ల వాకిళ్ళ తిన్నెలను చలువ ద్వారా తెలుసుకొని-వాటిపై ఉండే వారిని పట్టుకోవడానికి తొండం చాస్తుంటాయి. డిండిమ ధ్వనికి ఉబ్బి మదధారలు ఏరులై పారగా-డిండిమం వాయించే వారిని రాళ్ళతో రువ్వుతూ-వెదురు కోలల దెబ్బలకు పురం బయటికి వస్తాయి. ఇతర దారుల వెంటపోయే ఏనుగు చేసే ఘీంకారం చేత ఊరు వదలిపెట్టి వెళ్ళపోక-తిరిగి తిరిగి పిడి (ఆడ) ఏనుగును వెంబడించి-మళ్ళీ పురం బయటికి వస్తూ. శత్రురాజులను సంహరించడానికి ఆ పాండ్యరాజు పంపే 'కృత్యలు' అనే శత్రు సంహార దేవతలేమో అన్నట్లు ఒప్పుతూ ఉండే చూపుల సమూహంతో- ఊరివెలుపలికి వెళ్ళుతుంటాయి[24].

మదపుటేనుగులు నిరంతరం తమదేహం మీద చల్లుకునే దుమ్ములో వాటి కట్టుకంబాలుగా ఉండే పెద్ద పెద్ద చెట్ల నుండి పక్షులు పండ్లు కొరికి వేయగా విత్తనాలు పడతాయి. ఆ ఏనుగులు తొండాలతో పైన చల్లుకునే నీటితో బాగా తడపబడి-ఆ విత్తనాలు మొలకెత్తుతుంటాయి. ఆ ఏనుగులు ఆపుర ఉద్యానవనాలలో ప్రాణముతోడి పర్వతాల లాగా-అగమ్యాలై తూఁగుతూ తిరుగుతుంటాయి[25].

బాణాలకంటే వేగ వంతాలైన మధురాపురిలోని గుర్రాలు-కళ్ళాలతో బిగింపబడిన ముఖాల్ని కదిలిస్తూ ప్రక్కచూపులు చూస్తుంటాయి. అలా చూడడం 'మాకు శాలి హోత్రముని శాపంవల్ల రెక్కలు పోయాయి. మీరు రెక్కలు కలిగిన వారు. అయినా సరే మాతో సమానంగా రండి' - అని పిలుస్తూ, నురుగు-అనే నవ్వుతో కైజా మోరలు కదిలిస్తూ, తమ ప్రక్కంలో కట్టి ఉన్న అమ్ముల పొదులలో ఉండే పర్వసమానాలైన బాణాల్ని పిలుస్తున్నట్లు విలసిల్లుతుంటాయి[26].

వైరుల మీద రోషంతో రౌతులు శత్రు సంహార సాధనాలైన విల్లుల్ని, అమ్ముల పొదుల్ని మా పక్కలకు కట్టకమానరు. వారు శత్రువుల మీద బాణాల్ని ప్రయోగించినపుడు ఆ బాణాల వేగం మా వేగానికి వెనక బడక మానదు. అలాంటప్పుడు ఆ బాణాలు వెన్నుచూపని మా రౌతులకే పొర పాటున తగిలి 'వెన్నకు బాణం తగలడం' అనే మచ్చ వారికి వస్తుంది గదా! అనే చింతతో గుర్రాలు గొరిసెల్తో భూమిని త్రవ్వుతూ ఉంటాయి[27].

ఆపురిలోని గుర్రాలకు తమతో సమానమైన వాయు సమూహం అంతా-వేగంలేమివల్ల ఒక అంగలోనే వెనకబడతాయి ఆ వేగం వల్ల పుట్టిన వేడితో అవి ముందుకు వెళ్ళి జయించామన్న ఉత్సాహం పొందుతాయి. అయినా వాటి కడుపుల్లోనే 'సమానం' అనే వాయువు ఉండడం వల్ల-దాని కంటే ముందుకు వెళ్ళి, దానిని ఓడించలేక పోయామే అనే అపకీర్తిని కడుపులోనే దాచుకుంటాయి. ఆ గుర్రాలు ఉదయవేళలో నాకే అద్దం బిళ్ళం లాంటి సైంధవ లవణం పెళ్ళల్లో- ఆ గుర్రాల ఊర్పుల వల్ల అలముకొన్న దట్టమైన నలుపు అనే మిషతో-ఆ అపకీర్తి స్పష్టం అవుతూంటుంది[28].

మధురాపురంలో బాహ్లిక, పారశీక, శక, థట్టా, అరట్ట దేశాల నుండి దిగుమతి చేసుకున్న జాతి గుర్రాలు ఉంటాయి. అవి చాలా ఎత్తయి నవి కాబట్టి వాటిని అధిరోహించడానికి రెండు అంకవన్నెలు (రౌతుకాలుంచి ఎక్కడానికి గుర్రం పక్కల్లో వేలాడ గట్టే ఇనుప వలయంతో ఉండే తోలు పట్టి)వేసి మాత్రమే ఎక్కవలసి ఉంటుంది. కానీ, అవి పరుగెత్తే సమయంలో సాగి నేలకు కడుపు తాకేంతటి పొట్టిగా అవడం వల్ల రౌతుల పాదాలు నేలకు రాసుకొంటూంటే వారు భయపడతూ ఉంటారు. ఈ రెండు విధాలైన అప కీర్తులకు ఏం చేయగలం అని రౌతులు చింతాక్రాంతులై ఉండగా – ఆ జాతి గుర్రాలు ఒప్పుతూ ఉంటాయి[29].

క్రొమ్ముడి విప్పగానే పాద పద్మాలపై వ్రాలుతూ ఉండడం వల్ల మధురాపురంలోని సుందరులైన వెలయాండ్ర వెంట్రుకలు తుమ్మెదలు అవ డంలో సందేహం లేదు. చూస్తూనే ఎంతటి వాణ్ణి అయినా వశపరచుకోగలవి కాబట్టి వారి నెమ్మోములు అద్దాలవడంలో సందేహం లేదు. సూక్ష్మమైన నడుము అనే ఆకాశంపైన ఉండడం వల్ల వారి స్తనాలు జక్కవల జంట

అనడంలో సందియం లేదు. కుటిలత్వం దొర్లేట్లు చూసే కలికి చూపులు గల వారి తెలిగన్నులు చేపలు అనడంలో సందేహం లేదు. (చేపలు తమ మీది పొలుసు కనబడేట్లు నీటిలో పొర్లుతాయి-చూపులు పొలుసు (వంకర తనం కలిగి మహోజ్జ్వలంగా ఉంటాయి.) పువ్వవల్లిని సమీపిస్తూనే సువాసన గుప్పున కమ్ముకొన్నట్లు తీగల లాంటి వారి శరీరాలు సమీపిస్తూనే సువాసన గుప్పు మంటూండడం వల్ల, వారి శరీరాలు పూదీగలనడంలో సందేహంలేదు అనే ట్లుగా రతి ప్రౌఢిమకు నిధులైన ఆపురిలోని వెలయాళ్ళు ఒప్పుతూ ఉంటారు[30].

ఆ పట్టణంలో కాముకులైన స్త్రీ పురుషుల సమూహానికి కలహాలు పెట్టగల నారదముని- కుంకుమ పూలరాకులనే జడల సమూహంతో, కస్తూరి అనే వల్లకి వీణ నుండి వెలువడే తుమ్మెదల అవ్యక్త మధుర వీణా నాదాలతో, పచ్చ కర్పూరం రాశి అనే రూపంతో కళ్ళకెదురుగా కనిపిస్తూంటే - మదన కలహాలకు కొరత ఎలా ఉంటుంది? కుంకుమ పువ్వు, కస్తూరి వీణలు, తుమ్మెదల ఝుంకారాలు, వీటితో కూడిన పచ్చ కర్పూరపు రాశులు కామోద్దీపకాలు అయినందు వల్ల కామినీ కాముకులకు కామ కలహాలకు కొరత ఉండనే ఉండదు[31].

హరిశ్చంద్రుని తండ్రి త్రిశంకుడు బొందితో స్వర్గానికి తనను పంపడానికి సాధనం అయిన యాగాన్ని చేయించడానికి వశిష్ఠుని కోరి తిరస్కరింపబడ్డాడు. అతని కుమారుల్ని కూడా అడిగి వారూ తిరస్కరింపగా దూషించాడు. వారు అతణ్ణి 'చండాలునివికా' అని శపించారు. ఆ విధంగా చండాలుడయిన త్రిశంకుడు విశ్వామిత్రుని సాయంతో యాగంచేసి స్వర్గానికిపోగా దేవేంద్రుడు అతణ్ణి తలక్రిందులుగా పడేట్లు నెట్టేశాడు. అప్పుడు విశ్వామిత్రుడు ఆకాశం మధ్యలో దక్షిణ దిశగా మరొక స్వర్గం సృష్టించి, త్రిశంకుణ్ణి దాన్లో నివసింపజేశాడు. అందువల్లనే దానికి 'త్రిశంకు స్వర్గం' అని పేరు. పవిత్రం అయిన ఆకాశం ఈ విధంగా వెలివాడ అయింది. కాబట్టి ఇక్కడ ఉండ దగదు-అని ఆకాశం నుండి అశ్వని మొదలైన ఇరవై ఏడు తారలు, ఇతర నక్షత్రాలు, సూర్యుడు మొదలైన గ్రహాలు నేలకు దిగి వచ్చాయేమో అనేట్లుగా రమ్య నవరత్నరాసులు మధురా పట్టణపు అంగళ్ళలో ప్రకాశిస్తూ ఉంటాయి[32].

వేద పర్వతాలు. జప యజ్ఞశీలురు అయిన ఆ మధురాపురి బ్రాహ్మణులు దేవేంద్ర కుబేరాదులు దానం ఇస్తామన్నా పుచ్చుకోవడానికి కుడిచేయి చాపరు ఎంతోకాలం అగ్నికర్మ చేసినందువల్ల తమ కుడి చేతిలో వెలింగొని ఉన్న అగ్ని దానధారతో తడిసి చల్లారి పోతుందనో-లేక తమ శరీరం అంతటా యజ్ఞాగ్ని నిండి ఉండడం చేత తమకుడిచేయి అగ్నిదేవుని కుడి చేయి అవుతుంది కాబట్టి-తాము చేయి చాచి అగ్నికి అవమానం చేయలేకో-విప్రులు దానాల్ని పరిగ్రహించరు[33]

ఆపురిలోని రాజకుమారులు వజ్రాయుధ సమమైన తమ గుద్దుల చేతనే ఇతరరాజుల్ని లొంగదీసుకున్నవారు-ఉపాసన కాలంలో మాత్రమే 'మంత్రకవచం' ధరిస్తారుగానీ కవచం తొడుక్కొని యుద్ధం చేయరు. దానాలిచ్చేటప్పుడు మాత్రమే 'ఐదుకు బదులు పది' ఇస్తారు. కానీ యుద్ధంలో వైరికి వెనుకంజవేసి ఐదుపది చేయరు-అంతే చేతులు జోడించరు సాము చేయడంలో అతిసమర్థులై గరిడీలలో వేలబడి పొర్లుతారు - కానీ, నిర్మల మనస్కులు కాబట్టి రాజు పిలిపించి సామంత రాజ్యాలు ఇచ్చే వరకు దండాలు పెట్టి భూమి మీద పడిపొర్లకుండా వేచిఉంటారు[34].

మధురాపురిలోని వైశ్యులు ధర్మమార్గంలోనే ధనాన్ని సంపాదిస్తుంటారు. మహాదాతలు. కోటి వరహాల లాభానికి ఒక జెండా వంతున ప్రతిదినం తమ ఇండ్లమీద జెండాల్ని ఎక్కిస్తుంటారు. వారు దానాలు చేస్తూ పోసే నీటిధార వల్ల నగర మధ్య మార్గంలోని అంగళ్ళలో ఉండే కొయ్య స్తంభాలు చిగురించి. దినదినం చిగిరించే కొత్త చిగుర్లా అన్నట్లు ఆ జెండాలు మేఘమండలాన్ని కప్పుతూ ఉంటాయి[35].

సత్పురుషుల్ని సేవించడం వల్ల కీర్తి గడించుకొన్న మధురాపురి శూద్రులు తమ భుజాల మీద ధరించే నాగేళ్ళ చాలే రాజుల పాదాల్లో ఉన్న-పంచ మహాపురుష లక్షణాల్లో ఒకటి అయిన-హలరేఖకు మూలం గదా అని భావిస్తూ కోటి కొండలుగా ధాన్య రాశుల్ని పండిస్తూ ఉంటారు[36].

మధురాపురం ఉద్యాన వనాల్లో అకాలంలో పలురకాల పూలు పూయించడానికి తరుణులు వివిధ విధాలైన దోహదాలు చేస్తుంటారు. ఒక యువతి నోటిసుర ఉమియగా పొగడ పూసింది. మరో రమణి తన్నగా అశోక

వృక్షం పూసింది. ఇంకో తరుణి పరిహాసంగా నవ్వగా కొండ గోగు పుష్పించింది. మరో అందగత్తె శ్లేషతో దూషించగా సురపొన్నపూసింది.

ఇలా అవమానకరాలైన దోహదాలు చేయబడిన ఈ చెట్లు-కౌగిలింత లాంటి కమనీయ దోహదాలు పొందిన గోరంట మొదలైన చెట్లను తమకు అప్పగించండని-అవి తప్పించుకొని పోకుండా ఉండడానికి ఆ చెట్లను తుమ్మెదల బారులు అనే సంకెళ్లో బంధించాయి. అప్పటికీ నమ్మక మన్మథుని సైన్యం అయిన చిలుకలు, కోకిలలతో అపురాన్నే ముట్టడించాయా అన్నట్లు-ఆపురి చుట్టూ ఉండే ఉద్యాన వనాలు తుమ్మెదల శ్రేణులతో, చిలుకలు, కోయిలలతో కోళిల్లుతూ ఉంటాయి[37].

దక్షిణ దిగ్గజం పేరు 'వామనం.' ఆ ఏనుగుకూ మధురా పట్టణంలోని ఏనుగులకూ దానజల సువాసనలోని తేడాల్ని పరీక్షించడానికేమో అన్నట్లు దక్షిణ దిశ నుండి వీచే మారుతం ఆ ఊరి కరుల గండ స్థలాల్ని ఒరుసుకుంటూ ఉంటుంది. రతిశ్రమ వల్ల కామినులకు పట్టిన చెమటను చూడలేనట్లు వారి మృదువులైన చెక్కిళ్ళమీది చెమటను అర్పుతూ ఉంటుంది. కస్తూరి కోసం చంపిన బొడ్డు గలిగి విగతజీవులై ఉన్న కస్తూరి మృగాలకు ప్రాణాలనిచ్చి సువాసన గ్రహిద్దాం అనే కోరికతోనేమో అన్నట్లు కస్తూరి మృగాల బొడ్డుచర్మపు తిత్తులలో ఆ మలయ మారుతం ప్రవేశిస్తూ ఉంటుంది గాలి ఆయిన తనను భక్షించే పాముల్ని (పాములు వాయుభుక్కులు అని ప్రసిద్ధి) తింటాయి కాబట్టి నెమళ్లు తమకు మిత్రులు అవుతాయి అనేమో-మధురాపురి ఇండ్ల కొనిగలలోని నెమళ్ళ పించాల్ని మలయమారుతం నిమురుతూ ఉంటుంది.

ఈ విధంగా మలయానిలం కామినుల చెక్కిళ్ళ స్వేదం వల్ల శీతలత్వాన్ని, నెమళ్ళ పించాల్ని నిమరడం వల్ల మందగమనాన్ని, ఏనుగుల మదజలం నుండి, మృగమదం నుండి సువాసనను గ్రహించింది. ఆపురిలోని సకల సమృద్ధులు చూడాలనే కోరికతో తొందరపడకుండా తనదైన దక్షిణ దిక్కున ఉండే పుష్పదంతం అనే ఏనుగును ఎక్కి మెల్ల మెల్లగా సంచరిస్తూ ఉందా అన్నట్లు-మధురాపురిలో చందన పర్వతం (మలయాచలం) నుంచి వీచే తెమ్మెర మెల్ల మెల్లగా వీస్తూ ఉంటుంది[38].

# మత్స్యధ్వజుడు

ఆ మధురాపురం రాజధానిగా పాండ్యదేశాన్ని మత్స్య ధ్వజుడు అనేరాజు ఏలుతూ ఉండేవాడు. అతడు శత్రువులకు అనుకూలమైన సామ దానాల్ని, వారికి ప్రతికూలమైన భేదం, దండం అనే చతురుపాయాల్ని ఆలోచించడంలో పండిత శ్రేష్ఠుడు. సంధి విగ్రహ యాన ఆసన ద్వైధీభావ సమాశ్రయాలనే ఆరు గుణాల్ని ప్రయోగిస్తూండే షాడ్గుణ్యచాతురీ చక్రవర్తి. మలయపర్వతాన్నే తన క్రీడాచలంగా చేసుకొన్న శ్రీ ఖండ గిరిరాజు; మేరు పర్వతంపై తన మీన చిహ్నాన్ని చెక్కించుకొన్న కనకాద్రి ముద్రణ గ్రంథ కర్త. మేఘ సమూహాల్ని ఏనుగుల్లాగా సంకెళ్ళతో బంధించినవాడు. సముద్రానికి కట్ట కట్టిన ఆధునిక రాముడు. నిర్మలమైన తామ్రపర్ణీ నదీజలాల్లో స్నానం చేయడంలో హంసలాంటివాడు. లంకాధిపతియైన విభీషణునికి చెలికాడు. వాస్తవాన్ని మాత్రమే స్తుతించే అగస్త్యుని ఆశీర్వచనాన్ని పొందుతూ ఉండేవాడు. ఇంద్రుని కిరీటాన్నయినా నుగ్గుచేయగలిగే బాణ సమూహం కలిగినవాడు. మంత్రాల ద్వారా భూతాల్ని సేవకులుగా చేసుకొన్న అపరశివుడు[39]

చంద్రవంశ భూషణం అయిన ఆ మత్స్యధ్వజరాజు నీతిని ఎప్పుడూ తప్పడు. ప్రజల్ని నొప్పించి పన్నులు రాబట్టడు. ఒకడు మరొకని మీద వినిపించిన కొండేల్ని విని మనసులో ఉంచుకొని అవతలి వానిని చెరపడు. తనను ఎవరైనా పొగిడితే వినయంతో తలవంచుకుంటాడు. తాను గొప్ప శూరుడై ఉండీ పిరికిపందల్ని కూడా పరిహాసించడు[40].

మత్స్యధ్వజంలా సర్పాలు విశేషంగా ఉండే మలయపర్వత చందన వనాల్లో విహరిస్తూ కూడా సర్పబాధ (అంటే పాముల బాధ, స్వపక్ష శత్రువుల బాధ) లేనివాడు. మితభాషి. ఆత్మస్తుతి విముఖుడు. అయినా వైరుల్ని కేరడంతో (పరిహాసవచనాల్తో) భంగపరుస్తూ ఉంటాడు- అలాగే కేరళలోని శత్రువుల్ని భంగపరిచాడు. తామ్రపర్ణి అనే నదికి నాథుడైనా 'అంజనం' అనే దిగ్గజం కానివాడు-అంటే పాండ్యదేశంలో ప్రసిద్ధి పొందిన తామ్ర పర్ణీనదికి ప్రభువై సద్గోష్ఠితో పాపరహితుడై అసంజనత (మాలిన్యం లేకుండడం) కలిగినవాడు. కామ మాధుర్యానికి ఆస్పదం అయి ఉండీ లావణ్యం (లవణ భావ సంగతి)తో ఉల్లాసాన్ని పొందేవాడు అంటే-గొప్ప సామర్థ్యం వల్ల తాను మధురాపురీనివాసుడై శరీరలావణ్యంతో మనోజ్ఞమైనవాడు.

శత్రుసైన్యం మహాసముద్రం లాంటిది మత్స్యధ్వజుని బాహువు తిమి వంటిది అతని ఖడ్గం తిమితోక. శత్రువుల ఏనుగులు మహాతరంగాలు. వాటి కుంభ స్థలాలు అలలపై భాగపు విరుపులు రాజు కత్తితో కొట్టి బాహువును వెనక్కి తీసుకోవడం-తిమితోకతో అలవిరుపును కొట్టడం లాంటిది. అతని కత్తిదెబ్బకు ఆ ఏనుగుల కుంభస్థలాల్లోని ముత్యాలు రాలి దట్టంగా లేవడం తిమితోక దెబ్బకు నీటిబొట్లు లేవడం లాంటిది. ఈ విధంగా సముద్రంలాగా ఉండే శత్రుబలంలోని ఏనుగుల కుంభ స్థలాల్ని-తిమి సముద్రపు అలల్ని వాలంతో కొట్టినట్లుగా-రాజు చేతిలోని ఖడ్గంతో నరకగా వైరి సైన్యంలోని ఏనుగుల కుంభ స్థలాల్లోని ముత్యాలు నీటిబొట్లులాగా ఎగిరిపడుతూ ఉంటాయి[41].

అతని తెల్లని కీర్తి హంసికి దానధార పోస్తూ ఇచ్చే దానం ఒక రెక్క. అప్రార్థితంగా దానధార లేకుండా ఇచ్చే త్యాగం మరో రెక్క. దానం అనే మొదటి రెక్క రాజు సదా దానధార పోస్తూ ఉండడం వల్ల ఎప్పుడూ తడిసే ఉంటుంది. అలా ఒక రెక్క పూర్తిగా నాని ఉన్నా అతనికీర్తి హంస ఆకాశంలో ఎగురుతూనే ఉంటుంది. ఎందుకంటే-రెండు రెక్కలు వివిధ జలాల్లో తడిసినా వేగంగా ఆకాశంలో పరుగెత్తే ఆ హంస జాతికి, ఇతర పక్షులకులాగా ఒక రెక్క తడిస్తే మాత్రం వాటి సంచారం ఆగదుగదా[42]!

అతివృష్టి. అనావృష్టి ఎలుకల బాధ. మిడతల దండు. చిలుకల బాధ. అత్యాసన్నం (ఒరుసుకోవడం)అనే ఆరువిధాల ఈతి బాధలు ప్రజలకు లేకుండా మత్స్యధ్వజ రాజు వాటిని వేరే చోట్ల ఉండేట్లు నియమించాడు చిలుకలగుంపు వారవనితల గృహాలనే చెరసాలల్లో సంకెళ్ళతో కట్టి వేయబడ్డాయి ఎలుకల సమూహం శత్రువులు వదిలి పెట్టి వెళ్ళగా పాడుబడిన పురాల్లోని మేడల వరుసల్ని చెండాడుతూ ఉన్నాయి. లోకోపద్రవంగా ఒకరితో ఒకరు ఘర్షణ పడే రాజులు ఆ రాజు పాదంలోని గండపెండారంలో బొమ్మలై ఒరుసుకొంటూ అణిగిపోయారు. ఎక్కువైన అనావృష్టి ఆ రాజు సైన్యంలోని ఏనుగులతో పోటీచేసి ఓడిపోయిన శత్రురాజుల మదపుటేనుగుల గండస్థలాల్లో చేరింది. అందువల్ల వాటి మదజలం ఇంకిపోయింది. ఆ రాజు సదా దానం చేస్తూ ఉండడం వల్ల అమితమైన ధారా జలం స్రవిస్తూ ఉంటుంది. అలా దానధారను రాజు వదిలేటపుడు అతివృష్టి ఆ రాజు హస్తగతం అయింది. మిడతదనం (శలభత) రాజు ప్రతాపాగ్నిలో మండిపోయే క్షుద్ర శత్రువుల్లో

కలిసిపోయింది. ఈ విధంగా ఆరు ఋతు బాధలను తొలగించి ఆ రాజు తనరాజ్యం సుఖంగా ఉండేట్లు పాలిస్తూ ఉన్నాడు[43].

ఆ రాజు ఇలా సామ్రాజ్యవైభవాలనుభవిస్తూ ఉండగా కొంత కాలానికి[44]-

పాటల వృక్షాలకు పూత భాగ్యాన్నిచ్చేదీ. విస్తీర్ణమైన ఎండమావులనే నీటికి వర్షాకాలం లాంటిది, ఊరుగు పండ్లను రాల్చేదీ అయిన వేసవి కాలం భూమి మీద ఉద్ధతితో మొదలయింది[45].

గ్రీష్మఋతువు ప్రవేశించగానే సెలయేళ్ల ప్రవాహాలు ఇంకిపోయి-ఏటిలోని చట్రాళ్ళ మీద ఉన్నదట్టమైన పాచి పేట్లు పేట్లుగా లేచింది. నదియల్లో నీరు ఇగిరి పోయినందువల్ల-కిరాతులు గువ్వల్ని పట్టడానికి పోసిపెట్టిన జల్లిత అడవిలో ఆడాడ వ్యాపించింది. దావాగ్నివల్ల కాలిన చెట్ల ఆకుల సమూహాన్ని సుడిగాలి రేపగా-వాటిని పావురాలుగా భావించి-డేగల గుంపు ఆ కాలిన ఆకుల మధ్య దూరింది. చెట్లకింద నిద్రిస్తూ ఉండే బాటసారులు చెట్లనీడ అవతలికి జరగగా తాము కూడా ఆ చెట్లనీడలోకి పొరలుతూ ఉన్నారు. తెల్లగా ఆగుపడే ఎండమావుల బయళ్ళవేశ దిక్కులన్నీ దిగంబరుడూ క్షేత్రపాలుడు అయిన భైరవునికి ఉడికిన వస్త్రాల్లా ఆరవేసే చాకిరేవులు గములయ్యాయి దిక్కుల ముఖాలు ఎండకు కందామేమో అన్నట్లు పొగలు రాజుకున్నాయి[46].

పసుగులు, ఆడవిపందులు, దున్నలు అన్నీ ఆ ఎండ దెబ్బకు నశించి పోతాయేమో అని బ్రహ్మ భయపడి ఆ వేసవి పోయిన తర్వాత మళ్ళీవాటిని సృష్టించడానికి కోసం-ఇప్పుడే వాటి శరీరాల మీద మూసలు కట్టి. ఆ మూసలను పడమటి గాలికి మండుతున్న ఎండ అనే మిక్కిలి తీక్షణమైన అగ్ని కాలుస్తున్నాడేమో అన్నట్లు ఆ జంతువుల దేహాలకు దట్టంగా అంటుకొన్న ద్రోంపిపూత ఆ దెబ్బలకు అరిపోతూ ఉంది[47]

నీరు అనే తమ ధనాన్ని సూర్యకిరణాలనే దొంగలు దావాగ్ని అనే చీకట్లో దోచుకుని పోతుండే-సూర్యుని వద్దకు మొరపెట్టడానికి పెద్ద పెద్ద బావులు వెళ్తున్నాయేమో అన్నట్లుగా సుడిగాలులతో నేల నుండి లేచి పైన విస్తీర్ణంగా-అంచుల్లో గడ్డి అంటుకొని చలిస్తూ ఉండగా ధూళిచక్రాలు ఆకాశానికి ఎగిరాయి[48].

సూర్యుని రథానికి కట్టిన గుర్రాల పగ్గాలైన పాములు - వేడిగా ఉండే పడమటి గాలి అనే ఆహారం తినలేక 'కూటిపేదలై' సొమ్మసిల్లి-జారిపోతూ ఉండగా, సూర్యుని ఆజ్ఞనుసరించి-మాటి మాటికి అనూరుడు ఆ పాము పగ్గాల్ని ముడివేయడానికి తేరును మాటి మాటికి ఆపుతూ ఉన్నందు వల్ల-ఉదయ పర్వతం నుండి అస్తాచలం దాకా సాగే సూర్యుని ఆకాశపయనం నడుమ నడుమ ఆగుతూ ఉన్నందు వల్లనేమో- పగళ్లు దీర్ఘాలయ్యాయి[49].

తీక్షణాలైన సూర్యకిరణాలనే నిప్పువల్ల లోకం అంతా మండి, దాని బూడిద గాలికి ఎగిసిందేమో అన్నట్లుగా పండి పగిలిన బూరుగుకాయల దూది ఆకాశం అంతా వ్యాపించింది[50].

బాటసారులు నదులలో తవ్వుకొన్న నీటి చెలమల వరసలు సూర్యుని ప్రతిబింబాలతో ప్రకాశించాయి. ఆ ప్రకాశించడం ఎలా ఉందంటే-తమ భర్త అయిన సముద్రునితో గ్రీష్మకాలంలో కలవకుండడం అనే విరహంతో జనించిన తాపం చల్లార్చుకోడానికి - నదులు అనే తరుణులు నిండారగా ధరించిన ముత్యపు దండలా అన్నట్లు ఒప్పుతున్నాయి[51].

పూర్వం అతివృష్టి ద్వారా తమని సముద్రునితో కూర్చిన తుంటె నగాడయిన మేఘుడు- ఇప్పుడు కూడా లంచమిస్తే మళ్ళీ కలుపుతాడు అని భావించి, నదులు ఆకాశాన ఉన్న మేఘునికి ఇవ్వడానికి - 'హేమటంకాలు' అరచేతిలో ఉంచుకొని పైకి చాచిన బాహువులా అన్నట్లు-నీరెండిపోయినందు వల్ల రేకులు వెనక్కి వాలిపోగా - కర్ణికలు కనబడ్తూ పైకి నిలబడి ఉండే నాళాలతో-ఎండిపోయిన నదుల్లో తామర పూలున్నాయి[52].

ఆ వేసవి దినాల్లో - మరివాడిన నాచువల్లుల్ని తిని కొంగలకు గొంతు పగరెక్కింది. లేత చేపల పొలుసు వాసనవట్ట మరో చోటికి వెళ్ళిపోక మెడవంచుకొని అక్కడే ఒదిగి నిలిచాయి. ఒకచోట నుంచి చివర వరకు కడముట్ట తొక్కుకొని పోతూ ఉలుచల్ని, చిన్న చిన్న పత్త గుల్లల్ని ఆ కొంగలు తిన్నాయి. ఎండ్రి కాలు పట్టుకోగా ఎగిసి కొంత దూరంలో నిలిచి దానిని ముక్కుతో పొడిచి తింటూ, చేమకూర మళ్ళలాగా తడి ఆరిపోయిన తామర గుబుర్లలో, డీలుగు చెట్ల కింద ఎండలు గడిపేసే కొంగలకు చెరువులు మోకాలి బంటి అయ్యాయి. పశువుల పేడలోని ఎల్లుల్ని (వాన

పాముల్ని) తినడానికి వచ్చిన ముంగిసల్ని ఉరుములుగా బయట తిరుగుతూ కుక్కల రాయిడికి భయపడి బావుల్లో పడ్డాయి. మరుగు సీమ బోరియలోకి దూరింది[53].

పెద్ద పెద్ద కొంగలు నీళ్ళులేని మడుగుల్లో ముందుగా మంచి మంచి చేపల్ని తినేశాయి. బురద ఎండిపోతున్నందు వల్ల తడి కిందికి పోగా బొమ్మిడాయి చేపలు ఆ తడితో పాటు కిందికి పోయి ఒదుక్కున్నాయి. తడి ఆరిపోగా నశించాయి. వాటి గుడ్ల సమూహం - ఎండబీటలో కలువపేరు వెండిడి ఒకకోపులాగా కనిపించింది. ఆ గుడ్ల వరసను-ముక్కుతో లాగి, నోట చప్పరించి, వాటి 'లేతెన'ను పిల్చడానికి కొంగలు ఆరంభించాయి[54].

అలాంటి వేసవి కాలంలో గాలికి రాలిన పాటల పుష్పాల మకరందాల వల్ల రెండు మూడు సార్లు తడపబడిన భూమితో సువాసనలు గొలిపే ఉద్యాన వనాలున్నాయి. వాటిలోని చెట్లకు నీళ్ళు పారగట్టడానికి ఏతాన్ని తొక్కేవారు ఉచ్చైః స్వరంతో గానం చేస్తూ ఉండగా, నీటిలో మునిగే ఏతపు బానల ధ్వనులే వాద్యాల్లాగా-ఆ వేసవి ప్రభాత వేళల్లో సొగసు నింపుతూ ఉన్నాయి[55].

ఆ వేసవిలో మిక్కిలి తీక్షణమైన పగటి టీఎండ తాకి, వాడిన లేతబొండు మల్లెల పొదల తుదల్లో అణిగి, చాలా పెద్దవై అగ్గి బొబ్బల్లాగా మొగ్గలు గుంపులుగా పుట్టాయి[56].

ఆ వేసవి వల్ల నీళ్ళన్నీ ఇగిరిపోతాయేమోనని భయపడి జల దేవతలు వేసవి తర్వాత మళ్ళీ జలసమృద్ధి కావించు కొనడం కోసం బీజంగా కడవల్లో కొంత నీరు ఉంచుకొన్నారు. నీళ్ళలో ఉండే సుళ్ళు, పద్మాలు, నాచు, జక్కవ పిట్టలు, నురుగు అనే వాటిని తమదేహాల్లోని పొక్కిళ్ళు, కన్నులు, క్రొమ్ముళ్ళు, స్తనాలు, నవ్వులు అనే నెపంతో ఆ స్త్రీలు ఉంచు కొన్నారు. చలి పందిళ్ళలో అయితే వేసవి భయం ఉండదని ఆ జలదేవతలు అక్కడికి వచ్చి ఉన్నారేమో అన్నట్లుగా-కడవల్లో నీళ్ళు ఉంచుకొని-కాచుకొని ఉండి నీళ్ళు పోసే కాంతలు బాటసారులకు కన్నులపండువుగా కనిపిస్తూ-దాహశాంతి చేస్తూ ఉన్నారు[57].

ఆ వేసవి ఎండకు భయపడి గంగా యమునలు చలి పందిళ్ళలో నీళ్ళు పోసే స్త్రీల శరణు చొచ్చారేమో అన్నట్లు వారి మల్లెల తోడి జడలు మెరుస్తూ ఉన్నాయి. (గంగా జలాలు తెల్లగా ఉంటాయి కాబట్టి మల్లెలతో, యమునా జలాలు నల్లగా ఉంటాయి కాబట్టి జడలతో పోలిక) మీరు దొంగిలించిన మా శీతల స్తనాల సౌందర్యాన్ని తిరిగి ఇవ్వండి అని నీటి కాగుల్ని అడుగుతున్నట్లుగా వాళ్ళు కడవల్లో ముంచే గరిగలు ఒప్పుతూ ఉన్నాయి. ఆ స్త్రీలు బాటసారులకు పోసే నీటి ధారలో వారికలువ కన్నుల తళుకులు ప్రసరించగా అవి సువాసన కోసం ఆ నీళ్లలో వేసి ఉన్న కలువ పూరేకులనే భ్రమ గొల్పుతున్నాయి. ఆ స్త్రీల తెలిమోము పస మెచ్చి పాంథులు నీరు త్రావు[illegible]వగా-తమ ముఖ సౌందర్యానికి మెప్పుగా తలలూపారు గానీ 'నీళ్ల చాల్లే' అనే సంజ్ఞ కాదని తెలుసుకొని-నీళ్ల పోయడం మానకుండానే నవ్వే ఆ స్త్రీల నేర్పు బాటసారుల హృదయాన్ని కరిగిస్తూ ఉంది. ఆ వేసవిలో తన ప్రతాపం వేరేచోట్ల సాగనందువల్ల అసమర్థుడై (పిచ్చుకుంటై) స్త్రీలు నీళ్లు పోసే చలి పందిళ్ళలో చేరి, తన గౌరవాన్ని కాపాడుకుంటూ, బాటసారులు ప్రీతితో ఆ స్త్రీలకిచ్చే తాంబూలాలనే మిషతో మన్మథుడు సుంకం పుచ్చుకొంటూ ఉన్నాడు[58].

ఒక బాటసారి ఎండకు తడబడుతూ 'అమ్మలారా! అక్కలారా'! అని దీనంగా దోసిలి పడుతూ చలిపందరి ప్రవేశించాడు వాడు నీళ్ళు పోస్తూ ఉంటే తాగి కొంత కొంత దప్పి తీర్చుకొని, తను ఇంతకు ముందు పలికిన 'అమ్మ, అక్క' అనే మాటల్ని లెక్క చేయకుండా ఆ స్త్రీల మోముల్ని, గుబ్బల్ని, వ్యాపిస్తూ ఉన్న బాహుమూల కాంతుల్ని ఎగాదిగా చూస్తూ ఉన్న అతని 'చిట్టకపు త్రాగుడు' కనిపెట్టి, వానికి నీళ్ళు పోయకుండా, ఒకరికొకరు సైగలు చేసుకొంటూ ప్రపాపాలికలు (చలిపందిళ్లలో నీళ్లు పోసే స్త్రీలు) నవ్వుతున్నారు[59].

ఆ వేసవి రాత్రుల్లో భూమండలం అంతటా పండు వెన్నెలలు వ్యాపించి ఉన్నాయి పగటి ఎండ ఉడుకారలేదు. కాబట్టి భూమి నుండి 'కట్టావి' (ఎక్కువ ఆవిరి) ఎగుస్తూ ఉంది. ఎలా ఉందంటే-కాలుతూ ఉండే పెనం మీద అట్లపిండి పోసి-కట్టావి ఎగుస్తూ ఉండగా చకోరపు పిల్లల గుంపుల కోసం విశాలమైన 'చాపట్లు' పోస్తూ ఉన్నట్లుంది[60].

వేడిని తొలగొట్టుకోవడం కోసం-కాంతలు ప్రియులతో పగలంతా దిగుడు బావుల్లో 'నీరుచల్లు పోరాటం'లో గడిపి అలసిపోయారు. తామర లేత తూడుల్లాంటి తమ చలువ బాహువుల్ని ప్రియుల మోచేతులకు ఎదురుగా మలచుకొని, వారి మూపులపై తమ అరచేతులు ఆనించారు. తడి ఆర్పుకో డానికి పొలుమాలినందువల్ల పూర్తిగా తడి ఆరని సువాసనల్తో ఒప్పే క్రొమ్ము డుల్లో తని మొగ్గలతో కట్టిన విరజాజిదండ వికసిస్తూ ఉంది. దేహానికి పూసు కొన్న గంధం నీటిలో కరిగి పోయినా-దాని సువాసనను అట్లే పొదవుకొని ఉన్న తమ శీతల స్తనాల్ని కాంతుల రొమ్ములకు ఆనించి, కౌగిలిలోనే బోర గిలి పడుకొని, ఔంకాయ మద్యంతో తీయనైన నిశ్వాసాలు వదుల్తూ, సన్నని ఒంటి ఒల్లెధరించి ప్రియుల రొమ్ములపైనే నిద్రపోయారు. అలాంటి ప్రేయ సుల్ని వేకువ జామున తొందరతో హెచ్చరించి- తలపి వెన్నెల బయళ్లలో కాంతులు రమించి ధన్యులయ్యారు[61].

ఆ మండు వేసవిలో-రాత్రుల్లో కూడా వేడిమి మెండుగా ఉన్నందు వల్ల సతీపతుల రొమ్ములు తగలనే తగలని పెడకౌగిలింతలు, సంప్రాప్తమైన రతి కార్యాలు కాక చతురులు, ఒట్టి చలువల వల్ల దంపతుల పొందు మనసులు కలవని ఒట్టి ఆలింగనాలు, కార్యశూన్యమైన చాతుర్యపు మాటలు, కపట ప్రేమలు మెండైన అనార్యుల పొందులాగా ఉన్నాయి[62].

ఆ వేసవిలో మన్మథుడు బలహీనుడై పాతాళానికి పెళ్తూ ఉండగా- సూర్యకాంతికి భీతిల్లి మలయమారుతం కూడా పాతాళం పట్టింది. తమ ప్రియురాళ్ళ అలసిన విందు మొగాల మీద పట్టిన చెమటలు ఆరేట్లు వట్టి వేళ్ల విసనకర్రల్తో విటులు విసురుతూ ఉన్నారు ఇది ఎలా ఉందంటే- మలయ మారుతం తమ సువాసనను దొంగలించగా వట్టివేళ్ళు పట్టి వేసి దొంగను దొంగ సొమ్ముతో గూడా పట్టి తెచ్చి తమరాజైన చంద్రునికి అప్పగిస్తూ ఉన్న ట్లుంది[63] (ప్రియురాళ్ళ ముఖాలు చంద్రునిలాగా ఉన్నాయి అని భావం)

ఆ మండు వేసవిలో మధురాపురంలో-పవమి పోయి, కథావ శిష్టంగా మలయమారుతం మిగిలింది. దాన్ని ఇంద్రజాలంతో కృత్రిమ విధా నంలో-భూమికి మళ్ళీ విసనకర్రలు తేవడానికి ఆరంభించాయి. ఆ తేవడం

మాయ అవడానికి విసిరే నెమలి పింఛాల విసనకర్రలే సాక్ష్యం. (ఇంద్రజాలికుడు గారడీ చేస్తూ-నెమలి పింఛం ఆడిస్తాడు.)[64]

అలాంటి వేసవి కాలంలో కఠోరమైన వేడిమికి మన్మథుని హస్తం చెమటపట్టి మాటి మాటికీ అతని పిడికిటి నుండి జారిపడుతూ - సవరించడానికి వీలుగాక చెరకు విల్లు నేలకూలిపోయింది[65].

ఆ వేసవికాలంలో నూతులలోని నీరు మిక్కిలి లోతులో ఉంది చాలా పొడవైన త్రాళ్ళతో ఎంతోసేపు తోడితేనే బయటికి వస్తూ ఉన్నాయి. ఆ నీరు పైకిరావడం ఎలా ఉందంటే-సూర్యకాంతి వల్ల క్రుంగి పాతాళ గుహల బట్టి ఉన్న నీటిని ఈ అతుకు త్రాళ్ళు తేలేదు-బావుల 'తల్లి ఒర'పై ఆనించిన తరుణుల కుచశైత్యాలే దిమ్మ పిట్టలై-ఆ జాతి పక్షుల్ని పట్టి తెచ్చినట్లు శీతల జలాన్ని పట్టితెచ్చాయి అని ఊహించేట్లు ఉంది. అలాంటి శీతల జలాలు ప్రజల్ని ఎంతో అలరించాయి[66].

గ్రీష్మఋతువులో కామినులు సల్లగా ప్రకాశించే శిరోజాల్లో మల్లె పూలను, పాటల పుష్పాలను ధరించారు. మల్లెలు తమకు మూల కారణమైన వేసవి ఎలా సర్వాన్ని నెర్రెలు వచ్చేట్లు చేస్తున్నదో, అలాగే తమ వేడి ద్వారా కామినుల శిరోజాలను చిట్లించాయి కానీ పాటల పుష్పాలు తాము కూడా గ్రీష్మకారణాలే అయినా-గొప్ప మనసుతో తమ తేనె సొనతో చిట్లిన ఆ శిరోజాల్ని కలిపాయి. తోబుట్టువులైన మల్లెలు, పాటలాలు పరస్పర విరుద్ధ గుణాల్ని ఎందుకు కలిగి ఉన్నాయి? వత్సనాభి, అమృతం సాగరంలోనే పుట్టినా ఒకటి చంపే గుణాన్ని. మరొకటి బ్రతికించే గుణాన్ని కలిగి ఉండడం ప్రసిద్ధమే కదా[67]!

ఆ వేసవిలో భోగులైన స్త్రీ పురుషులు మధ్యాహ్న వేళ దోర మామిడి కాయల ముక్కలతో, చుయ్యని శబ్దం వచ్చేట్లు నూనె పోతతో తిరగ మోత వేసి-నీటి తడి ఇగిరి పోగానే తీసిన చేప ముక్కల తాళింపుతో భుజించారు. సాయంకాలాల్లో ఆ భోజనం జీర్ణమయ్యేటపుడు కసరు తేపులు వస్తున్నాయి. క్రీడావన మధ్య ప్రదేశాల్లో ఇసుకలో ఉంచబడిన టెంకాయల్ని తీసి పగలగొట్టి వాటి చలువైన నీళ్ళు తాగేటప్పటికి ఆ తేపులు శాంతించాయి[68].

ప్రతి గ్రామంలోనూ సామంతుల కోసం వేసిన చప్పరాలు మెండై- ఆ వేసవిలో కుంపటిలోని తామరల్లా భూమి మీద ఒప్పారుతున్నాయి[69].

పగలంతా చలువకోసం తోటలోనే గడిపి, సాయంత్రం కాగా చంద్రకావి వస్త్రాలు ధరించి, మల్లెలు తురుముకొని ప్రజలు చెరకుగానుగం వద్దకు చేరుకున్నారు. ఇదెలా ఉందంటే - రాబోయే వర్షసూచకంగా గుడ్లను మోస్తూ తీపి మీద కోర్కెతో గానుగల్ని చేరే ఎర్ర చీమలేమో అనిపించేట్లు ఉంది[70].

ఆ పెను వేసవిలో మహావైభవంతో మధురాపురి సమీపంలో ఉండే అళఘరి సుందర బాహు స్వామికి తెప్పతిరుణాళ్ళు జరిగింది. ఆ మహోత్సవం చూడడానికి వచ్చి ఒక పరదేశి విప్రుడు[71]-స్వామిని భక్తితో సేవించి తిరిగి వెళ్తూ మధురాపురి వైభవాన్ని చూడగోరి వచ్చాడు. బడలికతో సాయంవేళ వైగవతి నీటిలో సంధ్యవార్చి రాజపురోహితుని ఇల్లు చేరాడు[72].

బాగా పక్వమైన సుగంధి అరటిపండ్లు, దళమైన పెద్ద పెద్ద పనస తొనలు, వేటి ముద్దల్లాంటి దోసపండ్ల ముక్కలు, వివిధ రకాలైన మామిడి పండ్లు, మృదువైన ద్రాక్ష గుత్తులు, బాగా కడిగి శుభ్రంచేసిన వడపప్పు, బహు తియ్యని పెద్ద పెద్ద దానిమ్మగింజలు, రసదాడి అరటిపండ్ల ముక్కలతో పాటు పానకాన్ని ఆ పురోహితుడు ఆ పరదేశి విప్రునితో సహా అతిథులైన బ్రాహ్మణులకు సమర్పించాడు. తమ గౌరవార్థం ఇచ్చిన మంచి గంధాన్ని శరీరానికి బాగా అలదుకొన్నాడు. విరులు సిగలో ముడుచుకొన్నాడు. కర్పూర తాంబూలాన్ని 'జౌరుకొడ్తూ' ఆ పరదేశివిప్రుడు పండు వెన్నెలలో[73] అసిమి సంచినే తలగడగా ఉంచుకొని తోవ పక్కనే ఉండే అరుగుపై ఒకరు ఆర్యావృత్తాలు, మరొకరు గీత పద్యాలు, వేరొకరు సుభాషితాలు పఠిస్తూ ఉండగా-వింటూ శయనించి ఉన్నాడు[74].

పన్నీరుతో కదంబం చేసి పూసుకొన్న కస్తూరి గుమ గుమలు అతడు రాచనగరు నుండి వస్తూ ఉన్నాడని తెలుపుతున్నాయి. తలపై ధరించిన టోపీ కుచ్చెకొనలు (తపారపు చుంగులు) కటిలి-సిగలోని పాటల పుష్పాల పరిమళాలకు మూగుతూ ఉండే తుమ్మెదల్ని-తోలివేస్తూ ఉన్నాయి. చెవుల్లో కదలాడే కర్ణాభరణాల ముత్యాల కాంతులు - పైకెగబ్రాకే అతని కంఠహార

కాంతుల్ని వెనక్కి తన్నివేస్తూ ఉన్నాయి. చంద్రకాంతి లాంటి కాంతి గల చెంగావి రవిలీ రుమాలుతో ఒప్పే అతని చేత - బంగారు పిడిగల వాడి ఖడ్గం మెరుస్తూ ఉంది. ఒక స్త్రీ అడపం తెస్తూ ఉండగా, తలారులు కొందరు ముందు నడుస్తూ ఉండగా, కదిలే మేరు పర్వతంలాగా పాండ్యరాజు అశ్వానక్తితో-మరొక వీథిలోని అంతఃపురంలాగా ఒప్పే భోగిని గృహానికి - ఆమె పొందు కోసం పోతూ ఉన్నాడు[75].

అలా వెళ్తూ ఉండే పాండ్యరాజు-మానవుడు వర్షాకాలానికి కావలసిన సామగ్రిని మిగిలిన ఎనిమిది నెలల్లో సంగ్రహించుకోవాలి. రాత్రికి కావలసినవి పగటిపూట, వృద్ధాప్యం కోసం వయసులో ఉన్నపుడు-పరలోక సుఖం సాధించడానికి అవసరమైన ప్రయత్నాలు ఇహలోకంలో చేయాలి అని ఆ పరదేశి విప్రుడు పఠించగా[76], విని ఆ వాక్యార్థాన్ని తన నెమ్మనంలో ఊహించి, గ్రహించి నిశ్చేష్టుడై-ఇన్నాళ్లూ పరలోక సాధకాలైన కార్యాలు చేయకుండా-చివరికి తాను మోసపోయినందుకు భయపడి-ఆ రాజు భోగినీ సంగతికి పోకుండా అక్కడే నిలిచి సంతాపంతో[77]-ఇలా ఆత్మ విమర్శ చేసుకొన్నాడు.

'అక్కటా! ఎక్కడి రాజ్యవైభవాలు? ఎక్కడి భోగాలు? ఏమి సంభ్రమం? నీటి బుడగలాంటి శరీరాన్ని నమ్మి మోక్షమార్గాన్ని ఇన్నాళ్లూ లెక్కించలేదు. యుగసంధులలో జీవించిన మనువు మొదలైన వారు కూడా యమునిచేత ఆపదల్లో చిక్కి మరణించకుండా తప్పించుకోలేక పోయారే[78]?

'ఎలాగైతే నావ తనలో కూర్చొని ఉన్న నరుల్ని వారికి తెలియకుండానే ఈవలి గట్టునుండి ఆవలి గట్టుకు చేరుస్తుందో, అలాగే కాలంకూడా నరులకు తెలియకుండానే గడిచిపోయి, వయసుని గడిపి మరణాన్ని తెస్తుంది[79].

నగరుడు, నలుడు, పురూరవుడు, హరిశ్చంద్రుడు, పురుకుత్సుడు పురూరవుడు అనే షట్చక్రవర్తుల్ని; గయుడు, పృథుడు, భగీరథుడు, సుహోత్రుడు, శిబి, భరతుడు, దిలీపుడు, పరశురాముడు, యవ్వనాశ్వుడు, శశిబిందుడు, అనంగుడు, అంబరీషుడు, యయాతి, రంతిదేవుడు, శ్రీరాముడు మరుత్తు అనే షోడశ మహారాజుల్ని కాలం కోల్పుచ్చింది గదా[80]!

కాబట్టి మెరుపులాగా అస్థిరమైన రాజ్యానందాన్ని మరిగి-ఇంద్రియ సుఖలోలుణ్ణయి పోకుండా ఉంటాను. ఇక మీదట పరలోకానందం కోసమే ప్రయత్నంచేస్తాను[81].

పుణ్యం ఉన్నన్నాళ్ళు స్వర్గంలో ఉండి, పుణ్యం అయిపోతూనే భూలోకానికి రావలసి వస్తుంది కాబట్టి ధర్మార్థకామాలనే త్రివర్గాన్ని కోరను. అలా స్వర్గం నుండి భూమికి, భూమి నుండి స్వర్గానికి మాటి మాటికి తిరిగే దుర్గతి నాకు వద్దు. అలాగాక మోక్షప్రదుడైన వేలుపు ఎవరో తెలుసుకొని అతణ్ణే భజిస్తాను[82].

అని ఇలా భావించి నిశ్చయం చేసుకొన్న పాండ్యరాజు ఆ పరదేశి విప్రుణ్ణి మెచ్చుకొని-తన అదపంలో ఉన్న రాజముద్ర వేయబడిన ఒకముల్లెను తలారి చేత ఇప్పించి, తాను నగరుచేరి ఆ రాత్రి గడిపాడు[83].

ఉదయమే పాండ్యరాజు విందు కొలువు ఏర్పాటుచేసి-నానా మత సిద్ధాంతాల్లో చర్చించగలిగిన విద్వాంసుల్తో - 'మీమీ శాస్త్రాలలో శోధించి మోక్షం ఇచ్చే దేవుడు ఎవరో నిశ్చయించండి' అని పలికి[84]-వాదం చేసి గెలిచి 'మోక్షప్రదుడైన దైవం ఇతడు' అని నిశ్చయించే సిద్ధాంతం చేసే వానికి-ఇవ్వడానికి గాను బీరపువ్వుల్లా ప్రకాశించే కొత్త బంగారు నాణేల్ని నింపిన జాలెను సభాస్థలిలో వేలాడ గట్టగా-అది కాల సర్పంలాగా కనిపించింది[85].

విద్వాంసుల్లో ఒకడు మోక్షం ఇచ్చే వేల్పు హరుడు అన్నాడు. ఇంకొకడు హరి అన్నాడు. మరొకడు పార్వతి అని, ఇంకొకడు సూర్యుడని, మరొకడు అగ్ని అని, ఒకడు వినాయకుడు అని, వేరొకడు చంద్రుడు అని, మరొకడు బ్రహ్మ అని వేర్వేరుగా నిర్ణయించగా మధురలో వాదం జరుగుతూ ఉండే సమయంలో[86]-శ్రీవిల్లి పుత్తూరులో విష్ణుచిత్తుడు సాటిలేని పరిమళయుక్తమైన తులసిదామం అష్టాక్షరి జపిస్తూ మన్నారుస్వామి వక్షస్థలం మీద అలంకరిస్తూ ఉండగా, స్వామి గంభీరంగా తియ్యని మాటల్తో మధుర రాజాస్థానంలో జరుగుతున్న వాద ప్రకారాన్ని ఆనతిచ్చి[87]-ఓమహామతీ! నీవు అతి తొందరగా నేడే మధుర వెళ్ళి ఆ పురంలో పాండీయ కొలువు కూటంలో నిండుగా చేర్పుకోగా ప్రేలే దుర్మదాంధుల్ని రూపుమాపి-నా మహిమం ప్రకటించి, శుల్కంగా పర్పరచిన ఆ ధనం జాలెను తీసుకో! ఆ రాజు

ఇహలోకాన్ని ఏవగించుకొని ఉన్నాడు-కాబట్టి సత్కృపతో అతణ్ణి వైష్ణవునిగా చెయ్యి[88]' అని స్వామి వారు పలుకగానే విప్రశ్రేష్ఠుడైన ఆ విష్ణుచిత్తుడు వడవడ వణికి, సాష్టాంగ ప్రణామం చేసి, ఆనంద బాష్పాలు, పులకలు ముమ్మరంకాగా వినయంచేత ముందుకు వంగిన దేహంతో విష్ణువుకు భక్తితో ఇలా అన్నాడు[89].

స్వామీ! నేను ఇంతకు ముందు తర్క-వేదాంతాది శాస్త్రాలను పఠించిన వాణ్ణికాను. కేవలం అజ్ఞానిని. మీ పూదోటలో మట్టి త్రవ్వడానికి కఠినమైన గడ్డపారతో పనిచేసినందువల్ల కాయలు కాచిన గరుకైన (అస్నిగ్ధ) చేతులు కలవాణ్ణి. మీ గుడి దాసుణ్ణి, ఇలాంటి నన్ను వాదిగా మధురకు పంపితే ఆ రాజాస్థానంలో అపజయం సంభవిస్తే-మీకు కూడా అపకీర్తులు రాకుంటాయా[90]?

'ఓ నరహరీ! మీ గుడి ఊడ్చేపనో, మీకు స్నానార్థం జలం తేవడమో, మీ శృంగార పల్లకిని మోసేపనో, వనమాలను అల్లడమో, గుడి అధికారిని కాబట్టి ఆ అధికారంతో మీ ధ్వజాన్ని మోయడమో వింజామరనో గొడుగునో ధరించడమో, దీపాల్ని వెలిగించడమో-నేను చేసే కార్యాలు. 'వాదానికి పో' అని మాత్రం అనకండి! ఈ లీలకు పాత్రం అయిన మరెవరినైనా పంపండి[91].

ఇలా విష్ణుచిత్తుడు చెప్పగానే అచ్యుతుడు మనసులోనే మెచ్చుకొని-మొలక నగవు ఒప్పుతూ ఉండగా-శ్రీదేవి ముఖం చూస్తూ 'వాదు ఇతని చేతనే గెలిపిస్తాను. ఓ యువతీ 'నా మహిమ చూడు' అని ప్రాభవం ఒప్పగా పలికి[92]- 'ఓ మునిప్రవరా! నీ ఇష్టమేనా? ఇంకేమీ మాట్లాడకుండా వెళ్ళు! నిన్ను రాజ సభలో నొప్పిస్తానా? (రాజ సభలో నిన్ను ఒప్పిస్తాను అని పాఠాంతరం)అడ్డు చెప్పవద్దు అవతల వేమున్నాము గదా[93]'! అని స్వామివారు అనగా మారుపలకడానికి భయపడి ఆ విష్ణుచిత్త ఆళ్వారు మధుర వెళ్ళడానికి అంగీకరించాడు. ఇంతలోనే ఆయన ప్రయాణానికి కావలసిన సన్నాహాలు చేయమని నంబికి స్వామి ఆజ్ఞాపించాడు[94].

గుడినంబి ద్వారా హరి అనతిని పొంది స్వామివారి భాండాగారం నుండి పారుపత్తెగాడు దారి బత్యాన్ని, తన పాత అందలాన్ని ఇచ్చి

బోయల్ని పంపగా-వారు విష్ణుచిత్తుని పల్లకి మోస్తూ ఉండగా[95]- బలమైన అద్దె గుఱ్ఱపు తట్టువుల మీద ఆసిమి సంచులు వేలాడుతుండగా. పుత్రమిత్ర కళత్రాదుల్ని పరిత్యజించి-కావి వస్త్రాల్ని ధరించి స్వామి సేవచేసే 'ఏకాంగులు' ఇరుపక్కలా వస్తూ ఉండగా, రాజుకు కానుకగా ఇవ్వడానికి అరిసెల్ని కావళ్ళలో పట్టించుకొని[96], సాధ్వి అయిన తన భార్య భక్తితో ప్రయాణంలో ఉపయోగించుకోడానికి సంబారాలు పెట్టి మూటకట్టి ఇచ్చిన వేపుడు బియ్యపు పిండితో, బెల్లం పాకంతో చేసిన పొరివిలంగాయలతోను. ఎసటిలో పోసేందుకు తగినట్లు-పరిశుద్ధం చేసిన ప్రయాణంలో కొద్దిగా తీసుకొని వెళ్ళే 'క్షేమ తండులాలు' అని పిలువబడే-పాత బియ్యాన్ని. శుద్ధం చేసి బెల్లం సగపాలుగా కలిపి సంబారపు దినుసులు చేర్చి దంపించిన చింత పండును. వంట బిందెల కావళ్ళ చివరల్లో మెండుగా వేలాడ దీసిన ఆవు నేయి ఉంచిన నన్నమూతి నేతి లద్దిగల్ని. వరుగు వడియాల్ని, పచ్చివరుగు, కందిపప్పు. విష్ణు పూజా సామగ్రి ఉన్న పెద్ద దేవతార్చన పెట్టెలు. శిఖాయజ్ఞోపవీతాలు ధరించే సాత్తిన వారు, శిఖాయజ్ఞోపవీతాలు ధరించని సాత్తాని వారు పరివేష్టించి-' పై చెప్పిన వస్తువుల్లో ఇతడు దీనిని తేవచ్చును-ఇతడు దీనిని తేరాదు, అని విధినిషేధాలు తెలుసుకొని మోసి తెస్తూ ఉండగా-విష్ణుచిత్తుడు మధురాపురికి వెళ్ళాడు[97].

## ఆశ్వాసాంత పద్యాలు

యమనియమాదుల్తో పొంద దగిన స్వామీ! బ్రహ్మాది వృద్ధ దేవతలకు కూడా దూరమైనవాడా! జనన మరణ ప్రవాహ రూపమైన సంసారమనే శ్రమను పోగొట్టేవాడా! మురసంహారా! పాప సమూహాల్ని అణచేవాడా! రమాపతీ! పద్మనేత్రా! నీ భక్తుల అజ్ఞానం అనే పచ్చికకు కొడవలి అయిన స్వామీ! భూదేవరంజనా! కాటుక పిట్ట రంగును మించే దేహవర్ణం గల స్వామీ[98]!

కొడిలాంటి బాహువుచే ఇతరులకు మోయశక్యంగాని గోవర్ధన పర్వతం ధరించినవాడా! రాధానురాగవర్ధనా! ఓలకోసం వడ్డి కాసులు రాబట్టే స్వామీ! గడ్డి పోచతో ఇంద్రపుత్రుడయిన కాకాసురుని కన్నుపొడిచి ఒంటి కంటి వానిగా చేసినవాడా[99]!

నారదాది ముని సమూహాల పరాకు లేని ప్రకాశం గల హృద్య

యాకాశంలో విహరిస్తూ ఉండే- సంపూర్ణ అరుణాలైన పాదపద్మాలు గల సామీ! ప్రాణికోటి లోపలా, వెలుపలా నిండి ఉన్న వాడా! నీ మహిమను శివుడు అపర్ణకు తెలుపగా ఆమె ఆనందించించి గదా! స్వామీ! వేంకటేశ్వరా[100]!

## కృతికర్తృవిషయం

భూమికి అలంకారాలైన కొండవీడు, ఉదయగిరి పర్వత దుర్గాల్లో ప్రకాశిస్తూ ఉండిన-గజపతి కుమారుడైన వీరభద్ర పాత్రుని సైన్యాల ప్రాణాలు తీసుకోవడంలో-రాహువులా ఉన్న దిట్టమైన బాహువులుగల కృష్ణరాయ భూపతి-అనే పేరు గలిగిన నాచే రచింపబడ్డ ఆముక్తమాల్యద అనే కావ్యంలో-హృదయ రంజకమైన పద్యాలతో ఇది రెండవ ఆశ్వాసమై-భూమి మీద శోభిస్తుంది[101].

## ఆముక్తమాల్యద - తృతీయాశ్వాసం

శ్రీదేవి, భూదేవి, నీళాదేవులకు భర్త అయిన స్వామీ! వృషభాసురప్రాణహారా! రాక్షసుడైన హిరణ్యకశిపుని కోరలను ఎగపెరికినవాడా! కుమారస్వామిని దయగల చూపుల్తో వీక్షించేవాడా! వేంకటరాయా[1]! చిత్తగించండి. విష్ణుచిత్తుడు మధురాపురికి ఆ విధంగా వెళ్ళగా[2]- ప్రతి దినమూ రాజాస్థానంలో-మోక్షప్రదుడైన దేవుణ్ణి నిర్ణయించడం కోసం విద్వాంసుల మధ్య వాదం జరుగుతూ ఉండడం వల్ల-ద్వారపాలకుడు రాజాజ్ఞ కోరకుండానే విష్ణుచిత్తుణ్ణి రాజాస్థానం లోపలికి పోనిచ్చారు. విష్ణుచిత్తుడు మిక్కిలి తేజస్వి కాబట్టి-పాండ్యరాజు, సభికులు జంకుతో ఆయనకు స్వాగతం చెప్పి లేచి నిలుచున్నారు. ఆయన సభలో ప్రవేశించి రాజదత్తమైన సమున్నత రత్నఖచిత స్వర్ణ సింహాసనాన్ని అధిష్ఠించాడు[3]. రాజు వల్ల అతిథి సత్కారం పొంది-వారి తన చిత్తవృత్తిలో ప్రవేశించగా వద్దు మణిగిన విద్వాంసుల సమూహాన్ని చూసి "మనం ఒకరికొకరు కొత్త వాళ్ళమా! మీ వాదంలోని శేషభాగాన్ని ఆపకండి! మాటలాడండి" అంటూ[4]-

కొన్ని పలుకులతోనే వారి ప్రతిభను గ్రహించి, చిర్నవ్వు నవ్వుతూ, విష్ణుచిత్తుడు రాజు నెమ్మొగం చూసి 'నీవు మధ్యస్థం వహిస్తే మేము కొన్ని మాటలు వచిస్తాము' అన్నాడు. రాజు అనుమతి ఇచ్చాడు.

# విష్ణుచిత్తుని వాదం

విష్ణుచిత్తుడు ఆ వాదం చేసేవారిలో ఒక ప్రౌఢ వాదికి అభిముఖుడై అతడు చెప్పిన యుక్తులన్నిటినీ తాను మళ్ళీ అనువదించాడు. ఆ వాదాన్ని ఖండన చేయడానికి ప్రారంభించి - ఆయుక్తులన్నిటికీ 'దూషణములు' తొందర పడకుండా -సభ్యులు ఒప్పుకొనేట్లు పలికాడు[6].

పక్క మాటల్ని లెక్క చేయకుండా - ఒక్కొక్క మాటతోనే పరాజయ హేతువును-అనుగ్రహ పూర్వకంగా ఉద్ఘాటించాడు. ఒకేసారి దొమ్మిగా వాదించడానికి పూనుకోగా-కలత పడకుండా అందరినీ సమాధాన పరచి-వారు ఊరుకునేట్లు చేదుగా. ఇలాచేసి మళ్ళీ ఆ మొదటి విద్వాంసునికే-శ్రుతిస్మృతి సూత్ర సమూహానికి ఏకవాక్యత కల్పించి-తన మతం ఒగమెరిగేట్లు రాద్ధాంతం (సిద్ధాంతం)గా చేసి-ఆ పండితుని ఓడించి-దయతో విడిచి పెట్టాడు. అవతలివాని వైపు తిరిగి 'నీవేమంటివి? రమ్ము'! అని అతణ్ణి వాదంలో ఓడించి, ఒకడొకడూ వాదానికి రాగా-వారక్రమంలో అందర్నీ విష్ణుచిత్తుడు గెలిచాడు[7].

జగం పుట్టుకకు ప్రకృతి కారణం, ఈశ్వరుడు కాదు అని వాదించే సాంఖ్యమతవాదిని విష్ణుచిత్తుడు. 'ఈక్షతేర్నాశబ్దమ్' ఇత్యాది బ్రహ్మసూత్రాలతో ఓడించాడు. నేను ఈశ్వరుణ్ణి అని వాదించే మాయావాది అయిన అద్వైతిని 'భోగమాత్ర సామ్యలింగాచ్చ' మొదలైన బ్రహ్మసూత్రాలతో గెలిచాడు. అగ్నిష్టోమాది సత్క్రియే ఫలం ఇస్తుందని వాదిస్తూ సర్వేశుని అంగీకరించని మీమాంసవాదని 'ఫలమత ఉపపత్తేః' ఇత్యాది బ్రహ్మసూత్రాల్తో పరాజయం పాలు జేశాడు. 'క్షిత్యంకురాదికం సకర్తృకం కార్యత్వాత్ ఘటవత్' అనే అనుమానమే ఈశ్వరుణ్ణి తెలుపుతోంది అని వాదించే పరమాణువాదిని 'శాస్త్రయోనిత్వాత్' ఇత్యాది సూత్రసరణితో గెలిచాడు. సకల వస్తువులూ క్షణికాలని భావించే బౌద్ధుని 'నిత్యోలకం చేల్లనిత్యాదు' అనే వేద మహావాక్యంతో ఓడించాడు. రాజరాజేశ్వరుడని వాదించే ప్రత్యక్ష వాదిని 'అనుపపత్తేర్న' మొదలైన బ్రహ్మసూత్రాలతో విష్ణుచిత్తుడు గెలిచాడు. పండితుల చేత పూజితుడైన ఆ విష్ణుచిత్తుడు ఈ ప్రకారంగా

సచ్చిదానంద స్వరూపుడైన పరమాత్ముని బ్రహ్మ సూత్రాల్లోను, ఉపనిషత్ వాక్యాలతోను మొదట నిరూపించారు. ఆ తర్వాత ఆ పరమాత్ముని సర్వ వ్యాపకత్వాన్ని, పరమాత్మను ఆశ్రయించే ఇతర దేవతల తత్త్వాన్ని, విశిష్టాద్వైతాన్ని పెక్కు ప్రమాణాలతో తేటతెల్లం అయ్యేట్లు ఉపన్యసించారు[9].

సృష్టి ఆదిలో ఆదినారాయణుడు ఒక్కడే ఉండేవాడు. బ్రహ్మ, మహేశుడు లేరు. ఆకాశం లేదు. సూర్యచంద్రులు లేరు. నక్షత్రాలు లేవు. నీళ్ళు లేవు. అగ్ని లేదు. ఇలాంటి ఏకాకిత తన విలాసానికి యుక్తం కాదని భావించి, తానే అనేక రూపాల్ని పొందుతానని చేతనాలైన జీవులు, అచేతనాలైన ఇతరాలు అనే రెండు తెగలలోను ఆదినారాయణుడు ప్రవేశించి పెక్కు రూపాలు దాల్చాడు. ఈ విషయాల్ని ఛాందోగ్యోపనిషత్తు బోధిస్తూ ఉంది. అంతరాదిత్య విద్యలో సూర్యునిలోనున్న పద్మనేత్రుడు ఆదినారాయణుడు అవడాన్ని 'కప్యాసం పుండరీకాక్ష పుండరీకే ఇవ అక్షిణీ' అనే ద్వివచనం చెప్పుతూ ఉంది. అష్టనేత్రుడైన బ్రహ్మ, త్రినేత్రుడైన రుద్రుడు, వేయి కన్నుల వాడైన దేవేంద్రుడు మొ॥న వారిలో ఆదినారాయణుడు ఒక్కడు కాదని అతని విలక్షణతను ఆ ఛాందోగ్యోపనిషత్తే తెలిపింది[10].

ఈ ఛాందోగ్య ఉపనిషత్తులో ఆదినారాయణుని సాటిలేని స్వరూపం, గుణాలు, ఐశ్వర్యాలు స్పష్టం చేయబడ్డాయి. నారాయణుడు సకల చరాచర ప్రపంచం లోపలా బయటా నిండి ఉన్నాడని నారాయణీయ యజ్ఞికోపనిషత్తు తెలుపుతూ ఉంది. బ్రహ్మం దాది శబ్ద సమూహం అంతా- విశేష శబ్దాలన్నీ సామాన్యాన్నే చెప్తాయి అనే సామాన్య విశేష న్యాయంతో- నిర్మలమైన నారాయణ శబ్దంలోపలే చివరికి పర్యవసాయం పొందుతాయని వేదంలోని అరుణాలు అనే భాగాలు తెలుపుతున్నాయి[11].

అపహత పాప్మాదివ్యో దేవ ఏకో నారాయణః

ఇత్యాది సుబాలోపనిషత్తులోని సూక్తం మీద కుదురై ఉన్న ఆ 'నారాయణ' పదం, శ్రీమన్నారాయణుని కంటే అన్యదైవం లేదని నిస్సందేహం అయిన తీరులో-భ్రమాత్మక జ్ఞాన జన్యమైన వివాదాన్ని తీర్పు వేసింది[12].

పూర్వం దివోదాసుని పుత్రుడైన ప్రతర్దనుడు అనే రాజు పరశురామునికి భయపడి రాజ్యం వదిలి, వైరాగ్యం పొంది, మోక్షం కోరుతూ

దేవేంద్రుణ్ణి ఆరాధించాడు. దేవేంద్రుడు ప్రత్యక్షమై నాలో అంతర్యామి అయిన నారాయణుణ్ణి పూజించు అనే అర్థంలో 'మాముపాస్వ' (నన్ను కొలువు) అన్నాడు[13].

పూర్వం తపంలో ఈశ్వరున్తో తుల్యుడైన వామదేవుడు అనే ముని నేను సూర్యుణ్ణి, నేను మనువును, అగ్నిని నేను (సూర్యోహం మనురహం కక్షీవానహమ్) అనే శరీర వాచక శబ్దం శరీరి పర్యంతం (శరీరంలోని ఆత్మ పర్యంతం) పోతుంది కాబట్టి చిత్తు అనబడే జ్ఞానరూపమైన ఆత్మల్ని-అచిత్తు అనబడే అజ్ఞాన రూపమైన శరీరాల్ని-తన శరీరంగా గలవాడైన పరమేశ్వరుని గురించి ముందు గర్భంలో ఉన్నపుడే అన్వయించుకున్నాడు అని ఇంద్రుడు ప్రతర్దన రాజుకు తెలిపాడు.

దేవతల్లో జీవుడైన తాను ఉపాసింపదగిన జగత్కారణుడైన నారాయణుణ్ణి కాదని విజ్ఞాన వృద్ధుడైన వృద్ధశ్రవుడు అనే పేరుగల ఇంద్రుడు ఆ పరమాత్మయందు అన్వయం అనే (తదనుసంధాన న్యాయంబున) న్యాయంతో ఉపదేశించాడని-వేదవ్యాస సూత్రాలలోను, వేదాంత శాస్త్రాలలోను - వివరింపబడింది ఆత్మ, భూమి, అగ్ని, గాలి, గగనం, కాలం, మృత్యువు మొదలయిన చిత్ అచిత్ సమూహాలు-నారాయణుని దేహాలని-ఆ శ్రుతి సూత్రాల్లోనే చెప్పబడింది. అలా అయినందు వల్ల-అశేషాలైన ఇతర దేవతల శరీరాలన్నీ ఆ నారాయణుని శరీరాలే గదా! అని మోక్షాన్ని అర్థించేవారు. ఆ పుండరీకాక్షున్ని తప్ప ఇతర వ్యక్తిని ఉపాసింపరాదు. బ్రహ్మ, రుద్రుడు, కార్తవీర్యార్జునుడు, వ్యాసుడు, సూర్యుడు, పరశురాముడు విష్ణువు యొక్క సమయోచిత రూపాలే అయినందువల్ల వారి పూజ ధర్మార్థకామా అనే త్రివర్గాలు కోరేవారికి తగినది కాని-మోక్షం కోరేవారికి యుక్తమైనది కాదని-ధర్మశాస్త్రం చెప్తూ ఉంది. అదిగాక ఈశ్వరునికి జీవునికి ఉండే నిత్య సంబంధాన్ని-జీవునికి ఈశ్వరుడే తల్లి, తండ్రి, సోదరుడు, నివాసం, శరణం, చెలికాడు, గతి అని-సర్వానికి నారాయణుణ్ణే పరమాశ్రయంగా-సుబాలోపనిషత్తు ప్రతిపాదిస్తూ ఉంది. అలాంటి పరమేశ్వరుణ్ణి దర్శించడానికి తగిన యోగం చెప్తాను. ఖాండిక్య కేశిధ్వజుల సంవాదం విను! అని విష్ణుచిత్తుడు పాండ్యరాజుతో ఇలా అన్నాడు[14].

# ఖాండిక్యకేశిధ్వజ సంవాదం

నిమివంశంలో జన్మించిన రాజులందరికీ 'జనకులు' అనే సామాన్య నామం ఉంటుంది. ఆ వంశంలో ధర్మధ్వజుడు అనే రాజుకు మితధ్వజుడు అనే భూపతి, జగద్రక్షణలో విష్ణువులాంటి కృతధ్వజుడు జన్మించారు. మితధ్వజుని కర్మ శూరుడైన ఖాండిక్యుడు, కృతధ్వజునికి బ్రహ్మజ్ఞాని అయిన కేశిధ్వజుడు పుట్టారు[15].

ఆ ఖాండిక్య కేశధ్వజులు రాజ్యకాంక్షతో ఒకరిమీద ఒకరు వైరం వహించి జమేర్పడో ఆ రాజ్య ప్రజలు భీతిల్లేట్లు వాలాడినారు హోరాహోరిగా పోరాడారు[16]

వారిద్దరూ ఇక్షుమతీ నదిని సరిహద్దుగా చేసుకొని నిత్యం తెల్లవారగనే విడిదుల నుండి వెలువడి వచ్చి, భూజలుదీర్చి తలపడుతూ వెనుదిరుగుతూ యుద్ధం చేశారు. కృతధ్వజ నందనుడైన కేశిధ్వజుని సేనాంగ సమూహాల ధాటికు అగలేక ఖాండిక్యుడు అపన్నుడై పారిపోయాడు[17]. అలా పారిపోయి అరణ్యంలోకి వెళ్ళి అక్కడక్కడా కొండ శిఖరాల్లో కొట్టికాంద్రను విలిపి, అడవి మధ్యలో పాతేనికి అవరణగా కంప పాతించి అకుల గుడిసెల్లో మంత్రి భట సమేతంగా నివసించాడు[18].

ఖాండిక్యుని రాజ్యం కూడా తన రాజ్యంలో చేరిపోగా కేశిధ్వజుడు పరిపాలిస్తూ, యాగాది కర్మఫలమైన స్వర్గ భోగాన్ని కోరకుండా, 'మృత్యువును గెలుస్తాను-అజ్ఞానం వల్ల పునర్జన్మ పొందను. చివర చావను'-అని జనన మరణ ప్రవాహ రూపమై దుఃఖాన్నిచ్చే సంసారం దాటి, మోక్షం పొందడానికి విశ్వసించుకొన్న వాడయ్యాడు. బ్రహ్మజ్ఞానం అవలంబించి యోగాసక్తితో పెక్కు యజ్ఞాలు చేస్తూ, అందులో ఒక యజ్ఞానికి దీక్షబూని ఉన్నాడు[19]. అలా కేశిధ్వజుడు యజ్ఞదీక్షపూని ఉన్న సమయంలో యజ్ఞధేనువు యాగశాల సమీప ప్రాంతాల్లో ఏటి వెంబడి గడ్డి మేస్తూ వెళ్ళి, దట్టంగా కమ్ముకొని ఉన్న ఒక పొదను సమీపించింది. ఆ పొద పక్కనే యముని వెండాలాగా, అతద్రాచులా చరిస్తూ ఉన్న పులి తోకను చూసి గోంద్రవి అంగలాడుస్తూ మెడలో వేలాడే ఘంట మ్రోగిస్తూ ఉండగా

వరుగెత్తింది. పులి పిడుగులాగా దానిపైబడింది.[19]

పులి మీదబడుతూనే - ఈగలు వాలుతూ ఉండే పుళిసోటి గబ్బు ఆవు ముఖానికి తగిలి - దానికి ఊపిరాడలేదు పులి చెట్ల ఆకులు రాలేట్లుగా ఆవును చెట్లబోదెమీదికి పడదోసింది. వానకారు మేఘాల గర్జనకు పోటి వచ్చే పులిబొబ్బరింత గాలి విస్తృతమై చెవుల్లో దూరగా - పసులకాపరి స్మృతితప్పి నేలపై ఒరిగాడు. బెబ్బులి ఆవుగొంతు క్రోలు కరిచి, చెంగున మారుమెదపడేట్లుగా ఆవును పరవేసి లంఘించింది.[20]

గోవు కొమ్ములు, గిట్టలు తనకు తగలకుండా ఆ పులి ఇటూ ఆటూ త్రిప్పుతూ, శబ్దంవచ్చేట్లు తోకజాడిస్తూ, నెత్తురు తాగుతూ నేర్పుగా యాగధేనువును కొండగవికి ఈడ్చుకొని వెళ్ళే సమయంలో - ఆ ప్రాంతాల్లో తిరుగాడే పౌలంకాపరులు కూతలువేశారు. బ్రాహ్మణులు ఆ నదిలో సంధ్య వార్చి చెట్లెక్కి చప్పట్లుకొట్టి అదిలించారు. రౌతులు గుర్రాలెక్కి వచ్చి బాణాల్ని ప్రయోగించారు. పులి ఆవును వదలిపెట్టి, మాటిమాటికీ వెను తిరిగి చూస్తూ, ఘుటఘుట ధ్వనిచేస్తూ, తూగుతూ, పెదవిమూలలు నాక్కుంటూ, చెట్లగుంపులోకి వేగంగా పారిపోయింది.[22]

జలుజలుకని నెత్తురు వెలికి ఉరుకుతూ రొదచెయగా, గొంతు గండినుండే ఊర్పులు వడివడిగా ప్రసరిస్తూ ఉండగా, కొనప్రాణంతో ఆ ఆవు తన్నుకుంటూ ఉంది.[23]

ఆ యాగధేనువు వృత్తాంతాన్ని రాజు తెలుసుకొని ఋత్విజుల్ని ప్రాయశ్చిత్తం అడిగాడు. వారు తమకు తెలియదని - 'కసేరువు' అనే ఋషిని అడగమన్నారు. కసేరువు శునకుడు అనే విద్వాంసుణ్ణి అడగమన్నాడు. శునకుడు ఋత్విజులుగానీ కసేరువుగానీ, నేనుకానీ ప్రాయశ్చిత్త విధం ఎరుగము. మేమేకాదు - భూమండలంపై మరెవ్వరికీ తెలియదు. నీకు సప్తాంగాల్ని ఇచ్చి, అడవులు, గుట్టలుపట్టి తిరుగుతూ ఉండే ఖాండిక్యునికి ఒక్కనికే ప్రాయశ్చిత్త విషయం తెలిసి ఉండవచ్చు. ప్రాయశ్చిత్తం తెలుసుకోవడం ఆవశ్యక కర్తవ్యం అయితే 'అతణ్ణి అడుగు' అని చెప్పారు.[24]

ఇలా అంటూనే - కేశిధ్వజుడు - ఓ మునిశ్రేష్ఠా! నా శత్రువైన కేశిధ్వజుణ్ణి ప్రాయశ్చిత్తం అడగబోయినప్పుడు. అతడు నన్ను చంపాలా - యజ్ఞఫలం సిద్ధిస్తుంది. అలాగాక మత్సరమార్గం వదిలి ప్రాయశ్చిత్తమార్గం తెలిపితే - యజ్ఞకృత్యం క్రమం తప్పక సంపూర్ణం అవుతుంది. ఈ రెండు విధాలూ నాకిష్టమైనవే. కాబట్టి, కేశిధ్వజుణ్ణి ప్రాయశ్చిత్తం అడగబోతాను - అని మునితో అన్నాడు [25]

కేశిధ్వజుడు రథం అధిరోహించి. జింక చర్మం ఉత్తరీయంగా ధరించి. నిరాయుధుడై, ఖాండిక్యుని నెలవైన అడవిలో ప్రవేశించగా కొట్టికాండ్రు రథంపై ఉండే టెక్కెం చూసి కేశిధ్వజుడని తెలుసుకొని, గుంపుగూడి కూతలు పెట్టారు [26]

ఆ కొట్టికాండ్ర కూతలు విని వలస వచ్చిన ఖాండిక్యుని ప్రజలు బెదిరారు. అయినా ఖాండిక్యుడు చలించకుండా ప్రజల చింతల్ని మాన్పడానికి కొందర్ని పంపి కొమ్మల్లో విలవడానికి విలు కాండ్రను ఏర్పరచి పంపి, తాను కోపంతో 'తడుకు పెండెం' వెడలివచ్చాడు [27]

ఎదురుగా వస్తూ ఉండే శత్రువైన కేశిధ్వజుణ్ణి చూపులతోనే దహిస్తూ - రాజ్యం అపహరించడం, మళ్లీ కవిపించడం, రోషం అనే మిచ్చిచ్చులచేత తన బలం అతిశయించగా - మెరుపుతీగెలాగా చలించె వింటి అల్లెత్రాటికి బాణం సంధిస్తూ - ఖాండిక్యుడు ఇలా పలికాడు [28]

దుర్మతీ! ధనం. ధాన్యం. కరులు. అశ్వాలు. గోగణంతో గూడిన సామ్రాజ్యాన్నంతా తీసుకున్నావు అయినా తృప్తిపొందక మాయ వేషం దాల్చిన మారీచున్లాగా జింకతోలులో దాగినవాడివై ప్రశాంతుడిలాగా మాలో ప్రవేశించి, నా ప్రాణాల్ని కూడా అపహరించడానికి వచ్చావా? నిన్ను ఈ క్రూరభల్లంతో సంహరిస్తాను'.[29]

ఇలా ఖాండిక్యుడు అంటూనే కేశిధ్వజుడు చేయెత్తి 'ఓహో! అలుగకుండా విను! నేను చంపవచ్చినవాణ్ణి కాదు. నేను చేస్తూ ఉన్న యాగా

వికి ప్రమాదవశాత్తు వైకల్యం కలిగింది నేను బ్రాహ్మణ సమూహాన్ని ప్రాయశ్చిత్తం అడగ్గా నిన్న నిర్దేశించి 'రాజా! నిష్కృతి అతనికే తెలుసు! అతణ్ణే వేడుకోపో' అన్నారు. కాబట్టి కోపం అయినా విడువు! రోషం (బాణం) అయినా విడువు. ప్రాయశ్చిత్తం చెప్పినా, చంపినా ఏలాగైనా మేలే' అన్నాడు.[30]

ఇలా కేశిధ్వజుడు అంటూనే, ఖాండిక్యుడు చెట్లగుంపులోకి వెళ్ళి మంత్రులు, పురోహితులు మొదలైన ఆ ప్రజానానికి ఆ వృత్తాంతం అంతా చెప్పాడు అపుడు మంత్రులు ఇలా అన్నారు [31]

'రాజా! దాయాది మనకు ఎలాంటి కష్టం పెట్టకుండా తానే మన సమీపానికి వచ్చాడు కరుణ చాల్లే! ముదురాకులు మేసి నీ ప్రజల్ని చంపకు ![32]

గుంపులు గట్టి మా భార్యాబిడ్డలు చెటికనేలల్లో ఆకుకూరలు కోయ బోయి, ముండ్లు వారి పాదాల్లో గుచ్చుకోగా ఊడలాగి బాధతో కూపెట్టగాం రాత్రుల్లో కంటికి నిద్రలేక - ఈ అడవిలో ఒడిగి - కాలం వెళ్లబుచ్చుతున్నాం. ఒక్క మాకే కాదు! నీవు పడే అవస్థమాత్రం చెప్పశక్యమా![33]

స్వామి, మంత్రులు, మిత్రులు, భాండాగారం, రాష్ట్రం, చతురంగ బలాలు, దుర్గాలు అనే ఈ సప్తాంగాలు రాజు ఉన్నపుడే ఉంటాయి. ఆత్మసుఖంగా ఉన్నపుడే శరీరంలోని అంగాలు సుఖంగా ఉంటాయని మనకు తెలిసిందేగదా ![34]

అతని 'పనిదీరిస్తే' రెండు రాజ్యాలు నీకు లభిస్తాయి. ఏ ఉపాయంతో అయినా శత్రుజయం, ధనవృద్ధి, ప్రజల్ని దయతో కాపాడడ, అనేవి రాజధర్మాలు [35]

దుస్సహమైన కోపంగలవాడైన ప్రబల శత్రువును అన్యాయ మార్గంలో వధించినందువల్ల సంభవించే తిరస్కారానికి, న్యాయంగా

ప్రజల్ని సంరక్షించడం ద్వారా నిష్కృతి జరుగుతుంది.[36] దేవేంద్రుడు తన రాష్ట్రం చెడవచ్చినపుడు ఆచార్యుడైన త్రిశీర్షునే సంహరించలేదా? శత్రువుపై దయవిడువు! నిన్ను నమ్మిన ప్రజలు కృశించిపోతూ ఉండగా నీదయ ఏల?[37] శిష్టుడైన నిన్ను ఇంతచేసిన దుష్టాత్ముని సంహరించి, అందువల్ల వచ్చే పాపాన్ని క్రతువులు నిర్వహించడం, చెరువులు నిర్మించడం లాంటి 'ఇష్టాపూర్తాలు' చేసి పోగొట్టుకో![38] ఇంక రెన్నాళ్లు చూసి నీవల్ల తెగువలేకుండా ఉంటే ప్రజలు ఊళ్లకు వెళ్ళిపోతారు. అపుడు నీవు మునివైనా కావాలి - లేదా హీనమైన సంధిచేసుకొని అతణ్ణి చేరనన్నా చేరాలి. వేరేమార్గంలేదు.[39]

ఓ రాజా! నీవు తపం చేయడానికి పూనుకొన్నా 'అవమానం' అనే బాణంములికి నీహృదయంలో మెదలాడుతూ ఉంటే కన్నులు మూసుకోవడం ఒక్కటే ప్రయోజనం కానీ, ఏకాగ్రధ్యానం కుదురుతుందా?[40]

భార్గవుడు అవమానంతో తన తండ్రి హంతకులైన రాజుల్ని వెతికి పిల్లపిల్లతరం సంహరించి తర్వాత ముని అయ్యాడు. కాబట్టి వైభవం కోసం కాకపోయినా శాంతికోసమైనా సరే పగ తీర్చుకోక తప్పదు.[41] పగ, దుఃఖం లేకుండా ఏమాత్రం లభించినా సంతోషించే సామాన్య సంసారి కావడంమేలు. రాజవేషం ధరించిన రాజుకు పగ, పగ కలిగితే శాంతితో మరవడం ఉచితంకాదు.[42] పులి కొండదిగి కంటకలంకతో ఊళ్ళలోకి వస్తే ఆ వ్యాధిని మూస్కొని తిరిగి రమ్మని ప్రజలు వెనక్కి పంపి, అది వ్యాధి మూస్కొని గుహలో వెళ్ళిన తర్వాత చురకత్తులతో వెళ్ళి జనం చస్తారా? లేక ఊర్లోనే 'కుయిరేగి' (కేకలువేస్తూ) ఆ పులిని కొడుస్తారా? నీవే చెప్పురాజా![43] ఈ వేళ ధర్మం తలచి బలియుడైన అతణ్ణి కొలిదు ప్రాపు సరే! నీ పోయిన రాజ్యం ఎలా తిరిగి వస్తుంది? ఇదో ఆ మార్గం లేదా ఈ మార్గం అని వేలుమడిచి చెప్పు.[44] అలసత్వం (సోమరితనం) తో పడుండి ఉండేవాడు - కలియుగంలాంటివాడు. కూర్చున్నవాడు ద్వాపర యుగంలాంటివాడు. లేచినవాడు త్రేతాయుగంలాంటివాడు. నడుస్తూ వుండేవాడు కృతయుగంలాంటివాడు అని ఋగ్వేద బ్రాహ్మణంలో చెప్పబడిన

ఇంద్ర వచనం మనం విన్నాం కదా![45] (ప్రయత్నంచేసేవాడు సర్వోత్కృష్టుడు. ప్రయత్నం చేయనివాడు సర్వాధముడు అని భావం.) శత్రువు దోషస్థానం తెలిసికొట్టేవాడు, తన రాష్ట్రానికి కలిగే ఉపద్రవాల్ని పరిహరించుకొనేవాడు, యథార్థ వాక్కులైన ఆప్తుల మాటలు రుచించేవాడు, అనుకూల సమయంలో వైరుల మీదికి పోయేవాడు, అనుకూల సమయంలో త్వరపడక ఉండేవాడు అయిన రాజు చిరకాలం భూమినేలుతాడు[46]

కాబట్టి 'శత్రుసంహారానికి లేలెమ్ము' అని ప్రధానులు అనగా వారితో ఖాండిక్యుడు ఇలా అన్నాడు.[47]

'మీరు చెప్పిన పని చేయవలసినదే. ఈ పనిచేస్తే రాజ్యం అంతా మనకు దక్కుతుంది. వానికి పరలోకం సిద్ధిస్తుంది. ఒక్క విషయం! ఈ రెండిట్లో ఉండే తేడా విచారించాల్సి ఉంది.[48]

అలా విచారిస్తే - పరలోక సుఖం శాశ్వతం - భూపాలనవల్ల కలిగే సుఖం స్వల్పకాలం మాత్రమే అనుభవించతగినది. ఇలాంటి అల్ప సుఖంకోసం పాపంచేసి పరలోక సుఖానికి దూరం అవుతారా ?[49]

కేలుమోడ్చి మొక్కుతూ శరణుకోరి వచ్చిన దీనుణ్ణి కోపంతో చంపడం - పరలోక సంపాదన బుద్ధికలిగినవానికి చాలా కీడైన పని - అని చెప్పిన కణ్వమహాముని వాక్యాలు మీరు తలచుకోరేమి ?[50]

ఖాండిక్యుడు ప్రధానులతో ఇలా అని - మంత్రాలోచనకోసం ప్రవేశించిన చెట్లగుంపునుండి - బయటికి వచ్చి, కేశిధ్వజుని అడిగి, యాగధేనువు సంహారవృత్తాంతం తెలుసుకొని, తగిన ప్రాయశ్చిత్తం ఉపదేశించాడు. కేశిధ్వజుడు వెళ్ళి యజ్ఞాన్ని సంపూర్తిచేశాడు.[51]

కేశిధ్వజుడు అవభృథస్నానం (యజ్ఞాంత స్నానం) చేత బాగా తడిసిన శిరస్సుకలవాడై ఋత్విక్కుల్ని, సదస్యుల్ని పూజతో తనియజేసి, తరువాత సూతులకు, మాగధులకు, వందివైతాళిక ప్రభృతులైన అర్థి కోటికి వారు కోరిన ధనాన్ని ఇచ్చాడు.[52]

ఇంకా, కోరినవారి అక్కరలన్నీ తీర్చుతూనా - తన మనస్సు సంతుష్టి పొందకపోవడానికి కారణం ఆలోచించి - 'అకటా! గురుదక్షిణ ఇవ్వలేదే?' అని మళ్ళీ కేశిధ్వజుడు అడవికివెళ్ళి, ఖాండిక్యుడు సందేహంతో తొట్రుపడుతూ ఉండగా[53] - ఖాండిక్యుని సంభ్రమాన్ని వారించి 'రాజా! నీ కోరిక ఏమి? గురుదక్షిణ ఇవ్వడానికే వచ్చాను. అడుగు' అన్నాడు. అప్పుడు ఖాండిక్యుడు తన ఆప్తులతో[54] 'ఈ భూపతి గురుదక్షిణ ఇవ్వడానికి వచ్చాడు. మీరు నాకు ఆప్తులు. పదేపదే ఆలోచించి ఏది కోరడం మంచిదో ఆలోచించి చెప్పండి'[75] అని అనగానే, వారు సంతోషంతో పొంగుతూ ఇలా అన్నారు. 'ఈనాడు గదా! మనపాలిటికి దేవుడు కలిగాడు! నాలుగు సముద్రాలచేత ఆవరింపబడిన భూమండలాన్నంతా గురుదక్షిణగా వెంటనే కోరు! మమ్మల్ని అందర్నీ రక్షించు! బంధువుల ఆప్తుల పోషణకంటే పుణ్యం మరేముంది?[56]

శత్రువుపై దండెత్తడానికి మనకు బలం ఎప్పుడు కలుగుతుంది? సమయం ఎప్పుడు వస్తుంది? అనుకూల కాలం వచ్చినా పోరు యోగ్యం అయినదా? పోతే మాత్రం జయమే కలుగుతుందా? ఇప్పుడు నీ అదృష్టం కలిసిరావడంవల్ల ఇలా కార్యం చేకూరుతూ ఉంది. బంధువులకు, స్నేహితులకు ఒక్క కీడు కూడా కలగకుండానే రాజ్యం లభిస్తూ ఉంది. చావకుండా, గాయపడకుండా ఊరికే సిరులు అబ్బుతాయా'[57] అని ప్రధానులు చెప్పగానే ఖాండిక్యుడు చిరునవ్వు నవ్వి ఇలా అన్నాడు. 'మీరు అర్థశాస్త్రకోవిదులే తప్ప మహాసుఖాన్ని ప్రసాదించే మోక్షమార్గ విచార కోవిదులు కారు. నేను వెళ్ళి ఆ మహాముని అయిన కేశిధ్వజుణ్ణి సర్వోత్కృష్ట ప్రయోజనం అయిన మోక్షమార్గం అర్థించకుండా, అతిచంచల అయిన రాజ్యలక్ష్మిని ఎలా కోరగలను?[58] మేము నిమివంశస్థులమట! మాబోటివారికి రాజ్యమా లక్ష్యం? కేశిధ్వజుడు అమలిన రాజయోగానికి ఆశ్రయుడు. అతని వద్ద నుండి ఉత్తమయోగం గ్రహించడం ఉచితమా? రాజ్యం గ్రహించడం ఉచితమా?[59] కాబట్టి ఈ మాటలు విడవండి'? అని ఖాండిక్యుడు పాళెం వదిలివచ్చి కేశిధ్వజుణ్ణి ప్రేమతో చూస్తూ 'నీవు గురుదక్షిణ నిజంగా ఇస్తావా?' అన్నాడు. 'నిజంగానే ఇస్తాను' అని కేశిధ్వజుడు అవగానే

'ఓ రాజా! నీవు బ్రహ్మవిద్యానిష్ణుడివి. గురువుకు దక్షిణ ఇవ్వాలను కొంటూంటే ఏ విద్య సంసార దుఃఖ నాశకమో దాన్ని బోధించు' అని ఖాండిక్యుడు అన్నాడు. ఆ మాటలకు కేశిధ్వజుడు నవ్వి 'అహహా! శత్రు రహితం అయిన నా ప్రభుత్వం అడుగవిష్టపడకుండా అధ్యాత్మ విద్యను ఎందుకు అడిగావు? రాజులందరికీ రాజ్యంకంటే ప్రియమైనది మరొకటి ఉందా?' అన్నాడు. ఆ పలుకులకు ఖాండిక్యుడు 'కేశిధ్వజా! విను! రాజ్యంకోరనందుకు హేతువు తెలుపుతాను. అజ్ఞానికి కాక వివేకికి చాపల్యం ఎందుకు కలుగుతుంది? యుద్ధంలో ధర్మమార్గంలో శత్రువును గెలిచే శౌర్యం, ప్రజాపోషణ రాజు ధర్మాలు. అయినా, అలాచేయని పాపం నీచేత విజితుణ్ణయి రాజ్యం పోగొట్టుకున్న నాకు అంటదు'.[61]

'ఓ నరనాథా! ఈ రాజ్యపాలనం, శత్రుసంహారం మొదలైన రూపాల్లో విలసిల్లే అజ్ఞానాన్ని త్యజిస్తే అధికారి (సమర్థుడు) కి క్షత్రియ ధర్మ లోపంవల్ల వచ్చే పాపం అంటుతుంది అనధికారికి ఆ దోషం అంటదు. 'నేనిస్తాను! పరిగ్రహించు!' అని దానం ఇచ్చే రాజ్యాన్ని గ్రహిస్తే, ఆ రాజ్యం భోగానికి ఉచితంగాని ధర్మానికి ఉచితం కాదు. కాబట్టి, సత్క్షత్రియులకు భిక్షాటన కీడైనది. నా ప్రధానులు 'రాజ్యంకోరు' అనే పలుకులు ధర్మం అనే నెపం కలిగిన రాజ్యలోభం అవి. అలా కోరడం అయుక్తం అని తెలిసే రాజ్యాన్ని అడగడానికి నేను ఇచ్చగించడంలేదు.[62]

మమత మానని జడాత్ములలాగా . బుధులు రాజ్యానికి ఆశపడ తారా? అది అహంకార మధు మత్తులకే కాని మాబోటివారికేల?' అని ఖాండిక్యుడు పలికాడు. జనకవంశజుడైన కేశిధ్వజుడు హర్షించి ఖాండిక్యుని మెచ్చుకుంటూ ఇలా అన్నాడు.[63] "అనఘా! నేను అజ్ఞానంవల్ల కలిగే మృత్యువును తరించడానికి రాజ్యం పలుతూ, యజ్ఞయాగాదులు చేస్తూ ఉన్నాను. నా పుణ్య ఫలాన్ని భోగానుభవాలవల్ల క్షీణింపచేస్తూ ఉన్నాను.[64]

ఓ రాజా! మన నిమివంశం పవిత్రభాగ్యంవల్ల తత్త్వవివేచన చింతన నీకు కలిగింది. నేనిపుడు అవిద్యా (అజ్ఞానం) విధానాన్ని విని పిస్తాను విను.[65]

'ఓ ఖాండిక్య మహారాజా! తాను కాని దేహాన్ని తాను అనుకొనే అభిప్రాయం - తనవికానట్టి బంధుమిత్ర కళత్రాదులు తనవి అనే బుద్ధి - ఈ రెండూ అజ్ఞాన మహావృక్షం పుట్టుకకు రెండు దళాలుగా ఉండే అది బీజం [66]

నరనాథా! పృథివి, నీరు, తేజం, వాయువు, ఆకాశం అనే పంచభూతాత్మకం అయిన శరీరంలో జీవుడు అజ్ఞానం అనే మిక్కిలి దట్టమైన చీకటిచేత ఆవరించబడినవాడై, నేను అనే అహంకారం, నా సొత్తు అనే మమకారం కలిగి హద్దులేని భ్రమతో పడి తిరుగుతూ ఉంటాడు.[67].

జలం, భూమి, ఆకాశం, గాలి, అగ్ని అనే పంచభూతాలకంటే వేరై సర్వదా వెలుగొందే ఆత్మ ఉండగా దేహాన్ని ఆత్మగా ఎవరు భావిస్తాడు?[68]

ఓ రాజా! ఇల్లు, భార్య మొదలగునవి దేహానికి అనుభవింప తగినవి. కాబట్టి అవి ఆత్మవికావు. పుత్రపౌత్రులు సైతం జీవుడుకానట్టి దేహంలో పుట్టినందువల్ల తనవారుకారు. కాబట్టి మృతిపొందేది అయినట్టి శరీరంలో జన్మించే పుత్రాదులమీద తనవారనే తలపు తగదు. ఎప్పుడయితే, దేహంకంటే ఆత్మ వేరే అంటున్నామో అప్పుడే అతిశయాలైన భోగాలు ఈ ఆత్మకు అంటవు. అలాగాక, ఈ దేహమే ఆత్మ అంటే భోగాలు ఆత్మకు అంటుతాయి. మట్టిఇల్లు మట్టి, నీళ్ళు కలిపి అలికితే నిలుస్తుంది. అలాగే, పాంచభౌతికం అయిన దేహం పాంచభౌతిక భోగానుభవంతోనే నిలుస్తుంది. భౌతికంగాని జీవునికి భౌతికాలైన ఈ భోగాలు అంటవు [69]

సంసారి అనే బాటసారి వేలకొలది జన్మాలు అనే పెక్కు మజిలీలు చేస్తూ - జనన మరణ రూపం అయిన సంసార మార్గంలో నడుస్తూ ఉంటాడు. అతనికి అనాది కర్మవాసనలనే ధూళి కప్పుకొంటూ ఉంటుంది. అజ్ఞానం అనే శ్రమ ఆక్రమిస్తూ ఉంటుంది. ఎప్పుడు జ్ఞానం అనే వేడినీటితో సంసారి స్నానం చేస్తాడో - అపుడు ఆ ధూళి కడగబడుతుంది. ఆ అజ్ఞానం అనే శ్రమకూడా తీరుతుంది.[70] అనఘా! అలాంటి అజ్ఞానం అనే శ్రమ

తిరగానే ఆ జీవుడు స్వస్థుడై నిరతిశయం, నిర్బాధం అయిన మోక్షం అనుభవిస్తూ ఉంటాడు. అనాదినుండి జీవుడు జీవన్ముక్తుడు కాబట్టే ఆ విధంగా మోక్షసామ్రాజ్యం అనుభవిస్తూ ఉంటాడు.[71]

ఓ రాజా! విను! నీరు నిప్పుకు తగలకున్నా నిప్పుమీదనున్న కుండలో ఉండడంవల్ల, తాను నిక్కటి చల్లనిదై కూడా ఉడికి గుడగుడమనే ధ్వని, పొంగడం మొదలైన ధర్మాల్ని పొందుతుంది. అలాగే జీవుడు కూడా శరీర సంబంధంచేత - అహంకార మమకారాదులచేత మలినుడై - ప్రకృతి సంబంధ గుణాల్ని పొందుతున్నాడు. ప్రకృతి ధర్మాలకంటే విలక్షణుడు, అక్షయుడు అయినవాడు జీవుడు. అందువల్ల - ఇంత అనర్థ మూలం అయిన - ఈ అజ్ఞాన బీజం గురించి నీకు తెలిపాను. ఈ ప్రకారమైన సుఖదుఃఖాలను నాశనం చేసేది యోగం తప్ప వేరే ఉపాయంలేదు' అని కేశిధ్వజుడు చెప్పగా - ప్రీతుడై ఖాండిక్యుడు కేశిధ్వజునితో - 'ఓ మహాత్మా! ఈ నిమివంశంలో నీవు యోగశాస్త్రార్థాల తెలిసినవాడివి. నాకు ఆ యోగ సమస్తాన్ని గురించి విపులంగా తెలుపు' అన్నాడు. కేశిధ్వజుడు కృపాళుడై 'మహీపాలా! విను! జ్ఞాని ఏ యోగంతో మృతుడై పునర్జన్మం పొందక బ్రహ్మపారశ్యం పొందుతాడో ఆ యోగాన్ని చెప్తాను'. సావధాన చిత్తంతో విను' అని ఇలా పలికాడు.[72]

'ప్రాణికోటి బంధానికిగానీ, మోక్షానికిగానీ మనసే కారణం. ఆ మనసు విషయాసక్తి కలిగిందైతే బంధకారి, నిర్విషయమైనదైతే ఆ మనసే ముక్తి విధాయకారి.[73]

విశిష్టమూ, మోక్షోపయోగి అయిన విజ్ఞానంచేత విషయాదుల నుండి చిందు మనస్సును వెనక్కి లాక్కొని, పరమేశ్వరుడైన పరబ్రహ్మను మోక్షంకోసం ధ్యానం చేయాలి. అలా ధ్యానిస్తే - సూదంటురాయి తనపాటి రూపంగా మార్పుపొందే ఇనుమును తన వైపుకు ఆకర్షించినట్లు - పరబ్రహ్మం ఆ బ్రహ్మచింతకునికి ఆత్మభావాన్ని ప్రసాదిస్తుంది. యమ నియమాదుల్తో నిర్మలం చేయబడిన సాత్త్విక చిత్తవృత్తిని - ఇతర చింత

లేక బ్రహ్మ సంబంధిగా చేసే నేర్పే 'యోగం' అనబడుతుంది. ఇలాంటి విశిష్ట బ్రహ్మధ్యానం ఏ యోగంవల్ల కలుగుతుందో ఆ యోగం కలిగినవాడే యోగి అవుతాడు.[74]

నిష్కాముడై యోగి అయ్యేవాడు బ్రహ్మచర్యం మొదలైన 'యమములు' ఐదు, స్వాధ్యాయం మొదలైన ఐదు 'నియమాలు' మనస్సు నిర్మలత్వ సంపాదనకోసం ఆచరించాలి. ఈ నియమాలు ఫల విశేషంకోసం ఆచరింపబడితే (కామ్యాలు అయితే) విశిష్ట ఫలాల్ని ఇస్తాయి. నిష్కాములైనవారికి ముక్తిని ప్రసాదిస్తాయి.

అలాటి యమనియమాలు వదలక 'భద్రాసనం' మొదలైన ఆసన విశేషాల్లో ఏదో ఒకటి అవలంబించి, రేచక పూరక కుంభక అభ్యాసం ద్వారా 'ప్రాణం' అనే పేరుగల వాయువును స్వాధీనంచేసుకోవాలి. ఇలా ప్రాణవాయువును వశ్యం చేసుకోవడాన్నే 'ప్రాణాయామం' అంటారు.

అలాంటి ప్రాణాయామం సబీజ ప్రాణాయామం, నిర్బీజ ప్రాణాయామం అని రెండు పేర్లతో విలసిల్లుతూ ఉంటుంది. ఆ ప్రాణాయామమే ప్రాణవాయువు, అపానవాయువు ఒక దాన్ని ఒకటి అనుసరించి నందువల్ల, రెండింటినీ నిరోధించినందువల్ల రేచక పూరక కుంభకాలనే మూడు విధాల ప్రాణాయామాలు ఏర్పడతాయి.

మొదట నేను చెప్పిన సబీజ నిర్బీజ ప్రాణాయామాలలో స్థూల రూపాన్ని ధ్యానించేది సబీజం. స్థూలరూపధ్యేయంలేనిది నిర్బీజం.

శబ్దం, స్పర్శ, రూపం, విషయం, గంధం అనే ఐదు విషయాల్లోను ఆసక్తాలైన చెవులు, చర్మం, కళ్లు, నాలుక, ముక్కు అనే పంచేంద్రియాలను మళ్లించుకొని మనస్సుకు అధీనాలుగా చేయడం 'ప్రత్యాహారం' అనబడుతుంది ఇలాంటి ప్రత్యాహారం మోక్షార్థికి ఆవశ్యకర్తవ్యం. దీని వల్ల అతిచంచలాలయిన ఇంద్రియాలు మనస్సుకు అధీనాలు అవుతాయి. ఈ జ్ఞానేంద్రియాలు వశం కాకుంటే ఆ యోగి యోగసాధకుడు కాలేడు.

ప్రాణాయామంవల్ల ప్రాణ, అపానవాయువులు; ప్రత్యాహారం వల్ల ఇంద్రియాలు వశాలైన తర్వాత శుద్ధమైన చిత్తాన్ని శుభాశ్రయంమీద నిలపాలి'- అని కేశిధ్వజుడు అనగా ఖాండిక్యుడు ఇలా అన్నాడు.[75]

'అనఘా! మనసుకు ఏది శుభాశ్రయం? అలాగే సమస్తాధారమైన వస్తువేది? దేని చింతనం అశేషమైన, గొప్పదైన శోక సమూహాన్ని పోగొట్టుతుంది? తెలుపు'![76] అన్న ఖాండిక్యుని మాటలకు కేశిధ్వజుడు 'అనఘా! పరబ్రహ్మమే చిత్తానికి ఆశ్రయం. ఆ పరబ్రహ్మం పరం. అపరం అని రెండు విధాలుగా ఒప్పుతుంటుంది. అపరం రూపం కలిగినది (మూర్తం); పరం రూపరహితం[77] (అమూర్తం).

బ్రహ్మం పరం, అపరం అని రెండు విధాలుగా ఉంటుందని ఇంతకుముందే చెప్పాను కదా! అందులో ముక్తాత్మ అయిన పరం నిరాకారం - కాబట్టి మోక్షంకోరే జీవులకు ఉపాసనం శక్యంగాదు. బ్రహ్మాది రూపాల్లో ఉండే బద్ధజీవ సంఘరూపం సాకారం అయినా భావనాత్రయం కలది అయినందువల్ల - ఉపాసనాయోగ్యంకాదు. కాబట్టి పరిత్యజింపదగినది. ఈ విధంగా ముముక్షువుకు పరాపరాలు రెండూ సేవింపదగినవి కాకపోతున్నాయి.[78]

భావనాత్రయం ఏది? అంటే బ్రహ్మభావన, కర్మభావన, ఉభయ భావన అనేవి. సనందనాదిమునులు బ్రహ్మ భావన కలిగి ఉండేవారు. దేవతలు మొదలు సర్వకాలం వరకు ఉండే జీవులందరు కర్మభావనాయుతులు. బ్రహ్మాదులు బ్రహ్మకర్మ-ఉభయ భావనాయుతులు. ఈ మూడు తరగతుల వారు త్రిభావనలతో కూడి ఉన్న వారు కాబట్టి-సనందనాది, దేవాది, బ్రహ్మాది భేదాలతో త్రివిధాత్మక రూపం అయిన అపరబ్రహ్మ రూపం సేవింప తగినది కాదు. సనందనాదులు మునుపటి బ్రహ్మ కల్పాల్లో సంసారులే అయి ఉండినందువల్ల, బ్రహ్మభావన చేత బద్ధులైన వారే అవుతారు. ఈ భావనాత్మకం అయిన విశ్వం ఉపాధి. అవధి దేవ మనుష్యాది నానా ప్రపంచం యొక్క విశేషజ్ఞాన కర్మలు క్షీణించడమే.

అలాంటి విశ్వమై తోచే బ్రహ్మాదుల కంటె ఇతరమైనది 'పరము' అనే పేరు గలది-రూపరహితమై ఉంటుందని మొదటనే సూచించాము గదా! ఆ 'పరము' యొక్క స్వరూపాన్ని తేట పరుస్తాము. ఆ పరము యొక్క స్వరూపం మొదట చెప్పబడిన దేవాది భేద రహితం. ఆ భేదం లేక పోవడం చేత-ఇలాంటిది అలాంటిది అని చెప్పడానికి వీలుకానిది. నాశ రహితమైనది. 'సత్' అనే శబ్దానికి అర్థభూతమైనది. జీవుని చేతనే తెలియదగినది. జ్ఞానం చేతనే నిరూపింపదగినది.

జ్ఞానం అనే శబ్దానికి అర్థం అయినట్టిది, బ్రహ్మాత్మకం అయినందు వల్ల 'బ్రహ్మము' అనే పేరుతో విరాజిల్లుతుంటుంది. మరి శ్రీభావనా స్వరూపం అయిన విశ్వం కంటే విలక్షణంగా ఉండడమే లక్షణంగా కలిగిన ఈ బ్రహ్మ రూపం యోగం అభ్యసించే యోగికి అనుసంధానం చేయశక్యం గాదు.

మఱి. 'అపరం' అని చెప్పబడిన చతుర్ముఖుడు, ఇంద్రుడు, ప్రజాపతులు, మరుత్తులు, వసువులు, రుద్రులు, ఆదిత్యులు, తారకలు, గ్రహాలు, గంధర్వులు, యక్షులు రాక్షసులు, దైత్యులు మొదలైన సమస్త దేవ జాతులు, మనుష్యులు, పశువులు, పర్వతాలు, సముద్రాలు, చెట్లు, ఇంకా ఏకపాద ప్రాణులు, ద్విపాద ప్రాణులు, బహుపాద ప్రాణులు, అపాదాలైన ప్రాణులు లాంటి ఇతరప్రాణుల-వాటి ఉత్పత్తికి కారణాలుగా విలసిల్లే ప్రకృతి మొదలుగా ఏకవ్యక్తి యందుండే గుణాలు తుదిగా గలవి అయిన చేతనాలు, అచేతనాలు స్వరూపంగా దలదైన ప్రపంచ రూపంగా ఉన్నట్టిదైన స్థూలరూపం యోగాభ్యాసం ఆరంభించిన యోగికి ధ్యాన సాధ్యమైనది.

'అపరము' ఇలా ధ్యాన సాధ్యమైనదైనా శ్రీభావనాయుతం అయినందువల్ల శుభాశ్రయం కాదు. కాబట్టే ముక్తిసాధనంకాదు. ఈ చెప్ప బడిన సకల ప్రపంచం విష్ణుశక్తితో కూడినదై ఆ దేవునికి శరీరమై ఉంటుంది. అలాంటి విష్ణుశక్తులు మొదట నేను చెప్పిన పరము, అపరము అనే పేర్లతోను, వాటికంటే వేరైన కర్మశక్తి అనే దానితోను కలిపి మూడు విధాలై

ఉంటాయి. వాటిలో కర్మశక్తిచేత చుట్టబడినదై 'అపరము' అనే పేరు గలిగిన క్షేత్రజ్ఞశక్తి జననం, వార్ధక్యం, మరణం మొదలైన అనేక సంసార వేదనలను అనుభవిస్తూ, ఆయా కర్మలకు అనుగుణాలైన దేహాల్ని పొంది, విజ్ఞాన తారతమ్యాల్ని పొందుతుంటుంది. ఆ ప్రకారం[79] విను!

ఆ క్షేత్రజ్ఞశక్తి ఆ ప్రాణుల్లో కొంచెం ఉంటుంది. ఆ ప్రాణి జాతికంటె ఉన్న చోటు నుండి కదలలేవి (స్థావరాలైన) కొండలు, చెట్లు మొదలైన వాటిలో కొంచెం ఎక్కువగా ఆ క్షేత్రజ్ఞశక్తి ఉంటుంది. ఆ స్థావరశ్రేణి కంటే ఎత్తులు, రోకటిబండలు తెట్టి, మన్నింటి మొదలయిన సరీసృపాలలో ఆ క్షేత్రజ్ఞశక్తి మరికొంచెం ఎక్కువగా ఉంటుంది. వాటి కంటే పక్షుల్లో, పక్షులకంటే మృగాల్లో. మృగాలకంటే ఏనుగులు, గోవులు మొదలైన పశువుల్లో, పశువులకంటే మనుష్యుల్లో - మనుషులకంటే యక్షులు, గంధర్వులు, నాగులలో - వారికంటే దేవతల్లో - అంతకంటే దేవేంద్రునిలో - దేవేంద్రునికంటే దక్షునిలో - అతనికంటే ఈ విశ్వానికి మొదటివాడైన బ్రహ్మలో క్షేత్రజ్ఞశక్తి అధికంగా ఉంటుంది. ఇలాంటి కోట్లాది రూపాలన్నీ ఆ విష్ణుని శరీరాలే సుమా! అతడు అపరిమేయ ప్రభావంతో సకల వస్తువుల్లోను ఆకాశంలాగా నిండి ఉంటాడు[81]

ఓ రాజా! ముందు నేను చెప్పిన పరబ్రహ్మం అనే రూపానికి రెండవదై యోగులకు హృదయాల్లో ధ్యానింపదగినదై, అమూర్తమైన ఇంకొక రూపం - విష్ణువు అనే పేరు గలిగినది - ఉంది. పండితులు అలాంటి రూపాన్నే 'సత్తు' అని చెబుతూ ఉన్నారు. సత్తనే రూపమే సమస్త శక్తులకు ఆశ్రయమైనది. పూర్వం నేను చెప్పిన విశ్వరూపం కంటే విలక్షణమైనది. కళ్యాణ గుణాలు, అనంత విభూతులు కలిగినదై అతిమహత్త్వంతో వెలుగుతూ ఉంటుంది. అలాంటి శక్తితో ఒప్పే ఆ బ్రహ్మం నిజవిలాసంతో దేవ, పశు, మనుష్యాది నామం, రూపం, చేష్టలు గల - నృసింహ, వామన, మత్స్య కూర్మ వరాహ రామకృష్ణాది నానా అవతారాల్ని - విశ్వశ్రేయంకోసం కల్పిస్తూ ఉంటుంది[82]

దేవాది రూపాల్లో ఆ విష్ణువు జనించడం అనే విలాసక్రియ కర్మానుభవంకోసం కాదు. విష్ణువు దేవ తిర్యక్ మనుష్యాది సకల జాతుల్లోను పుడతాడు. ఆ విధంగా పుట్టే విష్ణువు అనంత వ్యాపారాలు రావణాది దుష్టులవల్ల భగ్నాలు కానట్టివి.[33]

అలాంటి పరమేశ్వరునికి మూర్తమైన బ్రహ్మాది బద్ధనికాయ రూపాలున్నాయి. అమూర్తం. పరం అయిన ముక్తరూపాలు అనేకాలున్నాయి. అయినా - వైకుంఠవాసుడైన పరవాసుదేవుడు, సంకర్షణుడు, ప్రద్యుమ్నుడు, అనిరుద్ధుడులాంటి పరమేశ్వరుని వ్యూహరూపాలు - రామకృష్ణాది అవతారాలైన విభవ రూపాలు మాత్రమే - మోక్ష సాధకునికి జ్ఞాన సిద్ధికోసం ధ్యానింపదగినవి. ప్రజ్వలించే జ్వాలలుగల అగ్ని ఎండిన పొదను ఎలా దహించి వేస్తోందో అలాగా - యోగుల సకల పాపాల్ని వారి చిత్తంలో ఉండే విష్ణువు కాల్చివేస్తాడు కాబట్టి సకల శక్తులకు ఆశ్రయమైన ఆ పరమాత్మునియందు చిత్తం నిలపడమే విశుద్ధమైన 'ధారణ' అనబడుతుంది. నిఖిల వస్తు సంబంధంవల్ల చంచలరూపం అయిన మనస్సుకు శ్రీభావ భావనకు అతీతుడైన ఆ దేవుడు శుభస్థానమై ముక్తిని ప్రసాదిస్తాడు. ఈ విష్ణువుకు భిన్నులైన బ్రహ్మాది దేవతలు కర్మమే కారణంగా గలవారు కావడంవల్ల అశుద్ధులు. కాబట్టి, చిత్తానికి ఆశ్రయింపదగినవారు కాదు. మరి, నిరాధారమైన ధ్యానం సిద్ధింపదు - కాబట్టి ధారణ, ధ్యానాలకు గోచరమై శుద్ధమైన మరొక స్థూలరూపం ఆ అనంతునికి ఉంది. ఆ రూపాన్ని గురించి సవిస్తరంగా చెప్తాను - విను ![34]

అతడు 'అనంతుడు, శరత్కాలచంద్రుని చకచకల గర్వాన్ని అణచివేసేట్టి ప్రసన్నమైన మోముగలవాడు - గొప్పవైన కెందామరల్లాంటి కనుల జంటగలవాడు, మిక్కిలి సుందరమైన చెక్కిళ్లు, విశాలమైన నొసలు కలిగినవాడు. రత్నఖచిత మకరకుండలాలు గలవాడు. శంఖ కాంతిని పోలుతూ వక్రువగా వున్న మెడగలవాడు. శ్రీదేవికోసం - శ్రీవత్సం అనే మచ్చతోను శోభించే విశాలమైన రొమ్ము గలవాడు. లోతైన నాభితోటి వళిత్రయాలతో శోభించే సన్నపాటి కడుపు గలవాడు. మోకాళ్లదాకా వ్రేలాడే

నాలుగు భుజాలు గలిగినవాడు శ్రేష్ఠమైన ఏనుగుతొండంలాంటి తొడలు, అందమైన పిక్కలు గలిగిన రమణీయుడు. సమంగా ఉండి చివళ్లను పోలిన పాదాలు గలవాడు. స్వర్ణవస్త్రధారి, కిరీటం, హారాలు, బాహు పురులతో శోభిల్లుతూ ఉండేవాడు. శంఖచక్రాది ఆయుధాలు గలవాడు.[85]

విష్ణుసారూప్యంకోరే యోగి శ్రీ విష్ణువును ఈ విధంగా ధ్యానించాలి. మొదట స్వామి అవయవాన్ని ఒక దాన్ని ధ్యానంతో మనస్సులో స్థిరంగా నిలుపుకోవాలి. తర్వాత మరొక అంగాన్ని సాధించాలి. ఇలా క్రమంగా సర్వాంగాలతో కూడిన స్వామి సంపూర్ణ మూర్తిని మనసునందు నాటుకొని నడచినా, ఊరకున్నా, ఏదో ఒక పని చేస్తున్నా - ఆ మూర్తిని మనసునుండి వదలిపెట్టనప్పుడే స్వామి సారూప్యం పొంది ముక్తుడవుతాడు. దేవతలు మొదలైన భేదాన్ని పుట్టించే అజ్ఞానాన్ని నివర్తించుకోవాలి. ఆ తర్వాత కళ్యాణగుణ సమన్వితుడైన ఆ హరికిని, తనకును (యోగికిని) లేని భేదాన్ని ఎవ్వడూ కల్పించలేడు.[86]

ఓ రాజా ! ఈ విధంగా సంసారబంధ విముక్తికోసం 'అంగాష్టకం' అనే పేరుగల గొప్ప యోగాన్ని సవిస్తరంగా చెప్పాను. ఇంకా నేను చేయదగిన పని ఉంటే చెప్పు - అని కేశిధ్వజుడన్నాడు.[87] ఆ మాటలకు ఖాండిక్యుడు "నృపాలా ! నేను ధన్యుణ్ణి అయ్యాను. ఇంతకంటే నాకు కోరదగినది మరేదీలేదు" అంటూ, కేశిధ్వజునికి పూజచేసి - వద్దన్నా అతనిచ్చిన మునుపటి తన రాజ్యాన్ని గ్రహించి ఆ రాజ్యాన్ని తన పుత్రునికి అప్పగించాడు.[88]

అలా పుత్రునికి రాజ్యాన్ని అప్పగిస్తూ పురోహితులను, ప్రధానులను - యుక్తవయస్సురాని తన కుమారుణ్ణి తీర్చిదిద్దండని ఆజ్ఞాపించాడు. వారిని దాన సన్మానాలచేత పోషించమని కుమారునికి అప్పగించాడు.

ఆ తర్వాత గోవిందుని పాదపద్మాలమీద మనస్సును నిలిపినవాడై ఖాండిక్యుడు పుణ్యపాపాలనే రెండు కర్మలను క్షయం చేసుకొని తానున్న అరణ్యాన్నే తపోవనంగా భావించి కొంతకాలం కేశిధ్వజుడు ఉపదేశించిన భక్తియోగాన్ని అనుసరించి విష్ణు సాధర్మ్యాన్ని పొందాడు.

కేశిధ్వజుడు ఖాండిక్యుని కుమారుణ్ణి, ప్రధానులను ఖాండిక్యుని రాజ్యపాలన చేయడానికి పంపాడు. తాను తిరిగి మిథిలాపురం వెళ్ళి యోగాన్ని ఆశ్రయించినవాడై భోగాల ద్వారా పుణ్యాన్ని, వాటికంటే వేరైన దుఃఖానుభవాలద్వారా పాపాల్ని నశింపజేస్తూ భూతలం పరిపాలించాడు.

కాబట్టి మోక్ష సాధకునికి ఆశ్రయింపదగినవాడు ఆ విష్ణువే. పాండ్యరాజా! నీవు ఆ విష్ణువునే పూజించు! ఇదే భక్తియోగం. దీనిలో కూడ ఒక కొరత ఉంది. ఈ భక్తి యోగానికి విఘ్నం కలిగితే పునర్జన్మ ఎత్తించి, తర్వాత ముక్తినిస్తుంది. అలా అయినందువల్ల ఇంతకంటే సులభమైన ఉపాయం - నాటి భారతయుద్ధ సమయంలో శ్రీకృష్ణుడు అర్జునునికి ఉపదేశించిన 'శరణాగత ధర్మమే' నిరపాయమైన ధర్మం' - అని విష్ణుచిత్తుడు చెప్పి, పరిపక్వ మనస్కుడైన ఆ పాండ్యరాజుకు శ్రీమదష్టాక్షరీ మంత్ర సహితంగా ద్వయమంత్రాన్ని ప్రసాదించి - అతణ్ణి భాగవతోత్తముణ్ణి చేశాడు.[89]

## ఆశ్వాసాంత పద్యాలు

పొగడపువ్వులచేత కైసేయబడిన నమ్మాళ్వారు యోగి హృదయమే గృహంగా గల స్వామీ! సూర్యచంద్రులే నేత్రద్వయంగా గలవాడా! బొడ్డు తామరలో చతుర్ముఖుణ్ణి, అతనియందు పుట్టిన రుద్రుణ్ణి గలిగినవాడా! కఠోరమైన ముష్టిఘాతంచేత దోసపండులాగా తలపగల్పబడిన కేశి అనే క్రూరదానవుణ్ణి గలిగినవాడా! గ్రీష్మ కాలంలో కోడి రెక్కల గల కుమార స్వామి పుష్కరిణిలో ఈదులాడే ఉత్సవంలో ఔత్సుక్యం చూపే వేంకటేశ్వరా![90]

అర్జునుని రథసారథ్యం అంగీకరించిన స్వామీ! చెలికాండ్రయిన గోపబాలురతో కూడి క్రీడించడంలో ఆసక్తిగలవాడా! భక్త ప్రహ్లాదునిచేత విశేషంగా స్తుతి చేయబడి పులకితమై శోభిల్లే దేహం గలవాడా![91]

శేషశయ్యపై శయనించే స్వామీ! వామనావతారంలో మిక్కిలి దూరంగా చాచిన పాదాలు గలవాడా! భక్త సమూహం మనసుల్లోని

పాపాల్ని ఖండించేవాడా! నీరుండే ప్రాంతాల్ని వ్యాపిస్తూ ఉన్న కాళీయ సర్పంయొక్క విషయుక్త శిరఃప్రదేశంపై శ్రేష్ఠనృత్తమైన 'హల్లీసకం' అనే తాండవం సలిపేవాడా![92] (అని రాయలు ఆశ్వాసాంతంలో శ్రీ వేంకటేశ్వరుణ్ణి స్తుతించాడు.)

## కృతికర్త స్వవిషయం

ఈ గ్రంథభాగం ప్రహరేశ్వరపాత్రుడు మొదలైన పలువురు ఉత్కళుల సమూహంచేత రక్షించుకోబడినది, మింటినంటుతున్నది, సమర్థాలైన యంత్రాలు గలది అయిన కొండపల్లి దుర్గాన్ని భుజంనందలి ఖడ్గం అనే సర్పంచేత హరించేవాడయిన - ప్రకాశించే గొప్ప ప్రయత్నం గల కృష్ణరాయ నృపుడు - అనే నామధేయం గలిగిన నాచేత రచింపబడిన ఆముక్తమాల్యదలో మనోహర పద్యాలు గలిగిన తృతీయాశ్వాసం ఒప్పారుతూ ఉంది.[93]

## చతుర్థాశ్వాసం

శ్రీలక్ష్మికి ఇల్లయిన వక్షస్థలం కలవాడా! గోవులను ఆకర్షించేట్లు పిల్లనగ్రోవి ఊదే స్వామీ! గర్వితుడు, భూదేవీ పుత్రుడైన నరకాసురుని నుండి అదితి తాటంకాలు తిరిగి తెచ్చిన స్వామీ! వృషభగిరివాసా! గరుడధ్వజా![1]

చిత్తగించండి, ఆ సమయంలో[2]

## విష్ణుచిత్తుని విజయం

విష్ణుచిత్తుడు వైష్ణవ మతాన్ని నెలకొల్పి - పాండ్యరాజును శరణాగతుణ్ణి చేసిన సమయంలో - బలంగా ఎవరో పట్టి తెంచినట్లుగా, విద్యాశుల్కంగా వేలాడగట్టిన వరహాల జాలె - ఒక దారం తర్వాత మరొక దారం తునిగి కొంతసేపుండి - త్రాటిగంటు సైతం పుటుక్కున తెగిపోగా - నేల పడింది. దేవదుందుభులు ఆకాశంలో ధ్వనించాయి. విరులు జోరున పెన్సోనగా కురిశాయి.[3]

విష్ణుచిత్తునికి జయం కలిగిన సమయంలో - పాండ్యరాజు విష్ణుచిత్తాది విద్వాంసులతో పారితోషికాలు ఇవ్వడానికి - వెంటవెంటనే సేవకుల్ని

పంపాడు. ఆ సేవకులు తతణమే కోశాగారానికి పోయి - మణి కనక వస్త్రాది కాలు తెస్తూ ఉండగా, ఆ కొందరలో వారి చేతుల నుండి, ఒకటి రెండుగా జారి భాండాగారానికి, ఆ స్థానానికి మధ్య ఆ మణిభూషాది శ్రేణి - దారిలో మోకాటిలోతు పడి ఉంది అది ఎలా ఉందంటే - భూదేవి కూడా మిక్కిలి సంతోషంతో ఆ సమయంలో నానావర్ణ పుష్పాల పిగబంతివి ధరించిందేమో అన్నట్లు శోభిల్లుతూ ఉంది.[4]

విష్ణుచిత్తుడు వాదం గెలిచి, వేదవేద్యమైన విష్ణుతత్త్వాన్ని ఈ విధంగా తెలిపి, రాజును భక్తిలో ఓలలాడించి భగవంతునికి శరణాగతుణ్ణిగా చేసి లోకహితం చేశాడు [5]

ధీరాగ్రణి అయిన విష్ణుచిత్తుని గెలుపు ఉత్సవంలో - 'అద్దా' (బళాబళి) అని దేవతలన్నారు. 'ఆహో' అని పితృదేవతలు పలికారు. సిద్ధులు 'ఆహా' అన్నారు విద్యాధరులు 'ఆహా! కలియుగం కృతయుగం అయింది కదా' అని పలికారు. కిన్నరులు 'దుర్మతుల తలపొగరు నాశనం అయింది కదా' అని అరిచారు. ఈ పలుకుల్తో ఆకాశం నిండిపోయింది [6]

ఇలా విష్ణుచిత్తుడు వాదం గెలిచిన తర్వాత వాడించి ఓడిపోయిన పండితుల దుస్థితి ఎలా ఉందంటే - కొందరు పండితులు పెదవుల మూలల్ని నాక్కుంటూ - వెలి ఆరుగులు చూడకుండా ముందుకు వెళ్ళి - తర్వాత తమ చెప్పులు మోసేవాని (పాదూవాహుడు) కోసం వెదుకుతున్నారు. కొందరు విద్వాంసులు తమ ఎదుటనే ఉండే అందలం చూడకుండా ముందుకు వెళ్ళి-పెద్ద గొంతుతో పల్లకీ బోయీల్ని పిలుస్తున్నారు. మరికొందరు విద్వాంసులు నగరు బయటికి వెళ్ళేదాకా మాత్రం వేరువేరుగా పోయి, తర్వాత నిలబడి తోడి విద్వాంసుల్తో కలుస్తున్నారు. ఇంకొందరు విద్వాంసులు తమకెదురైన తమవాణ్ణి ఇంటి విషయాలు అడిగి - వాడు చెప్పే మాటల్ని ఒకదానికి మరొకటిగా భావిస్తూ ఊకొడుతున్నారు.

'వాదం ఏమయింది ?' అని ఎవరైనా అడిగితే రాజు పక్షపాతం ఆదావరికి ఉండబట్టి బతికిపోయాడు'-అని కొందరు విద్వాంసులు చెప్తున్నారు. ఔనౌనండి' ఇలా విమర్శదూరమైన ఆస్థానంలో ఎవరు ఉంటారు' అని

కొంతమంది పండితులు విమర్శించారు.[7]

ఈ విధంగా నాలుగు వీథుల కూడళ్లలో విద్వాంసులు నగరి తిక్కు చూస్తూనే కొంతసేపు మంతనాలాడి ఇండ్లకు వెళ్ళిపోయారు. పాండ్యరాజు విష్ణుచిత్తుని ప్రసిద్ధికోసం ఆతణ్ణి మహా గజారూఢుణ్ణి చేసి -[8]

'పురి ఏగించి విష్ణుచిత్తుణ్ణి విల్లిపుత్తూరు నగరానికి చేర్చండి' అని అతని వెంట దొరలను, రాజకుమారులను పంపాడు. మంగళ వాద్యాలు, నిరంతరంగా వందిస్తుతులు, నూపురాలు శబ్దిస్తూ ఉండగా, వారు విష్ణుచిత్తుని ఇరువక్కలా సేవిస్తూ పోగా మార్గమధ్యంలో -[9]

## విష్ణుచిత్తునికి భగవంతుడు సాక్షాత్కరించడం

గరుత్మంతుని మూపుపై విష్ణువు విష్ణుచిత్తునికి, అతనితోపాటు వచ్చేవారికి ఇలా సాక్షాత్కరించాడు :

మొదట భగవంతుని వాహనం అయిన గరుత్మంతుని రెక్కల కాంతితో - ఇంగిలీకం నీటిలో తడిపి ఎత్తుతూ ఉండే నల్లని దుప్పటేమో అన్నట్లు ఆకాశం లేత ఎరుపు పొందింది. వెంటనే గరుత్మంతుని రెక్కల గాలి పాలసముద్రపు మీగడం జిడ్డును వారి శరీరాలకు అంటిస్తూ - ఆ పరిమళాన్ని వారి మీదికి వీచింది. మరింత దగ్గరికి రాగానే గరుడుని రెక్కల శబ్దం పెద్దగా వినిపించింది. అంతలోనే గరుడుని మూపు మీద ఆసీనుడై ఉన్న విష్ణువును వారు వీక్షించారు [10]

అలా దర్శనమిచ్చిన శ్రీమహావిష్ణువు ఎలా శోభిల్లుతూ ఉన్నాడంటే - తనమూపుపై కూర్చొని ఉన్న శ్రీమహావిష్ణువు దివ్య పాదాలను గరుత్మంతుడు అరచేతుల్లో మోస్తూ ఉన్నాడు. స్వామి దివ్య పాదాలు ఎరుపువైనందువల్ల ఎర్రతామరల్లాగా ఉన్నాయి. వాటికి సుఖ స్పర్శగా ఉండడానికి వీలుగా అతి కోమలాలైన. ఎర్రనైన గరుత్మంతుని అరచేతులు చిగుళ్ళ పొట్లాలులాగా ఉన్నాయి.

తళతళవి తనమేని నల్లని నిగ్గులో-బంగారు రంగు గలిగిన గరుత్మంతుని ప్రతిబింబం కనిపిస్తోందా-అన్నట్లు మహావిష్ణువు శరీరంపై పీతాంబ

రం వెలుగొందుతూ ఉంది

భగవంతునిపైవ్రాలిన యోగీశ్వరుల పరిశుద్ధాంతఃకరణాలేమో నన్నట్లు భగవంతుని రొమ్ముపైన ఆణిముత్యాల హారాలు ప్రకాశిస్తూ ఉన్నాయి.

సముద్రంలోనే పుట్టి శ్రీలక్ష్మీదేవికి పుట్టింటి వెచ్చెలులైనందువల్ల ఆ చొరవచేత కాబోలు స్వామి చెవుల వద్ద చేరిన మొసళ్లేమో అన్నట్లు భగవంతుని కర్ణాల్లో మకరకుండలాలు అమరి ఉన్నాయి. స్వామి దీర్ఘబాహువులు కల్పతరు శాఖల మాదిరిగా ఉన్నాయి. ఆ బాహువుల్లో అమరి ఉన్న శంఖచక్రాలు హంసల్లాగా, సుడిగాలికి రేగిన పుప్పొడిలాగా చక్రం శోభిల్లుతూ ఉన్నాయి. కమలనేత్రుడు, చతుర్భుజుడు అయిన శ్రీ మహావిష్ణువు అలా దర్శనమిచ్చాడు [11]

ఆకాశంలో నిలిచి వైష్ణవ మత స్థాపకుడైన విష్ణుచిత్తుని వీక్షించే ముప్పయ్మూడుకోట్ల దేవతలు ఎప్పుడైతే హరిని దర్శించారో వెంటనే వారి హస్తాలూ, హస్తాల్లో ఉన్న గొడుగులు ఏకకాలంలో ముకుళించాయి.[12]

విష్ణుద్వేషులైన రాక్షస పిశాచ సమూహం ఆ దృశ్యాన్ని దేవతలతో పాటు చూస్తూ ఉంది. అంతలోనే గరుడుని రెక్కలగాలి సోకుతూనే భయపడినవారై - చేటలగాలికి కళ్లంలో పొల్లుకొట్టుకు పోయినట్లు - పారిపోయారు.[13]

ఆ సమయంలో మహామునులు అక్కడికి విచ్చేసి - భగవంతుని దర్శించి సామగానం చేశారు. దేవతలు పూలవానలు కురిపించారు. మునుల సామగానం - అప్పుడు ఆ పుష్పవర్షంలోని తుమ్మెదల ఝంకారానికి అనుకరణంలాగా విరాజిల్లింది.[14]

ఆ విధంగా ప్రత్యక్షమైన పద్మాక్షుణ్ణి అంతరిక్షంలో దర్శించి విష్ణుచిత్తముని ఆనందబాష్పాలు కళ్లలో నిండగా పులకించి, ఏనుగు గంటలే తాళాలుగా చేసుకొని ఆ విష్ణువును స్తుతించాడు.[15]

## విష్ణుచిత్తుడు శ్రీ మహావిష్ణువును స్తుతించడం

దానవ సంహార కారణాలైన శార్ఙ్గ చక్ర గదా ఖడ్గధారీ జయ జయ! (సర్వోత్కృష్టుడుగా ప్రవర్తిల్లు) నూరు అయుతాల (అయుతం= పదివేలు) సూర్యచంద్రుల కాంతితో సమానమైన దేహకాంతి గలవాడా! జయ జయ! తామర పువ్వులో భాగానికి తుల్యమైన అందమైన పాదం నుండి స్రవించే గంగాప్రవాహం కలవాడా! జయ జయ!! బ్రహ్మ శివులకు ఉత్పత్తి కారణమైన కేశవా! (క = బ్రహ్మ. ఈశ = శివుడు) కేశి అనే రాక్షసుని సంహరించినవాడా! శూరుని వంశాన పుట్టిన శౌరీ! శరత్కాల కమలాలవంటి నేత్రాలు గల హరీ! జయ జయ!![16]

## దశావతార స్తుతి: మత్స్యావతారం

స్వామీ! నీవు సురద్వేషి, వేదచోరకుడైన సోమకుని మహా మీనాకృతి ధరించి సంహరించి, సత్యలోకం మీదుగా నీ లోకమైన వైకుంఠానికి వెళ్ళిననాటి నీ వృత్తాంతం ఎలా ఉంది అంటే - వేద విశుద్ధాక్షర పంక్తులను - చతురస్రమైన తెల్లని పొలుసుల సమూహం - అనే మిషతో - నీ శరీరంపై ధరించి - మహాసముద్రంలోని నీ దాటులతో లేచి - బ్రహ్మలోకం అంతా అలమిన నీటిబొట్ల రూపంలో మిక్కుటంగా పైకి ఎగిసే కాంతితో - బ్రహ్మకు తిరిగి వేదాల్ని ఇవ్వడమేమో అన్నట్లుగా ఒప్పారుతూ ఉంది.[1]

మురాంతకుడైన ఓ స్వామీ! నీవు మత్స్య మూర్తివై సోమకాసురునివద్ద నుండి వేదాల్ని లాక్కుని, వాడిని సంహరించి ప్రళయజల ప్రవాహానికి ఎదురీదేటప్పుడు - అప్పటిదాకా సముద్రంలో దాగి ఉండిన మైనాకాది పర్వతాలు, తిమితిమింగిలాది మహామత్స్యాలు, ఆ ప్రళయ ప్రవాహంలో కొట్టుకొని వచ్చి గుహలలాంటి నీ పుక్కిళ్ళలోకి చొరబడ్డాయి. నీవు నీ పుక్కిళ్ళలోనే ముందుయుగాలకోసం పదిలంగా దాచుకొని ఉన్న బ్రహ్మాండాన్నే దబాలున తగిలాయి. అప్పుడు ఏర్పడిన శబ్దం - వేదాల్ని తిరిగి సంగ్రహించడం, సోమకాసుర సంహారం అనే నీ జయాలకు చేసిన దుందుభి శబ్దంగా ఒప్పింది గదా![18]

ప్రళయకాలంలో నీవు నీ తిమింగలమూర్తివి అపరిమేయంగా అవలీలగా పెంచుకొన్నావు. మహావిపులమైన నీ నోటిలో వేదచోరకుడు, శూద్రరక్కసుడైన ఆ సోమకుణ్ణి ఒక చిన్న చేప మాదిరి మింగావు. ఆ మింగడం మింగడంలాగా లేదు. వాడు దొంగిలించిన వేదాలైన నీ ఊర్పులు - నీవు మహత్తరంగా పెరిగేకొద్దీ, - ప్రవాహ వేగంతో ఎక్కువై, మళ్లీ నీ నోటిలోనే ప్రవేశించేటప్పుడు - సోమకుణ్ణి గూడా నీ నోటిలోకి కొట్టుకొని వచ్చినట్లుంది [19]

## కూర్మమూర్తి

క్షీర సాగర మధ్యకాలంలో ఆదికూర్మం వీపుపై మందరపర్వతం తిరుగుడు పడడం, వాటి మధ్య ముత్యాలు, ముత్యపు చిప్పలు, శంఖాలు సున్నంలాగా నలిగిపోవడం ఎలా ఉందంటే - మట్టిముత్తం అయిన భూమి నీటి ప్రవాహంలో తేలుతూ ఉన్నందువల్ల దినదినానికీ నాని కరిగిపోతుందేమో నని శంకించినవాడివై - అలా కరిగిపోకుండా కాపాడడానికి స్థితికర్తవైన నీవు భూమికి గారపూత పూయాలనుకున్నావు. ఓ స్వామీ ! అందుకోసం నీవు ఆదికూర్మం రూపం ధరించి వజ్రాయుధంలాగా కఠినమైన నీ వీపును తిరగలికింది రాయిగా, మందర పర్వతాన్ని తిరగలిపైరాయిగాచేసి ఆ ముత్యాల్ని, ముత్యపు చిప్పల్ని, శంఖాల్ని సున్నంగా మారిస్తున్నావో అన్నట్లుంది [20]

## వరాహమూర్తి

వరాహమూర్తివై శరీరాన్ని పెంచి, ఒకసారి ముట్టెతో కెళ్లగించగా ప్రళయ జలాలు పైకిలేచి బ్రహ్మాండపు చిప్పను దూసుకొని, ఆ వెలుపలి ఆకాశమార్గంలో వెళ్లాయి. అలా వెళ్లి మళ్లీ కిందికి వంపుగా వాలిపడుతూ ఉన్న ఆ స్వచ్ఛనీటి పరంపర - బ్రహ్మాండంకన్నా అవతల ఉంటూ ప్రకాశిస్తూ ఉన్న ప్రకృతికాంతకు - ఈ బ్రహ్మాండాన్నే బంగారు ముక్కెరగా - ఓ స్వామీ ! నీవు చేయించిపెట్టినట్లుంది.[21]

## నరసింహమూర్తి

నరసింహమూర్తి హిరణ్యకశిపుని గుండె చీల్చి, ప్రేవులను వెళ్లి

గించాడు. ఆ దృశ్యం ఎలా ఉందంటే - విశాలం, లోతు అయిన భగవంతుని చేష్టచేత చర్మాది రూపం అయిన పైకప్పు లేచిపోయిన హిరణ్యకశిపుని హృదయం ఒక నెత్తుటి కుండలా ఉంది. భగవంతుడు అతని పేగుల్ని పెకలించడం ఎలా ఉందంటే - ఆ నెత్తుటి కుండలో తన ప్రతిబింబం చూసి అది వైరిసింహంగా భ్రమించి దాని జూలను పెకలిస్తున్నట్లుంది. హిరణ్యకశ్యపుణ్ణి అలా చంపిన క్రూరమైన, వాడియైన స్వామి గోళ్ల వరుసలు మమ్మల్ని రక్షించుగాక ![22]

ఓ మాయ సింహమా ! నీవు నఖకోణశ్రేణితో హిరణ్యకశిపుని రొమ్ము గోడను చీల్చేటప్పుడు - మొదట మొదట తెలుపు, దూరగా దూరగా ఎరుపు, మరింతగా దూరినపుడు గుండెకాయలోని నలుపు కనిపించేట్లు విక్రమంతో చీల్చావు. ఆ చీల్చడం ఎలా ఉందంటే - హిరణ్యకశిపుడు పూర్వం విక్రాంతుడై గర్వంతో హరించి తనలో ఇముడ్చుకొన్న తెల్లని ఈశ్వరుని తేజాన్ని, ఎర్రని బ్రహ్మతేజాన్ని, నల్లని విష్ణుతేజాన్ని తిరిగి పుచ్చుకొన్నట్లు ఒప్పారింది [23]

## వామనమూర్తి

ఓ వామనమూర్తీ ! బ్రహ్మాండం అనే ఇంటిలో - బలిచక్రవర్తి వల్ల భయం అనే అంధకారం నిండి ఉండగా - నీవు వామనునివై నీ వల్లని దేహాన్ని కింది నుండి పైనున్న శింశుమార జ్యోతిచక్రందాకా పెంచి వ్యాపించావు. ఆ వ్యాపించడం ఎలా ఉందంటే - హిరణ్యకశిపుని ప్రతాపం - బ్రహ్మాండగేహంలో, ముల్లోకాలపై ప్రకాశిస్తూ ఉండి, ఉన్నట్లుండి ఆరిపోయింది. అలా హిరణ్యకశిపుని ప్రతాప దీపం ఉన్నట్లుండి ఆరిపోగా, ఆ దీపం యొక్క మహాఛాయ పెనుచీకటై పైకి వ్యాపించినట్లుగా ఒప్పారింది. అంటే వామనమూర్తి విజృంభణవల్ల బ్రహ్మాండంలో భయాంధకారం పోయి, హిరణ్యకశిపుని ప్రతాప నిర్వాణం అనే అంధకారం వ్యాపించింది.[24]

## పరశురామావతారం

ఓ పరశురామావతారమైన హరీ ! పశుపక్ష్యాదులు స్వతంత్ర మార్గా

లలో వెళ్ళక గతానుగతికమైన దారి వెంబడే వెళ్తుంటాయి. అలాగే పూర్వం నీ గొడ్డలితో సంహరింపబడిన రాజులకోసం - వారి భార్యలు పెల్లుగా ఏడ్వగా - వారి కన్నీటి వర్షధారలు కురుస్తూ ఉండే వర్షాకాలంలో - నీ కీర్తి హంసి క్రౌంచ రంధ్రమార్గం గుండా వెళ్ళింది. కాబట్టి, అప్పటికీ హంసజాతి వానలు రాగానే ఆ క్రౌంచరంధ్ర మార్గంలోనే మానససరోవరానికి వెళ్తుంటాయి. ఓ స్వామీ ! నీవు బాల్యంలోనే లోకోత్తర మహావీరుడివై, తర్వాత దుష్టక్షత్రియ సంహారం చేసిన దేవుడివి. అలాంటి స్వామివైన నిన్ను స్తుతిస్తున్నాను.[25] (విలువిద్యలో శివుని శిష్యుడైన పరశురాముడు తన సహాధ్యాయి, శివతనయుడైన కుమారస్వామితో పందెం వేసి క్రౌంచం అనే పర్వతాన్ని ఒకే బాణంతో రంధ్రం పడేట్లుగా కొట్టాడు )

## శ్రీరామావతారం

రఘుకుల స్వామి అయిన ఓ శ్రీహరీ ! ఇంద్రుని వజ్రాయుధపు వాదర వేటునుసైతం లెక్కచేయని - ఆ రావణాసురుని దేహంలోని సప్త ధాతువుల్లో దూరి చీల్చే నేర్పును ముందుగా అలవాటుచేసుకొంటున్నదేమో అన్నట్లు - నీ వాయువేగి బాణం ఏడు తాటిచెట్లను ఒక్కపారిగా దూరి - విలువక వడిగా అవతలికి వెళ్ళిపోయింది. ఆ బాణం మాకు సంపదలను ఇస్తుంది.[26]

శ్రీరాముడు రావణున్తో యుద్ధం చేసేటప్పుడు ప్రయోగించిన బాణ పరంపరలు ఎలాంటివి అంటే -

రామరావణ యుద్ధంలో పోరడానికి శ్రీరామునికి దేవేంద్రుడు తన రథాన్ని, సారథి అయిన మాతలిని పంపాడు. రాముడు ప్రయోగించిన బాణాల పిడివద్ద కట్టిన రెక్కలగాలి బాణాలు వెళ్ళేటపుడు 'రయ్'మని పోతూ ఉండగా, ఆ రెక్కల ఝూత్కారంచేత రథంలోనే మాతలికి చెవులు గింగుర్లెత్తి బుద్ధికి జడత సంభవించింది.

రాముని బాణాల అలుగులనుండి - ఆకాశంలో గాలితో రాపిడి సంభవించినందువల్ల - పుట్టిన అగ్ని జ్వాలలు రావణాసురుని రక్తంలో ప్రవేశించి 'చుంయ్ చుంయ్' అని స్ఫుటంగా శబ్దిస్తున్నాయి. రావణాసురుని

సైన్యంలోని వీరుల కవచాలతోడి హృదయాల్ని ఛేదించుకొని - రాముని బాణాలు అవతలికి దూసుకొని వెళ్లి - లంకానగర ప్రహరీ గోడలకు తగిలి 'ఠాప్ ఠాప్' అని మాటిమాటికి ధ్వనిస్తున్నాయి.

రాముని బాణాల దెబ్బవల్ల చలిస్తున్నట్లే ఉంది - భయంకరమైన రాక్షసుల మొండేలు నేలమీద చాపకట్టుగా కూలుతూ ఉండగా - ఆ భారానికి నొప్పి చెంది పడగలు క్రుంగి - ఆదిశేషుడు పెల్లుగా 'ఫూత్కారం' చేస్తూ ఉన్నాడు.

ఆ పోరాటంలో హుటాహుటిగా పరుగులెత్తడంవల్ల - అలసిపోతూ ఉన్న తేరు గుర్రాలకు - రాముని బాణ పరంపర క్రిక్కిరిసి - తన నీడను ప్రసాదిస్తూ ఉన్నది.

ఆ విధంగా లంకాపట్టణపు ముంగిటి ఆకాశంలో చరించే శ్రీరాముని బాణ పరంపరలు - రక్కసుల్ని, రావణాసురున్ని కూల్చగలవి - మా కలుషాల్ని హరించుగాక ![27]

## బలరామావతారం

'భూమిలో నాగేటి ముక్కచేత పుట్టిన సీత భూమిలోనే లయ మొందింది' అని ఆ సీత విరహవేదనతో శ్రీరామునివే - పాండుర వర్ణంతో బలరాముడై పుట్టి యమునానదీ తటాన్ని నీ నాగలితో అవకాత్మకివై మళ్లీ దున్నావు అలాకాకపోతే - స్వామీ ! నీవు బలరామావతారం ఎత్తి అలా దున్నవలసిన పనేముంది ?[28] (కౌరవులమీద కోపంతో హస్తినాపురిని ఎత్తి యమునలో తోయడానికి నాగేలితో బలరాముడు దున్నిన సందర్భం ఇక్కడ అన్వయించుకోవాలి.)

బ

యదువీరుడవైన ఓ కృష్ణా ! నీవు ఏడు దినాలు, ఏడు రాత్రులు గోవుల మందను - దేవేంద్రుడు కురిపించే రాళ్లవాన నుండి గోవర్ధనగిరిని ఎత్తి దానికింద ఉంచి - కాపాడావు. ఆ కాపాడిన సందర్భంలో - నీ పొడవైన స్వరూపం - నీ చేతి చివరనున్న గోవర్ధనగిరి అందులనుండి కిందిం

కురుస్తున్న నీటిధార అనే శత సహస్ర చంద్రకాంత శిలల వరుసలో ప్రతిబింబించింది. ఆ దృశ్యం కష్టాలు తొలగడానికై నారాయణ కవచకి పఠించే భక్తులకు అన్ని వైపుల నీవే అయి రక్షించినట్లు ఉంది.[29]

## బుద్ధావతారం

బుద్ధావతారం ఎత్తిన కేశవా! తరుణుడైన నీ కొడుకు మన్మథుడు పంచబాణాలతో దైత్యస్త్రీలను శీల భంగం గావించగా వారి భర్తలైన దైత్యుల్ని నీవు ఒక్క మొదిబాణంతోనే ధ్వంసం చేశావు. ఆ తరుణుల శీలం అనే కవచం ఎవరికీ అసాధ్యం అయినందువల్ల గదా! ఇలా చేశావు[30]

## కల్కి అవతారం

కలికి అవతారం ఎత్తిన ఓ శ్రీహరీ! నీవు గుర్రమెక్కి దానిని అయిదు విధాల గతుల్లో నడిపించావు ఆ గుర్రం తిరిగిన చోటల్లా పంచ మహాపాతకాలు (బ్రాహ్మణ హత్య. మద్యపానం. బంగారు దొంగిలించడం. గురువు భార్యను గవయడం. ఈ నాలుగు పాపాలు చేసిన వారితో స్నేహం చేయడం) తొలగిపోతాయి. పాపులు నశిస్తారు. మ్లేచ్ఛులు నీపై బాణాలు ప్రయోగించేప్పుడు నీవు రెండు చేతులతో తిప్పే ఖట్గాకత్తులు 'మెరపుల అల్లికలాగా - నీ దేహాన్ని కనబడనీక మరుగుపరుస్తూ - కవచంలాగా మ్లేచ్ఛుల బాణాల్ని వారిస్తుంటాయి. అలాంటి కల్క్యవతారా! నిన్ను స్తుతిస్తున్నాను.

- అని విష్ణుచిత్తుడు హరిని స్తుతించగా, హరి దేవశిల్పి అయిన విశ్వకర్మను చూసి ఇలా అన్నాడు : 'అయ్యో! మునివరేణ్యుడయిన ఈ విష్ణుచిత్తుడు పాండ్యరాజు ఇచ్చిన అశేషధనం అంతా వైష్ణవులకు, విష్ణ్వాలయాలకు ఇచ్చి, చాలా దారిద్ర్యాన్ని అనుభవిస్తున్నాడు. కాబట్టి విలుబుత్తూరులోని విష్ణుచిత్తుని గృహాన్ని. మణిమయంగాను, పదార్థ సమృద్ధంగాను చేయి'! అని చెప్పాడు.[32] స్వామి ఆనతిచ్చినట్లుగా విశ్వకర్మ విష్ణుచిత్తుని గృహాన్ని మణిమయంచేసి, పదార్థ సమృద్ధిని కల్పించాడు. శ్రీహరి ముని అయిన ఆ విష్ణుచిత్తుణ్ణి ఆదరించి అదృశ్యమయ్యాడు. విష్ణుచిత్తుడు మధురాపుర వీధుల ఊరేగిస్తూ తోడురాగా విలుబుత్తూరుకు వెళ్ళాడు.[33]

## విష్ణుచిత్తుని విల్లిబుత్తూరు ప్రవేశం

శ్రీ విల్లిపుత్తూరు దేవస్థానం అధికారులు (స్థానికులు) విష్ణుచిత్త మునిని దర్శించడానికి ఉవ్విళ్లూరుతూ - పురం అలంకరించి, ప్రజలు తోడు రాగా వేశ్యల మేళంతో (నాగస్వరం) పాటు - మంగళ వాయిద్యాలు మ్రోగుతూ ఉండగా విష్ణుచిత్తునికి ఎదురు వెళ్ళారు.[34]

ఈ విధంగా విల్లిబుత్తూరు స్థానికులు, పౌరులు విష్ణుచిత్తునికి ఎదురేగి 'తిరుప్పరివట్టం' (విష్ణుప్రసాదంగా గ్రహించి తలకు చుట్టుకొనే పట్టువస్త్రం) పవిత్రమైన భగవంతుని ప్రసాద తీర్థాలు కానుకలుగా విష్ణుచిత్తునికి సమర్పించారు. ప్రణామాలాచరించి, లేచి అంజలిఘటించినవారై, బంగారుతో చేయబడిన, అలంకారంచేత కవచితమైన బ్రహ్మరథంలో (బ్రాహ్మణులు మోసే వాహనం) - ఆ భాగవత వతంసుడైన విష్ణుచిత్తుణ్ణి ఆసీనునిచేసి మోసుకొని వెళ్తూ ఉన్నారు ఆ సమయంలో పౌరులు, జానపదులు ఒకరితో ఒకరు కలిసి మెలిసి నడుస్తూ ఉండే సమయంలో -

మృదంగాలు, ఉపాంగాలు (సుతిపోసే తిత్తి), తంబురాలు, తాళాలు, ఉరుముల మద్దెళ్లు, కిన్నెరలు, సన్నకాహళలు, వీణలు, ముఖవీణలు, పిల్లనగ్రోవులు, డోళ్లు, నాగస్వరాలు, దుందుభులు, పెద్దకాహళలు, గుమ్మెతలు, డప్పులు, ఢక్క, డక్కి, చక్కిలాంటి వాద్యవిశేషాలు, చుయ్యంకులు (ఒక విధమైన తాళం) లాంటి అసంఖ్యాక వాద్యత్రయాల వరుసలు శబ్దిస్తున్నాయి.

ఆ ఊరేగింపులో నాట్యగత్తెలు - నడుమ నడుమ ఊరేగింపు నిలిచినపుడు ఊరేగింపునకు ఎదురు నిలిచి నాట్యం చేస్తూ ఉండగా - పట్టణాల నుండి వచ్చిన ఘోట్టాణదేశపు గుర్రాల గంటల సమూహాల పుష్పరధ్వనులకు సమానంగా - విలాసినుల మంజుమంజీరాలు శబ్దిస్తుండగా - ఊరేగింపు మెల్ల మెల్లగా ముందుకు సాగుతూ ఉంది.

ఊరేగింపు పక్కలలో చిత్రవర్ణ రత్నకంబళులు కప్పబడిన మేలిజాతి పసుగుం, పిడిపసుగుం మెరసిన కవచ అంకుశాలు చేతబూని (అది పేరా శిహ్నం.) సామంత కుమారులు సమూహాలుగా వస్తున్నారు. వారిని

చూసి విలాసినులు ఒకరినొకరు దాటి ముందుకు పోవడానికి త్వరపడుతూ, వారికి నమస్కరించి, నిక్కి, చేయెత్తి, ఒదిగి, కన్నులు మిలమిలా మెరుస్తూ ఉండగా తిరిగి తిరిగి పొగడుతూ వస్తున్నారు.

ఆ రాజుల సమూహం విల్లిపుత్తూరికి ఎప్పుడు వచ్చినా ఆ పట్టణపు వెలయాండ్రను తమకు - నాట్యమేళాల్లోని కళావతులు తాత్పగత్తెలు అయినందువల్ల వారిని కొట్టే మిషతో - పూర్వం తాము ఆ ఊరికి వచ్చినపుడు అనుభవింపబడిన చంద్రవదనలను ఊరూరి గ్రామణులు కానుకలుగా ఇచ్చే నారింజపండ్లతోను, మొల్లలు, బంతులు మొదలైనవాటితోను కొడ్తున్నారు.

అలాగా రాజకుమారులు వేశ్యల్ని నారింజపండ్లతోను, బంతులతోను కొడ్తూ ఉండగా - వారి రత్నతాటంకాలు ధగధగ మెరుస్తున్నాయి. వారిలో విస్మయం పొడసూపుతూ ఉంది. ఆ విటుల ముఖాల్ని వీక్షించడానికి దోలాయమానమైన, కాలమైన, సాభిప్రాయమైన విలాసంతో కొద్ది ఓరగా కడగన్నులతో చూస్తున్నారు. వారి కొప్పులు అల్లనల్లన కదులుతూ ఉన్నాయి.

ఆ విలాసినులు ముఖాలు తిప్పుకొని సమ్మర్దంలో వెళ్తున్న మద్దెంకాండ్ల మూపుల మరుగున దాగుతున్నారు. ఆ ఊరి విలాసవంతుల్ని చూస్తూ-చెంరేగి మొగాలు బిగించుకొని వెర్రెత్తినట్లు ఆశ్చర్యంకొలిపేట్లు - అడుగడుగునా మద్దెం వాయించడానికి మద్దెలకాండ్లు వంగినప్పుడల్లా - వేశ్యలు బయటికి కనిపిస్తున్నారు. దాగడానికి మరేవీలులేక నారింజ, పూలబంతుల్తో కొట్టేవారికి అభిముఖంగా తిరిగి కొప్పులు సర్దుకుంటున్నారు. ఆ నారింజ పండ్ల, బంతుల దెబ్బల నుండి తప్పించుకోడానికి అభినయం చేస్తూ పద్మం లాంటి చేతులు అడ్డుపెడుతున్నారు. ఇలా గుంపులో వారు తిరుగుడునదే సమయంలో కనిపిస్తున్న కర్ణాభరణాలతో వారి చెక్కిళ్లపై గరిడీమీద కదులుతూ కనబడుతున్న మొల్లలలాంటి నవ్వులు - సాంద్రతరమైన వెన్నెలకు దీటుగా ఉన్నాయి. చతురంగా మాట్లాడంతో వాచాలులు అయిన వృద్ధ వనితలు విటులైన రాజకుమారులకు మొక్కారు. బంతుల దెబ్బలు తిన్నప్పుడు గుబ్బెతలు మాత్రం దండం పెట్టకుండా ఆ వృద్ధ వనితల ఇరుపక్కలా ఒదిగి, ఆ దొరలతో పూర్వం తమకున్న సంబంధాన్ని తలపోసి తలవంచారు.

వారిని ఓర చూపుల్తో చూస్తూ - రాజకుమారులు ఎగతాళికోసం వారిచేత మొక్కించుకొనే వేడుకతో, అక్కడ రాజు లేనందువల్ల, సామాన్య మాత పుల్ని నరకుచేయక, మనోల్లాసంతో 'విద్యా వయోవృద్ధులయిన మీరు మొక్కగా వారు మొక్కకపోవడం కుదరదు - మీరు వారిచేత మొక్కించండి' అన్నారు

అలా దొరలు అన్న మాటలు విన్న విలాసినులు ఆ మాటలకు తమ పద్మాల్లాంటి ముఖాల్లో మొలకనవ్వు వింత ప్రకాశాన్ని ఇస్తూండగా - ఆ దొరలకు తమకు సన్నిహిత సంబంధాలున్నాయి అని - తమతోపాటు నడిచే యువతులకు తమ పెద్దరికం తెలపడానికి - ఎర్రని పెదిమలు విరుస్తూ, లోపల్లోపలే మెల్లమెల్లగా ఉచుక్కన్నారు. (అనాదర శబ్దం చేశారు). ఆ సందర్భం తెలుసుకొని. ఆ వృద్ధ స్త్రీలు ధనం మనకు లభించినట్లే, అని విలాసినులను ముందుకు నూకి 'అక్కక్క మొక్కవే' ఈ దొర మనపాలి వేలుపు' అని బుజ్జగించారు - కనుబొమలు ముడిచి బెంకించారు. ఎట్టకేలకు మొక్కడానికి వారిని ఒప్పించారు.

అలా దొరలకు మొక్కడానికి అంగీకరించిన యువతులు - సిగ్గుతో చంచలాలైన నేత్రాలు కలవారై - ఎదమెదంగా పెట్టుకొన్న వ్రేళ్లతో కేల్మోడ్పి మొక్కారు. ఇలా బలవంతంగా మొక్కించి అతిశయించి ఆ ప్రణయం ఎడపడక ఉండేట్లు - పక్షిం పట్టుకొనడానికి పెట్టిన 'జిగురుకండెలు' లాగా - దొరలను, విలాసినులను చుట్టుకొని వృద్ధ వనితలు గొల్లున నవ్వారు. నాతివి దొంగకోపంతో ఆ యువతులు కొట్టి, కసరు చూపు ఆ రాజసంఘం మీద ప్రసరించారు. మళ్లీ ఆ రాజకుమారులకు కనిపించకుండా మరుగుగా వెళ్లే ఆ లేడికళ్ల పడుచుల కదిల్చిన కంకణాలు రాచుకొని వినిపించే 'క్రేంకారాలు' - వారి ముఖాల సువాసనకోసం దట్టంగా చుట్టుకొన్న తుమ్మెదల 'ఝంకారాల' బింకాల్ని అతిశయిస్తున్నాయి.

(బుక్కావాంధ్ర వర్ణన) శంఖంతో చేసిన కర్ణాభరణాలు, లోవంక కుచాలు, కొంకిపిగలు, కావిదుప్పట్లు ఒప్పగా తమ నివాసం వదిలిపెట్టి కష్టకాలాన్నమపరించి, వృద్ధాప్యంతో ఆ విల్లిబుత్తూరుకు వచ్చి, ఆ పురిలోని

రసికజన బాంధవ్యంతో, బంధువియోగం మరచిపోయి, పరిమళ ద్రవ్యాల్ని పసుపూర్చడం, పూలదండలు కూర్చడం - మొదలైన పనులలో పొరపాటు లేకుండా ఆంధ్రదేశీయులైన గంధకారులు చిన్న చిన్న పద్యాల ముక్కలతో వెర్రివెర్రి స్తోత్రాలు చేస్తూ, ఏనుగులమీద గుర్రాలమీద వచ్చే రాజకుమారుల మీద, నాట్యగత్తెలమీద, విష్ణుచిత్త ఆళువారిమీద బుక్కాం చల్లగా చల్లారు. ఆ బుక్కాం పెల్లగసి సృష్టినంతా పిడికిట బట్టుకొన్నట్లు వస్తుభేదం తెలియనీ కుండా చేస్తూ, సుగంధాల మొత్తంలో ముంచుతూ ఆకాశమండలానికి చందాతకం (చల్లాడం) అయి, సూర్యకిరణాల్ని మాటువరిచింది. పన్నీరు నించిన ఆ నీరు తిత్తులు ఒత్తగా మింటికి ఎగిసి కైవ్రాలు ధారలతో వాద్యాలు తడిశాయి ఆలా తడిసిన వాద్యాల్ని సరిగా మోగేట్లు చేయ డానికి ఆ వాద్య ముఖాల్ని కాచడానికి వాయిద్యకాండ్లు అగ్గి వెదుకుతున్నారు.

నృత్యం చూడడానికి నిలబడి మెత్తమెత్తగా నడుస్తూ ఉండే విట సమూహమూ - ఆ గుంపులోని విలాసినులు - కాస్త తెరిపిచేసుకొని తెల్లు పూల ప్రతిబింబాలతో తెల్లనివైన దారులయొక్క ఇరువక్కలలోని అతి హృద్యమైన ఉద్యానవనంలోని చెట్లకోసం పారే చెంగలువ కాలువల్లో దిగి - మీగడ సహితమైన గేదె పెరుగుతో చిక్కగా పిసికి ఆరబెట్టిన నారం గాల, అల్లం తునకలతో మూటకట్టిన వరి అన్నపు చద్దిని - పోకపట్టల్లో భోంచేయడానికి కూర్చోగా దాసరిగుంపు చూసింది.

పొట్టపోసుకొనే భావంతో ఆకటికి కృశించినవారై పలు తావులకు తిరిగి తిరిగి వేసారి ఓసరిలిపోయిన ఆ దాసరిగుంపు, ఆ చద్ది భుజిస్తున్న వారి వద్దకి 'గోపాలభిక్ష' ను (దాసరులు తమకు పెట్టిన అన్నం కబళంతో గోపాలదేవునికి ప్రీతి అవుతుందనే భావంతో 'గోపాలభిక్ష' 'గోపాలభిక్ష' అంటూ కబళం యాచిస్తారు. దానినే 'వందె గోపాలం' అని కూడా అంటుంటారు). యాచించి భుజించడానికి తమ లావుపాటివైన తిరువిళ క్కాలను (తివెదారి కంబాలు) గుండ్రని బొక్కల మండి - ఉధృతమైన జ్వాలలతో ధగధగమండే జగజ్జ్యోతి దీప సమూహాల మధ్య (జగజ్యోతి అని ప్రమిదలో వత్తులకు బదులుగా నూనెతో తడిపిన వస్త్రఖండాల్ని వేసి వెలి గించే దీపం) కూచున్నారు. పరిమళ ధూపార్థమైన పాత్రలోని నిప్పుల

మీద వాయిద్యాలు తడి ఆరేట్టు కాచుకొని 'నాదు' పరీక్షించడానికోసం వాయించే 'ధిమిధిమి' శబ్దాలకు బెదిరి ఈవలి ఉద్యానవనంలోని చిలుకలు ఆవలి ఉద్యానవనంలోకి, ఆవలి ఉద్యానవనంలోని చిలుకలు ఈవలి ఉద్యానవనాల్లోకి - దట్టంగా కట్టని మామిడాకు తోరణాలుగా ఎరుగెత్తగా - ఆ కోలాహలంలో తలలు పిసరడం (అభినయించడానికి) నోరు తెరవడం (పాడడానికి). చేతులు చలవడం (తాళం వేయడం) కనిపిస్తున్నది తప్ప - మూక గట్టి వచ్చే భాగవతుల గుంపు కావడమేగాని - వారి పాట వినిపించడం లేదు.

ఊరూరి సంత సంతకూ తిరగడానికి పెద్దలు ఇంటింట్లో సంతరించి పెట్టిన అను గుర్రాలకు పుట్టి కాలు గట్టి విడువగా ఊరి చెత్తంలో మెత్తని గరిక మేసి, పోతరించి మాపటి వేళల్లో మేపే సజ్జ కవణం మేపులని, పిడకల్తోను, గొఱపం (గుర్రాన్నితోమే సాధనం)తోను తోమినందువల్ల నిగనిగమంటూ, కర్రెకంబడి పాతను చూచినా బెదిరే లేత తట్టువ గుర్రాలకు కాలిపొడుగునా వ్రేలాడే ఎర్రకుచ్చులు కట్టిన గవ్వల దండలతో అలంకరించి, వల్లభాయ చెక్కను కాచగా ఏర్పడే చిక్కని వల్లమడ్డిలో నానబెట్టి నూరకు ఒకటి జానకు ఒకటిగా కుట్టిన వ్రేలాడే జాలరులు కోతిల్లేట్టు జీనులమీద చిల్లతైలం. పరిమళ ద్రవ్యాలు పట్టించే కుంచెలతో పూసిన తెల్లని మడుగు వస్త్రాలే అలంకారాలు కాగా ఊరేగే జనసమూహానికి ఎదురుగా సంబరంతో ఆ ఊరి మేటిసాలె, అగసాలె, పటుసాలె, వానె, వైజాతి, సాతులు, ఏతుల జాతులకు చెందిన యువకులు-గుమికూడి వచ్చే ఆ రాజుల సేనల్లోని ఏనుగులను చూసి అతిశయించిన భయంతో-తమ వాహనాలు ఎక్కి-కళ్ళేలు రెండు చేతులా బిగబట్టినా అవి వినవక గుంపును తొక్కుతూ పోయాయి.

ఆ గుంపులోని వృద్ధులు, స్త్రీలు, రోగులు మొదలైన వారు అశ్వాల్ని తమమీదికి తోలారని తిట్టగా-వారు తిరిగి ఇట్టట్టు అనలేక ప్రాణాలు పిడికిట బట్టుకొని పోతూ-కొత్తవైన పమీపపు లేత వరిపొలాల్లో పడి - పిడుదులు దిగబడి వెడల లేకుండా-తాము బయటికి రావడానికి వీలులేక వ్యథ పడుతూ-దిక్కులు చూస్తున్నారు. ఈ దృశ్యాన్ని చూసి చేతులు తట్టి 'కోహో' అని గేలి చేస్తూఉండే వేశ్యల చప్పట్లు-ఉపవనాల చెట్ల సమూహంతో ప్రతిశబ్దాలు పుట్టించాయి.

ఇలా అమాన విభవంతో విజృంభించగా ఆ తిరుపతి (దివ్యక్షేత్రం అయిన శ్రీవిల్లి పుత్తూరు) ప్రవేశించి ఆ విష్ణుచిత్తుడు బ్రహ్మరథం నుండి దిగి-మన్ననారుస్వామి గుడి మొగసాల నిలిచి, రాజులూ, దేవాలయాధికారులు వెంటరాగా హరిని సేవించి స్వామి ప్రసాదంగా పొందిన పరివట్టం (దేవుని ప్రసాదంగా ఇవ్వబడితలకు చుట్టుకొనే పట్టువస్త్రం)తో అలంకృతుడయ్యారు. నానాలంకార సహితం, రత్నకాంచన మయం అయిన తన భవనాన్ని చూసి విస్మితుడయ్యాడు. ఈ వైభవం అంతా హరి మహిమతో లబ్ధం అయిందని గ్రహించి, అక్కడనే ఉన్న రాజులకు వీడ్కోలు చెప్పి, గృహప్రవేశంచేసి, ముందుకంటే నూరింతలు ఎక్కువగా భాగవత పూజాతత్పరుడై విష్ణుచిత్తుడు ఉన్నాడు[35]

విష్ణుచిత్తమునిని సాగనంపడానికి వచ్చిన దొరలు-తమ ఇంట విందును అంగీకరించండని కానుకలు పెట్టి-అభ్యర్థించిన విల్లిపుత్తూరు పౌరుల ఇండ్లలో-స్నానం, రాజులకు తగిన ఉదార భోజనాలతో తృప్తులయ్యారు. ఆ రేయి హరి కొలువులో (గుడిలో భగవత్సేవగా జరిగే నృత్యంలో) వివిధ నర్తవల్లో పోటీపడిన లావణ్యవతులైన నాట్యగత్తెలలో తారతమ్యాలు ఎర్పరచి-చెప్పి వారిని సమాధానపరచి, బహుమతులిచ్చి పంపివేశారు. భక్తిపూర్వకంగా రత్నభూషణ సమూహాన్ని హరికి నిష్ఠతో సమర్పించి-వేకువజాములో[36] ప్రయాణమై ప్రభువులు తిరిగి పాండ్యనగరి అయిన మధురాపురికి వెళ్ళి పోయారు విష్ణుచిత్తముని కూడా ముందు మాదిరే వైష్ణవుల అభ్యర్చన చేస్తూ, తాను చిరకాలం నుండి చేస్తున్న తులసిదండలు కట్టే దాస్యాన్ని చేసుకుంటూ భగవత్పరాయణత్వంతో ఉన్నాడు[37].

ఒకనాడు మధ్యాహ్న సమయంలో పూలతో స్వామి కంఠం అలంకరించి తిరిగి వెళ్తున్న విష్ణుచిత్తుని-ప్రసాద మంద స్మితంతో అందంగా తెల్లనైన కడకంటి చూపుతో వీక్షించి-గరుడ ధ్వజుడైన మన్ననారు స్వామి శ్రీలక్ష్మీదేవితో ఇలా అన్నాడు[38].

## యామునాచార్య చరిత్ర

'యామునాచార్యుడు ఒకడు, మహాత్ముడైన ఈ విష్ణుచిత్తుడు ఒకడు నా కృపాతిశయంతో 'దర్శనం' (సత్యమైన విష్ణువే పరమాత్మ అనే మతం) ఉద్ధరించారు.' అని హరి అంటూనే ఇందిరాదేవి తన భర్తతో ఇలా అంది[39].

'అతని కథ తెలిపిందే! అతడేం చేశాడు?' అని లక్ష్మీదేవి అడిగింది. 'ఓ అతివా! పూర్వం నా పాదాల్ని కొలిచే భక్తుడున్నాడు[40].

అతడు చిన్నప్పుడే ఆచార్యునింటిలో వేదశాస్త్ర ముఖ్య విద్యల్ని అభ్యసిస్తూ ఉండేవాడు. ఓ లక్ష్మీదేవీ! అప్పటి పాండ్యరాజు పూర్వవంశ్యుడు ఒకడు పరిపాలిస్తూ ఉండేవాడు[41]

ఆ పాండ్యరాజు 'వీరశైవం' ముదిరి నా వినుతి (హరిస్తుతి) వినడు. నా ప్రతిమలకు నమస్కరించడు. హరుడే పరతత్త్వం అంటాడు. నా ఆలయాల్లో ఉత్సవాలకు ఉలికి పడతాడు అతనితో పాటు అతని స్నేహితులు కూడా అంతే[42].

ఆ పాండ్యరాజు వేద విదులైన బ్రాహ్మణుల పూజ మానేసి. ఎడతెగని జంగమార్చన ఆసక్తితో ప్రవర్తిస్తాడు గృహ దైవతలు నిప్పుల్లో జారి పోతుంటే (ప్రతి ఆదివారం వీరభద్రునికి నైవేద్యపు పళ్ళెం వేసి ప్రమథగణాల్ని అర్చించడానికి జంగాలకు సంతర్పణ చేస్తారు.) శంకర దాసమయ్య భక్త సమూహానికి (శంకరదాసమయ్యలు అని పేర్కొనబడే శివ భక్తుల సమూహానికి)తొంబై ఆరుదినాల శ్రాద్ధాల సమూహాన్ని ఏర్పరుస్తాడు. ప్రాచీనకాలం నుండి ఉన్న దేవాలయాలు పూజా నైవేద్యాలు లేక పాడుపడి పోతుండగా, భూమి అంతటా 'నిరాళులు' అనేపేరు గలిగిన జంగాలకు మఠాలు కట్టిస్తాడు. (నిరాళులు వీరశైవ మతంలో ఒక తెగవారు.) గుడూవ దేశంవల్ల ఉత్తరశైవం అవలంబించి జందెం తెంచి వేశాడు. పతితులైన 'ఆరాధ్యదేవళ్ళే' శుశ్రూషకు అర్హులు అని భావించి-వారిచేత ఉపనిషత్తులు సంతోషంతో వింటూ ఉంటాడు. బ్రాహ్మణేతరుడైన జంగం ఎవరైనా ఉపనిషదర్థాలు చెప్పడానికి పూనుకొంటే ఆశ్చర్యపడుతుంటాడు[43].

శివలింగం తాల్చిన జనాలు ఏమైనా చేయనిది పాపం - కాదు 'ఔను కాదు' అనడు ఆ సమయంలో లింగధారుల నడవడిని తప్పుపట్టని విప్రులకే అగ్రహారాలు ఇస్తాడు.[44]. ఆ పాండ్యరాజు పాండ్యదేశాన్ని పాలించే కాలంలో అతని వశంలోని గ్రామ పర్జివదిలో లభించే-మరెక్కడా లభించని ముత్యాల మొత్తం-మాహేశ్వరుల బొంతలకే సరిపోయాయి[45].

(ముత్యాల మొత్తం మాహేశ్వరులు మెడల్లో ధరించే రుద్రాక్షల్లో కలిపి కుట్టుకోడానికే సరిపోయాయి-అని పాఠాంతరం)

ఇలా ఆ పాండ్యరాజు శైవ పక్షపాతం వహించిన ఆ రోజుల్లో కొందరు బ్రాహ్మణులు తమ జన్మ భూమిని విడువలేక-'ఇచ్ఛకులు' అవుతూ నుదుటి విభూతి గద్దాల్ని అమకొంటుండగా-పెండేకట్లు ధరించి, రుద్రాక్షలు కట్టుకొన్న సంచిట్లో 'సూతసంహిత' ఇరికించుకొని - రాజాస్థానంలో ప్రవేశించడానికి మొదలెట్టారు[46] (సూతసంహిత స్కాంద పురాణంలో ఒక భాగం దానిని సంచిట్లో ఇరికించుకొని ఉండడం నిరంతరం స్కాంద పురాణాన్ని పఠిస్తున్నాం అని రాజును భ్రమపెట్టడానికి)

శీలం (జంగమాచారం) పట్టికూడా ఏకాంతంలో గంజాయి తాగేవారు, మద్యపానం చేసేవారు అయిన అధముల్ని కూడా ఆ పాండ్యరాజు బయట వేయజాలడు విప్రులలో ఎవరైనా పొరపాటు కనిపిస్తే చాలు-ఆ దోషాన్ని బయట పెట్టి సభలో శైవ సభ్యులకు కన్నుగిలుపుతాడు[47].

ఆ పాండ్యరాజు పట్టపురాణి అందామా-నా (విష్ణు) ఆరాధన తత్పరంగా ఉంటుంది. అలా ఉండి కూడా తనభర్త నా (విష్ణు) పాద భక్తుడు కావందుకు తొలగింపరాని దుఃఖానికి అంతం కనిపించక బాధ పడుతుంటుంది[48].

ఆ ఉత్తమ గృహిణి[49]-పట్టపురాణై ఉండి కూడా సుందరమైన ముంగిట్లో వేలకొన్న బృందావనికి (తులసి తోటకు) స్వయంగా తానే ముగ్గు పెడుతుంది దశమినాడు ఒకపూటే భోంచేసి, ఏకాదశినాడు జాగారం చేస్తూ నిరుపవాసం ఉంటుంది. ద్వాదశీవ్రతాన్ని మానదు. పాఱటక్కలు (బ్రాహ్మణ స్త్రీలు) పాడే నా (విష్ణు) పుణ్యకథలు వింటూ-వ్రతానంతరం వచ్చే నిద్రను పోగొట్టుకుంటుంది. నియమపు మూన్నాళ్ళు (దశమి, ఏకాదశి, ద్వాదశి అనే విష్ణువ్రతపు మూన్నాళ్ళు) భర్తను కామింపదు ఆ మర్నాడు రాజు మనసూ, కన్ను తనిసేట్లుగా మనోహరమైన శృంగారంతో ప్రియుని శయ్యకు వెళ్తుంది. అలా వెళ్ళేటప్పుడు నాభిని (కస్తూరీ తిలకాన్ని) తుడిచి, కర్పూరపు నాభిని (కర్పూరపు బొట్టు) పెట్టుకొంటుంది. ఇలా ఆ రాణి మామీద (హరిమీద) భక్తి కలిగినదై కూడా నాకు ఇష్టం కాబట్టి భర్తమీద భక్తి కలిగి ఉంటుంది[50].

బ్రహ్మశివాదులు నా దేహాలే. వారి పూజలు నా పూజలే. ఆ బ్రహ్మశివుల్ని పూజించడం వల్ల కలిగే కోరిన ఫలాల సిద్ధిదాతను కూడా నేనే. అలాగైనా నా పూజల్లో తారతమ్యాలు ఉన్నాయి[51] (వార్ని పూజించడం కన్నా నన్ను పూజించడం మేలు.)

కేవలం శరీర దృష్టితో-ఇతర దేవతల్ని నాకన్నా భిన్నులుగా భావించే జడాత్ములు పొందే సిద్ధులు- శాశ్వతాలు కావు. ఆ పూజ అంతంతో కూడిన ఫలమై (సాంతమై)మళ్లీ పూర్వస్థితికే తెస్తుంది[52].

అంతేగాక ఈ రహస్యం తెలియక ఆ భూపతి తామసుడై నాభక్తుల్ని సామాన్య బుద్ధితో చూస్తూ వారి జీవన వృత్తులకు వచ్చే ఉపద్రవాల్ని ఉపేక్షిస్తూ, రక్షణ విముఖుడై ఉన్నాడు. ఇలా ఉండడం చూచి-కలియుగంలో ద్రవిడ మండలంలో తామ్రపర్ణినదీ తీరంలో నా భక్తులు దండిగా ఉన్నారు. ఆ దేశానికి రాజు అతడు. రక్షణ శిక్షణలు రాజు ద్వారానే తప్ప నేను సాక్షాత్కరించి చేయను నాభక్తుల రక్షణ మీద ఇష్టం నా భక్తురైతే తప్ప కలగదు' నా అభిముఖ్యం సంవాదం ద్వారా తప్ప పుట్టదు అని నేను ఆలోచించాను. ఆ అభిముఖత్వ సిద్ధికోసం ఆస్థానమెక్కి వాదిజయం చేయాలి అనే కోరికను ఆ విప్రకుమారునికి (యామునునికి) పుట్టించాను.

యామునుడు పాండ్యరాజు రాజధాని అయిన మధుర వెళ్ళి వర మఠ ద్వారం చేరాడు. అక్కడ నానా దేశాల నుండి వస్తున్న దీనులకు, అనాథలకు, వృద్ధులకు, బ్రాహ్మణ కుటుంబాలకు, ధాన్యం, కృష్ణాజినాలు, వస్త్రాలు మొదలైనవి, రాణి తరవున ఇవ్వబడుతున్నాయి. వటువులకు పెండ్లికోసం-ఉపనయనం జరగని వారికి ఉపనయనం చేసుకోడానికి - కుంటి గ్రుడ్డి-చెవిటి వారికి-ఎద్దులు మొదలైన వాహనాలు-చెరువు తెగిందని-కొంతమంది-పేదగుళ్ళకు పూజ నడవడం లేదని కొందరు-ఎడారిలో చలివేంద్రం పెడతా మని కొందరు-శ్రాద్ధం మునిగి పోయిందని కొందరు-తీర్థయాత్ర వెళ్ళడానికని కొందరు-వ్రత సంపూర్తికి అని మరికొందరు - వ్యాధి, మాన్పుకోడానికని కొందరు-చెప్పి పంపగా అరాణివాసం గుప్తంగా కొంత-పైకి తెలిపేట్లుగా

కొంత-పంపే ద్రవ్యం తెచ్చి ఇచ్చే ముదుసళ్ళయిన హెగ్గడి కాంద్ర చేతులకు ముసుకులు-హెగ్గడికాని పందిటికి కట్టిన తోరణాలేమో అన్నట్లు(అయాచకుల చేతులే మామిడి ఆకులు లాగా ఉన్నాయి) ఏకదండి (స్మార్తులు) త్రిదండి (వైష్ణవ సన్యాసులు) వటువుల యొక్క ఎత్తైన కోలలలో విందుగా కట్టి ఉన్న కాషాయ, పసుపు వస్త్రాలు, గోపుర పరంపరలో క్రమ్మి-కావలి ఉండే ధ్వజాల గుర్తెరిగి, కేవలం దారిద్ర్యమే విద్యతప్ప ఇతర విద్యలేమీ తెలియక యాచించే ఇలాంటి వారికి ఆధారమైనపడమటి ద్వారం చేరాడు. ప్రతిదినం నాపాద భజన సంబంధితమైన శ్రుతపూర్వాలయిన కథల్ని వింటూ ఉండే ఆ రాజ మహిషికి ఆశీర్వచ నాంతలు దౌవారికుల ద్వారా పంపుతూ-'నేను విదేశం నుండి వచ్చినవాణ్ణి. వైష్ణవ బ్రహ్మచారిని వాదిగనుక ఉంచే విష్ణు తత్త్వమే పరతత్త్వం అని వాదించి గెలుస్తాను రాజు విష్ణు భక్తి విముఖుడు. కాబట్టి వైష్ణవుని మనవిని విన్నవించడానికి అందరూ భయపడుతారు. నీవు విష్ణుభక్తి పరాయణవు. పతి హితమే ఆచారంగా గల దానివి. కాబట్టి నీకు విన్నవించి పంపుతున్నాను. నీ భర్త నీకు విధేయుడు-అతనికి విన్నవించి నన్ను రప్పించి వాదం చేయించ గలిగితే వాదించి గెల్చి, నీ భర్తకు భగవద్భక్తి పుట్టించి కృతార్థుణ్ణి కావిస్తాను-అని విన్నవించడానికి దౌవారికుణ్ణి పంపాడు[53].

గ్రీష్మకాలంలో నిరుత్సాహంగా ఉండే ఆడు నెమలి కొత్త మేఘం ఉరుముకు ఆనందించినట్లు రాణి ఆనందించింది ఏకాంతంలో నర్మగోష్ఠి సలిపే వేళ, ప్రాణేశునితో రాణి యామునుని విధం తెలిపింది. ఆ రాజు తత్తర పడ్డాడు[54].

పాండ్యరాజు భార్యతో! 'ఎట్టెట్టూ! తాను వాదం చేసి శివమతం జయించడానికి వచ్చాడా! చూద్దాం - రావించు' అన్నాడు. ఆ నాటి రాత్రి తెల్లవారింది[55].

ప్రభాత వేళలో పరిమిత జనంతో ఆస్థానంలో కొలువు ఉండే భర్త వద్ద తాను కూడా ఉండి-రాణి అతని అనుమతితో ప్రతీహారి చేత ఆ భూదేవ కుమారుణ్ణి[56] పిలువనంపింది.

## యామునాచార్యుడు పాండ్యరాజు సభచేరడం

యామునుడు రాజసభాద్వారం ప్రవేశించి, గరుడపచ్చలతో తాపడం చేయబడిన భూమిపై, వజ్రమయమైన వేదిక మధ్య చిగురుల్తో ఎర్రగా ఒప్పుతూ ఉండే ఒక రావిచెట్టును చూసి, ఆ రావిని వాదసాక్షిగా ఉండమని ప్రదక్షిణీకరించాడు [57]

పసిడిగచ్చు అమరగా, మూడు మెట్లతో ఎత్తుగా ఉన్న, విశాలమైన - చిత్తరువులుకలదైన సభలో - రత్నకంబళం మీద పులితోలు ఖండాలు కప్పుకొన్నవారు, జటాధారులు అయిన వృద్ధశైవులు రాజు చుట్టూ ఉన్నారు. రాజు మెల్లుగా రుద్రాక్షలు కలిపికుట్టిన ముత్యాల హారాలు ధరించాడు అతని నొసటి విబూది వింజామర గాలులవల్ల రాలుతూ ఉంది. ఎర్రని విశాల నేత్రాలుగలవాడై కురుచపీఠంమీది గుండ్రని దిండుపై మోచేయి ఆనించి, నందీశ్వరుని ప్రతిమగలదైన ఉంగరంతోడి అరచేతిలో చెక్కిలి ఉంచుకొని, శైవ ఆగమాలు వింటూ ఉన్నాడు. బంగారు పొదిగిన చిన్న చిన్న రుద్రాక్షలు అతని చెవుల కుట్లల్లో మెరుస్తున్నాయి తెల్లని తలపాగాను మించే దువ్వలువను కప్పుకొన్నాడు అడపం, పదునైన ఖడ్గం ఒక స్త్రీ ధరించి ఉండగా - భార్య వింజామర వీస్తుండగా ఒప్పుతూ ఉన్న పాండ్యరాజును యాముసుడు చూశాడు.[58]

అలా పాండ్యరాజును చూసి వినయంగా అతని దగ్గరికి వెళ్ళి ఒందెం కానుకగా సమర్పించి యామునుడు కూర్చోగా - అతణ్ణి ఆదరించకుండా వేగిరపాటు కలవాడై రాజు ఇలా - అన్నాడు [59]

'ఓయి! ఇసుమంత పింగణావునీవు! ఇది నీకు శక్యమేనా! తత్త్వనిర్ణయంచేసే వాదం చేయడం నీకు తరమా? నీవు ఓడిపోతే - 'మొఱ్ఱో' అంటున్నా పట్టుకొని లింగాన్ని కట్టక వదలం. ఇది తెలుసుకొని మాట్లాడు.[60]

కొందరు చోరవకాండ్రు 'వాదులం మేం' అని చెప్పించి సభలోకి వస్తారు ఓటమి అయితే దయతో ఏదో కొంత ఇవ్వకుండా పోతారా? అని సిగ్గులేకుండా జూటుదనంతో సభలెక్కే బ్రాహ్మణుల సుద్ది చెప్పవలసిన

పన్లేదు.[61]

అని రాజు పలికి దరహాసంతో రాణివైపు చూసి ఇలా అన్నాడు.[62]

'మా మతం వాడు (శైవుడు) ఓడిపోతే ధన్యం. రుద్రాక్షలు వదిలి పెట్టి ఇతని ద్వారా నా ఆప్తులైన శైవులతో కూడా విష్ణుచక్రాంకితుణ్ణి అవుతాను'.[63]

ఉవిదా! ఈ నీదు విద్వాంసుడు ఓడితే - ఇతనికి నేను చెప్పిన ప్రతిజ్ఞే నీకు కూడా వర్తిస్తుంది (నీవు ఇతనితోపాటు శైవురాలివి కావలసి ఉంటుంది) అని రాజు అన్నాడు. రాణి 'మేం ఒప్పుకుంటున్నాం' 'దేవర పంచభూతాల సాక్షిగా చేసిన తమ ప్రతిన తప్పకుండా ఉంటే చాలు' అంది.[64]

ఇలా పలికే ఆ యిద్దరి ప్రతిజ్ఞలు విని[65] - యామునాచార్యుడు కృష్ణాజినం పెళపెళమంటూండగా లేచి, పసుపు గోచి కట్టిన మోదుగు దండం ఎగయగా, తన ఆసనం నుండి కొంచెం లేచి వినీతుడై కేలు మోడ్చి 'దేవరా! నా విన్నపం వినండి' అని ధైర్యంతో ఇలా అన్నాడు[66]

'దేవా! నేను జూటుతనంతో ధన సంపాదనకోసం వాదని అయి వచ్చాను అని సెలవియ్యకండి! నేను కడుపుకూటికోసం ఇక్కడికి రాలేదు. నా వేషం ఎవరిని కాపాడడానికి? "భిక్ష" అనే బ్రతుకుతెరువును బ్రహ్మచారికి బ్రహ్మే సృష్టించాడు కదా![67]

సర్వభూతాలకు అంతర్యామియై ఈ విశ్వాన్ని ఈ విధంగా నడవడానికి ఎవడు ప్రేరేపిస్తున్నాడో ఆ భగవంతుని ఆనతే నన్ను ఇక్కడికి రప్పించింది. నాకు తెలిసిన నాలుగు మాటలు చెప్పితే ఏమి జరిగినా లెస్సే! ఆతడే బొంకితే ఏమిచేయగలను?

ఓ రాజా! నేను పంతంకోసం వచ్చానని నీవు భావించినా సరే! నా వాదంలో అపజయ కారణం అగుపడితే 'అమ్మ దెచ్చిన విద్వాంసుడు' అని అనుకోవద్దు! నీ యిష్టం వచ్చినట్లుచేయి.[68]

అని యామునుడు జంకులేకుండా పలికి, మళ్లీ తన ఆసనంపై కూర్చుండి రాజు అనుమతితో వాదానికి ప్రారంభించాడు.[69]

## అన్యమత ఖండనం

విష్ణుచిత్తుడు ఆ వాదం చేసే వారిలో ఒక ప్రౌఢవాదికి అభిముఖుడై అతడు చెప్పిన యుక్తులన్నిటినీ తాను మళ్లీ అనువదించాడు. ఆ వాదాన్ని ఖండనచేయడానికి ప్రారంభించి ఆ యుక్తుంకన్నిటికి 'దూషణములు' తొందర పడకుండా, సభ్యులు ఒప్పుకొనేట్లు పలికాడు పక్కమాటల్ని లెక్కచేయకుండా ఒక్కొక్క మాటతోనే పరాజయహేతువును అనుగ్రహపూర్వకంగా ఉద్ఘాటించాడు.[70] పలువురు ఒకేసారి దొమ్మిగా వాదించడానికి పూనుకోగా కలతపడకుండా అందరినీ సమాధానపరిచి వారు ఊరుకొనేట్లు చేశాడు. ఇలా చేసి మళ్లీ - ఆ మొదట విద్వాంసునికే - శ్రుతి స్మృతి సూత్రసమూహానికి ఏకవాక్యత కల్పించి - తన మతం జగమెరిగేట్లు రాద్ధాంతం (సిద్ధాంతం) గా చేసి ఆ పండితుని ఓడించి, దయతో విడిచిపెట్టాడు.[71] అవతలివానివైపు తిరిగి 'నీవేమంటివి ? రమ్ము !' అని అతణ్ణి వాదంలో ఓడించి. ఒకరొకరుగ వాదానికి రాగా వాదక్రమంలో అందర్నీ విష్ణుచిత్తుడు గెలిచాడు.[72]

ఇలా ప్రతివాదుల్ని అందర్నీ గెలిచి యామునుడు విష్ణుదేవుడే పరతత్త్వం అని, విశిష్టాద్వైతమొక్కటే మతమని నిరూపించాడు [73]

ఆ సమయంలో ఎదురుగా ఉండే రావిచెట్టునుండి 'ఓహో ! ఇది నిజం ! రాజా ! నారాయణుడే పరమదైవతం, 'అతణ్ణే కొలువు' అని వినిపించింది [74]

రావిచెట్టు నుండి వినబడిన ఆ పలుకులు విని అక్కడి పాషండుల సమూహం ఖిన్నులై - అందరూ తలవంచుకొని వెళ్ళిపోయారు. పాండ్య రాజు యామునుని మాహాత్మ్యానికి సంతోషించి సాష్టాంగ నమస్కారం చేశాడు. అతని అంతరంగం హర్షాద్భుతాలతో ఉప్పొంగిపోయింది, అతనికి హరిపాదపద్మాలపై భక్తి పుట్టి ధన్యుడయ్యాడు. పాండ్యమండలానికి సోదరీపుత్రుడే పట్టాభద్రుడు - కాబట్టి బ్రహ్మచారి అయిన అతడు పాత్రుడని యామునునికి తన కడగొట్టు చెల్లెల్ని పరిణయంచేసి, అరణంగా ఆ మహాత్మునికి ధారాపూర్వకంగా అర్ధరాజ్యమిచ్చి యువరాజును చేశాడు. షడంగ వేదవేత్తయిన యామునాచార్యునికి అధర్వణశిఖ అభ్యస్తం అని, అధర్వణ

వేదంలో దివ్యాస్త్ర మంత్రాలు ఉండడం తెలుసు కాబట్టి - దుస్సాధమైన విరోధి సమూహాన్ని సాధించమని దండయాత్రకు పంపాడు ఆ యామునుడు సన్నద్ధుడయ్యే సమయానికి అతని పురోహితుడు, ప్రధాన మంత్రివర్గం - సన్నిహితమైన ఈ వర్షాకాలాన్ని గడిపి విజయంచేయమన్నారు. ఆ విష యాన్ని రాజుతో తెలిపి రాజు సమ్మతంతో యామునుడు మధురలో ఉన్నాడు.[75]

## వర్షాకాల వర్ణన

ఆ తీవ్రమైన ఎండల తర్వాత సూర్యుడు కర్కాటకరాశికి రావడం ఎలా ఉందంటే - సూర్యునికి ఆ గ్రీష్మకాలంలో 'కర్కశుడు' అనే నింద రాగా, అతడు దానికి కంటగించి వరుణునికి వచ్చిన 'చల్లనిదొర' అనే పేరు తాను కూడా తెచ్చుకోవాలనుకున్నాడు. ఎలాగయితే వరుణుడు నదులన్నీ సముద్రంలో పడటంవల్ల - సముద్ర రూపంలో జలం కూడబెట్టుకొన్నాడో - అలాగే సూర్యుడు తాను కూడా భూమిమీది నదులు, చెరువులు మొదలైన జలాశయాల నీటినంతా ఆవిరి రూపంగా ఆకాశంలో కూడగట్టుకొన్నాడు. దానితో తనివిచెందక - ఆ వరుణునితో ఇంకా పోటీకోసం - గంగకు వాహన మైన మకరం తనకు కూడా వాహనం అయినందువల్ల వరుణుడు గంగలో సుఖంగా ఉన్నట్లు - సూర్యుడు తాను కూడా గంగవద్ద మొసలిలాగానే జల జంతువైన కర్కాటకరాశిలో ప్రవేశించి సుఖంగా ఉన్నట్లుంది.[76]

కర్కాటకరాశిలో సూర్యుడు ప్రవేశించగానే వనాలు, వరాహాలు, దున్నలు, పాముల విరోధులు, ఏనుగులు, కప్పల బాధ తీరింది. వనాలు మొదలైనవాటి జన్మరాశి వృషభం, వృషభరాశికి మూడవరాశి అయిన కర్కాటకంలో ప్రవేశించిన సూర్యుడు భూమికి ప్రమోదకారి అవుతాడు గదా![77]

సూర్యకిరణాలు సముద్రునితో కలిసి గర్భందాల్చి ప్రసవానికి మళ్లీ సూర్యుని ఇంట్లో చేరాయి. ఆడపడుచులు ఘనతతో మెట్టినింట నుండి కాన్పుకోసం పుట్టినిల్లు చేరడం విదితమే గదా![78] (సముద్రోదకం సూర్యుని కిరణాల్తో (ఎండతో) ఆవిరియై ఎగసి ఆకాశంలో నిండి ఉండి వర్షం

కురుస్తుందని భావం)

భూమిపై మేఘపంక్తులు ఉమ్మనీరు స్రవించిన వెంటనే వాటి ద్విజత గుణంతో (ద్విజులు = రెండు జన్మలు కలిగిన పక్షులు - బ్రాహ్మణులు) మేఘపంక్తుల సుఖ ప్రసవానికి (అంటే వృష్టి కురవడానికి) కేకలు వేశాయి. ఆ కేకలు ఆరణ్యకధ్వనులలాగా ఉన్నాయి ఇది ఎలా ఉందంటే - ద్విజులు ఆరణ్యకం అనే వేద భాగాన్ని వినిపించి - గర్భవతుల సుఖ ప్రసవానికి తోడ్పడినట్లుంది.[79]

ప్రసిద్ధుడైన దేవేంద్రుడు సూర్యుడు అనే కొలిమిలో, ఆకాశమనే పెద్ద ఇనుప పెనంలో - నీరు కారిపోకుండా ఉండడం కోసం పిడుగు అనే ఉక్కుతో తయారుచేసిన అయస్కాంతపు తునియను పెనంలో పెట్టగానే భూమిమీద ఉన్న లోహపు రజను ఆకాశం అనే పెనంలోకి ఎగిరి వెళ్తున్నాయో అన్నట్లు - ఆకాశంలో 'గద్దంత' మేఘం ఏర్పడగానే - ఎండ కాలంలో దావాగ్నిలో కాలిన ఆకుల మసులు పైకిలేచాయి. కొదమ మేఘాలు అనే గున్న ఏనుగులు ఆకాశం నుండి నేలకు దిగి, చుట్టి చుట్టి, దుమ్మెత్తుకొని ఎగిసిపోయి - తమల్ని ముంచేటటువంటి సుడిగాలి అనే తుండాగ్రాలతో - స్వర్గలోక గజమైన ఐరావతం నుండి ఆకాశగంగలో శిక్షణ పొందినట్లుగా - నీరు బయటికి ఉమిశాయి.[81]

స్తన్యపానం మానిన శిశువులకు క్రమక్రమంగా పాలపండ్లు రాలినట్లు, నీరుతాగిన మేఘం పిల్లలకు క్రమంగా 'వడగండ్లు' అనే పాలపండ్లు రాలాయి. తర్వాత ఆ శిశువులకు మళ్లీ పండ్లు మొలిచినట్లు ఈ కొత్త మబ్బులకు బెగ్గురు కొంగలనే పండ్ల వరుసలు కూడుకొన్నాయి ఆ శిశువులకు వయస్సు పెరిగినకొద్దీ నోరు ఎక్కువైనట్లు ఆ మబ్బులకు ఆకారం పెరిగినకొద్దీ ఉరుము బిగ్గర అయింది.[82]

భూమియొక్క జలాల్ని సూర్యకిరణాలు దొంగిలించాయి. అప్పుడు భూమి సుడిగాలికి లేచిన ధూళి రూపంలో మింటికిపోయి దొంగతనం విషయం దేవేంద్రునికి చెప్పుకొంది. ఇంద్రుడు దొంగను సంహరించి భూమికి ఆ నీటిని తెచ్చి ఇవ్వడానికి ధనుస్సు (ఇంద్ర ధనుస్సు) ధరించి

వచ్చారు ఈ విషయం తెలిసిన సూర్యకిరణాలు తమ ప్రాణం రక్షించుకోడానికి మబ్బుల్లో దాగి - నీరు ధారలు ధారలుగా భూమి మీదికి కుమ్మరించాయి. ఇంతలో మెరుపు అనే దీపం వెలిగించగా కిరణాలు దాగాయి. నీటి వెల్లువ మాత్రం మిగిలింది [83]

మేఘాల నుండి తొలి తొలి వర్షధారలు నేలకు దిగగానే, నేల నుండి నల్లని ఆవిరి ఎదురులేచి ఆ వర్షధారల అడుగు భాగాలకు తీగలు చుట్టకొన్నట్లు అలముకొనసాగాయి. ఆ దృశ్యం ఎలా ఉందంటే -

ప్రళయకాలంలో పుష్కరాలు, ఆవర్తకాలు అనే మేఘాలు అన్ని చోట్లా సంచరిస్తూ మహావర్షంతో లోకాన్ని ఏకార్ణవంగా చేస్తాయి. మిగతా సమయాల్లో అలా చేయకుండా ఉండడానికి గాను దేవేంద్రుడు పుష్కరావర్త మేఘాల పాదాలకు సంకెళ్లు వేసి ఉంచుతాడు. అలాగే ఇప్పుడు కూడా ఇంద్రుడు మేఘాల తొలి తొలి ధారల జలవిస్తారం చూసి, వీటిని ఉపేక్షిస్తే ఇవి కూడా పుష్కరావర్తకాల లాగానే జలప్రళయం సృష్టిస్తాయని భయపడి, ఈ మేఘాల 'వానకాళ్లనే' కాళ్లకు - పూర్వం ఆ ప్రళయ మేఘాల కాళ్లకు సంకెలు వేసినట్లు - ఇనుప సంకెలు వేసినట్లుంది.[84]

వర్షాకాలం రాకముందు లేని ఉరుములు, వర్షాకాలంలో ధ్వనిస్తుండడం ఎలా ఉందంటే - సూర్యచంద్రుల రథాలు పూర్వం ఆకాశంలో ఎక్కడా దారికి ఏమీ అడ్డంగా తగలనందువల్ల నిశ్శబ్దంగా వెళ్తుండేవి. ఇప్పుడు ఆ చోటుల్లోనే మేఘ సమూహాలు అడ్డుపడుతూ ఉన్నందువల్ల - వాటిని చీల్చుకొని ఆ రథాలు దాటుతూ ఉండడంవల్ల పుట్టిన మ్రోతలేమో అన్నట్లు - ఉరుములు భయంకరంగా, మెండుగా రేయింబవళ్ళు వినబడుతున్నాయి.[85]

ఆ వర్షాకాలంలో వర్షిస్తున్న మేఘాల కడు దట్టమైన ఉదర మండలాల నుండి ధ్వనిస్తున్న ఉరుములు ఎలాంటివిగా ఉన్నాయంటే - ఆ మేఘాలు చాలా దినాల నుండి ప్రతిదినం తాగుతూ వచ్చిన సముద్రపు నీటిలో తీయని నీరు, ఉప్పు రెండూ ఉన్నాయి. వింటెలో ఇందువుగిం

గంధం కలిపితే మందునీటిలోని మంచినీరు పైకి తేరి మందు కిందికి దిగినట్లు - దినదినమూ తీయని నీరు పైకి తేరింది - అదే వాన నీరు. దినదినమూ అడుగుకు దిగిన ఉప్పు - మొన్నటిదానితో నిన్నటిది నిన్నటిదానితో నేటిది - ఇలా పేరుకొని చిట్టెం కట్టినట్లు ఉంది. మేఘాల కడుపులోని ఆ ఉప్పు చిట్టెములకు - మేఘజ్యోతులనే దావాగ్నులు అంటుకోగా, ఆ ఉప్పు చిట్టెములు కాలి పగిలేటప్పుడు పుట్టిన మోతలేమో అన్నట్లు - మెరుపుల్తో కూడిన ఉరుములు కలిగాయి.[86]

ఆ సమయంలో దిక్తటాల్లో మేఘాలు లేవడం. మేఘంలో నడుమ నడుమ సందులు పడి ఆ సందుల నుండి మెరుపులు చలిస్తూ మెరవడం. ధారలు కురవడం చూడడానికి ఎలా ఉంటుందంటే - సూర్యకిరణాలు తాము కూడా వేసవి వేడికి దప్పికొన్నవై సముద్రంలో దిగి - నీరు కొంచెంగా తాగుతూనే - తమ 'వేడి' అనే నిప్పు సోకి - సముద్రపు నీటి నుండి పొగలేచి వీటిని కమ్ముకోగా - వీటి కన్నులు మంటపెట్టసాగాయి. ఆ కంటి మంటకు సూర్యకిరణాలు నిలువలేక తప్పించుకోడానికి పైకెగసినవై - తర్వాత ఆ పొగ మొత్తాలు గాలి ఊపులతో సందులు పడగా - ఆ సందులలో ఆ సూర్యకిరణాలు కంటిమంటతో వణుకుతూ, కన్నీరు విడుస్తూ కనిపిస్తున్నాయేమో అన్నట్లున్నాయి.[87]

భూమియొక్క జలరూపమైన సొత్తును సూర్యబింబం తాగివేయగా - లోకంలో ఒక రాజుకు వైరి ఎవడో అతని వైరి మొదటివానికి మిత్రుడైనట్లు - రాహువు వైరి అయిన సూర్యబింబానికి వైరి అయిన భూమి తనకు మిత్రురాలు అవుతుంది కాబట్టి రాహువు భూమిమీద దయ వహించాడు ఆ భూమికి శత్రువైన సూర్యబింబాన్ని కబళించి, పిప్పిగా పీల్చి, ఆ సూర్యబింబం ముందు తాగి ఉండే ఆ జలాన్ని మళ్ళీ తాను ఒక్కసారిగా గ్రుమ్మరించడానికి ఎంత పెద్ద ఆకారం దాల్చితే సరిపోతుందో - అంత పెద్ద ఆకారాన్ని దాల్చాడా అన్నట్లు - ఆకాశంలో నల్లమబ్బులు వ్యాపించాయి సూర్యబింబం మరుగుపడుతున్నది. మహావర్షం కురియడానికి సిద్ధంగా ఉంది.[88]

అప్పుడు పుట్టనుండి ఇంద్రధనుస్సు లేవడం, దాని కింద ఆకాశం నలువైపులా 'వానకాళ్లు' గాలి త్రోపుడుతో దట్టం అవుతూ - చీకట్లు కమ్ముతూ, కంపిస్తూ నడుస్తూ ఉండడం ఎలా ఉందంటే - పెద్ద పలువన్నెకట్ల జెఱ్ఱి ఒకటి పుట్టలో నుండి వెలువడి ఆకాశం అనే గోడమీద ప్రాకుతున్న దేమో అన్నట్లు - కిందదాని కాళ్లగుంపు క్రిక్కిరిసి ఉంటూ చీకట్లు కమ్ముతూ చలిస్తూ నడుస్తూ ఉందేమో అన్నట్లుంది.[89]

వానకోయిలలు (చాతక పక్షులు) చినుకులకోసం మేఘం వద్ద మూగడం, వడగండ్లు ముందు వర్షధారలు వెనుకగా రాలడం ఎలా ఉందంటే - 'మేఘుడు' ఈ చాతకాలు నన్ను దట్టంగా చుట్టుకొని సస్యవంతం అయిన భూమి మీదికి ఒక చినుకును గూడా దిగనీవడంలేదు' అని వాటి మీద కోపగించి - వానకిందికి దిగేట్లు చాతకాల్ని ఎడమెడంగా తరమడానికి, నోటి గాలితో గొట్టంగుళికలు (నాళపుటుండలు) ఊదగా, ఆ గొట్టాల నుండి ఆ గుళికలు రాలినట్లు వడగండ్లు కనిపించాయి.[90]

'ఎలగోలు జల్లు' మొదట పెళపెళ పటవాలుగా పడి గాలివల్ల పట్టడ్లను తడిపివెళ్ళింది. వెంటనే రెండవది వడగండ్లతో కూడా వచ్చి వడగండ్ల చలువ, భూమి వేడి కలిసి పుట్టిన ఆవిరితో కూడిన ఎట్ట దూళిని రేపిపోయింది. అంటే మట్టివాసనతో లేచే ఆవిరిని రేపింది. మూడవ జల్లు మొదటి రెంటిలా గాక నిలిచి మెరుపులు మెరుస్తూ, మిక్కిలి గర్జించి, తువ్వరమై విశ్వమంతా చీకట్లు కమ్మినట్లు కమ్మింది.

పిమ్మట కిందిజల్లు విరివిగా, దానికన్నా పై జల్లు కొంత తక్కువ విరివిగా, అంతకన్నా పై జల్లు మరికొంత తక్కువ విరివిగా ఉండి ఉయ్యాల తాళ్లు ఏ విధంగా పైన ఒక ముడిగా కలిసి ఉండి కిందికి వచ్చేకొద్దీ విశాలత హెచ్చినట్లు ఉంటూ, ఇటునుండి అటు అటునుండి ఇటు ఉయ్యాల ఎలా ఊగుతుందో అలా ఆ జల్లుల దొంతర దిగి అన్నీ ఒకదానితో ఒకటి పెనగొని మల్పు మొదలుకొని ఒకటే జల్లయ్యాయి.

తర్వాత, నేలను బ్రద్దలుచేసే నీటి మొత్తపు భారం యొక్క వేగంతోను, గాలి విసురుతోను, పెక్కు పెక్కు ధారలు కూడి ఒక్కొక్క

మహాస్థూల ధారగా పోతూ, అలాంటి స్థూలధారలు నీటి కడవ వంచినట్లు 'హోరు' మనే ధ్వనితో పడుతూ, తాము కూడా సందులేనట్లుగా క్రిక్కిరిస్తూ, ఆకాశానికి నేలకు నడుమ ఎడమే పోయి మిన్నూ మన్నూ ఏకం అయ్యేట్లు వర్షం వ్యాపించింది.[91]

దేవేంద్రుడు నెమళ్లు అనే పాత్రలను గుంపుగా నాట్యం ఆడించేటపుడు మేఘమండలం అనే మద్దెలను నాట్యానుసారంగా కిందికి మీదికి దించుతూ ఎత్తుతూ ఉండగా, ఆ మేఘమండలంతో కూడా కిందికి వచ్చినపుడు భూమికి దగ్గరగా ఉండి, అది పైకి పోయినపుడు భూమికి దూరంగా ఉండి, మేఘమండలంనుండే కారుతుండే వర్షధారలు, వాటి చివరన ఉండే ఆరుద్ర పురుగులు - మృదంగం కిందికి వచ్చినా - పైకి పోయినా మృదంగం నుండి వ్రేలాడుతుండే తెల్లజాలరులు, వాటి చివర ఉండే ఎర్ర కుచ్చులుగా ఒప్పుతూ ఉన్నాయి[92]

ఓహోరిసాహోరిగా (తండోపతండాలుగా) మొదట కురుస్తూ ఉండే ధారల్ని గాలికొట్టి ఏటవాలుగా ఊద్చడం వల్ల మేఘం సంచరిస్తూ ఉన్న రథమేమో అన్నట్లుంది. ఇట్టలు కాని అసలు వర్షానికి కలగబడడం ఆ రథం ఉద్వే తొక్కుడుకు భయపడడమేమో అన్నట్లుంది వర్ష ప్రతిబంధకం వల్ల జనులు ఊళ్ళకు పోక నిలిచిపోవడం-మొదటనే మెరుపు అనే ధ్వజం ఎక్కించినందువల్ల - ఆ ఉత్సవం ముగిసేవరకు పోకూడదనందువల్ల నేమో అన్నట్లు ఒప్పుతూ ఉంది[93]

పూర్వం వసంత ఋతువులో సంపెంగలు పూయగా వాటిని ధరించి, అవి శాశ్వతం అని నమ్ముకొని మొగలిపూలను తిరస్కారంతో దూరంగా పారవేసినవారు - ఇప్పుడు సంపెంగలు లేనందువల్ల తెలివితెచ్చుకొని, ఇప్పటి ఆ మొగలిపూలనే కోరడం చూసి మొగలి వనాల సమూహాలు వారిని చూచి నవ్వుతున్నట్లు కంచెలలో అన్ని చోట్లా గేదంగులలో పూలు వికసిస్తూ ఉన్నాయి.[94]

ఆ సమయంలో మొగలి పొదల్లో బంగారువన్నె పూలు దండిగా పూచాయి. వాటి రేకులు ఎలా ఉన్నాయంటే - వర్షాకాలం మెరుపులు -

నందనవనం తోడిది అయిన ఆకాశంలో చాలా కాలం ఉండి - ఆ నందనోద్యాన దివ్యపుష్పాల పరిమళాలను సంగ్రహించుకొని - తమకు ఆధారాలైన మేఘాలు వర్షించడానికి నేలకు ఈ మొగలి డొంకలవద్ద దిగినప్పుడు-వాటితో పాటు తాము కూడా వచ్చి - ఇక్కడ తమ అపూర్వ దివ్య పుష్ప సౌరభానికి ఆశపడిన మొగలి నాగుపాములు అదవి తమను చుట్టుకోగా, తిరిగి పోవడానికి శక్తి లేక, ఇక్కడే నిలిచిపోయాయో అన్నట్లున్నవి [95]

ఆ వర్ష ఋతువులో మేఘంలో మువ్వన్నె ఇంద్రధనుస్సు ఒప్పారడం, వాటితో కూడా వడగండ్లు రాలడం ఎలా ఉందంటే - గ్రీష్మ ఋతువులో నాటిన చెరకు ఇపుడు ఆకుల పచ్చరంగు, కణుపుల్లో కమ్ముకొని ఉండే బూడిద తెలుపు రంగు, చెరకు గడ పై భాగపు ఎరుపు అనే మూడు రంగులతో పెద్ద గడగా ఎదగగా - అది తన విల్లు కాబట్టి మన్మథుడు దానితో ఒక్కసారిగా లోకాన్నంతా గురిపెట్టడానికి దాన్ని తీసుకొని పిడికిట బిగువుగా పట్టుకోగా - ఆ బిగువువల్ల దాని నుండి ముత్యాలు రాలుతూ ఉన్నవి తెలియనివారు ఆ మువ్వన్నె వింటిని ఇంద్రునిదంటారు. అలా ఇంద్రునిదైతే పుట్ట నుండి ఎందుకు వస్తుంది? వడగండ్ల తత్త్వం వారికి తెలియదు. అవి మన్మథుని చెరకు వింటిలోని ముత్యాలు అనడానికి తగి ఉన్నాయి.[96]

ఈ సూర్యుడు సముద్రం నుండి చాలా నీరు తాగి ఉన్నాడు. దానితో ఇప్పటికి మితంగా మేఘ రూపంలో పరిణమించిన నీరే పంటలకు సరిపోతుంది. ఇంకా మేఘాలు ఎక్కువై కురిస్తే అతివృష్టి అయి భూమికి చేటు కలుగుతుంది - అని ఊహించినవాడై బ్రహ్మదేవుడు మిగిలిన జలం సూర్యుని నుండి వెడలకుండా ఉండడానికోసం - అతని చుట్టూ కట్టిన ఆనకట్టేమో అన్నట్లు ఆకాశంలో సూర్యుని చుట్టూ అన్ని వైపులా గాలిగుడి (సూర్యగుడి) కట్టింది.[97]

అప్పుడు గగన రంగస్థలంలో మిక్కిలి ప్రౌఢిమతో మేఘతతి అనే కాళికాదేవి ఎక్కువ కౌతుకంతో చీకట్లు కమ్ముతూ చరించడం అనే నీల వస్త్రధారణ పూర్వక నాట్యం (నీలికోలం) చేయగా - ఆమె వదనం

నుండి రాలే నిప్పుకలేమో అన్నట్లు భూమిమీద గుంపులుగా ఆరుద్ర పురుగులు రాలాయి.[98]

ప్రతి అమావాస్యనాడు చంద్రుడు సూర్యునియందు ప్రవేశిస్తాడు. సూర్యకిరణాలు ఆ సమయంలో చంద్రుని అమృతం తాగి, తర్వాత మేఘాలుగా పరిణమించి, వర్షాకాలం వచ్చినపుడు వానతోపాటు ఆ అమృత బిందువుల్ని కూడా ఉమ్ముతున్నాయేమో అన్నట్లు వడగండ్లు అనవరతం రాలుతున్నాయి.[99]

మొదట తుప్పలమీద ప్రకాశంతో ఒప్పారి నీటిస్రావంచేత ఏ దినానికాదినం కరుగుతూ పుట్టుతూ ఉండే ఇంద్రధనస్సుం బహు దినాల వసరంతా వెల్లిలో తెట్టువ కట్టిందేమో అన్నట్లు పచ్చిక తెట్టెలు కట్టింది. అలాగే ఇంద్రధనుస్సుం కరిగిన ఎరుపు అంతా ఆ వెల్లువలో ఎర్ర మరుగులు అయిందేమోనన్నట్లు పచ్చిక తెట్టెల్లో ఆరుద్ర పురుగులు దర్శనీయాలై ఒప్పుతున్నాయి.[100]

వర్షాకాలంలో నదులు ఉధృతమై సముద్రాన్ని ఎలా ప్రవేశించాయంటే - మేఘం పెళ పెళ అని కఠోరంగా ఉరిమింది. భూదేవి భయంతో బెదిరి వైడూర్యమణి మొలకలనే పులకలు దేహంలో కల్గై - సాగరంపై నిద్రించే తనప్రాణేశ్వరుడైన శ్రీహరిని తటాలున కౌగలించుకోడానికి చాచిన చేతులేమో అన్నట్లు-గంధపు పూతలాగా చిక్కని వండు నీరొప్పగా-ఆ గంధపు పూతలో కనిపించే పులకరింతలాగా-ఆ వండు నీటి మీద పచ్చిక తేలుతూ ఉండగా-పసిడి గాజుల మోతలాగా 'కంకణాయిలు' అనే జలపక్షుల రొదమించగా-నదులు సముద్రంలో వేగంగా ప్రవేశించాయి.[101]

వర్షాకాలంలో కోకిల పంచమ స్వరం లేకుండా పోయింది-ప్రోషిత భర్తృకలకు మేఘధ్వనులు అప్రియాలయ్యాయి నదులను సముద్రునితో కూర్చే చెలికత్తెలాగా షడ్జ స్వరం పలికే నెమలి మాత్రమే వర్షాకాలంలో హితమైనది అయుంది. నదులు గ్రీష్మ ఋతుప్రభావం వల్ల కృశించి భర్త అయిన సముద్రుని చేరలేనందు వల్ల ప్రోషితభర్తృకలయ్యాయి. ఆ నదులను భర్తతో చేర్చడానికి-దూతికల లాగా ఉపయోగ పడడానికి ఇతర నదులు లేవు. అందు

వల్ల నెమలి కూతలే దాదిలాగా-ప్రోషిత భర్తృకలైన నదుల్ని ఉద్దీపితం చేసి-వాటి భర్త అయిన సముద్రున్తో కూడేట్లు చేశాయి.[102]

మహాకాయం అయిన నల్లని మేఘం అమృతంలాంటి చంద్రుణ్ణి కబళించడం-మహాకాయుడైన రాహువు అనే నల్లని రాక్షసుడు - మోహిని రూపంలో ఉన్న శ్రీహరికి సైగ చేసి చంద్రుడు తెలిపిన అమృతాన్ని పానం చేయడం లాగా ఉంది. ఆ మేఘంలోని ఇంద్ర ధనుస్సు శ్రీహరి చక్రాయుధంతో ఆ రాహువు కంఠం తెగవేయగా అయిన గంటిలాగా ఉంది. ఆకాశంలో ఆ దగ్గర్లో ఉన్న సూర్యుని ప్రతిబింబం రాహుకంఠాన్ని శ్రీహరి తెగవేసిన ఆయుధం ఆయన సుదర్శన చక్రమేమో అన్నట్లు ఒప్పారింది.[103]

వర్షాకాలంలో-మేఘుడు లవణ సముద్రాన్ని తాగినందువల్ల పిడుగుల తీక్షణత తెచ్చింది. ఇక్షు సముద్రాన్ని తాగినందువల్ల నీటి మాధుర్యం వెల్లివిరిసింది సుధా సముద్రాన్ని తాగినందువల్ల నెమళ్ల మదం హెచ్చింది. నేయి సముద్రాన్ని తాగినందువల్ల మెరపుటగ్గుల దీప్తి హెచ్చింది. దధి సముద్రాన్ని తాగినందువల్ల వడగండ్ల సంభవం కలిగింది. క్షీర సముద్రాన్ని తాగినందువల్ల కొంగల అభివృద్ధి జరిగింది శుద్ధోదక సముద్రాన్ని త్రాగినందువల్ల స్వచ్ఛోదక వర్షం కురిసింది-సప్తసాగరాల్ని సముద్రుకు తాగినందువల్ల ఈ లక్షణాలు కలిగాయని ఊహించడానికి అనుగుణంగా ఉంది[104]

నీల మేఘుడనే వామన మూర్తి మెరుపనే పచ్చ మెరుగు గోచి ధరించాడు-ఇంద్ర ధనుస్సు అనే ప్రకాశవంతమైన మోదుగుకోలచేతపూనాడు. పుట్టగొడుగు అనే గొడుగు ధరించాడు. నెమలి పురులనే పుస్తకపత్రాల్ని విప్పి, ఉరుము అనే పఠన ధ్వని మించగా. రేగిన పెనుధూళి అనే గర్వించిన రజోగుణాతిశయం కలిగిన బలి చక్రవర్తిని అణచి, ఎత్తుగా ఆకాశంలో విజృంభించడం ఊర్ధ్వంగా ఆకాశంపైకి పెరిగినట్లుంది. గాలి కుదిలించడం చేత వానకాళ్ల రాలుస్తున్న నీటి వెల్లి అనే దేవతా దత్తమైన పాద్యజల ప్రవాహాన్ని వామన మూర్తి పొందాడు.[105]

పాములు పెనువానను తమ పుట్టల్లో చొరనీకుండా-పుట్టరంధ్రాల్ని మూయడానికి ఎత్తిన గొడుగులేమో అన్నట్లు-భూమి అంతటా పుట్టగొడుగులు మొలిచాయి.[106]

పురోంగారక యోగంవల్ల అనావృష్టి కలుగుతుంది. అది మేఘునికి చేటు. అలా చేటు కలిగేట్లు అంగారకుడు మాటిమాటికి పురోంగారక యోగంగా చరించడం చూసి మేఘుడు రోషంతో ఆ గ్రహాన్ని నలుగుతుండంగా నేలకు పడద్రోశాడు. గ్రహం మాత్రం మిగిలి దాని శకలాలు చిన్న గుంపులు. పెద్ద గుంపులుగా నేలగూలినట్లు ఆరుద్ర పురుగుల గుంపులు భూమిపై రాలాయి.[107]

మేఘుడు కప్పల శత్రువులైన పాముల్ని మెరుపు మెరిసి పుట్టలో దూర్చినందుకు కృతజ్ఞతతో కప్పలు గుంపై మేఘుని స్తుతించడానికి సంఘమై రెండు బృందాలుగా ఏర్పడి, ఒక బృందం కొంత స్తుతి మరొక బృందం కొంత స్తుతి పలుకుతూ స్తుతించినట్లుగా కప్పల ధ్వని వేరు వేరు ఛందో వృత్తాల్ని అనుకరిస్తూ వినిపించింది. (ఆ సమయంలో ఎదురెదురు బృందాలుగా కప్పలు అరవడం ఎలా ఉందంటే - దుష్ట సంహారకుడైన రాజును సాధుజనులైన రెండు బృందాలు స్వాగతిస్తూ వేదానువాకాలను చిన్న చిన్న భాగాలుగా ఒక బృందం ఒక భాగం పలికినట్లు, వెంటనే మరో బృందం మరో భాగం పలుకుతూ స్తుతించినట్లు భాసిల్లింది.)[108]

మేఘుడు తన శరీరపు నలుపు అనే చీకటితో పగలును రాత్రిగా మార్చాడు. అతిశయించే తన మేని జిగి మెరుపులతో రాత్రిని పగలుగా చేశాడు. సకలాన్ని నిద్రపుచ్చే కేశవున్నే నిద్రపుచ్చగలిగే ఘనుడైన మేఘునికి ఇదేమద్భుతం? (వర్షర్తువులో శ్రీహరి నిద్రిస్తాడు - అంటే మేఘుడు శ్రీహరిని నిద్రపుచ్చుతాడు అని అన్వయం)[109]

భూమిలో ధూళి ఎగసిపోవడం - అనంతరం మేఘంలో మెరుపు మెరవడం ఎలా ఉందంటే - దేవేంద్రుడు ఆకాశలక్ష్మికి నగలు చేయించడానికి భూమిలోని మంటిని ఎత్తి, మేఘం అనే దొన్నెలో పెట్టుకొని, ఆకాశగంగలో కడగగా, దానిలోని బంగారు రేణువులు ఒక్కచోట కూడుకొని రేఖగా మెరుస్తూ కనిపించినట్లుగా ఉంది.[110]

పెద్దవై పరిపక్వమైన అడవి మేడివండ్ల పై రంధ్రాల్లో - వాన నీరు ప్రవేశించగా దోమల వరుసలు - కార్చిచ్చుల పొగలు అణగగానే

విశ్రాంతికోసం రచ్చ వేయను వెలువడ్డాయేమో అన్నట్లు వెలువడ్డాయి.[111]

మేఘం ఆకాశాన్ని ఆవరిస్తూ, నెమళ్లు పురి విప్పి ఆడుతూ ఉండే సమయంలో - కొండలలో మొగిలి పూలు, కొండమల్లెల పుప్పొడి, గరిక యొక్క పచ్చరంగు పట్టపగలే చూస్తుండగానే వర్షం కురిసేటప్పుడు అదృశ్యం కావడం, వర్షం కురవనప్పుడు కనిపించడం ఎలా ఉందంటే భాద్రపద మేఘం ఇంద్రజాలికుడులాగా, పురులు విప్పిన నెమళ్ల పించాలు ఇంద్రజాలికుడు ఆడించే నెమలి కుంచెలా పుప్పొడి, గరికరంగు దృశ్యా దృశ్యం కావడం - ఇంద్రజాలికుడు వాటిని పుట్టించి మాయం చేయడం లాగా ఒప్పుతూ ఉంది.[112] (భస్మం, గరిక, నెమలికుంచె ఇంద్రజాల పరికరాలు.)

కొండ దరుల్లోని నేరేడుచెట్ల పండ్లు (జంబూ ఫలాలు) రాలగా, వాటి రసంచేత జంబూనదులు పుట్టాయి. కాబట్టి మేఘాలు ఆ గిరుల్ని కమ్ముకోగా, ఆ మేఘాలకు జంబూఫలాల రసం అంటుకొన్న ప్రదేశాలు మెరుపులు అనే నెపంతో బంగారం అయ్యాయి.[113]

వర్ష ఋతువులో మన్మథునికి విరహుల్ని హింసించడానికి వసంత ఋతువులో ఉండే విరజాజి, అశోకం, కమలం, కలువ, మామిడి పుష్పాలు అనే పంచ బాణాలు లేకపోయాయి. అయినా మన్మథునికి జయకారకాలుగా కామోద్దీపం కలిగించే కడిమి, కొండమల్లె, ధారా కదంబం, మద్ది, అడవి మొల్లల పువ్వులు పంచబాణాలుగా లభించడమే గాక, అదనంగా బంగారు మొగలి కటారి కూడా అందింది. ఆ విధంగా విరహులకు వసంత ఋతువుకంటె వర్ష ఋతువే దుస్సహం అయింది.[114]

కొండలనే రాజులయొక్క చరియలనే నాట్యశాలల్లో వర్తిస్తున్న నెమళ్లు అనే పాత్రలకు తెరలేమో అన్నట్లు కొండ చరియల్లో మేఘాలు కమ్ముకొన్నాయి. గిరితటాల్లో మేఘాలు ఉరుమే చిటపొట శబ్దం తాళం వేసే శబ్దమేమో (చప్పుడేమో) అన్నట్లు ఒప్పింది.[115]

పుల్లని ఆహారం ఉప్పుతో కలిపితే రుచిస్తుందని మేఘం మొదట లవణ సముద్రాన్ని తాగి, తర్వాత దధి సముద్రాన్ని తాగింది. దధి

సముద్రం ప్రాచిడ కాట్టి పలు పెక్కువై మేఘుడు పెద్దవైన పులుసు కరుళ్లను వాంతిచేసుకోగా అవే వడగండ్లై భూమిమీద రాలాయి. అలా కాకపోతే వడగండ్లను నోట్లో వేసుకోగానే చలిపండ్లు ఎందుకు పడతాయి?[116]

ఆ వర్షాల్లో మృగాలు కొండలకింది బురదనేలలకు దిగకుండా మేఘాల పంక్తి కప్పిన కొండలమీదనే - దొడ్డిలో నిలిపి ఉంచిన జంతువుల సమూహంలాగా ఒప్పాయి. పైన కొండలమీద మేఘపంక్తి పొదువుకొని ఉంది. ఈ దృశ్యం ఎలా ఉందంటే - మీద విల్లు ధరించి వేటాడడానికి సిద్ధంగా ఉన్న ఇంద్రుడనే రాజుకు తెరవేటకోసం చేసిన సన్నద్ధంలాగా ఒప్పింది.[117]

వాన నీరు మొదట పక్షుల తలల్ని తడిపి, తర్వాత తలమీదుగా ఒళ్ళంతా తడిపింది. అందువల్ల పక్షులకు ఒళ్ళు కొయ్యబారింది. ఆ వాన నీరే తలమీదుగా కన్నుల్లో జారబడగా - దానిని కనురెప్పల చివరల్తో పుల్పోసినాయి. అదే నీరు ముక్కురలాగా ముక్కులవద్దకు స్రవించగా - కొంత జలాన్ని నోటితో స్వీకరించి, కొంత జలాన్ని గూటికగ్రకు ఒత్తుతూ - రెక్క విదిలించడం కూడా లేకుండా - వణకడం తప్ప మరేచేష్ట లేకుండా - ఒళ్ళంతా ముడుచుకొని - చలితీరడానికిగాను మోకాళ్లను రొమ్ముల్లో దూర్చుకొని - పక్షులు ముడుక్కున్నాయి.[118]

సంధ్యవేళలో వర్షం కురుస్తూ ఉండగా - ఎరుపు చెందిన సంధ్య అనే కుంకుమపువ్వుచేత - ఎర్రనైన ఆకాశానికి కాశ్మీరదేశత్వం సిద్ధించింది. సూర్యుడు - కాశ్మీరదేశంలో పుట్టిందని ప్రసిద్ధిపొందిన చంద్రకాంత శిలాత్వాన్ని పొందాడు. అలాకాకుంటే - సంధ్యా సూర్యుడు నీళ్లను వర్షించడానికి కారణమేమి? అని ప్రజలు తలచేట్లు విరాజిల్లింది.[119]

పగలు సముద్రుని నీటివల్ల - సూర్యకిరణాలు గర్భం దాల్చాయి. అది చూసి ఈర్ష్యతో - భూమిని సముద్రోదకంతో ముంచుతున్న మేఘాల ద్వారా - రాత్రివేళల చంద్రకిరణాలు గర్భం దాల్చాయి. ఆ మేఘాల్లోని జలాన్ని తాగడానికో అన్నట్లు - మేఘాల్ని కమ్ముకొని కొంగలు క్రీడించి - చూలు దాల్చాయి.[120]

అలకాపురికి ఆకాశంలో వడివడిగా పరుగెత్తుతూ ఉన్న హంసల సమూహాలు - తినడానికి నోటితో కరుచుకొని పోతూ - ఉరుము ధ్వని విని భయపడి తినకుండా కిందికి వదిలిన తామరకాడల తునకల ముత్యాలేమో అన్నట్లు - వడగండ్లు తెల్లని కాంతుల్తో రాలాయి.[121]

నెమళ్లకు ఆహారాలైన పాములు మెరపులకు భయపడి - బొరియల్లో దూరినందువల్ల - నెమళ్లకు ఆహారం లేకుండా పోయింది. అలా విరవ్వాలైనా - నెమళ్లు నటనం మానలేదు. అతి సంతోష కారణం కలిగినప్పుడు ఆకలి, దప్పి ఉండవు గదా ! కారణం మేఘోదయం, ఉరుములు, మెరుపులు నెమళ్లకు అతి సంతోష కారణాలు కాబట్టి ![122]

ఆ వర్షాకాలంలో సూర్యుని దర్శించనిదే భోంచేయని వ్రతంగల వారికి, తొండలకు - దృష్టి ఆకాశంలోనే నిలిచి ఉంది. సంధ్యకాలంలో సూర్యునికి అర్ఘ్యం ఇవ్వడం బ్రాహ్మణులకు ప్రధానం కాబట్టి వారికి - సంజవేళ దూడలకు పాలివ్వడానికి తిరిగి వచ్చే పాడి ఆవులకు - సూర్యుడు మేఘాల్లో అగుపడనందువల్ల భ్రాంతి కలిగింది. రైతులకు అదునులో విత్తనాలు చల్లడాలు - కొంగలకు గర్భదానాలు లభించాయి. విలపిల్లుతున్న అడవి మొల్లలకు 'విచ్చు మొగ్గలు' పుట్టాయి. సంతల కూటాలకు వానల వల్ల చెల్లాచెదరై పోవడం (విచ్చు మొగ్గలు) సంభవించింది.

అతిథి సంఘానికి వర్షంలో గృహస్థుల ఇండ్లకు పోలేనందువల్ల వస్తులు సంభవించాయి. ఈనిన గేదెల మందలోని లేగదూడల సమూహానికి వాకట్టులు సంభవించాయి. గేదెల లేతదూడలు చలికి దౌడలు, నాలుక కొయ్యబారినందువల్ల పాలు తాగలేక వస్తున్నాయి. మట్టమిద్దెలవారికి, కాంతావియోగులైన పురుషులకు నిద్ర చెడింది[123]

ఆ మహావృష్టివల్ల పల్లపు నేలలు మాత్రమే గాక మెరక బీళ్లు కూడా మెత్తబడినందువల్ల దుక్కికి అలవి అయింది. అందువల్ల నెరవేరిన అపరిమితమైన దుక్కి ఎలా ఉందంటే - యముని దున్న తాను శివుని నంది అయి ఉంటే - పేద్యగాండ్రు తనను తోలుకొనిపోయి నాగలికి కట్టి బారు గంటలు దున్నించేవారు. నందిని కానందువల్ల - ఆ కష్టం తనకు తప్పిందని సంతోషించింది. అలాగే శివుని నంది తాను కాలుని దున్న అయి ఉంటే -

తనను సేద్యగాండ్రు తోలుకొని వెళ్ళి తనచేత బురద దుక్కి దున్నించి ఉంటారు - అలా కావడంవల్ల తనకా కష్టం తప్పిపోయిందని సంతోష పడిందట. అలా శివుని నంది, కాలువ దున్న సంతోషించేట్లు - భూమిలో ఉండే పశువులన్నింటినీ తోలుకొని వచ్చి సేద్యగాండ్రు నాగటికి కట్టి, ఎన్నటికీ తెగని బొరుగడ్డ దుబ్బుల మెట్ట పొలాల్ని దున్నడానికి - పశువు లన్నిటితోపాటు నందిని, జొన్నమళ్లు దున్నడానికి కాలువ దున్నను కూడా పట్టుకొచ్చి దుక్కిచేశారు - అన్నట్లు ఒప్పింది.[124]

హాలికులు పొలాల గనిమ వెంబడి రొంపిని తొక్కగా - నీరుకట్టె పాములు వారి కాళ్లకు - పసిడిచాయ కడుపుల్తో చుట్టుకొన్నాయి. ఇది ఎలా ఉందంటే - దున్నడంలో తమకెవరు సాటిలేరని చాటడానికిగాను - వారు బంగారు గండపెండేరాలు ధరించారేమో అన్నట్లు విలసిల్లింది.[125]

వానతో తడిసిన వంటచెఱకుల (కట్టెలు) తో పొయ్యిలోని నిప్పు ఆరిపోయింది. ఆ తడిసిన కట్టెలు బెల్లం వండడానికి సిద్ధపరిచిన రసభరితమైన వంటచెఱకులు (పచ్చి చెఱకు గడలు) లాంటివి కాబట్టే పొయ్యి రాజుకోలేదు. అందువల్ల ప్రజలకు భోజనాలు 'బక్కల బోనాలు' అయ్యాయి (శూద్రుల పెళ్ళిళ్లు మొదలైన ఉత్సవాల్లో బక్కలవాళ్లు అరివేణి పెట్టిన శూన్య భాండాలను తలపై ఉంచుకొని 'బోనాలో బోనాలు' అని పలుకుతుంటారు) అంటే ప్రజలకు భోజనాలు లేకుండా పోయాయి.[126]

వానాకాలంలో ఇల్లిల్లు తిరగగా ఒక్కింత నిప్పు దొరికింది. అలా దొరికిన కొద్దిపాటి నిప్పు ఇంటి కప్పులోని పూరిని పెట్టి విసరకుంటే రాజుకోదు ఎలాగో రాజుకొన్నా ఇంటిలోని వాసాలు విరిచిపెడితేగాని నిప్పు రగులుకోదు. అలా రగులుకొన్నా అన్నం ఉడకక 'మందు' లాగా అవుతుంది. వంట అయినా - ఇల్లంతా పొగనిండి ఉన్నందువల్ల సుఖభుక్తి చేకూరదు. ఎక్కువ మందికి వండిన అన్నం అంతా మొదట తినే కొందరికే సరిపోతుంది. మిగిలినవారి భోజనంకోసం మళ్లీ ఇంటిలోని స్త్రీలు పునః ప్రయత్నం చేయాలిసిందే. అప్పుడు ఆ స్త్రీలు పొయ్యి మండించడంకోసం వేరిగుడ్డలు మొదలైనవాటి నాశనాన్ని, ఇంటి కట్టడంలోని కొయ్యల

నాశనాన్ని లెక్కచేయరు. ఇలా రాత్రి పొద్దు పోయేవరకు అతిథులకు వంటచేసిపెట్టి, భోంచేయని గృహిణి పడకకు రానందువల్ల మన్మథునిచే గృహస్థులు వేదనపొందారు [127]

శ్రీరువులైన కోమలులు పిడుగులకు భయపడి కంచాల్ని కడగడానికి గడపలు వెదలిరాకుండా, ఇంటిలోనే తొలచి, ఆ తొలచిన నీటిని గడపలో నుండి విసరిపారవేస్తున్నారు. అలా పారబోసే సమయంలో విజృంభించిన ఆ కంచాల కాంతులు ద్వారాల వెలికి వస్తుండగా, పొగల వలుపు క్రమ్ముకొని ఉన్న పూరిండ్లు ఎలా ఉన్నాయంటే - మెఱుపులతోడి గొప్ప మేఘాలు నీళ్లతో భూమినంతా ముంచి, ఇంక పాతాళాన్ని ముంచడానికి పయనమై వెళ్తూ దారి మధ్యలో - సైన్యాల్తో విడిదిచేసినట్లున్నాయి.[128]

వానజడిలో బాటసారుల పాట్లు ఎలా ఉన్నాయంటే - వాన బాటసారుల గొడుగుల్ని గాలితో కూల్చింది. వారు గొడుగుకోలలతోనే పరుగెత్తుతుంటే - జడివాన వారిని పూర్తిగా తడిపేసింది. ఆ వానకు బాటసారులకు ఎంత వైరమో మరి! బాటసారుల తడిసిన మేనిలో తడి ఇంకి - అది భార్యా విరహాగ్నిని కొంత కొంత ఆర్పింది. ఒక్కొక్కసారి బ్రహ్మరతు చేసే సమయంలో విషం కూడా అమృతం అయినట్లు పాంథులకు ఆ జడివాన మేలేచేసింది.[129]

బాటసారులు దూరంగా జల్లు వస్తోందని తమకు దగ్గరగా ఉండే చెట్లకిందికి చేరారు. అయితే, అప్పటికే ముందు జల్లుల నీరు ఆ చెట్ల మీద ఉంది. దూరంగానున్న జల్లుకు ముందుగా వచ్చే గాలి కొమ్మల్ని కదిలించింది. దూరం నుండి వచ్చే ఆ జల్లు రాకముందే చెట్లు వంగుళ్లతో బాటసారుల్ని తడిపేశాయి.[130]

నానాదిశల నుండి వచ్చిన బాటసారులు వర్షం రాగానే తటాలున ఒక రచ్చ చావడిలో చేరతారు. లోక వృత్తాంతం సంభాషిస్తుంటారు. ఆ సంభాషణలో అశ్వపతికంటె గజపతి గొప్పవాడని, గజపతికంటె నరపతి గొప్పవాడని పట్టుదలతో వాదించుకుంటారు. వారి వారి గజాల, అశ్వాల సైన్యాల సంఖ్య - ఎక్కువ తక్కువల్ని గురించి ఉగ్రంగా వాదులాడు

కొంటారు. ఇంతలోకే మేఘం కొంత తెరిపి ఇవ్వగానే విచ్చుముగ్గ ఎవరి దారిన వారు వెళ్ళిపోతుంటారు[131]

వర్ష ఋతువులో కాకులు గడ్డితోను, పుల్లలతోను గూళ్లు కట్టుకొంటుంటాయి. ఆ గూళ్లు కట్టుకోడానికి గడ్డి నోట కరచుకొని రాజ మార్గాలలో ఉండే పెద్ద పెద్ద చెట్లమీదికి రాకపోకలు చేస్తూ ఉన్నాయి. ఈ దృశ్యం ఎలా ఉందంటే - తాము భాగ్యవతులయిన గ్రామలక్ష్ములకు - వారి మెడలోని హారాల్లోని నీలమణులు అవడంచేత తృణగ్రహణం చేస్తున్నాయో అన్నట్లుంది[132] (నీలాన్ని 'తృణగ్రాహి' అంటారు.)

భాద్రపద మాసంలో కాపు స్త్రీలు - వానలో పంట చెవివద్ద గుడిసెలో కాపలా ఉండే భర్తలకోసం - జమ్ముగూడ వేసుకొని - అంబళ్లు మోసుకొని వెళ్తుంటారు. వెళ్ళి తడిసిన జమ్ముగూడను - గుడిసెలోకి తీసుకుపోకుండా - గుడిసె ద్వారానికి తగిలిస్తారు. ఆ జమ్ము గూడ - ద్వారానికి అడ్డంగా పసగా నిలుస్తుంది. గుడిసెల్లోపల ఆ కాపు స్త్రీల భర్తలైన హాలికులకు తమ భార్యల కుచమర్దనాలు (పిసికిళ్లు) - పునాస పంటల కంకులు (పిసికిళ్లు) లభిస్తుంటాయి.[133]

ఆ జడివానలో రెడ్డిదొరలు నిశ్చితం అయిన స్వతంత్ర భూజీవనం కలవారై సుఖంగా ఉంటారు. ఎలాగంటే - గురుగు, చెంచలి, తుమ్మి, లేత తగిరిస ఆకుమ చింతచిగురుతో కలిపి నూనెల్తో సిరిగిరి పోయేట్లు పొగిచి వండి, ఆకుకూరను పొగలుగక్కే కుట్టారిక బియ్యపు అన్నంలో వేసుకొని నుష్టుగా తింటారు. మేకెరువు కుంపటి మంచంకింద రాజుతూ వేడినిస్తూండగా - రెడ్లు మంచంమీద పడుకొని ఉంటారు. సేవకులు వారి పశువుల్ని పొలానికి తోలుకుపోయి ఉండగా, ఇంట్లో ఉండే దూడలు రెడ్ల దేహాన్ని ఆప్యాయంగా నాకుతూ ఉంటాయి.[134]

రాజులు రత్నపు దండం మీద ఉండే ఆటనెమలి షడ్జమ స్వరం అనే అమృతంలో వీనులు ఓలలాడగా పొద్దెక్కి లేస్తారు. గమగమలాడే పుష్పాలతో చేయబడిన 'గంధరాజం' అనే పరిమళ ద్రవ్యంతో అంగమర్దన చేయించుకొన్న తర్వాత - చాలాసేపు వేణ్ణీళ్లతో స్నానం చేస్తారు. మిసిమి

దువ్వలువ, జన్నసరం (నానా విధాల మణులతో చేసిన హారం), శిరోజాల్లో మొగిలిరేకులు ధరించి పొద్దు జామెక్కిన తర్వాత కొలువు తీరుస్తారు. తర్వాత రాజనాల వరి అన్నం, కౌజు, పూరేళ్ళ, అడవి పంది మొదలైన అడవి జంతువుల మాంసంతో చేసిన కూరలు వేసుకొని - నిన్నటి వెన్న కాచిన నేయి దండిగా పోసుకొని భుజిస్తారు. భోజనానంతరం కస్తూరి అతిశయించే తాంబూలం వలుపు పెదవి మీద దట్టంకాగా, అగరు వెక్కంతో వెలిగించిన జందికుంపటి ప్రకాశిస్తూండగా, మేడల కిటికీల నుండి కనిపించే మెరుపుల కిరణాలకు చూపులు వాల్చిన అంతఃపుర స్త్రీలతో కలిసి ఆనందిస్తారు.[136]

ఇలా సాంద్రమైన ఎడతెగని జలధారలు పడుతూ ఉండగా అతిశయించిన వర్షాకాలపు దినాలు గడచిపోయాయి. ఆ దినాల తర్వాత -

## శరదృతువు వర్ణన

శరత్కాలం వచ్చింది. క్రౌంచ పర్వత రంధ్రం దాటిన హంసలు మళ్లీ తిరిగిరావడానికి ప్రారంభించాయి. వరి పండడానికి, రెల్లు పూయడానికి ఆరంభించాయి. యజమానులు (యజ్ఞకర్తలు) అగ్నిలో అన్నం వేల్చారు. తామరతీగల్లో పూవులు ఉద్భవించి వికసించ నారంభించాయి. అందువల్ల ఆ వికసించే పద్మాలలో మహాలక్ష్మి నివసించడానికి ప్రవేశించింది. ఎక్కడ జూచినా అప్పుడే పుట్టి వికసించిన ఎర్ర కలువల తోడి సరస్సులు - అప్పుడే నిద్రమేల్కొన్న శ్రీమన్నారాయణుని కెత్తిన నివాళి పళ్లేలేమో అన్నట్లు విలసిల్లాయి.[137] (విష్ణువు వర్షాకాలంలో శయనించి - శరదృతువులోని ఆశ్వయుజ శుద్ధ ఏకాదశినాడు నిద్రమేల్కొంటాడు.)

శరదృతువులో ఆకాశం అతిశయమైన నీలిమను పొంది ఇంద్రనీల మణుల, నేరేడువండ్ల కాంతివంటి నల్లని నిర్మలకాంతి గలిగినదై, పెద్ద పెద్ద మెరుపుల దీపకళికలు ఉమిసిన పొగ వ్యాపించడంచేత పొగ చూరిం దేమో అన్నట్లు ఒప్పింది.[138]

సంజకెంజాయ యొక్క పెద్ద అంచేత శరత్కాల మేఘాలు సగం ఎరుపు రంగు కలవై ఆకాశంలో సంచరించాయి. ఆ దృశ్యం ఎలా

ఉందంటే - అప్పుడే నిద్రమేల్కొన్న ఇందిరాధిపతి - ఎత్తే కర్పూర నీరాజనాలేమో అన్నట్లు అతిశయించాయి.[139]

ఆకాశంలో వరిచేలకోసం వెళ్తున్న చిలుకల గుంపు - కాటిలో పసుపుపసుపు ఒకపాటిగా సంధ్యారాగం కాల్చిన పొందు వర్ణపు శరత్కాల మేఘ శకలాలు - ఎలా దృశ్యమానం అవుతున్నాయంటే - వర్షాని ఆతుకు, నిలియబాటిన పండ్లు గల దొండతీగలు - తుమ్మెద రెక్కలాదరలాగా నిర్మల మైన నలుపులో సొంపారుతూ ఉండే ఆ నింగిలో ప్రతిఫలిస్తున్నాయేమో అన్నట్లున్నాయి.[140]

అద్దంలాగా నిర్మలమైన ఆకాశంలో - జనపనార కుంచెవలెను పాదిలోపల నుండి కనిపించే పీచులాంటి తెల్లని మేఘాలు. మూసుకొనుపోవు పురుగులు తొలువగా కాన నీరు భరితో చిలిక ఇంద్రధనుస్సు కుటితో సహా వాలై తెల్లని మేఘాలు వ్యాపించాయి [141]

శరదృతువు అనే యువతి సూర్యచంద్రులు అనే అద్దాలకు మెరుగు పెడుతున్న బూడిదేమో అన్నట్లుగా నిర్మల కాంతితో ఏడాకుల అరటిచెట్లు వరాగం వ్యాపించింది.[142]

శరత్కాలంలో శ్రీహరి నిద్ర మేల్కొని, పాము శయ్యను వదిలి కింద పాదమూని నిలుచగా. ఆయన విశ్వంభరుడై నందువల్ల (విశ్వాన్ని కడుపులో మోస్తున్నాడు కాబట్టి) భూమి లోతుగా దిగిపోయింది. అప్పుడు గడచిన వర్ష ఋతువులో పడిన పిడుగులు పాతాళం దాకా చేసిన రంధ్రాల్లో నుండి భోగవతి తెల్లని ఆ పాతాళ గంగ పిటిధారలు చిలాయేమో అన్నట్లు ఎక్కడ చూసినా తెల్లని కాంతులతో రెల్లు కాడలు ఎన్నులు పుట్టాయి.[143]

పద్మనేత్రుడైన హరి ఆ సమయంలో నిద్రలేచి తన మీద అడుగు మోపిన కారణంగానేమో - భూకాంత పులకగాత్ర అయిందేమో - అన్నట్లు భూమిపై వరి ఎన్నుల ముల్లు గట్టపడి - అంకటా ఒప్పారుతున్నాయి.[144]

సూర్యకిరణాలు తాము తాగడానికి కావలసి ఉన్న సముద్ర జలాన్ని - అగస్త్యుడు ముక్కుపట్టాగానే తాగేస్తాడేమోనని భయపడి - ఆ సముద్రాన్ని - తమలావైన ఆకాశంలో చేర్చుకొన్నాయి. ఆ సముద్రం

మెరుపులే జడదారావలంగా, భూమి మీద అంతటా వర్షించి మాయమైంది. నక్షత్రాలకు, అంగారకాది పంచ గ్రహాలకు, సూర్యచంద్రులకు కాంతి పెరగడం ఎలా ఉందంటే - అగస్త్య మహాముని నక్షత్ర రూపంలో - అప్పుడు ఆకాశంలో ఉదయించాడు - కాబట్టి, ఆయన అక్కడ కూడా సముద్రాన్ని తాగేశాడు సుమా అన్నట్లు - ఆ నక్షత్రాదులే ఆ సముద్రం అడుగున ఉండే రత్నాలు, ముత్తెపు చిప్పలు అని అనిపించేట్లు ఉంది.[145]

శరదృతువులో అగస్త్య నక్షత్రోదయం కాగానే భూమిలో అంతటా పంకుకిందికి దిగి నీళ్లు పైకి తేరాయి. ఇది ఎలా ఉందంటే - నక్షత్రాలు నీటిని తేర్చడం పట్టిమాట. శరదృతువే మలయపర్వతం నుంచి అగస్త్యుడనే ఇందుపు గింజ తెచ్చి, కొలములోని అగస్త్య నక్షత్ర ప్రతిబింబం అనే మిషతో జలదేవతలకు ఇచ్చింది వారు ఆ ఇందుపు గింజను ఆ కొలనుల మెట్లమీద పెట్టి - అలలు అనే చేతుల్తో అరగదీయగా వచ్చిన జిగురు కలవడంచేత నీరు తేరింది. ఆ ప్రతిబింబం అగస్త్యుడనడానికి గుర్తేమి అంటే - అగస్త్యుడు హ్రస్వుడు - ఇందుపు గింజ కూడా హ్రస్వమైనదే గదా! ఇదే గుర్తు అన్నట్లుంది [146]

శరదృతువులో మబ్బు విడిచిన ఎండ (మొగిల్విరి ఎండ) తీక్షణంగా కాయడం, సరస్సులో తామరల, కలువల పుప్పొడి ముత్తాలు గాలికి రేగి అలలపై పడడం ఎలా ఉందంటే - శరత్తు అనే జలజాతి స్వర్గానికి అమృతంతో కలిగిన ఉత్కర్షను, భూమికి నీళ్లతో సంపాదించాలను కుంది. ఆ శరత్తరుణి సరస్సులనే కుండల సమూహంలో నీటి కాలుష్యం తొలగి అది అమృతతుల్యం అయేట్లు మబ్బు విరి ఎండతో ఆ నీటిని కాస్తూ, ఆ నీటిలో పసుపుపొడి రాలుస్తున్నదేమో అన్నట్లుంది [147]

శరదృతువులో క్రౌంచ రంధ్రం దారిలో హంసలు వలయాకారంగా వచ్చి చంకారంతో తామర కొలనుల్లో వాలడం ఎలా ఉందంటే - శరత్కాలం అనే విశ్వకర్మ పద్మ సరస్సులనే పద్మినీ జాతి స్త్రీల మీద హెచ్చిన ప్రేమతో, వారికోసం కాళ్లకు వెండి కడియాలు, చేతులకు వెండి గాజులు తయారుచేయాలనుకున్నాడు. అతడు రజతాద్రి వెండిని క్రౌంచ

నగం అనే కమ్మెచ్చులో పెట్టి కమ్ములుగా లాగి, ఎవరికోసం లాగిన వెండి కమ్ముల్ని వారి దగ్గరనే ఉంచినట్లుగా ఉంది.[148]

ఆ శరత్కాలంలో తామర కొలనల్లో - తామరాకుల మీద తేటలుగా, రుచికరాలుగా ఉండే నీటి బిందువులు ప్రకాశిస్తూ ఉండడం ఎలా ఉందంటే - అగస్త్యుడు సముద్రజలంతోపాటు దానిలోని ముత్యాలను కూడా తాగి తర్వాత నీటిని కడుపులోనే ఉంచుకొని, కడుపులో నుండి స్వచ్ఛమైనవి, తూనిక కలవి, ప్రకాశవంతాలు అయిన ముత్యాల్ని మాత్రం కిందికి - ఈ కొలనులలోనికి - క్రుమ్మరించాడా ఏమి అన్నట్లు సొంపారింది.[149]

ప్రవహించే ఏటిలోని పై ఇసుక కిందికి దిగే సమయమే గడియారంలోని పై గిన్నెలోని ఇసుక కింది గిన్నెలోకి దిగే సుముహూర్త కాలం అయింది. సూర్యుడనే రాజు వరుడై - పద్మలత అనే పద్మినీ జాతి స్త్రీ వధువు అయింది. పెండ్లి సమయంలో మధ్య తెర తొలగగా, తన కోసం విరహాగ్నిలో వేగుతున్న పెండ్లికూతురు పద్మలత చేతిలో సూర్యుడు జీలకర్రతో కలిపిన బెల్లం ఉంచాడు. అది ఆమె చేతి విరహదీప్తితో కరిగి పాకమై పొర్లి ఒలికిపోతున్నట్లు ఆ తామరలందలి కేసరాల్తో కూడిన మకరందం ఒప్పారింది. పైన ముసురుకునే తుమ్మెదలు ఎలా ఉన్నాయంటే - సూర్యుడనే పెండ్లికొడుకు పద్మలత అనే పెండ్లి కూతురు తలపై ముత్యాల తలంబ్రాలు పోయగా, ఆమె విరహోష్ణంచేత కంది నల్లబడిన ముత్యాల తలంబ్రాలుగా వింత గొల్పుతూ ఉన్నాయి.[150] (ఈ విధంగా శరత్కాలంలో నీరు అతి నిర్మలమై చాలా తెలికగా ఉన్నాయి.)

కొలనుల్లో కమలాలున్నాయి వాటి దరుల్లో చెరకు తోటల లోని తెల్ల చెరకులు వేలకు బరువుగా అతి తియ్యని రసంతో పండి, తమ బరువుకు తామే వంగిపోయి ఆ కమలాల మీదికి వాలాయి. ఆ బరువుకు ఆ కమలాల్లో నిండి ఉన్న మకరందం పొంగి పొరలి పారుతూ ఉంది. ప్రభాత వేళలో ఆ తేనెకోసం ఆ పద్మాల మీద బిగ్గరగా ఝం ఝం అని శబ్దిస్తూ తుమ్మెదల గుంపులు తిరుగుతున్నాయి. ఆ కమలాలు చెరకులు అదే గానుగలుగా వాటి నుండి పొర్లిపారే మకరందం ఆ చెరకుల అతి తియ్యని రసంగా, కొలనులే ఆ చెరకు రసపు పెనాలుగా, పైన తిరుగుతూ ఉండే

మ్మెద గుంపులు గానుగల్లో తిప్పుంటే గానుగ కంబాలుగా కది పిస్తున్నాయి.[157]

ఏనుగులు నదుల ఒడ్డుల్ని కోరాడుతూ ఉన్నాయి - ఎలాగంటే - అవి ఒక కన్ను కిందా ఒక కన్ను మీదా ఉండేట్లుగా తలవంచాయి - ఆ స్థితిలో ఏనుగు తలలు నాగటికి పెల్లగిల్లి ఒరిగి పడిన అరటి దుంపల్లాగా ఉన్నాయి. ఏనుగు కిందివైపు కొమ్ము నేలలో గుచ్చింది. అప్పుడు ఆ ఒరిగిన దుంప యొక్క మోసుపేలకు తగులుతున్నట్లు ఉంది.

ఏనుగుల గండస్థలం నుండి దిగి చిబుకం మీద రాత్రి పేరిన మద జలం కాటుకకరడో అన్నట్లు మెరుస్తూ ఉంది. ఏనుగులు తొండాన్ని చుట్టుతూ విప్పుతూ దరిమీద వేసి చాచినప్పుడు అది అప్పుడే కొరియనుండి తేలి వచ్చి దెబ్బతిని చుట్టుకొంటూ చుట్టు విప్పుకుంటూ ఉండే పాములా

మట్టిపెళ్లలు నీటిలోకి దొర్లిపడి - రెల్లుపువ్వులు నురుగుగా అయి - పెళ్ల కరిగి నీరువంటు అయి - మళ్లీ వర్షాకాలం వచ్చిందేమో అన్నట్లుంది.

దట్టమైన పుప్పొడి వర్షాన్ని కళ్లల్లో పడకుండా నివారించడానికి మీదికన్ను మూసుకోగా, కటి దిక్కులవైపు నిగుడుతుండగా, జరితోలు చలిస్తూ ఉండగా, కిలులాంటి వల్లవి చిక్కని తమ మదజలం వదులుకు తిక్తతను (మగంధిత్వం - చేదు) ఇవ్వగా ఆ ఏనుగులను అనుకరిస్తూ ఉన్న అబోతులు వాటిని చూసి పరుగెత్తాయి. ఆ ఏనుగుల గండస్థల మద జలానికి ఆశ్రయించిన తుమ్మెదలు కూడా అబోతులతోపాటు పరుగెత్తగా, ఏనుగులు నదీ తటాల్ని కోరాడుతున్నాయి.[158]

ఆ శరత్కాలంలో - ఏకాకుల అరటిపూల ధవళమైన ధూళి ఏనుగుల రెండు గండస్థలాల్లో స్రవిస్తూ ఉండే దట్టమైన మదజల రేఖలకు అంటుకొని, ఆ రెండు రేఖలు అదనంగా రెండు నూతన దంతాల్లా ఒప్పాయి. ఆ తెల్లని రేఖలే - మాటిమాటికి చెవుల్ని ఏనుగులు ముందు వెనకలకు ఆడిస్తూ ఉండడంవల్ల అవి ధవళ చామరాలుగా ఒప్పుతూ ఉన్నాయి. ఏనుగులు కొండల్ని కోరాడగా - కొమ్ముల కొనల్లో నిండుగా అంటుకొని ఎంతిన

మన్ను-దంతాలకు కట్టిన కత్తుల్లాగా విలసిల్లుతూ ఉన్నాయి. ఈ తీరు ఎలా ఉంటుందంటే - రాజులతో ఏనుగులు 'లెండి! దిగ్విజయానికి తరలండి! మీకు జయం సమకూర్చడానికి ఈశ్వరుడు మమ్మల్ని 'చవుదంతులు' (నాలుగు దంతాలున్న ఐరావతాలు)గా చేశాడు. మా కొమ్ములకు కత్తుల్ని కూడా కట్టాడు' అని బోధిస్తున్నట్లుగా ఉంది[154].

ఆ శరత్సమయంలో - ఒకరినొకరు జయించగోరిన రాజుల అమ్ముల పొదుల జంటల నుండి వెడలి-గురిని ఛేదిస్తూ ఉన్నందువల్ల-గొప్ప కీర్తిని సంపాదించిన బాణాలు తమ వంశంలోనివే కాబట్టి-ఆ కీర్తి తమకు కూడా సంక్రమించినట్లు - రెల్లుకాడల్లో విస్తారమైన తెల్లని పూత ప్రకాశించింది[155].

శరత్కాలంలో-అబోతులు ఏళ్ళదరుల్ని కోరాడగా అందలి తడి వండు మన్ను మూపురాలకు కమ్ముకొనడం - దాని మీద రెల్లు దుబ్బులు అంటుకొని ఉండడం - వాటితో అబోతులు ఉల్లసిల్లడం ఎలా ఉందంటే- అబోతుల్ని కొండలుగాను-వాటి మూపురాల్ని కొండ శిఖరాలుగాను భావించి- నీటిని వెలువరించిన తెల్లని శరత్కాల మేఘాల తునకలు - ఆ మూపురాలపై ప్రాలంగా వాటితోనే అబోతులు సంచరిస్తున్నాయేమో - అన్నట్లున్నాయి.[156]

శరత్సమయంలో - చుక్కలు మెరుగెక్కడం, ఆకాశంలో కొద్ది విరళాలుగా తెల్లని మేఘాలు ఏర్పడడం ఎలా ఉందంటే - గగనలక్ష్మి తన ఇరువది ఏడేసి ముత్యాలు గల 'నక్షత్రమాలికలనే' ముత్యాల హారాల్ని - ఆకాశగంగానదిలో కడగడానికోసం - పిసికిన కుంకుడు వండు మరుగులేమో అన్నట్లు వ్యాపిస్తున్నాయి.[157]

నీరే ప్రాణంగా గలిగిన మేఘాలు - శరత్కాలంలో సముద్రుని నుండి నీటిని అప్పుగా తీసుకొని - సముద్రునికి దూరంగా ఆకాశం అనే దేశాంతరానికి వెళ్ళి - అక్కడ వేసవి వెట్ట తీర్చడం - చాతకాలకు బలా కాదులకు మేలుచేయడంలాంటి కార్యాలు పూర్తిచేసుకొన్నాయి. కార్యానంతరం - మొదట తీసుకొన్నదానికంటే ఎక్కువగా వడ్డీతోకూడా - సముద్రునికి ఆ నీటి ఋణాన్ని తీర్చాయి. ఆ కారణంగా విశుద్ధాత్ములు, విశుద్ధ

దేహాలు అయి, గౌరవంగా ఉన్నతాలై సంచరిస్తున్నాయేమో అన్నట్లు - తమలోపల చంద్రమండలాన్ని కలవై - తెల్లని మేఘాలు ఆకాశంలో చరిస్తూ ఉన్నాయి.[158]

లోకంలో బుద్ధిమంతుడు తన కాలి పెండేరంలోని పద్మరాగంలో లశున పటం (కెంపులో పాలుపై పూసినట్లుండే తెల్లకాంతి) అనే దోషం ఉందని తెలుస్తూనే, ఆ పెండేరాన్ని వదిలి, లోభంలేక సంతుష్టికలవాడై, తెలివి కలిగి భాగ్యమొంది సుఖపడతాడు. అలాగే శ్రీమన్నారాయణుడు తన పాదమైన ఆకాశంలో - పరివేషం అనే అందియలో సూర్యుడనే పద్మ రాగంలో - ఒక పక్క తెల్లని మబ్బుల ఆవరణం అనే లశున పట దోషం కనిపెట్టాడు. వెంటనే పరివేషం అనే అందియను తన పాదమైన వింగి నుండి తొలగించి, వస్తులోభం లేక సంతుష్టుడై, తన స్థావరమైన పాల సముద్రంలో నిద్ర మేల్కొనడం అనే తెలివిని పొందినవాడై - మహాలక్ష్మి అనే భాగ్యాన్ని పొంది శరత్కాలంలో సుఖంగా ఉన్నాడు.[159]

దేవతలంటు హవ్యం కొనిపోతుండే అగ్ని - వర్ష ఋతువులో మందగించాడు. అప్పుడు శరదృతువులో దేవతలు అగ్ని కార్యాల కోసం- అగ్నిని సంపాదించడానికి మండుతూ ఉండే సూర్యకాంతశిలలకు కొంత పైగా - తెల్లని శరన్మేఘాలు అనే దూదిని పలచపలచగా పట్టుకోవగా నిప్పు పుట్టింది. ఆ నిప్పు వారు కోరిన తీరులో నిలవనిదై 'ఎందుకు దీనిని పుట్టించామా' అని వారు పరితాపం పొందేట్లుగా - ఒక పరిమితిలో నిల్వక మొగిల్విరి ఎండలు (మబ్బులు విడిచిన ఎండలు) దుస్సహంగా కాశాయి.[160]

శరదృతువులో సూర్యుని ఉదయంలోను, అస్తమయంలోను ఉదయాస్తమయ సంధ్యారాగాలవల్ల ఎర్రనై - ఆకాశం ఊర్ధ్వ భాగంలో నీలమై - మాయ అనే చెంచెత ధరించిన గురివింద ముంగరేమో అన్నట్లు ఒప్పుతూ ఉన్నది.[161]

ఆ శరత్సమయంలో - నోట వరి వెన్నులు కరచుకొని గుంపులుగా గూళ్లకు ఆకాశంలో ఎగిరి పోయే చిలుకల పంక్తులు ఎలా ఒప్పుతున్నాయి అంటే - వరివెన్నులు పండి ఒక్కొక్క పసరు ఆకుతో ఒప్పుతూ - కాపులు

తమ్ము మళ్ళీ వచ్చి కోత కోస్తారని భయపడి-విరహాయమైన శావుకు వెళ్ళ డానికి ఆకాశ మార్గంలో ఎగిరిపోతున్న వరిచేలో అన్నట్లు - ఒప్పుతూ ఉంటాయి[162].

రాజనపు వరిచేలను కాచే గోపికా స్త్రీలు ఇలా ఉన్నారు: గోపికల చెవులు శ్రీలు (శ్రీకారాలు) అయినందువల్ల-శ్రీదేవి పద్మకర్ణికా సింహా సనం మీద ఆసీనురాలు అవుతుంది కాబట్టి-ఆ పద్మకర్ణికల ఆకారంలో ఉండే చెవిదుద్దులు మెరుస్తున్నాయి.

మన్మథునికి తేరువడుపుతున్న రతీదేవి చిలుకల గుర్రాన్ని అదిలిం చినట్లు-ఆ గోపికలు మంచెలెక్కి చిలుకల గుంపును అదిలిస్తూ తరుము తున్నారు. చేనిపై వాలే చిలకల్ని తోలడానికి తామర మొగ్గల్ని విసిరేశారు- అవి దూరం వెళ్ళనందువల్ల గోపికలు చప్పట్లు చరుస్తూ ఉంటే - వారి చన్నులు, జడలు కదులుతున్నాయి బాటసారి దారి అడగ్గా-తప్పుదోవ చెప్పి నవ్విన గోపికలు-ఆ నవ్వు విని బాటసారి వెనక్కి తిరగ్గానే సిగ్గుపడ్డారు.

ఆ గోపికల అధరమాధుర్యాన్ని, దంతాల కాంతిని తమకిమ్మని అడగడానికి నోరు తెరిచాయేమోనన్నట్లు పండి పగిలి ముత్యాలు కనిపించే చెరకు తోటలున్నాయి. ఆ గోపికల పిక్కలకు తమ పొట్టలు సరిపోయేందువల్ల సిగ్గుతో రాజనాల వరికర్రలు గలిగిన వరిచేలు తలలు వాల్చాయి. అలాంటి చెరకు, వరి తోటల్ని గోపికలు కాస్తూ ఉన్నారు[163]. ఆ శరదృతువులో పండిన వరి మొదలైన ధాన్యాల గడ్డిరాశులు-గిరులంతై నింగిని తాకుతుండడం వల్ల-వింగి కామ మహాసీలం అయిన గరిమకు తగినట్లు బహుతృణ గ్రాహి అయింది[164]

ఆ శరత్కాలంలో శుభకర్మమీది పట్టుదలతో శ్రోత్రియులు యాగం చేయడం, తెల్లతామరలు శ్వేతచ్ఛత్రంలాగా వికసించడం, హంస శ్రేణులు రావడం, కకుత్స్థుల్లాంటి ఎద్దులు కలవాడై-వర్షాదినాల పోకడవల్ల మనోహ రుడైన శరదృతు పురుషుడు పెంట బెగ్గురు పక్షులు గలవాడై, సూర్యునికి దీప్తి కలిగేట్లు ఇంద్రధనుస్సును రూపుమాపాడు. ఆ శరత్పురుషునికి కొత్త లై పోయిన రాజనాల చేనిలో-నాగటి చాలు కలిగింది ఇదంతా దేని మాదిరిగా ఉండంటే-శుభకర్మయందు దీక్షతో జనక మహారాజు యాగం చేయగా,

ఆ యాగానికి ముని బృందాలు వచ్చారు. కాకుత్స్థ శ్రేష్ఠుడైన శ్రీరాముడు ఐదు దినాల పోకడలాగా మనోహరుడైనవాడు-లక్ష్మణ సమేతుడై వచ్చి - జనక రాజుకు ప్రతాపం హెచ్చేట్లు శివధనుస్సును త్రుంచి ధనుర్భంగం చేసిన ఆ వేళలో-జనకునికి సీతాలబ్ధి అయినట్లుంది[165].

మబ్బు విడిచిన ఎండ వేడిమి విజృంభించి చిలుకల గుంపు యొక్క పచ్చరంగు ఆకాశమంతా వ్యాపించగా-ఆకుపచ్చ రంగు గుర్రాల్ని పూన్చిన సూర్యుని రథం తమకు దగ్గరగా వచ్చిందేమో అని ప్రజలు భయపడ్డారు[166].

శరత్సమయంలో ఆకాశానికి నైర్మల్యం అతిశయించింది. ఎందు వల్ల? కృష్ణపక్ష రాత్రులలో చీకటి - లోకాన్నంతా ఆక్రమించి దట్టంగా ఉంటుంది. ఇప్పుడు ఆ కృష్ణ పక్ష రాత్రులలోనే ఆ చీకటిని భూమి నుండి కొలనుల్లోని తెల్లకలువలు తరిమేశాయి. అటు నింగినుండి గ్రహాలు, నక్షత్రాలు చీకటిని తరిమేశాయి-కాబట్టి చీకటి ఎక్కడా నిలువడానికి స్థలంలేక ఆకాశం యొక్క నీలిమలో కలిసి పోయినందు వల్లనేమో అన్నట్లు ఆకాశానికి నలుపు హెచ్చింది[167].

ఎండలో దప్పిగొన్నవారు పాలు తాగితే దప్పి తీరకపోగా వ్యాధి కూడా కలుగుతుంది. నిండ వానలవల్ల ఏటిగట్టుల పచ్చిక సమృద్ధిగా ఉంది. ఆ ఏటి ఒడ్డుల్లో ఉండే పచ్చికను మేసే పాడి ఆవులు తమ దూడల్ని తలచుకోగానే పాలుచేపగా, ఆపాలు ఏటి నీరులో కలుస్తున్నది ఆ పాలు కలిసిన నీరు బాటసారులు తాగితే వారికి అరోగ్యం చెడుతుందని - నదుల్లో నీటి నుండి పాలు వేరుచేసి తాగివేయడానికి-బ్రహ్మతన వాహనాలైన చిలుకల్ని వాటి కాల నుండి ఆ నదుల్లోకి పంపాడేమో అన్నట్లు-నదుల్లో హంసలు మిక్కుటంగా ఉన్నాయి[168].

ఆ శరత్కాలంలో-ఆబోతులు రంకెవేయడం ఎలా ఉందంటే-పెద అడవిన ఆవుతో పోనలేందుకు కలిగిన తాపం, కంఠం దాకా ఉండే క్రొవ్వుని కరిగించగా అప్పటికి అడ్డుతీరి, మెడసాగగా, ధ్వని ఆ సందునుండి వచ్చిందేమో అన్నట్లుంది[169].

ఆకాశంలో వడివడిగా వెళ్ళే శరత్కాల మేఘాలు తెల్లగా ఉండ దానికి కారణమేమంటే-మేఘాలు తాము సముద్రంలో తాగిన జలాన్నంతటినీ

ఉప్పు మాత్రం మిగిలించుకొని-తక్కిన నీరంతా వానగా కురిశాయి. మిగిలిన ఉప్పు ఆనీటినుండి కిందికి దిగి- మేఘాల కడుపులో ప్రతిదినం కొంతకొంత పేరి దట్టమై-అద్దంలాంటి వాటి స్వచ్ఛమైన దేహంనుండి బయటికి కన్పిస్తున్నదేమో అన్నట్లుంది.[171]

వర్షఋతువులో-సూర్యకిరణాలు సముద్రాన్ని తాగి మేఘాలుగా మారినందువల -సూర్యుడు తేజోహీనుడయ్యాడు శరదృతువు వచ్చినప్పటికి- ఆమేఘాల్లోని నీరంతా వానరూపంలో సూర్యకిరణాల్ని వదిలి పోయింది. వాటి మేఘభావం పోయింది. తాము మళ్లీ మునుపటిలాగా సూర్య కిరణాలుగా మారినందువల్ల-సూర్యునికి ఆవర్షర్తువులో తగ్గిన తేజస్సు-మళ్లీ కలిగిందేమో అన్నట్లు - సూర్యుడు మిగుల దురుకెక్కి మెరుస్తూ ఉన్నాడు.[171]

ఆశరత్కాలంలో మేఘాలు-తాము ముందు సముద్రంలో తాగిన నీరంతా తమకు నిలవక శూన్యాలైనందువల్ల, మళ్లీ కడుపునిండా తాగుదాం అని కొలనుల్లో ప్రవేశించాయేమో అన్నట్లుగా-కొలనుగట్లల్లోని రెల్లుల ప్రతిబింబాల సమూహం-ఒప్పుతూఉంది.[172]

కొలనులో దంపతులైన ఏనుగులు-ఒకదానికొకటి ఇవ్వడానికి తామరమొగ్గలు ఎత్తగా-వాటినుండి మకరందం ఒలికింది. ఇది ఎలా ఉందంటే-ఏనుగులు దంపతులుగా వచ్చి ప్రీతితో శరల్లక్ష్మికి అభిషేకం కావిస్తున్న కడవల జంట అన్నట్లు శోభాయమానాలయ్యాయి.[173]

శరత్కాలంలో-బావుల్లో బురద అడుక్కు వెళ్ళి నీరు తేటపడింది. అయినా ఆ తేటనీటిని తామరలు తమ పుప్పొడి మకరందంతో మళ్లీ బురద చేశాయి ఇది న్యాయమే!. లోకంలో కారణం యొక్కగుణం కార్యంలో ఉంటుంది ఎలాగంటే పంకజం బురదనుండి పుట్టింది కాబట్టి తన కారణమైన పంకం (బురద) యొక్క గుణాన్ని తానుకూడా చూపింది.[174]

జనులు స్వామీ! అగస్త్యా నీవు సముద్ర జలాన్ని తాగివేశావు. నీవు దానితో సంతుష్టిచెంది-భూమిమీదనున్న ఈ మిగతా జలాన్ని శైర్ల్యకోసం

పదులు! దీనిని నీవు తాగవద్దు అని ప్రార్థించడంగా-'వీరికి ఇంతసిరెందుకు'? అనే ఈర్ష్యతో కూడుకున్న అగస్త్యుని కన్నీకవరు (కోపవీక్షణం) శాంతించేట్లు ఆయనకు కప్పంగా కొంతజలం ఇస్తున్నారేమో అన్నట్లు-అప్పుడు నక్షత్ర రూపంలో దక్షిణదిక్కున ఉదయించిన అగస్త్యునికి-ప్రజలు అర్ఘ్యోదకాంజలులు సమర్పించారు.[179]

గట్టినిప్పుచే కాగిన పెనంమీద అట్లపిండి పోస్తే అది ఎలా చక్కగా కాగి చిక్కబడుతుందో, అలాగా తీవ్రమైన ఎండతో పగలంతా కాగిన ధరణీపాత్రం మీదపడడంవల్ల కాగి చిక్కబడిందేమో అన్నట్లు-రాత్రుల్లో శరత్కాలపు వెన్నెల-దట్టంగా కాస్తూఉంది.[176]

వర్షాకాలంలో నాచుతీగ పొడుగునా-చేపలు గుడు పెడతాయి. వాటిని తర్వాత శరత్కాలంలో తినివేస్తాయి! చేపలు ఆలా తింటూ-పటి కేటనీటిలో తళతళలాడుతూ-నాచులత పొడుగునా కిందినుండి పైకి వస్తూ ఉండగా - నాచులత ఎలా ఉందంటే-జమిలిక వాద్యంలోని వెంద్రుక పొడుగునా కిందినుండి పైకి తళతళలాడుతూ వెండిచేపలు ఎక్కే వెంద్రుక విల్లో అన్నట్లుగా ఒప్పింది [177]

హంసము వట్టి హంసే. అగస్త్యుడు పరమహంస. కాబట్టి హంసకంటే అగస్త్యుడు ఎన్నోరెట్లు గొప్పవాడు. అందువల్ల హంసకన్నా ఎక్కువ ప్రభావం చూపించాడు ఎలాగంటే హంస క్రౌంచపర్వతం శిఖరం దాకా ఎగరలేక-నడుమ ఏదోఒక రంధ్రముంటే-అదారిన వచ్చింది. అగస్త్యుడు మలయాద్రి శిఖరంమీదనుండి వచ్చాడు. హంస పాలు విరువగా తాను అంతకన్నా పలుచనైన నీటినే విరిచాడు. అగస్త్యుడు బందు నుండి నీటిని వేరుచేసి తేర్చాడు.[178]

పరశురాముడు క్రౌంచాద్రిలో చేసిన రంధ్రంలో హంసలు భూమికి - మానస సరోవరానికి రాకపోకలు గావిస్తుంటాయి. కాబట్టి ఆనడుమ ఆ రంధ్రంలో కొన్ని హంసలు గుడ్లు పెట్టాయి. ఆగుడ్లను హంసేతర పక్షులు పొదగగా-అవి హంస సమూహాలయ్యాయి. అలా కాదు-ఒక జాతి పక్షి గుడ్లను మరోపక్షి పొదిగితే పిల్లలవుతాయా? అనే

అశేషం ఉంటే కోళ్ళుపొదుగగా నెమలి పిల్లలు అయిన నెమలి గుడ్లే నిదర్శనం గదా!.[179]

సరస్సులు సరస్సులు కాదు. మరేమంటే అవి జలదేవతలు ముఖం చూచుకొనే కంచుటద్దాలు. వాటికి వర్షఋతువులో దట్టంగా చిలుమెక్కింది హంసశ్రేణులు-ఆ చిలుమును తోముతున్నాయో అన్నట్లు-ఆసరస్సులలో మునుగకుండానే - ఇటూ అటూ అంతటా కలిసేటుగా సంచరిస్తున్నాయి. అలా తోమడం వల్ల చిలుము ఊడి ఎగిరిపోతున్నదేమో అన్నట్లు-పద్మాల పుప్పొడి హంసలు పోయిన చోటంతా రేగుతూ-సరస్సుల బయటికి ఎగిసిపోతూ ఉంది. హంసలు సరస్సులనే అద్దాల్ని గట్టిగా తోముతుండడం వల్ల కలిగిన శబ్దాలేమో అన్నట్లు వాటి క్రేంకారాలు వినిపిస్తున్నాయి.[180]

శరత్సమయంలో అడవిలో నెమళ్ళు ఎలా ఉన్నాయంటే-సూర్య మండలానికి మేఘం అడ్డమౌతూనే-మేఘం వచ్చిందేమో, వర్షిస్తుందేమో-అని మేత మేయడం మాని మొగం పైకెత్తి చూస్తూ ఉంటాయి. గుహల్లో 'ఘుమఘుమ' ధ్వనితో గాలి ప్రవేశిస్తూనే-ఉరుమేమోనని భ్రమపడి పురి కొద్దిగా విప్పి-ఆ గాలిధ్వని ఉరుము కాదని తెలుసుకొని పింఛం ముడుచుకుంటాయి. పుష్పరహితమైన మొగలి చెట్టుకు కన్నీరు అద్ది, కప్పలుండే పడియ చోటులో చెవి ఒగ్గి వింటాయి-కప్పలు అరుస్తాయేమో వాన వస్తుందేమో అనే ఆశతో, కేక వేయడానికి మూడుసార్లు మెడవంచినా కూడా కేక రానందువల్ల, కొద్దిగా అరుస్తున్నాయి. ఏమైనా కనబడితే దాన్ని నోటితో కరుస్తుంటాయి. మబ్బువిడిచి కాస్తున్న ఎండ తీవ్రతకు తాళలేక శరత్కాలంలో పుష్పించి విజృంభించే ఏడాకుల అరటి జోలికి పోక-నీడ కోసం వర్షఋతువులో విజృంభించేదయిన గుమ్ముడుచెట్టు ఎక్కుతాయి. ముక్కుతో ఇరువైపులా రెక్కల మొదళ్లను సరిదిద్దుకొంటూ-అర్థం లేని వెర్రి చూపుల్తో-రొమ్ము ఇరుపక్కల్ని చూచుకొంటూ ఉంటాయి.[181]

అడవిలో నెమలి ముడిగిన పింఛంపై బురద అంటుకొంది. అది చెట్లనీడల్లో క్రమంగా ఇగిరిపోయింది. శరదృతువులో వర్షంలేనందువల్ల

నెమలి అదరల్చుకోలేదు, కాబట్టి పించం విప్పనందువల్ల అంటుకొన్న బురద అల్లేఉంది. చూడడానికి అది ఎలా ఉందంటే-నెమలి ఆటను మెచ్చుకొని దేవేంద్రుడు తన మెచ్చుదలకు సూచకమైన ముద్రను నెమలి యొక్క శానె కొంగుపై లక్కతో ఒత్తాడేమో అన్నట్లుంది.[182]

సముద్రుడు 'సరిత్పతి' కాబట్టి నదీ సముద్రులకు నాయికా నాయక భావం కవి ఈ పద్యంలో వర్ణించాడు. శరత్కాలం లోని నదులు ఒక్కొక్క తావున సముద్రుని చిత్తం ఆకర్షించడానికి చక్రవాకాలనే స్తనాల ప్రకాశంతో-అతని కనుగవను తనియించడానికి-నురుగు అనే పైటను తొలగించి-బొల్లికోళ్ల గొనగొన ధ్వనులనే నెపంతో-ఏమో గొణుగుతూ దగ్గరించాయి

ఆ శరత్కాల నదులకు రాతి బండలే పిరుదులు హంస శ్రేణులే ముత్యాల సరాలు. పూదూళిరేఖే బంగారు మొలనూళ్ళు. మొలమీది నుండి నీరు అనే పావడ జారుతూ ఉండగా, ప్రబ్బలి తీగలనే చేతుల్ని సముద్రునివైపు ఆలింగనార్థం చాచాయి శరత్కాలపు కృశత్వం అనే విరహాకృశత్వంతో-శరత్కాలపు ఎండవలన వేడి అనే విరహ వేడిమితో-తుమ్మెదలనే కాటుక సహితమైన ఆనంద బాష్పాలతో కూడుకున్నాయి. వంటకాలువల కోసం ఏర్పరచిన కలుజులు అనే నిట్టూర్పులు కలవై-ఎర్రకలువలు అనే అలుక చూపులతో ఒప్పారాయి. సముద్రుడు తన కాలువ అనే చేతితో-శరన్నదుల తామరలు అనే పాదాల్ని స్పృశించడం అనే నమస్కారం చేయగా సంతోషపడినవై-కలువల మకరందపు పెద్దఅలతో సముద్రుని మీదపోయి పడి పురుషాయిత క్రీడతో అతనికి నీరు ఉబకడం అనే ఆనందాన్ని పెంచాయి.[183]

## యామున ప్రభుని దిగ్విజయం

ఇలా శరత్సమయం ప్రవర్తిల్లగా క్షత్రియ ధర్మాన్ని అంగీకరించిన యామునుడు దిగ్విజయ యాత్ర తన ధర్మమని ఆరు విధాలైన బలాల్ని తోడ్కొని, సామంత రాజుల్ని వెంటబెట్టుకొని,[184] రాజైన

బ్రాహ్మణుడు (యామునుడు) రథగజ హయసేనలు భూమినంతా ఆక్ర మించగా, వాటిభారంవల్ల శేషుని పడగలమీది మణులు భూమిలోనికి చొచ్చి భూమిలోని మణులకు తోడుగా నిలిచిపోయాయి. యామునుని కాల్బలం యొక్క ఈటెలకు కట్టిన జెండా గుడ్డల గాలిదెబ్బలకు ఘూర్ణిల్లుతూ ఉండే సముద్రపు అల్లకల్లోలపు మోతను అతని సేనా వాద్యాల మోత మించగా దిగ్విజయయాత్ర చేసి యుద్ధాల్లో శత్రు సంహారం చేశాడు.[185]

దిగ్విజయానంతరం యామునాచార్యుడు యజ్ఞాలు చేసి దానాలతో నానాదేశ విప్రుల్ని తనియజేస్తూ సంపన్నతతో నిత్యం బహుభోగోన్నతుడై - అశంకతో (జ్ఞానభక్తి వైరాగ్యాల్ని) అదమరచి ఉన్నాడు[186]

యామునుని రాజ్యంలో-పరాజయాలు-శరణుచొరడం అనేవాటికి సూచకాలైన కసవు గరచడం, చేయెత్తి మొరపెట్టడం అనేవి ఏనుగుల చేష్టల్లో మాత్రమే మిగిలాయి. కలహాలకు సూచకాలైన 'అట్లట్లు పడ మెడ బట్టి త్రోయుట'- మెల్లమెల్లగా నడిచే విటుల్ని పండుగ తలంటులకు తీసుకువెళ్ళే వెలయాండ్ర సోదరుల పరిహాస చేష్టల్లో-మాత్రమే ఉన్నాయి.

అపరాధులకు శిక్షలైన సున్నమెత్తడం సౌధనిర్మాణంలోను, పట్టుకార్లతో పట్టడం-బంగారు నగల తయారీలో మాత్రమే ఉపయోగ పడుతున్నాయి.

పీకుల కృత్యాలైన నడుముకు కాసె చుట్టడం, కత్తిదాల్చడం అనేవి-కోడి పందేల్లో వాటి కాళ్ళకు కాసె చుట్టడం, కత్తికట్టడంలో మాత్రమే మిగిలాయి.

ఇచ్చుకోవడం, పుచ్చుకోవడాలలో సమంకాని వాటిని సమం చేయడం, ఘర్షణ మొదలైన దోషాలు-బంగారు పరీక్షణ మొదలైన వాటిలోనే కనిపించాయి.

కన్నువేయడం (ఇతరుల వస్తువుల్ని కోరడం), మృదంగాది వాద్యాల ముఖాలకు నడుమ నల్లగా బిళ్ళలాగా పూతవేయడంలో మాత్రమే కనిపిస్తున్నది.

ధాతు వాదాలు (మోసం చేయడాలు) ఎక్కువగావడం వైయాకరణుల్లో మాత్రమే కనిపించింది. ఈవిధంగా రాజ్యంలో అయాదోషాలు పైచెప్పినచోట గాకుండా వేరేచోట్ల కనిపించకుండా యామునాచార్యుడు రాజ్యం పాలిస్తూ ఉన్నాడు.[187] (అంటే అతని రాజ్యం సుభిక్షంగా ఉంది)

ఇలా యామునాచార్యుడు రాజ్యపాలన చేస్తూ వుండగా-అతని పితామహుడైన నాథముని శిష్యుడైన శ్రీ పుండరీకాక్షుని ప్రియ శిష్యుడైన శ్రీరామ మిశ్రుడు-తన పరమ గురుని పౌత్రునికి ఇలాంటి (రాజ్యభోగ రూపమైన) బంధం ఎలా సంభవించింది? అని ఆర్తితో-ఇలాచింతించాడు.[188]

యామునుడు యోగసామ్రాజ్యం మరచిపోయి సామ్రాజ్యంపైన ఆసక్తుడయ్యాడు. అలాంటి మహాత్ముని వంశంలో పుట్టిన ఇతడిలా కావడం అతివ్యతిక్రమమం.[189]

పూర్వం యామునుని తాత నాథముని ప్రతిదినం ఘటికాచలంలో-సెలయేట నిష్ఠతో మూడువేళలా స్నానంచేసి, ఆహ్నికం (సంధ్యావందనాది కృత్యం) తీర్చుకొనేవాడు. ఘటికాచలం కొండదరిని ఏకాంత గుహలో దర్భాసనం మీద కూర్చొని - లక్ష్మీపతి చరణ కమలాన్ని ఆనందంతో ఒళ్ళు గగుర్పొడుస్తుండగా - బాష్పాలు రాలుతుండగా - హృదయ కమలంలో ధ్యానించేవాడు. పొద్దు పడమటికి మరలగానే జందెంతో తామరపూసల తావళంతో యోగపట్టంతో రొమ్ము ప్రకాశిస్తూండగా వెళ్ళి-ఘటికాచలనివాసి అయిన సుందరబాహు స్వామిని సేవించుకొని తిరిగివస్తాడు. అలావచ్చి ఇంట్లో పతివ్రత అయిన భార్య ముండ్లముస్తె కూర (అలర్కశాకం) వండగా, తన దేవతార్చన పెట్టెలోని శ్రీమన్నారాయణ మూర్తికి నివేదించి అగ్నిహోత్రం కావించి ఇలా దేహయాత్రను నడుపుతుండేవాడు [190]

విషయాసక్తుణ్ణి ఎలా బాగుచేయాలో తెలియక త్వరపడి-'విషయాల్ని వదిలెయ్' అని గురువు బోధించడం వల్ల-అతనికి గురువు మీద ద్వేషం కలుగుతుంది. మరేం చేయాలి? అతడే తెలివి కలిగి విషయాల్ని విడచి పెట్టేట్లు-అర్థమయ్యే విధంగా కథలు మొదలైన వాటిద్వారా ఒక క్రమంగా బోధించాలి.[191]

లోకంలో కన్నతండ్రే తన పుత్రాదుల దుర్వ్యసనం మాన్పాలంటే వసపడదట! మరి రాజ్య వ్యసనం వారించాలంటే పరుడు ఎలా శక్తుడవుతాడు?[192]

జింకను గొంతుకోతికి నెత్తురుతాగే సివంగిని నెత్తురు తాగేప్పుడే తరిమితే జింకను ఈడ్చుకొని పోతుంది-లేదా మీద పడుతుంది అలా గాకుండా జింకరక్తం తాగినంత వరకు ఊరకుండి-సివంగిని తరిమి జింకను తెచ్చుకొనే వేటకాడు లాగానే-విషయాలమీద అతని ఆశ తీరేంత వరకు ఉండనిచ్చి-తర్వాత అతణ్ణి విషయాసక్తి నుండి మరలించటం మంచిది.[193]

కాబట్టి, ఆలా ఓర్పుతో ఉండడం మంచి ఉపాయమే అయినా-ఇంక యామునుని ఉపేక్షించరాదు, ఏదో ఒక ఉపాయంతో అతని మనసుకెక్కి, అతణ్ణి విషయాసక్తత నుండి మరల్చ వలసిందే. లోకంలో ఆహారదోషం విజ్ఞాన నాశనానికి మూలంగాదా! అని శ్రీరామ మిశ్రుడు వితర్కించాడు.[194]

ముక్తికాంత చెవులకు పల్లేరు పువ్వులనే ఆభరణాలైన-పువ్వుల తోడి ముల్లు ఇంకామొలవని లేతముండ్ల ముచ్చింత కూరను, సమృద్ధిగా తీసుకెళ్ళి యామున ప్రభుని వంటబ్రాహ్మణుల చేతికిచ్చి 'ఒక వైష్ణవుడు కానుకగా పంపాడు' అని యామునునికి ఇమ్మని-శ్రీరామ మిశ్రుడు చెప్పి పంపాడు. యామున ప్రభుడు ప్రియపడి ఆ అలర్కశాకం వండించి భోంచేశాడు. ఇలా కొన్నాళ్లు జరిగింది.[196]

ఒకనాడు యామున ప్రభువు భోజన సమయంలో అన్ని కూరల్ని రుచిచూస్తూ ఆ అలర్కశాకం నంజుకొంటూ-ఈ శాకం తెచ్చే భాగవతుణ్ణి భోజనానంతరం నాకు కన్పింపజేయండి' అని పలికాడు. భోంచేసి పాణిపాద ప్రక్షాళన, ఆచమనం ఆచరించిన తర్వాత-శ్రీరామ మిశ్రుణ్ణి కన్పింపజేసుకొని. నమస్కరించి, 'మీరు వచ్చిన పనేమి'? అని అడగగా శ్రీరామ మిశ్రుడు ఇలా అన్నాడు.[197]

'ప్రభూ! మీ పెద్దలు కూర్చిన విశేషం ఒకటి కావేరి జలాంతర్ద్వీపంలో ఉంది. ఆ విశేషాన్ని నీకు చూపడానికి నేను వచ్చాను'.[198]

'నాకెందుకు నిక్షేపం? అనవద్దు। నిధులు, గనులు రాజులసొమ్మేలే కాబట్టి విన్నవిస్తున్నాను' అని నిక్షేపం వివరం వివరించి.[199]

రాజా! ఆనిధికి పడగలపై రత్నాలు ప్రకాశిస్తూవుండే కాంతమైన తెల్లత్రాచుపాము చుట్టుకొని ఉంటుంది. (శ్రీరంగనాథున్నే కవినిధిగా చెప్తున్నాడు. ఆ అర్థంలో - శ్రీరంగనాథస్వామి మణి ప్రభాభాసంతో సహస్రఫణాధరుడు, శ్వేతవర్ణుడు అయిన శేషాహిపై శయనించి ఉంటాడు)

అనిధి పూర్వం రాక్షస గ్రహీతం అనే ప్రసిద్ధి ఉంది. అయినా ఆరాక్షసుడు ఇప్పుడు ఆరు నెలలు మాత్రమే ఆ నిధివద్ద ఉంటాడు. (విభీషణుడు శ్రీరంగనాథున్ని ఆరునెలలకో, సంవత్సరానికో వచ్చి సేవించి వెళ్తూ ఉంటాడు)

ఆ నిక్షేపం ఏపాటి బలి ఇచ్చినా లభిస్తుంది ప్రాణి హింసాది పూజలకు అశపడదు. (శ్రీరంగనికి సాత్త్విక పూజ కొద్దిగానైనా చాలు)

ఆ నిక్షేపం కాంతి నిర్యంజనం లేని కంటికే కనిపిస్తుంది. అయినా ఇంతా అంతా కాదు. నిరంజనుడు అంటే పరమాత్మ కాబట్టి-పరమాత్మను బుద్ధిచేత ధ్యానిస్తే తెలుస్తుంది. (రంగధాముని మహస్సు అనంతమైనది).

ఆ నిధిమీద అనర్ఘమైన ఒక రత్నం మెరుస్తూ ఉంటుంది. (కౌస్తుభమణి శ్రీరంగనాథుని రొమ్ముపై ప్రకాశిస్తూ ఉంటుంది) అనిధిలో పద్మసంఖ్య గల, శంఖం సంఖ్యగల ధనం ఉంది. (స్వామిబొడ్డులో పద్మం చేతిలో శంఖం ఉన్నాయి). పెక్కు మాటలేల? ఆ నిధి అక్షయం అనంతం. అద్వయం (స్వామి అక్షయుడు, అనంతుడు, అద్వయుడు) ఆ నిధిని నీకొకనికే తప్ప మరెవ్వరికీ చూపరాదు'. (నీవు ఏకాంతంలో ఆ స్వామిని చూడాలి).[200]

అని శ్రీరామమిశ్రుడు యామున ప్రభునికి విన్నవించాడు అతడు సంతోషించి, సేనా సమేతుడై శ్రీరంగానికి వెళ్ళి ముందు కావేరిలోను, చంద్రపుష్కరిణిలోను స్నానంచేసి, రంగనాథుని సేవించి-సాభిప్రాయంగా తనను యామునుడు చూడగానే శ్రీరామమిశ్రుడు ఇలా అన్నాడు.[201]

'మీ పెద్దలు కూడబెట్టిన నిక్షేపం ఇదే! గ్రహించు' అని శ్రీరంగపతి శ్రీపాద యుగ్మం చూపుతూనే-రాజు బలవంతంగా భ్రమను తొలగించబడిన వాడయ్యాడు [202]

యామునుడు హఠాత్తుగా తన పూర్వదశ తలచుకొని-ఇన్నాళ్ళు తన ప్రమాదానికి పరమ నిర్వేదనం పొంది, 'నీవెవరు? అని శ్రీరామమిశ్రుణ్ణి అడిగాడు. శ్రీరామమిశ్రుడు నేను మీ పితామహుడయిన నాథముని ప్రశిష్యుణ్ణి ఆ యోగివరుడు భవిష్యత్తులో జరుగబోయే మీ జన్మను గురించి తెలుసుకొని, భాగవతశ్రేష్ఠుడవైన నీచేత ఈ విశిష్టాద్వైతం సకల ప్రాణిహితంగా వర్ధిల్లుతుంది అని విశ్వసించుకొని - నీకు 'ద్వయం' ఉపదేశించమని తన శిష్యుడైన పుండరీకాక్షున్ని ఆదేశించాడు. ఆ పుండరీకాక్షుడు తన శిష్యుడైన నన్ను పిలిచి-భోగాసక్తుడివైన నిన్ను భోగాసక్తత నుంచి ఉపాయంగా తప్పించి-'ద్వయం' ఉపదేశించమని నన్ను పంపగా వచ్చాను ,అన్నాడు. యామునుడు శ్రీరామమిశ్రునికి సాష్టాంగ ప్రణామం చేసి, అతని చేత పంచసంస్కార సంస్కృతుడయ్యాడు. వెంటనే సన్యాసాశ్రమం స్వీకరించాలనుకొని స్కంధావారానికి తిరిగి వచ్చి, కుమారునిపై రాజ్యభారం పెట్టి, బంధుమిత్ర అమాత్య సమేతమైన బల చతుష్టయాన్ని, ప్రజల్ని అతనికి ఒప్పగించి ఇలా అన్నాడు.[203]

## యామున ప్రభుని రాజనీతి

'ఏసమయంలోనైనా విసుగకుండా ప్రజలకు రక్షాపరుడవు కావాలి అపన్నులు మొరపెడితే వారి కష్టాల్ని విని తీర్చు. కార్యభారం కాపురుషుల మీద ఉంచవద్దు.[204]

రాజు ప్రజల శ్రేయస్సుకోరితే ప్రజలుకూడా రాజుమేలు కోరుకుంటారు. దానివల్ల ఏం ప్రయోజనం అనరాదు ఎందుకంటే-బ్రాహ్మణాది ప్రజలు ఏకరూపంగా కోరే అభిలషితాన్ని-వారిలోపలి పరమాత్ముడు రాజుకు తప్పక తీరుస్తాడుగదా![205]

భూపతికి ఆజ్ఞ కావాలి. అడవిలో గొల్లలు, కోయలు మొదలగు పాలెగాండ్రకు ఆజ్ఞ చెల్లుతుంది. ఎలాగంటే-వారు ఎవరికైనా అభయమిస్తే వానిచేతికి ఒక అంపకట్టెను గానీ-మాఱుపోగుమగానీ ఇస్తారు. దానివి చూస్తే వారిప్రజలైన దొంగలు వానిని చెనకరు అని ప్రసిద్ధి. అలాంటి వారికే ఆవిధంగా ఆజ్ఞలు చెల్లేటప్పుడు సార్వభౌముడైన భూపతి ఆజ్ఞకు ఎల్లవారు తల్లడిల్లవద్దా![206]

దుర్గాల్ని నీకాప్తులైన బ్రాహ్మణోత్తములకే ఇవ్వు! దుర్గాలు కలిగిన వారిమీద ఎలాంటి శత్రువులు వచ్చినా వారిని నిర్భయులై సంచరించ దానికి, ఆదుర్గాధిపతులకు నీ అనర్ఘల -ధిగాజ్యం ద్వారా ఆ దుర్గాలకు కావలసిన సైన్యాదులను సమృద్ధిగా ఉంచు అల్పంగా ఉంచవద్దు [207]

ఎంతమంచివానినైనా మొదటనే గొప్పస్థితిలో ఉంచి-తర్వాత తగ్గిస్తే-వాడు తన మునుపటి హీనదశను గుర్తించడు తనకు ఇప్పుడు స్థితి తగ్గించినందుకు-రాజుమీద అలుగుతాడు. కాబట్టి ఎవరినైనా వాని నడవడి కని పెడ్తూ-క్రమంగా వృద్ధికి తెస్తూ-వేళవేళ పనులు చేయించు కోవాలి.[208]

నీ దొరతనం నీకే ఉండాలని అభిలషించే వాడివైతే బ్రాహ్మణున్నైనా సరే-ఉత్తమ వంశస్థుడు కాని వాన్ని-కిరాతక వాడల్లో నివాసం ఉండేవాడివి శ్రుతం (గురువువల్ల వినికిలేని వాడు) లేనివాణ్ణి-భయం లేకుండా బొంకు పలికేవాణ్ణి-చంపనుద్యుక్తుడైన వాణ్ణి (ఆతతాయిని)-గడుసువాణ్ణి-అన్యదేశ్యుణ్ణి-అధర్ముణ్ణి త్యజించు.[209]

కిరాతుల పల్లెల్లో నివసించే జాతిభ్రష్టుడైన బ్రాహ్మణున్ని దగ్గరికి చేర్పవద్దు. పూర్వం భ్రష్టయిన విప్రుడు ఒకడు తనను రక్షించిన కొంగపైనే ఒకపూట కూటికోసం ద్రోహం తలపెట్టాడు గదా। (గౌతముడనే విప్రుడు జాతిభ్రష్టుడై కిరాతక వాడల్లో నివసిస్తూ ధనాతురుడై ఒక సార్థవాహంతో పాటు వెళ్తూ ఉండగా-వనగజం ఆ బాటసారుల గుంపును చంపేసింది. అతడు ఒకమర్రిచెట్టు చేరాడు. ఆచెట్టులో ఉండే నాడీజంగుడనే కొంగ అతనికి ధనమిచ్చి భోజనం అమర్చింది. తర్వాత అతడు మర్నాటి పయనంలో

భోజనంకోసం నిద్రపోతున్న ఆ కొంగను చంపి రెక్కలు పీకివేసి మాంసం గుడ్డలో మూటకట్టుకొని పోయాడు. ఈ కథ భారతం శాంతిపర్వం మూడో అశ్వాసంలో వుంది.[210]

బాగా విద్యనేర్చి, రాజనీతిశాస్త్రం బాగా తెలిసి అధర్మభీతి కలిగి ఉండి వయస్సు డెబ్బయ్‌కి లోపు ఏభైకి పైనా ఉండి, అంతకు మునుపు రోగాలులేని పూర్వులు కలవారై, నిరహంకారులుగా ఉండి, రాజు ప్రార్థన మీద అమాత్య పదవి గ్రహించి రాజ్య కార్యాల్ని నెరవేర్చే బ్రాహ్మణులు లభిస్తే, రాజ్యాంగాలు (స్వామి, అమాత్య, సుహృత్, కోశ, బల, దుర్గాలు) బలియాలవడానికి ఒక్కపూట చాలదా?[211]

అలాంటి మంత్రివర్గం దొరకకుంటే[212]-రాజనీతిని అనుసరించి రాజు తానే పనులు చేసుకోవాలి-అపనులు నెరవేరినా సరే-నెరవేరకున్నా సరే! అలాగాకుండా, ఇంతకుముందు చెప్పిన గుణాలు లేని వానిని, పరాయి వానిని తెచ్చి మంత్రి అని గుణహీనుణ్ణి పోషిస్తే, వాడు రాజాజ్ఞకు లోబడక తానే స్వతంత్రుడౌతాడు. ధరించడానికి శక్యంగాని గుమ్మడి కాయంత ముత్యమై రాజు మనస్సును బాధిస్తాడు. తర్వాత రాజు అతని చేతిలో బలికేవాడౌతాడు కాబట్టి మంత్రి లేకుండానైనా రాజు ఉండవచ్చు గానీ-గుణహీనుడైన మంత్రిని అధికారంలో ఉంచకూడదు.[213]

ఒకదారే చేయవలసిన గొప్ప కార్యానికి పలుగురు దొరలను నియమించడం మంచిది. ఒక్కొక్క దొరవెంట అతని అప్తులుంటారు. కాబట్టి, పనులు సులభంగా అవుతాయి దొరల్ని తగ్గిస్తే వారికి కక్కసంగా ఉంటుంది దొరలసంఖ్య పెంచితే వారికే బాధా ఉండదు.[214]

గొప్పపని ఏదైనాసరే – కేవలం ధనంవల్లనే సాధ్యం కాదు. పలువురు దొరలు ఆపనిని అక్కరతో సాధించాల్సి ఉంటుంది. ఆ దొరలు తనకు వశ్యులు కావడానికి రాజుయొక్క అలోభం, సజ్జనత్వం, సత్యం తోడ్పడతాయి.[215]

లోకంలో ధనం, సైన్యాలు మొదలైన రాజ్యాంగాలు ఉండికూడా తగిన మనుష్యులు లేక దేశం చెడిపోగా-శత్రువునకు ఒదిగుండిన రాజులు ఎందరో ఉన్నారని మనం వినలేదా?[216]

రాజు విప్రుణ్ణి గొప్ప అధికారంలో నియమించడం వల్ల మేలే పొందుతాడు. ఎందుకంటే-క్షత్రియుల, శూద్రుల వతిహాసానికి భయపడి అయినా, సేవించి బ్రతికే బ్రాహ్మణధర్మం తెలిసి అయినా పూనిక వహించి రాజుకు కష్టాలలో తోడ్పడతాడు. కాబట్టి బ్రాహ్మణున్ని అధికారి చేయడం రాజుకు హితం.[217]

నీకోసం ధనం ఆర్జించే అధికారాన్ని-దేవాలయధర్మాధికారాన్ని రెండింటినీ ఒకనికే ఈవద్దు. అతడు ధనార్జనకోసం రాజుభూమిలో నష్టం వస్తే ఆ నష్టానికి బదులు దేవాలయాది ద్రవ్యాన్ని రాజు భాండాగారానికి పంపుతాడు. అందువల్ల రాజుకోసం ధనం ఆర్జించే అధికారం లేని వానికి-దేవాలయ ధర్మాధికారం ఇవ్వు అతడు దుర్బుద్ధితో దేవాదిద్రవ్యం కొంత తిన్నా వాడే నశిస్తాడు-ఆదేవాదిద్రవ్యం రాజు బొక్కసం చేరదు కాబట్టి రాజుకు చెడు కలుగదు[218]

వేద్యగాడు-మొదట పొలం స్వాధీనం చేసుకొని. తర్వాత దానికి సరిహద్దుగా ముండ్లకంచె నాటి. అనంతరం చేను దుక్కి చేయడానికి అను వయ్యేట్లు-వేరులు. గడ్డలు గుద్దలితో తవ్వేస్తాడు. అలాగే రాజు కూడా ముందు దేశం స్వాధీనం చేసుకొని. ఎల్లలు కాపాడుకొని-దానిపైకి బయటి రాజులు రాకుండే దానికి శత్రురాజులతో చెలిమి చేసుకొని-తన దుర్గాల బలాన్ని ఆశ్రయించి అయినా బయటి భయం లేనివాడై తన రాష్ట్రంలోని క్షుద్రశత్రువుల్ని నిర్మూలించడం మంచిది.[219]

కొండెలు పలికేవాణ్ణి. అసత్యం పలుకుతున్నాడని నీకు తోచగానే తూలనాడి నీవద్దకు రాకుండా చేయవద్దు. వానిమాట సత్యమో కాదో నీమనస్సులో చక్కగా ఆలోచించి, పైగా పరమార్థు శోధించి, అసత్యమే అని నిశ్చయమైతే-వానిని పనిమంతు-తొలగించక ఒకపక్క పెట్టఉంచాలి.[220]

ప్రవేశించి, సాధించ శక్యంగాని పర్వతారణ్యాల్లో నివసిస్తూ రాజ్యపీడచేసే ఎఱుకుల పొరుగూళ్లను, సిరిలేని వరాయి కూరులకు ఎరువుగా ఇవ్వు. ఆ కూరులు ఎఱుకులు పరస్పరం ఏమైనా సరే.[221]

విశేషించి పార్వతీయబలం తనలో చేరనట్టి రాజుకు ప్రజాబాధ తరుగదు. ఎలాగైనా సరే వారికి బెదురుతూన్ని. దగ్గరకు చేర్చుకోవాలి. అవిశ్వాసం-విశ్వాసం, కోపం-స్నేహం, అతివైరం అత్యనుకూలం-ఇవన్నీ వారు అల్పులు కాబట్టి స్వల్ప కారణాలతోనే వారికి కలుగుతుంటాయి.[222]

ఒక భిల్లుడు విల్లుచేతబూని మిత్రుడింటికి వెళ్ళాడు. మిత్రుడు వీనికి తనింట్లో పాలతో అన్నం పెట్టాడు. ఇంటో వారు ఉడుకుతున్నది. అతిథిగా వచ్చిన భిల్లుడు చూసి-అది మాంసం అని భావించి-తనకు పెట్టలేదని మిత్రునిపై అన్నం పెట్టిన విషయం మరచిపోయి-కోపం పెట్టుకొన్నాడు. తనను సాగనంపను వచ్చినప్పుడు దారిలో ఎక్కడో ఒక చోట చంపాలనుకున్నాడు. ఇంతలో మిత్రుడు 'నార చెడిపోతుంది! నాకు సెలవు ఇవ్వు' అన్నాడు. అతిథిగా వచ్చిన భిల్లుడు అర్థం చేసుకొని, మిత్రుణ్ణి చంపకుండా సెలవిచ్చి పంపాడు.[223]

అటవికులు పాలన్నం పెట్టిన మాత్రానికే-ఒకమాట పలికితే తప్పరు. దోషం విషయంలో ఎంత కొంచెం దోషం కనిపించినా-ఈ పని ఏంత? అనకుండా అలుగుతారు.[224]

సత్యం తప్పని రాజుకు అటవికులు వశీకృతులౌతారు. వైరిరాజు మైత్రి అతని దూత సన్మానంతో సంభవిస్తుంది-అంటే సన్మానితుడైన ఆ దూత ఈ రాజు గుణాల్ని శత్రురాజువద్ద పొగిడి అతణ్ణి అనుకూలుణ్ణి చేస్తాడు. కాల్బంట్లకు ప్రేమతో సమయానికి జీతమిస్తే వశులౌతారు. రౌతులు బహుమానం తోడి కొలువుద్వారా రాజుకు వశమౌతారు.[225]

ఉత్తమాశ్వాన్ని, ఉత్తమ గజాన్ని నీ ఆప్తుడైన భటునికే ఇవ్వు! అందువల్ల సమయం వచ్చినపుడు నీకు మేలు కలుగుతుంది-అంటే వాటిని నీసేవకు అతడు తెస్తాడు. అశ్వశాలను, గజశాలను జాగ్రత్తతో కాపాడు. ఎప్పుడుగానీ వాటిని దొరల వశంలో వదలవద్దు.[226]

ఒకడు ఒక పనిని-సరిగా కనిపెట్టి సభలో నీకు తెలిపినపుడు, వానిమీద ద్వేషంతో మరొకడు ఖండిస్తాడు. నీవు ఆ కారణం కనిపెట్టి

ఆ ఇద్దరి మాటల్ని నిషేధించకుండా సంభావించి పంపు. కొలువు చాలించి పిమ్మట మొదటివాడు చెప్పినదాన్నే అవలంబిస్తే-మేలు కలుగుతుంది.[227]

దుష్టసచివులు తమ రాజు పీడిక-రాష్ట్రం బయటి రాజుల్ని రెచ్చగొట్టి, రాష్ట్రంలోపల దొంగలను వర్ధిల్లచేసి, రాజును తమచేతుల్లో ఇరికించుకొని, అతనికి తాము తప్ప వేరే దిక్కులేనట్లు చేసుకొని భయం లేకుండా వ్యవహరిస్తారు.

ఆ దుష్టసచివులు ఆత్మవశులకు రాజుచేత ఇప్పిస్తారు. ఇతరులకు ఇవ్వకుండా చేస్తారు రాజును మాట తప్పిస్తారు రాజు ఇలాంటివాడు అనిచెప్పి - ఇతరులు నమ్మి రాజువద్దకు చేరనీకుండా చేయడానికే ఇలా చేస్తారు.[229]

చక్కగా దీపిస్తూ ఉండే జఠరాగ్ని-కఫం మొదలైన దోష ప్రకోపంతో మందమయినపుడు - బయటమందు ఆదోషాన్ని అణచి-ఆమాంద్యాన్ని పోగొట్టి-మళ్ళీ జఠరాగ్ని దీప్తి కలిగిస్తుంది ఈ దుస్సచివులను అణచడానికి సమర్థుడైన యోగ్యుణ్ణి ఇతరుణ్ణి తెచ్చుకుంటే-ఆవచ్చిన వాడు దుష్టసచివుల భరతంపట్టి రాజు అధికారాన్ని తేజరిల్లజేస్తాడు[230]

ఆ దుష్టసచివులనతిక్రమించి వేరొకణ్ణి ఉద్దిపేయడం ఎలాగంటే-[231]

పండితుడు. పరాక్రమవంతుడు అయిన రాజుకు భాండాగారంతో పాటు. అశ్వాలు, ఏనుగుల సమూహాలు తన సొమ్మై-వాటి ఆశ్రయాల్లో అవి ఉండగా-ఆ దుష్టసచివుల బెడద తప్పుతుంది-అంటే రాజు చేతిలో చతురంగ బలం ఉంటే దుష్టసచివుల్ని దండించవచ్చు-దుష్టనిగ్రహ సమర్థుడు కావచ్చు.[232]

అధికారులు తమకడుపునకు ఒకకడి తగ్గినా రాజును చెడజూస్తారే గాని-రాజుకు వాస్తవంగా మిత్రులులేరు. వారి దౌష్ట్యం భరించలేక వారిని అణచినా-స్వతంత్రులుగా పోనీయకూడదు. వారి దండచేతిని పట్టుకొనే పరిపిస్తుండాలి [illegible] వ్యవహరిస్తూ. జీవనభంగం చేయకుండా దయతో కాపాడుతూనే ఉండాలి.[233]

ఒక అపకార్యానికి ఏవగించక ఒడడాన్నిబట్టి-తక్కిన వర్తనాల్ని కూడా రాజు ఊహించుకోవాలి. ద్రుపదుడు ద్రోణుణ్ణి చంపడానికి కారణ యజ్ఞాన్ని చేయమని యాజుడు, ఉపయాజుడు అనే మునుల్ని అడిగాడు. ఉపయాజుడు తాను చేయనని-తన అన్న యాజుడు చేస్తాడు అంటూ దృష్టాంతంగా అపవిత్రమైన నేలమీద పడిన పండును తాను గ్రహించ లేదని, తన అన్న తీసుకొన్నాడని చెప్పాడు. అంటే ఒక అకార్యం చేయగలిగేవాడు మరే అకార్యం అయినా చేయగలడు అన్నదానికి ఈ కథ దృష్టాంతంగా చెప్పబడింది యాజుడు యజ్ఞం చేయించాడు. ఈ కథ భారతం లోనిది రాజు ఒకటి దృష్టాంతంగా చూసి తక్కినవి గ్రహించా లని, అన్నీ తెలుసుకోవడం అశక్యమని చెప్పబడినది.[234]

నీ కష్టసమయంలో ఎవరైనా కీడుచేయ తలపెట్టితే-వానిని నీకు ఆకష్టం తప్పి గెలుపు గలిగిన తర్వాత వానిని హింపించ వద్దు వాని సిరి మాత్రం తీసుకో. అప్పుడు వాడు మదమణగి, కోరలు పెరికిన పాములా మరేమీ చేయలేకుంటాడు. అలాంటి నీదయకు-నీ వైరి కూడ నిన్ను నమ్ముతాడు. నీ పక్షంవాడే అవుతాడు.[235]

దేశ వైశాల్యం ధనప్రాప్తికి కారణం. భూమి శాస్త్ర అయినా వరే-గుంటలు నిర్మించి, కాల్వలు త్రవ్వించాలి పేదలకు అరికోరులు (అరి-ధనరూపం అయిన పన్ను, కోరు-సస్యరూపమైన పన్ను) ఇతరుల కన్నా తక్కువగా నిర్ణయించాలి. అలాచేసి పేదవానిని వర్ధిల్లచేస్తే వానివలన అరికోరులు సమృద్ధిగా వస్తాయి వాణ్ణి బాగుచేసిన ధర్మం కూడా రాజుకు అబ్బుతుంది.[236]

కష్టపడి-సేద్యాలు మాని-పసులను, ఇండ్లను, ధాన్యాన్ని వదలు కొని పోయే జనులను-అధికారులు ఉపేక్షించరాదు. వారిని పిలిపించి పాయపడి - సేద్యానికి తగిన పరిస్థితులు కల్పించి-కోల్కొనేట్లు చేయాలి. అంతేగాని వారిని రప్పించి ఆడుకోకుండా-వారిపశువుల్ని, ధాన్యాన్ని అమ్మి వారి ఇండ్ల కలప వంటచెరకుగా వనికివస్తుందని సంతోషించే-యుద్ధరంగం లోని నక్కలాంటి అధికారి రాజువద్ద ఉంటే-ప్రజలు అతిత్వరలో చెడి

పోతారు, రాజుకు ఆదాయం కూడా శూన్యం అవుతుంది. అలాంటి అధికారుల చేతిలో రాజు పదుదీవులు జయించి ఇచ్చినా సరే సమృద్ధిఉండదు.[237]

రాజు తన ఆదాయాన్ని సమంగా నాలుగుపాళ్ళు చేయాలి. ఒకపాలు సమృద్ధమైన త్యాగానికి, తనభోగానికి వినియోగించాలి. ఉగ్రమైన సేన రక్షణకోసం రెండుపాళ్ళు వినియోగించాలి. బొక్కసం నిండడానికి ఒకపాలు ఉపయోగించాలి. చారుల ద్వారా వైరి పక్షం వారియొక్క-తనమంత్రులు మొదలైన వారియొక్క రహస్య వృత్తాంతాన్ని పరిశీలించాలి. తనరాజ్యంలోని దొంగల్ని సంహరించాలి.[238]

తలవరుల సమూహాన్ని లాలనతో ఏలి. వారివల్ల దొంగను తెలుసుకొని వెంటనే దండించాలి. అలా చెయకుండా చెరలోనే ఉంచి, దండన విధించడంలో ఆలస్యంచేస్తే వాడు ఈగోపల కొఱ్ఱు (శూలం) తప్పించుకొని పోతాడు. తమ అజాగ్రత్తకు రాజు దండిస్తాడని భయపడి ఆ తలారులు మరెవరినైనా తెచ్చి చెరలో ఉంచుతారు. ఆ మార్పు తెలియకుండా రాజు దండన విధిస్తే ఆ బదులు వానిని శిక్షకు పాత్రం చేస్తారు. ఇలా జరిగితే కొరత వేయబడిన లావుపాటిశెట్టి న్యాయం లాగా రాజుకు అమితమైన అపకీర్తి కలుగుతుంది. కాబట్టి దొంగ దొరికిన వెంటనే వాణ్ణి దండించాలి (శూల పృథు వణిఙ్న్యాయం అంటే-పంచమహాపాతక పట్టణాన్ని అవకతవకి రాజు ఏలుతున్నాడు. ఒకడు తాను ఇల్లుకోసం మట్టిఇల్లు కట్టుకోగా-అడివానకు కూలింది. వాడు అపరాధిని దండించాలని రాజుకు మొరపెట్టుకున్నాడు. రాజు అపరాధి ఎవరంటే అవివేక ప్రధాని 'మేఘుడు' అన్నాడు. మేఘుణ్ణి కొరత వేయండి అన్న రాజాజ్ఞకు 'పొగవల్ల మేఘుడయ్యాడు కాబట్టి పొగదే తప్పు' అన్నారు. పొగను కొరత వేయండి! అన్నాడు రాజు. ఒక సభ్యుడు 'పొగకు కారణం కుమ్మరి ఆవం' అన్నాడు. అయితే 'ఆవంను' కొరత వేయండి అన్నాడు రాజు. ఆవం లేదు-దానిని పెట్టిన కుమ్మరి ఉన్నాడు' కుమ్మరిని కొరత వేయడానికి రాజాజ్ఞ అయింది, కుమ్మరి 'ఫలానా వారింట్లో పెండ్లి - వేమ అరివేణి కుండల కోసం ఆవం పెట్టాను. మీరు 'పెండ్లి కుమారుని కొరతవేయాలి'. అని తలారులతో వాదించాడు. రాజామాటవిని 'పెండ్లికుమారుని కొరత

వేయండి' అన్నాడు. ఆ పెండ్లికొడుకు కొఱ్ఱు చూసి 'అయ్యా' కొఱ్ఱు లావుగా ఉంది. నేను సన్నగా ఉన్నాను. నన్నెలా కొఱ్ఱువేస్తారు? అన్నాడు. రాజు ఆ వాదం విని 'ఆ కొఱ్ఱుకు తగిన లావుగల వానినే వేయండి' ఇదే ఆజ్ఞ మరిరాకండి అన్నాడు తలారులు లావుపాటి శెట్టిని ఒకణ్ణి పట్టుకొని కొఱ్ఱెక్కించడానికి తీసుకపోయారు. అతడు ధనం ఇస్తానన్నా 'మేము రాజాజ్ఞ మీరుతామా? లంచం తీసుకుంటామా? ధర్మస్థాపన జరగ వద్దా? అని వాదించి అతన్ని శూలం ఎక్కించారు. ఈ కథవల్ల నీతి ఏమంటే- అపరాధి తప్పించుకోవడం రాజుకు ఒక అపకీర్తి హేతువు. నిరపరాధి దండనకు గురికావడం మరొక అపకీర్తి హేతువు-అని గుర్తించాలి).

రాజు ఎప్పుడూ నీతిమార్గం విడువకూడదు. తెలుసుకోవాల్సిన విషయాల్లో ముఖ్యాతికవంతు తానే స్వయంగా తెలుసుకోవాలి. తనకు తెలియని నాలుగో పాలు ఆప్తమిత్ర బృందంవల్ల తెలుసుకోవాలి. ఇలా చేస్తూ తన అభిమతమే చెల్లాలి అనే దురభిమానాన్ని ఎప్పుడూ పెట్టుకోకుండా తనకు ఆపదలు వస్తే పరాధీనుడు కాక. క్రూర దండనలు వేయకుండా ఉండాలి. అలాచేస్తే రాజు చిరకాలం సుఖంగా రాజ్యం చేస్తాడు.[240]

ఎలుగుబంటి ఎలాగైతే చెట్టుకొనమీద పరుండి ఒక కన్ను మూసుకొని నిద్రిస్తూ, మరో కన్ను తెరచి మేల్కొని ఉంటుందో అలాగ రాజు భోగాలు అనుభవిస్తూకూడా అంతర్బహిశ్శత్రువులను ఒక కంట కనిపెట్టే ఉండాలి.[241]

నవ్యాసులు, జడదారులు, మొదలైన వారి విద్యకు మెచ్చి ధనం, గ్రామాలు ఇవ్వవద్దు. అలా ఇస్తే వారు గర్వించి తమ నియమాల్ని తప్పి తిరుగుతారు. అలాచేస్తే దేశంలో కరువులు, రోగాలు, శిశుమరణాలు లాంటి అనర్థాలు సంభవిస్తాయి. అందువల్ల వారిని రాజు ధనాదులీకుండా భక్తితో పూజిస్తే చాలు. వారు తృష్ణాపరులై నీవేమీ ఈలేదని నీమీద క్షోభ పడినా ఆ క్షోభ నిన్నేమీ చేయదు. ఆ విషయంలో శంక వదిలిపెట్టు[242]

మరణదండనకర్హులైన అపరాధులు మన్నింపు వేడుకొనడానికి మూడుమార్లు అవకాశమివ్వు! తప్పించుకొని పోతే వానివల్ల నీకు కీడు

సంభవిస్తుంది అనుకుంటే-అలాంటి ముమ్మారు సెలవు ఇవ్వనక్కరలేదు. వానిని పట్టిపట్టించక మునుపే తలగొట్టించాలి [243]

రాజు తాను అతిశూరుడై ఉండికూడా ఇతరవీరుల శూరాలాపాల్ని వినే ఓపిక పట్టాలి. అలా ఓర్చుకున్నందువల్ల ఆవీరులు ఉత్సాహం తగ్గకుండా ఉంటారు. రాజు తన శూరత్వాన్ని తనదొరల్లోనే చూచుకోవడం మంచిది [244]

రాజు తనదేశానికి బయటి దేశాలనుండి గుర్రాలు. ఏనుగులు రత్నచందనమౌక్తికాదులు వచ్చేట్లు వర్తకం పెంచి, రేవుల్లో దిగుమతి కలుగజేయాలి. అనావృష్టివల్ల. రోగాలవల్ల. ఉపద్రవాల వల్ల బయటి దేశాలనుండి వచ్చే ప్రజలను-తనదేశంలో వారివారి జాతులకు తగినట్లు పోషించాలి తోటలు. దొడ్లు. గనులు ఆప్తులకు స్వాధీనం చేసి వారు వాటిని చూచుకొనేట్లు వినియోగించాలి [245]

అపరాధిమీద అదను వచ్చుదాక కోపం అపుకొని సరైన సమయం చూసి శిక్షించాలి. విలుకాడు ఎలాగయితే బాణాన్ని బలంగా లాగి-విడువకుండా పట్టుకొని-గురిచూసి లక్ష్యాన్ని భేదిస్తాడో అలాగన్నమాట. [246]

రాజు అల్పుడైన వైరిరాజు మీదకి తాను దండెత్తిపోయేటప్పుడు కొన్నిదినాలు చిన్నచిన్న ప్రయాణాలు చేస్తూ-ఏరు వెనుకనుండి వస్తున్న వరదవచ్చి తాకేవరకూ నిలుస్తూ-వరదవచ్చి తాకిన తర్వాత ప్రవహిస్తూ ఉన్నట్లు-తనసైన్యాలు ఒక్కటొక్కటిగా వచ్చి దారిలో కలిసే వరకూ ఆగుతూ, కలిసిన తర్వాత ముందుకు సాగుతూ వెళ్ళాలి. వైరిరాజు బలవంతుడైతే అతడు చేసే సత్కారానికి సంతోషించి తిరిగిరావాలి. చారుల ద్వారా ఆ వైరిరాజు అల్పుడు అని తెలిస్తే ముందుకువెళ్ళి ముట్టడించాలి. [246]

వైరిరాజు-బాధించి ధనం పుచ్చుకోవడం, నీచులతో ఆలోచన చేయడం, తనదేశంలో భాగాల్ని దండెత్తివచ్చిన రాజుకిచ్చి సమాధాన పరచుకోవడం, పూర్వం తనకు మేలుచేసిన వానిని ఆ హితం మరచి అహితులుగా శంకించడం-ఇలాంటి దోషాలు కలవాడు అయినప్పుడు-ఆవైరి రాజుమీద అతని సామంత రాజులు లోలోపల అసంతృప్తులుగా ఉంటారు.

అలాంటి వారిని విజిగీషువైన రాజు అభయోక్తి పూర్వకంగా రత్నాభరణాలు రహస్యంగా పంపి-వారిని వైరిరాజు నుండి చీలదీయాలి. రాజు తనలో అదోషాలు ఉండకుండా చూసుకోవాలి.[248]

రాజుకు బయటి శత్రువు చేసే కీడు కంటే తనపక్షం వారే వగబూనితే ఎక్కువకీడు చేయగలరు. అది పామువల్ల భయంకంటే చెడ్డది. కాబట్టి బయట వైరి కోరితే తాను ఏలే భూమిలో సగమిచ్చి అయినా - అతనితో దృఢసఖ్యం చేసుకొని స్వపక్షంవల్ల భయాన్ని మాన్పుకోవాలి.[249]

వేయిమాటలేల? రాజు ఎన్ని ఉపాయాల్తో అయినా తన రాజ్యంలో కంటకులను వెదికి-కనుగొని అచని సుందరీబృందం మధ్య ఉన్నట్లు నిర్భయంగా మెలుగుతుండాలి. అలాకాకపోతే రాజ్యం సౌఖ్యానికి కాదు 'దుఃఖలబ్ధికే రాజ్యం' అన్నట్లవుతుంది.[250]

ఎలాగైతే ఒడ్డున ఉండే గాలంవేసే వేటగాడు బలిష్ఠమైనచేప గాలానికి పడి వెనక్కి లాగుతూ ఉంటే అలాగే దాన్ని వెనక్కి పోనిచ్చి అది కురురుకొని ముందుకు వచ్చేటప్పుడు-చప్పున లాగి గట్టుమీద వేసుకొని గ్రహిస్తాడో-అలాగే రాజుకూడా బలవంతుడు ఎవరైనా తనను చేరకుండా బెదరి తిరుగుతూ ఉంటే, వానినప్పుడు అలాగే ఉండనిచ్చి, తర్వాత వాడే వచ్చేట్లు చేసుకొని, వాడు వచ్చినప్పుడు చేర్చుకోవడం పద్ధతి.[251]

రాజు ఈ చెప్పబోయే దోషాల్ని చేరనీకూడదు. దండనలో క్రూరత్వం. చాడీకోర్లు కొండేలు చెప్తే తర్కించకుండా వినడం. శత్రువు సంధి కోరినపుడు ఆ అవకాశం ఇవ్వకుండా విరుద్ధంగా ప్రవర్తించడం - దేశాంతర రాజు తనకు చేసిన చెడును చూచివచ్చి తనకు చెప్పిన విదేశ్యుణ్ణి చెరచడం, తనకు వికటించిన మంత్రికి తెలిపేటట్లు రాజ్య కార్యాల్ని నిర్వహించడం-

ఇమని అవిశ్వాసం తెలిసికూడా-వానితో కలిసి వ్యవహరించడం విశ్వసనీయుని దూరంచేయడం-మంత్రాలోచనలో మోమోటం పెట్టుకోవడం,

మంత్రాలోచన బయటపెట్టిన వాన్ని దండనచేయక ఉపేక్షించడం-ఉత్పాతం పుడితే వాటిని చక్కగా పరికించి శాంతి చేయకుండడం. పూజ్యుల్ని ఎప్పుడూ గౌరవించక పోవడం. విహీనులతో కూడుకొని ఉండడం. మద్యపానాది సప్తవ్యసనాలకు లోబడడం. మాత్సర్యం వహించడం-రాజుకు తగదు.[252]

దివ్యాలు, అంతరిక్షాలు, భౌమాలు అనే త్రివిధోత్పాతాలు పుడితే రాజు వాటి శాంతికి బ్రాహ్మణులకు భోజనాలు, దేవతలకు పూజలు అగ్నికి హోమాలు-చేయించడానికి గాను బహు ద్రవ్యాన్ని వినియోగించాలి.[253]

రాజు తన గొప్పఅధికారుల్లో, గొప్ప వీరుల్లో ఒకరిమీద ఒకరికి పోటీలు పెట్టాలి. అందువల్ల వారు రాజుకు చేసే హితాలు, అహితాలు బయటపడుతుంటాయి అంటే వాని రహస్యం వీడు వీని రహస్యం వాడు బయట పెడ్తుంటారు. అంతేగాక-వారు ఒకరిని మించి మరొకరు రాజుకు అహితం తలపకుండా ఉంటారు [254]

శత్రువులందరి మీదికి రాజు తానే స్వయంగా వెళ్లకూడదు. అందువల్ల తనకు విశ్రాంతిగా, తనకు బదులుగా దండెత్తి పోవడానికి ఒకణ్ణి దొరగా నియమించుకోవాలి ఆదొరకు కావలసిన సాధనాలు లేకుంటే వైరి చెదడు-కాబట్టి ఆ దొరకు కావలసినంత ధనం, దుర్గం, ఏనుగులు, గుర్రాలు మొదలైన వాటి సమృద్ధి ఉండే భూమి ఇవ్వాలి అలాట అధికారం బ్రాహ్మణేతరునికిస్తే అతడు రాజుమీదే అలుక వహించి తిరగబడతాడు. కాబట్టి దానిని బ్రాహ్మణునికే ఇవ్వాలి. అయితే బ్రాహ్మణేతరుడు కూడా అవసరమే అందువల్ల అతన్నికూడా పోషిస్తూనే ఉండాలి.[255]

నీ దేశపు ఎల్లల్లోఉండే అడవుల్ని వృద్ధి చేయించు! నీ దేశం పడుమనున్న అడవుల్ని - వాటిలో నెలకొని దారిదొంగలు, బందిపోట్లు ఇత్యాదులు జనులకు బాధ కలిగించనట్లు ఛేదించి బయలు చేయించు.[256]

అడవిలో దుర్గమ ప్రదేశాల్లో తిరిగే మన్నెపు ప్రజల తప్పిదాలు ఎన్నైనా ఉంటాయి-మట్టిగోడను ఎంతకడిగినా మట్టిపోనట్లు-వారిని ఎంత దండించినా-వారి తప్పులు తగ్గవు అలాగాక వారికి వస్తు వాహనాలు

కానుకిచ్చి, సత్యం తప్పక వర్తించి చెలిమి చేసుకోవడం మంచిది. అలా మైత్రి చేసుకుంటే రాజు తాను వైరులపై దాడివెడలేటప్పుడు-శాత్రి మన్నెపు దండు కూడా తోడు వస్తుంది. అంతేగాక తనపొలిమేరల్లోని రాజుల భూముల్ని ఈ రాజు మన్నెపు ప్రజలచేత కొల్లపెట్టించవచ్చు. అంతేగాని నూనమంచి చేసే తప్పుకు (శతాపరాధినికి) వెయ్యిమందికి దండన (సహస్రదండం) విధించడం సర్వం ఏలే రాజు చేయడం అతర్క్యం-అంటే తలపెట్టదగింతికాదు.[257]

ఏనుగుల్ని, ఉత్తమాశ్వాల్ని మొదలైన వాటిని తన రాజ్యానికి చేర్చే దూరద్వీపాల వణిజులకు-అవి తన వైరి రాజుకు చేరకుండా ఉండడానికి గాను-ఊళ్ళు సద్గృహాలు, నిరాజధానిలో కొలువు, ఉన్నతమైన మర్యాదలు, వెలలో లాభం కలుగజేసి-చిరపరిచితులైన మిత్రుల్లాగా-వివేకి అయిన రాజు చేసుకుంటాడు.[258]

పక్కదేశాల రాజుల రాయబారులతో కొలువులో సరససల్లాపాలు చేయాలి. కర్తవ్యాంశాల్ని యుద్ధప్రసక్తుల్ని (కార్య ఖడ్గాలు-అపక్క దేశపు రాజులు తనకు చేయవలసి ఉండికూడా చేయకున్న కార్యాలు-అందు కోసం వారిపై తనకుగల యుద్ధప్రసక్తి) తనమాటల్లో హెచ్చరికగా పలకాలి. అలా హెచ్చరిస్తూ తాను నటించే మైత్రితో తేలబలకాలి. (అవి ఏదో పొరపాటున జరిగాయని, పక్కదేశాల రాజులు మనకు కావాలని చేసినవి కావని తేలికగా పలకాలి)[259]

రాజు తాను కొత్తగా అధికారానికి తెచ్చిన వాణ్ణి వెంటనే మంత్రాలోచనలో చేర్చుగూడదు. అలా చేరిస్తే అతడు తన నూతన గౌరవం వల్ల ఉత్సాహంతో-ఆమంత్రాలోచనను మిత్రులకు చెపుతాడు. అది అంతటా తెలిసిపోతుంది. అందువల్ల, ఏకార్యంకోసం ఆ మంత్రాలోచన జరిగిందో-అది కొనసాగినా చెడిపోతుంది. మంత్రాలోచన బయట పెట్టిన ఆ దొరకూడా చెడతాడు.[260]

రాజు తనమేలు కోరేవారు, మహా విద్వాంసులు, వేదోక్తవిధుల్ని అతిక్రమించక నడచుకొనేవారు, శూరులు తనకు కుల క్రమాగతులై జీవనం వలిపేవారు అయిన బ్రాహ్మణులను దుర్గాధిపతులుగా ఏర్పరచాలి.

ఆ దుర్గాల్లో పులిజున్నులాంటి అపూర్వ వస్తువుల్తో కూడా కావలసిన సకల పదారాలు మూరేండ్లకు సరిపడేట్లు నింపించి పెట్టాలి. కొద్దిగా కూడా హెచ్చుతగ్గులు లేకుండా సామంత రాజులకు భూములివ్వాలి. బొక్కసం ఎలా కూర్చుకోవాలంటే-బొక్కసంలోకి వచ్చేధనం హెచ్చుగాను, దానిలో నుండి వ్యయమయ్యేది తక్కువగాను, దానికోసం ప్రజలను పీడించకుండా సమకూర్చుకోవాలి. వైరి రాజును అతడు క్షీణించి ఉన్నాడని-చారుల ద్వారా తెలుసుకొని, తాను నొవ్వకుండా, తన ప్రజలు నొవ్వకుండా కొంగ బొటుక్కున చేపను పట్టినట్లుగా హఠాత్తుగా పోయి పట్టుకొని, అతని రాజ్యాంగాల్ని చీకాకు పరచాలి. అలాచేసే రాజు గుండెమీద చేయుంచుకొని నిద్రపోగలడు [261]

ఏనుగుల, గుర్రాల వెలకు, వాటిమేతకు, కాల్బంట్ల జీతాలకు, బ్రాహ్మణ సత్కారాలకు, దైవపూజలకు, తనభోగాలకు అయ్యేఖర్చు వృథావ్యయం అని రాజు తలపకూడదు ఆ వ్యయం ధారాళంగా చేయవలసిందే.[262]

రాజు వైరి మీద ప్రతిజ్ఞ చేయకూడదు. వైరి మీదికి దండు వెడలితే ఆకార్యం తీరవచ్చు – తీరకపోనూవచ్చు. అలాకాక-అలాగే ఉండి ఉండి-మరెప్పుడో తీరవచ్చు. అలా అనుకూల కాలంకోసం రాజు ఎదురుచూడ్డం మంచిది. రాజు కార్యపరుడుగా ఉండాలి. కాని కలహప్రియుడుగా ఉండరాదు [263]

జిగీషువైన రాజు తన వైరిని-అతడు తప్పించుకొని పోవడానికి వీలుకాని దారిలేని మూలలకు తరిమికొట్టాలి. అలాచేయడం వల్ల అతని సైన్యం చేసేదిలేక తిరగబడిపోవడానికి ప్రారంభిస్తే ఆపోరులో జిగీషువైన రాజు గెలిస్తే గెలుస్తాడు లేదా వీర స్వర్గం పొందినా పొందవచ్చు. జయం నిశ్చయం లేదు. అంతేకాదు. వైరుల కోటల్లో బహువిధాల మారణ యంత్రాలున్నపుడు జిగీషువైన రాజు తాను పోగూడదు. తన దండునే పురిగొల్పాలి.[264]

ఎవ్వరినైనా ఒకటి రెండు ఆలోచనలు మనస్సుకు వచ్చేట్లు చెప్పితే రాజులు వాళ్ళి మాటిమాటికి మంత్రాలోచనకు పిలుస్తారు. అది చూసి

రాజు వానిమాట వింటాడని - ఇతరులు తమ కార్యాలను రాజుతో చెప్పి చేయించమని లంచం ధనాదుల్ని ఇస్తారు. అతడు వాటిని గ్రహించి రాజువద్ద తన మాట చెల్లుతుందనే గర్వంతో అసంగతమైన మంత్రాలోచనలు రాజుకు చెప్పుతాడు కాబట్టి రాజు అలాంటివాని పరోక్ష వృత్తాంతాన్ని వేగుల మూలంగా తెలుసుకొంటూ ఉండాలి.[265]

తనరాజ్యం పరిహద్దు కవతలిరాజు తప్పక చెడేవాడయితే చెడ చేయడం మంచిది. చెడేవాడు కాకపోతే ఆగడిదేశపు రాజుతో మైత్రి చేసుకోవాలి. తన పరిహద్దురాజు వైరి అయితే-అతణ్ణి చెడచేయడానికి ఆపైగడిదేశం రాజును పురిగొల్పితే-అవతలివానితో వైరం వల్ల ఇతడు ఈ రాజ్యం జోలికి రాడు.[266]

రాజు అయినవాడు-వైరిరాజు ప్రజల్ని కష్టాలపాలు చేయాలి. ఆవైరిరాజు దుర్గాలు ఆక్రమించుకోవాలి. అతని రాణివాసం అగుపడితే వారికి పుట్టింటి మర్యాద నెరపాలి. ఆ శత్రురాజుల రాయబారుల ఎదుట పరుషవాక్యాలు పలుకకూడదు. ఒక్కొకసారి సంధికూడా అవసరంకావచ్చు.[267]

మారణాది క్రియలు చేసే వారుండేది, తీవ్రవిషయుక్తమైన నీళ్ళతో దూషితమైనది. రోగాలచేత నిరంతరం పీడితమైనది. కొండలతో వనాల్తో నిండినది. ఉగ్రమ్లేచ్ఛులు గలదేశంలో మేరుగిరితో సమమైన ధనం లభించేట్లున్నా ఆ దేశంలో నీవు అడుగుపెట్టకు! ఆదేశాల్నిపట్టడానికి ఒక సేనా భాగాన్ని వినియోగించు.[268]

కపటపు మనిషి మనోరంజకంగా ఇచ్ఛకాలాడి రాజుచేత తనపని నెరవేర్చుకుంటాడు. రాజు సంతోషవేళలో కొలువు చేస్తుంటాడు. ప్రభువు బలిమి తప్పేనా విడిచి వెళ్ళిపోతాడు. అలాంటి సేవకుని యోగ్యత ముందే తెలుసుకోవడానికి రాజు-ప్రాణం చెల్లుతుందో లేదో చూస్తూనే తెలుసుకొనే పరాకు కావాలి.[269]

రాజు తనజీవితకాలంలో-సుఖంగా రాజ్యం పాలించడానికి గాను-తెలిసిన వారిద్వారా స్వర్ణాదిలోహాల గనులు ఎక్కడ ఉన్నాయో కనిపెట్టి వాటిని గ్రహించాలి. ప్రజల ఆదాయంలో కొద్దిపాటి మాత్రమే పన్నుగా

గ్రహించాలి. పొగరెక్కిన బల్లిదులను దండనతో అణచివేయాలి. దయగల వాడై ప్రజలందరినీ పోషిస్తూ, వర్ణాశ్రమ ధర్మాల్ని కాపాడుతూ సదా విప్రుల్ని గౌరవిస్తూ ఉండాలి. జనహీన ప్రదేశాలకు జన సమృద్ధి కలిగించాలి. జనం క్రిక్కిరిసి ఉండే ప్రదేశాల్లోని ప్రజల్ని జనములేని ప్రదేశాలకు పంపాలి. క్షుద్రశత్రువుల్ని నాశనం చేస్తూ, సమృద్ధమైన రాజ్యాన్ని తన దేహంలోని సప్తాంగ సమానంగా కాపాడుకోవాలి.

రాజు తన ఆయుస్సుకు హితంకోరిన వాడై-ధాతువులు తెలిసిన వైద్యులచేత ధాతు స్థితిని తెలుసుకొని, స్వర్ణభస్మాది మందులు సేవిస్తూ దేహం అంతటికీ పుష్టికల్గించుకోవాలి. బలియ వలసిన భుజహృదయాద్య వయవాలు బలిసేట్లు, కృశంగా ఉండవలసిన నడుము ఇత్యాది అవయవాల్ని సన్నబడేట్లు వ్యాయామాదులు చేస్తూ, దేహశుద్ధి ఏమారకుండా, తన దేహాన్ని రాజు సమానంగా కాపాడుకోవాలి.[270]

రాజు దినచర్య ఇలా ఉండాలి: ప్రాతఃకాలంలో సుఖవిశ్రమ అడిగే సౌఖశాయనికులు, వైద్యులు, జ్యోతిష్కులైన బ్రాహ్మణులు రాజును దర్శించాలి. రాజు వారితో సల్లాపంచేసి ఆరోగ్యానికి, గ్రహాను కూలతకు కావలసిన విశేషాల్ని తెలుసుకోవాలి జాముపొద్దు ఎక్కాక మంత్రి సామంతులతో ధనార్జన నియుక్తులయిన కరణాలతో కొంతసేపు గోష్ఠిజరిపి, మంత్రాలోచనాదికం చేసి ఆయవ్యయ విశేషాలు తెలుసుకోవాలి. తర్వాత అంగమర్దనం, మల్లులతో వ్యాయామం, వేటకాండ్రు తెచ్చిన మాంసాలు, తేవలసిన వాటిని విచారించి, తెచ్చిన వాటిని వండ వలసిన ప్రకారం విశేషాల్ని గూర్చి వంటవాళ్ళని ఆదేశించాలి మధ్యాహ్నం తర్వాత దేవతార్చన సమయంలో పెద్దలతో, ధర్మాధికారులతో, వద్యానులతో సల్లాపం చేయాలి. భోజనానంతరం విదూషకునితో వినోదం పౌరాణికులతో, కవులతో గోష్టి జరపాలి. నాలుగోజాములో చారులకు దర్శనం ఇవ్వాలి. పాటకచ్చేరి జరిపించాలి. రాత్రివేళల సుఖనిద్రకు పూర్వం ప్రేయసీగోష్ఠి తగినది.[271]

అనఘా! రాజు అనుచరులు హితులు, హితాహితులు, అహితులు అని మూడు విధాలుగా ఉంటారు. వారి స్వరూపం తెలుపుతాను విను.[272]

రాజుకు వైద్యులు, జ్యోతిష్కులు, పండితులు, కవులు, పురోహితులు ఎప్పుడూ మేలుకోరే హితులు. ధనార్జన మొదలైన రాజకార్యాల్లో నియమితులైన అధికారులు ఒక పక్షాన హితులూ అవుతారు. వారే ద్రవ్యం హరించడం వల్ల రాజు కనిపెట్టి దండిస్తాడేమో అనే భీతితో మరో పక్షాన అహితులుగా కూడా అవుతారు. ఎవరి దుర్వృత్తిని అణచడానికి వారి ధన సమృద్ధిని రాజు హరించి ఉంటాడో-అలాంటివారు ఎలాగైనా ఆ ధన సమృద్ధిని తిరిగి గ్రహించడానికి-రాజును మదిలో నిత్యమూ ద్వేషిస్తూ ఉంటారు. వీరే అహితులు. కాబట్టి ఈ మూడురకాల అనుచరుల విషయమై తానుకూడా హితుడుగా, హితాహితుడుగా, కేవలఅహితుడుగా ప్రవర్తిస్తూ నేర్పుతో మెలగడం రాజుకు శ్రేయస్కరం.[273]

పాత్రమైన వాణ్ణి అతడు అలాటివాడని లెస్సగా తెలుసుకొని అతనికి ముందుగా ఎవిధంగానూ-తెలియనీక ఒక్కసారిగా పనసపండ్లు తిగిన విధంగా - కోర్కెకు మించి అధిక ద్రవ్యాన్ని, అతడు కలగన్నట్లుగా అనుకోకుండా రాజు ఇచ్చి ఆశ్చర్యపరచడం ఒప్పు [274]

హవ్యాల (దేవపూజలు) కన్నా కవ్యాలే (పితృదేవతక్రియలు) సూక్ష్మధర్మాలు అయినందువల్ల, వేదాధ్యయన సదాచారులై, చాంద్రాయణాది వ్రతాలవల్ల శాంతచిత్తులైన వైష్ణవులకు శ్రాద్ధదేయాలను ఇచ్చి, నీ పితృదేవతల్ని ఊర్ధ్వలోకాలకు పంపాలి.[275]

నీవు ధారాపూర్వకంగా చేసే షోడశ మహాదానాలు బ్రాహ్మణ రక్షణకు, నీ పరతత్త్వజ్ఞానం నీ రక్షణకు అయ్యేట్లు ప్రవర్తించాలి నీవు రాజువైనందువల్ల తెలిసో తెలియకో నీప్రజలు చేసేపాపాలు, నీవు చేసే పాపాలు అన్నీ కలిపి నీకు రాజ్యాంతంలో తప్పక కలిగే నరకాన్ని (రాజ్యాన్తే నరకం ధ్రువమ్) నివర్తించుకోవడానికి-శ్రీమన్నారాయణుని శరణుపొందు.[276]

భార్య పతిభక్తి, స్త్రీపురుషుల నానావరసలు, యతులు ఇంద్రియ నిగ్రహం కలిగి ఉండడం, తిగుణాతులు అగ్రజాతుల్ని అనుసరించడం. సేవకుడు రాజు కార్యాలకు అనుకూలమైన ప్రవర్తనతో ఉపయోగపడడం.

ఇవన్నీ రాజదండన భీతివల్లనేసుమా! కాబట్టి వీటి అతిక్రమాన్ని రాజు సహించక-దండించాల్సి ఉంటుంది.[277]

రాజు (వధ్యులను) చంపినా కూడా ధార్మికుడవుతాడు. సతిని పొంది బ్రహ్మచారి అవుతాడు. (సాధ్వి అయిన భార్యను పర్వాది వర్జంగా-ఋతు కాలంలో నియతిగా పొందడం-బ్రహ్మచర్యంతో సమానమే). బొంకినా కూడా సత్యశీలి అవుతాడు. (ఒకని ప్రాణం కాపాడడం మొదలైన మంచి కార్యాలకోసం బొంకడం సత్యంతో సమానం) ద్రోహంచేసికూడ సదువవాసి అవుతాడు. యుద్ధంనుండి వెనుదిరిగి కూడా శూరుడవుతాడు. (పెద్దల మీద పోకుండడం శూరుల్ని కాల్చడంతో సమానం). ధనాన్ని వ్యయించికూడా ధనికుడవుతాడు. (సత్కార్యాలకై చేసిన ధనవ్యయం ధనవ్యయంకాదు, అది సద్వినియోగమే) ఇది రాజు విషయంలో విచిత్ర సరణి.[278]

చారుడు రాజు ఊరిలో ఇల్లుకలవాడై ఉండాలి. నానా భాషా విదుడుగా ఉండాలి. రాజువద్దనున్న ఇతరచారుల విషయం తెలియని వాడుగా, తాను చారుణ్ణని ఇతర చారులకు తెలియనీయని వాడుగా ఉండాలి. అతడు నానావేషాలు ధరించ గలిగే వాడుకావాలి. (లింగమాత్ర కృతుడు-ఎల్లలింగాలు లేనివాడు-ఏగుర్తులు లేనివాడు కావాలి). కోరినంతకన్నా ఎక్కువధనం ఇచ్చి రాజు అతన్ని ధనికుణ్ణి చేయాలి. అలా అధిక ధనమిస్తే తప్ప అతడు చారవృత్తిలో ప్రవేశించడు-ఎంతధనమిచ్చి అయినా అలాంటి వారిని వేగులుగా రాజు సంపాదించుకోవాలి.[279]

రాజ్యాన్ని యథాధర్మంగా పాలించేరాజు ఆయా ఋతువులకు తగిన అంగమర్దనం, స్నానం, భోజనం, లేపనం, వస్త్రధారణ పువ్వులు ముడుచుకోవడం లాంటి భోగాల్లో ఆసక్తుడై వాటిని సదా అనుభవిస్తూ ఉండవచ్చు. దేహాన్ని క్లేశపెట్టే తపస్సు చేయనక్కరలేదు. తపస్సు వల్ల లభించే పుణ్యాన్ని దానాలచేతనే ఆర్జించుకోవాలి.[280]

రాజు భుజించే ఆహారం పలురకాల రుచులతో కూడిన పదార్థాలతో కూడి ఉంటుంది. కాబట్టి మధ్యాహ్నం అనంతరం కానీ, ఆమాశయకోశ శుద్ధి చెందిగానీ, ఆకలి అయినప్పుడే రాజు భుజించాలి. అలాచేయడమే రాజు ఆరోగ్యానికి మంచిది.[281]

రాజా! ఈ మాటవిను! ధర్మం, అర్థం, కామం అనే మూడు పురుషార్థాలకు రాజు సమంగా ధనవ్యయం చేయాలి ఒకవేళ ధర్మంకోసం అయేటి వ్యయం ఎక్కువైనా-ఇతరమళ్లకు ఎతమెత్తిన నీరు గనిమ కోతపడి రాజనం వరి మడికి ఎక్కితే సంతోషించినట్లుగా - రాజు మిక్కిలి సంతోషించాలి [282]

నీవు ఉజ్వలుడివై ఉండడానికి గాను శ్రేయఃప్రదమైన ఒక రత్నాన్ని ధరించు. అంతేగాక దినందినం వేర్వేరు రత్నాభరణాల మంచి అలంకరణతో వెలుగుతుండాలి [283]

రాజ్యం ఏలేవానికి అనంతపాపం తప్పదుగదా! రాజ్యం పాలించడం ఎందుకు? పాపం మూటకట్టుకోవడం ఎందుకు? నరకమనుభవించడం దేనికి? అని వెనుదీయకూడదు. శక్తికొలది అధర్మం చొరనీకుండా రాజ్యం చేయాలి తెలియక జరిగే పాపాలకు పరిహారాలుకూడా ఉన్నాయి. వేదం అవశక్యమైన కార్యాన్ని విధించదు కర్తయొక్క శక్తికొలది చేసేట్లుగానే చెపుతుంది. కాబట్టి అచింత వద్దు [284]

మనువు, యముడు మొదలైన వారు విశేషించి దోషం తెలుసుకొని దండనలు విధించే ధర్మపరుడుగా కీర్తిగాంచారు. ప్రజాపాలన కర్తవ్యంగా-బ్రహ్మ ఇంద్రాది దిక్పాలకాంశాలతో పుట్టించగా పుట్టి, వేదాల్లో విరాట్, సమ్రాట్ మొదలైన పేర్లతో చెప్పబడి, దేవసదృశుడై, పట్టాభిషిక్తుడైన రాజు కష్టాలను ఓర్చి భూమిలో కలిగే అలజళ్లు తీరిస్తే తప్ప అతని జన్మం ఎలా సఫలమౌతుంది?

కేవలం ఇంద్రియ ప్రీతితో పరస్త్రీలను చెరసాలలో బంధించి బాటసారుల్ని కొట్టి సంపాదించిన సొమ్ముతో (ధనంతో) దొంగల రాజులకు కాలం జరిగిపోతుంది గదా! ఇంత లంపటమెందుకు? అని భూమి రక్షణలో వైముఖ్యం ప్రదర్శించరాదు - ఎలాగంటే-పూర్వం కృతయుగంలో కృతవీర్యుని పుత్రుడు సహస్ర బాహుడు అనేవాడు - తన భుజ స్తంభాలచేత ఈ భూమిని భరించి - ఏ దీవిలో, ఏ దినం, ఏ వీటలో, ఏ త్రోవలో, ఏ కార్యంలో, ఏ వేళలో ఎవ్వడు ఏమి చేయాలనుకుంటాడో తెలుసుకొని

అప్పుడు అక్కడ కత్తి-రోకలి విల్లు మొదలైన శస్త్రాస్త్రధారియై ప్రత్యక్షమై దండిస్తూ ఉండేవాడు. అలా దండించడానికి ఈ కలియుగంలో యజ్ఞాలకు తగినట్లు స్వల్పబలం కలిగిన రాజలోకానికి శక్యంకాదు. ఒక రాజలోకానికే అనడం దేనికి? ఈ కాలంలోని బ్రాహ్మణులకు ఆ కాలంలోని బ్రాహ్మణులకు ఉండే శక్తి ఉందా? అగస్త్యుడనే ఒక భూసురుడు కడలినీరు ఒక గుక్కలో తాగేశాడు. విశ్వామిత్రుడనే ద్విజుడు బ్రహ్మ సృష్టికి ప్రతి సృష్టి చేశాడు. వశిష్ఠుడనే విప్రుడు బ్రహ్మదండంతోనే బ్రహ్మాస్త్రాన్ని వారించాడు. అంతటి తపశ్చర్య మాకులేదు. మా వల్ల ప్రయోజనమేముంది? అని ఈ నాటి ద్విజులు శక్త్యనుసారం ఆచరించడం మానవచ్చా? ఈ బ్రాహ్మణులు క్షత్రియాది ఇతర జాతుల వారికి ఉపాసనీయులు కాకుండా పోయారా? అందువల్ల సావధానుడవై శక్తి కొద్దీ విన్నవాటిని, చూసిన వాటిని ఉపేక్షించక శిష్టరక్షణ దుష్ట శిక్షణాలు ఆచరిస్తూ-అశక్యమైనదానికి ఆర్త శరణాగత సంరక్షకుడైన శ్రీమన్నారాయణుని మీద భారంవేసి, అహంకార రాహిత్యంతో ప్రవర్తిస్తే-సకల కార్యసిద్ధులు చేకూరతాయి అది అలాగుండనీ! ఆ విధమైన పట్టబద్ధుడైన రాజు ధర్మం మీదే దృష్టి ఉంచి నడవాలి వరుణుడు, కుబేరుడు, ఇంద్రుడు అనిలుడు, ధనంజయుడు, ఇంద్రాదుల జన్మలు - అనేక జన్మల్లో ఆరంభింపబడిన యాగాది క్రియలచేత పొందబడిన భూర్భువ స్వర్గాదులైన లోకాలు-ధర్మం నందే ప్రతిష్ఠితాలు కాబట్టి ధర్మాచరణలో దక్షుడవై, ఋషిదేవపితృ ఋణాలు అనే ఋణత్రయం తీర్చి, సమానుల్లో కీర్తికరుడవై, రాజ్యపాలన చేయి' అని యముడు కుమారుని పట్టాభిషిక్తుణ్ణి చేశాడు. ఇది నా శక్తప్రభావం' అని లక్ష్మీదేవికి మన్నారు స్వామి అనతిచ్చాడు [285]

## ఆశ్వాసాంతం

క్షీరాబ్ధి మహాగేహప్రియా! ప్రణతులైనసురల యూథాముల వెలుగు జాలులతో నీపాదాలు తేజరిల్లుతున్నాయి. నీ క్రీగంటి దీప్తిలో సముద్రమంత దయ ప్రవహిస్తూ ఉన్నది. మందరధరా! గజేంద్రుని ఆర్తిని మీటవేసిన చక్రం ఆయుధంగా గల స్వామీ! మహాలక్ష్మీ మనోహర నరపోలాపాలకా-

విన్నకొద్దీ వినాలని కోరుతూ ఉన్నావు. నీచేతి శంఖం ఊది అధ్వనితో రాక్షసుల్ని మూర్ఛిల్ల చేస్తావు.[286]

స్వామీ గరుడవాహనా! నీవు నీభక్తుడైన తొండమాను రాజును-నీచేతి శంఖుచక్రాల్ని ఇచ్చి కాపాడావు (రక్షించావు). అర్జునుని మనుమడైన పరీక్షిత్తు తల్లి గర్భంలో అశ్వత్థామ ప్రయోగించిన బ్రహ్మ శిరోనామక అస్త్రంతో మృతుడు కాగా-ఆశిశువును బ్రతికించావు. శరణాగత నిధివి గరుడునెక్కి అన్నిచోట్లా సంచరిస్తావు.[287]

ఓ నారాయణమూర్తి! ఉన్నతమైన నీ కేతనంలో గరుత్మంతుడు వెలుగుతున్నాడు. నీవు నీబాహుబలంతో నందనవనం నుండి పారిజాతాన్ని పెకలించి-ఇంద్రున్ని ఓడించి తెచ్చి ఇచ్చి-ఒడలెల్ల పులకాంకుర అయ్యేట్లు-సత్యభామను అలరించావు. రాయబారంలో నీ వాక్పటిమను కౌరవులు గూడా మెచ్చుకొన్నారు పాండుపుత్రుడైన ధర్మరాజుకు కీర్తి చేకూర్చావు. అలాంటి ఓ పరమ పురుషా! మమ్మల్ని రక్షించు![288]

## కృతికర్త స్వవిషయం

ఇది (ఈ చతుర్థాశ్వాసం) సింహాద్రి క్షేత్రంలోని నృసింహుని పాదాల అభీష్ట అర్చన పుణ్యం వల్ల లభించిన - చెక్కడానికి శక్యంగాని పొట్టునూరి విజయస్తంభపు రాతి మీద విజయ చిహ్నంగా దృఢమైన ఇష్టాక్షరాలుగా చెక్కబడిన కృష్ణరాయలు అనే పేరు గలిగిన నా చేత రచింపబడిన 'ఆముక్తమాల్యద'లో ఆశ్వాస శ్రేష్ఠమైన నాల్గవది హృద్యమై భూమిలో విరాజిల్లుతుంది.[289]

# ఆముక్తమాల్యద - పంచమాశ్వాసం

శ్రీదేవి, నీళాదేవి, జాంబవతీదేవులు హృదయ కమలాల్లో విహరించే తుమ్మెదలాంటి స్వామీ! కళింద పర్వతం నుండి నల్లని యమునా నది జనించి ప్రవహించే రీతిగా-నీ దేహం నుండి జనించి వ్యాపించే కాంతిగల స్వామీ! వెయ్యి పాదాలు, తలలు, నేత్రాలు గల స్వామీ! శేషాద్రి సింహమైన ట వేంకటేశ్వరస్వామీ[1] అవధరించండి! ఆ విష్ణుచిత్తుడు-[2]

వసంత ఋతువు ప్రవేశించింది. పొదరిండ్లు నిండారపూచాయి. వాటిలోని విశాల ప్రదేశాల్లో-లేమావి చిగుళ్లమొత్తం-పూవురాశులు పాన్పులుగా ఒప్పుతుండగా-పొదలలో నాయికలతో నాయకులు శృంగారక్రీడల్ని అనుభవిస్తున్నారు. ఆ శృంగార అనుభవంలో మొదట సమరీతిలో నున్న నాయికలు-నాయకులను బెదిరించి పురుషాయితానికి పూనకొని-అబలలైనందువల్ల నిట్టూర్పు ఎగదట్టగా అలసిపోయి-పురుషాయితం మాని-మొదట ఉన్నట్లే తాము కిందయ్యారు. సెజ్జలోని మామిడి చిగుర్లు-చెమట చిత్తడితో తడిసి-వారి వీపునకు అంటుకొన్నాయి. అలా వీపున అంటుకొన్న మావిలేత చిగుళ్లతో-వారు ఎలా ఒప్పుతున్నారు అంటే-మన్మథ యుద్ధంలో నాయికలు పరాజయం పొందినందుకు-గుర్తుగా మన్మథుడు వారిని తరిమి-మామిడి పూల బాణాలతో కొట్టాడేమో అన్నట్లుంది[3].

## గోదాదేవి చరిత్ర

ఆ విష్ణుచిత్తుడు విశాలమయిన ఒక వన వీధిలో-ఒక తెల్లతామర కొలను వద్ద, తులసితోటలో, చెట్ల నీడల ప్రతిబింబం వల్ల-పచ్చల అరుగుగా ఒప్పుతూ ఉన్న పాలగచ్చు తిన్నెమీద-ఒక ఆడ శిశువును చూశాడు. ఆ ఆడ శిశువు శుభాంగి. పద్మరాగాల మొలకల దళాలకు సాటియైన అరకాళ్లు, ఉదరం కలిగినదై ఆ బాల ఒప్పారుతూ విష్ణుచిత్తునికి కనిపించింది.[4]

ఆ బాలను చూచి విష్ణుచిత్తుడు ఆశ్చర్యం పొంది. దగ్గరికి వెళ్ళి ఆ బాల కోమలత్వాన్ని, మేనివన్నెను, శుభలక్షణాల సముదాయాన్ని, తేజస్సును. అందాన్ని కొంతసేపు రెప్ప వాల్పకుండా దర్శించాడు. అహాహా!

సంతాన హీనుణ్ణి అయిన నాకు ఆ ముకుందుడే ఈ శిశువును దయచేశాడు అనుకొంటూ సంతోషంతో[5] ఆ శిశువును తీసుకెళ్ళి తన ధర్మపత్నికి ఇచ్చారు. ఆమె ఆ శిశువును గ్రహించి-ఆనందంతో పొంగుతూ మాతృత్వంతో ఉప్పొంగే తన స్తన్యం ఇస్తూ-అనురక్తితో బాలను గోముగా పెంచింది. అలా ఆ బాల క్రమంగా పెరుగుతూ ఉంది.[6]

గోదాదేవికి బాల్యంజారి యవ్వనం ఎలా ప్రవేశించిందంటే-ఆమె నోరు తెరచి ఇంతకు ముందులాగా మాట్లాడడంలేదు. ఆమె శిరోజాలు ఉంగరాలు తిరిగాయి. నేత్రాల్లో ఐశ్వర్యం (కాంతి పెరగగా ఆరకంటితో చూడను ప్రారంభించింది. ఆననం కనుబొమల్ని ఆడించడం ఆరంభం అయింది. (కను బొమలకు అందం పెచ్చి మనసులోని అభిప్రాయాన్ని తెలపడానికి కను బొమల్ని ముడవ వేర్చినది). వక్షం మీద స్తనాలనే కొమ్ములు విజృంభించగా వాటిని అనాదరంతో ఒక ప్రక్కకు తోసేసింది. (స్తనాలు తలెత్తిన గర్వంతో ఆమె బాల్యాన్ని లెక్క చేయక ప్రక్కకు తోసింది-స్తనాలు విజృంభించడానికి ప్రారంభించగా వాటిని కప్పుకోవడానికి మొదలు పెట్టింది.) చేతులు, పాదాలు ఎఱ్ఱవారదొడిగాయి. (యౌవనోదయం వల్ల అతిశయమైన ఎరుపు రంగును పొందాయి )

గోదాదేవి నడుము మాటి మాటికి దారిద్ర్యాన్నే (లేవి తనం) తెలిపింది. (యౌవనోదయంతో నడుము సన్నగిల్లింది.) ఆమె మేను రొమ్ము ఓర్వక ఈ విధంగా ముడుచుకోవడానికి ప్రారంభించింది.

నాభి వట్టి గాంభీర్యాన్ని మాత్రం వహించింది. (నాభి శూన్యతా రూపమైన లోతును ధరించింది యౌవనం చేత పొక్కిలి లోతయింది.) ఈ విధంగా నానాటికి మునుపటి చెలిమి చౌకయిన ఈ బాలయందు నిలవడం కుదరదు అనుకుని-జారిపోయినట్లు బాల్యం వెళ్ళిపోయింది.[7]

గోదాదేవికి మొదటి ఉన్న దేహసువర్ణచ్ఛాయ చేతగానీ. అధరం అరుణిమతోగానీ, ముఖచంద్ర ధవళిమ చేతగానీ-అంటే పసుపు, ఎరుపు, తెలుపు అనే రంగుల్లో దేన్నిగాని తెలిపే పేరు రాలేదు. ఇప్పుడు యౌవనో

దయంవల్ల తుమ్మెదల గర్వభారాన్ని వహించే నైల్యాతిశయంచేత 'శ్యామ' అనే పేరు వచ్చింది. ఇది ఉచితమే. దేహానికంతా శిరమే ప్రధానం. (సర్వస్యగాత్రస్య శిరః ప్రధానమ్ (అనే వాక్యం ఎలాగునైనా తప్పుతుందా? (శ్యామ అంటే నల్లనిది-యౌవన మధ్యస్థ అని రెండర్థాలు)[8]

యువతి అయిన గోదాదేవి ఉంగరాల కురుల నలుపు అతిశయిస్తూ ఎలా అమరాయంటే-దీర్ఘబాహువునందు ఒక్క చక్రాయుధం మాత్రమే ధరించిన నారాయణుణ్ణి-బొమ్మతో గెలవడానికి మన్మథుడు ఉక్కు చక్రాయుధాల వరుసల్ని సిద్ధం చేసుకున్నాడేమోనన్నట్లు ఒప్పాయి ఆ ఉంగరాల కురులు నారాయణునికి మిక్కిలి మనోవ్యామోహావాలుగా ఉన్నాయి.[9]

కర్పూర తిలకం యొక్క కాంతితో ధవళమై ఉన్న గోదాదేవి లలాటంలో ముంగురుల వరుసలు-భాగ్యంలో ఈమె సీమంతినీలోకాన్ని అతిశయిస్తుందని బ్రహ్మ వ్రాసిన అక్షర శ్రేణులేమో అన్నట్లు అతిశయించాయి[10]

గోదాదేవిని అలరించే సైరంధ్రులు-ఆమె ముఖాన్ని పైకెత్తి కనురెప్పలకు కాటుక తీరుస్తూ ఉండగా-ఆ ముఖం ఊర్ధ్వ ముఖం అనే చవితి రాత్రి చంద్రుణ్ణి చూపింది. ఆ దోషంవల్ల ఆ ముఖ కాంతిని దొంగిలించిన చంద్రుడుండగా, అతనికి ఏ నిందా రాక, తానతని కాంతిని దొంగిలించినదని ఆమె ముఖానికి లోకంలో నిందకలిగింది[11].

గోదాదేవి నుదుట కస్తూరి బొట్టు పెట్టుకొంది ఎందుకు? పరిమళం కోసమా? కాదు. ఆమె ముఖం తన కనుగవతో మృగాన్ని జయించింది-మృగం కనుగవకన్న ఆమె కనుగవ తారళ్యం, వైపుల్యం మొదలైన గుణాల్లో అతిశయంగా ఉంది. అందువల్ల ఆ కస్తూరితిలకం ఆమె కనుగవపై పగబూని. ఆ ముఖాన్ని గెలువుమని చంద్రుణ్ణి పురిగొల్పింది. చంద్రుడు తనకు ఆ ముఖంలోని కాంతి ఉందిగానీ పరిమళం లేనందువల్ల-తెలివికలిగి ఆ ముఖం మీద వైరం పెంచుకోవడానికి ఒప్పుకోలేదు. అప్పుడు మృగం ఇదిగో 'ఆ పరిమళలోపాన్ని నేను తీరుస్తాను దాన్తో సమృద్ధుడివై నీవు ఆ ముఖం మీదికి దాడివెడలు' అని చంద్రునికి బోధించి, తానేపోయి చంద్రునిలో ప్రవేశించింది. తనపై ఆ మృగం అంత పగసాధించినందు కోసం ఆమె ముఖం

దానిపై అధికమైన పగబూని, దాని నెత్తురైన పచ్చికస్తూరితో నుదుట బొట్టు పెట్టుకుంది. అంతేగాని ఆమె ముఖంలో పరిమళం లేక కాదు పరిమళం సహజంగానే ఉంది[13] (కస్తూరి ఒక జాతిలేడి అండకోశంలో పుడుతుంది. దాన్ని చంపితేనే కస్తూరి లభిస్తుంది ఆ కస్తూరి పచ్చిగా ఉన్నపుడు పరిమళం ఎక్కువ దానిని బుద్ధిమంతులు నుదుట ధరిస్తారు. లోకంలో వైరిని చంపిన వారు అతని నెత్తుటితో బొట్టుపెట్టుకోవడం ప్రసిద్ధం. లోకంలో చంద్రుని మచ్చను లేడి అంటుంటారు. ఆ అంశాన్ని కవి ఇక్కడ అనుసంధించారు.)

గోదాదేవి యొక్క కనీనిక (కనుగ్రుడ్డు) కంటి తుదకు వెళ్తూ-తిరిగి కంటి మధ్యకు వస్తూ ఉన్న అజ్ఞానహితమైన దృష్టి విలాసాలు ఎలా ఉన్నాయంటే-మన్మథుడు లక్ష్యాన్ని భేదించడానికి దిట్టమైన విల్లును ఎక్కుపెట్టి-గురిని గూర్చి-ఊపిరి బిగపట్టుకొని-నిలిపియున్న కలువ బాణం యొక్క చలనాలేమో (చలిస్తూ ఉన్న కలువబాణం) అన్నట్లున్నాయి.[13]

యౌవనోదయం వల్ల గోదాదేవి కళ్ళకు విభ్రమం. చాంచల్యం కలగడం-ఆమె నేత్రాలు ఆకర్ణాంతాలు అయి-శ్రవణకూపాల వైపు సాగడం-ఆ కళ్ళ కాటుక రేఖలు ఎలా శోభిస్తున్నాయంటే-యౌవన మద్యం సేవించి ఆ కన్నులు కైపెక్కి, ఒళ్ళుమరిచి చాపల్యంతో పోయి-ఆ చెవి నూతుల్లో పడతాయేమోనని-బ్రహ్మ భయపడి-కళ్ళను ఆ చెవి నూతుల్లో పడనీకుండా ఆపడానికి-కాటుక రేఖల్తో సంకెళ్లు వేశాడేమో అన్నట్లు ఒప్పారుతున్నాయి[14].

బంతి ఆటలో ఒకచేత్తో బంతి కొట్టేప్పుడు ఒక వైపుకు బంతిమీద చెవి ఆనేట్లు తలవంచడం సహజం. కర్ణాభరణహీనురాలైన సహోదరిని సహోదరుడు చూడగూడదనేది. చూస్తే పాపం కలుగుతుందనేది సంప్రదాయం. ఆ సంప్రదాయాన్ని గూర్చి గోదాదేవి బంతి ఆటను గురించి ఈ పద్యంలో వర్ణితమైంది.

గోదాదేవి చెవి రూప సామ్యంవల్ల శ్రీకారం అంటే ఆమె చెవి శ్రీమహాలక్ష్మి. ఆమె ముఖం మహాలక్ష్మికి అన్న అయిన చంద్రుడే. కాబట్టి

ఆమె చెవిలో కమ్మలేనపుడు ముఖచంద్రుడు చూడగూడదు. బంతాటలో ఆమె విసురుగా కొట్టినపుడు ఒక వైపు చెవి కమ్మ జారిపోయింది కమ్మలేని చెల్లెలి చెవి చూస్తే దోషం. ఆ దోషం శ్రీకి తోబుట్టువయిన ముఖచంద్రునికి కలగకూడదు. అందుకోసం ఆమె తాను ఆట నిలపకుండానే ఆట వేగంతో తలను ఒరగ పెట్టి కమ్మ మెరిసే రెండవ చెవి పైకివచ్చి అతనికి కనిపించేట్లు- కమ్మలేని చెవి అతనికి కనపడకుండడానికి భుజంమీద ఆనేట్లు-చేస్తున్నదేమో అనే తీరులో ఆడుతూనే కిందపడిన కమ్మ అందుకొని తన చెవిలో ధరిస్తుంది[15].

గోదాదేవి నిశ్వాసంలో దివ్యసౌరభం వచ్చినా-నాసిక చంపకం కాబట్టి తుమ్మెదలు ఆ సుగంధాన్ని ఆస్వాదించడానికి భయపడి కూడా సంభాషించేటప్పుడు ఆమె నోటిని ఎందుకు అలముకుంటాయి. కారణమడగడం దేనికి? ఆమె నోటిలో సకల సౌరభాలూ ఉన్నాయి. దానికి ఒక నిదర్శనం- ఆమె దంతాలు మొల్ల మొగ్గలు కావడమే దానికేమి తార్కాణం అంటే! ఆ తుమ్మెదలు ఆమె దంతాలు తమ ప్రతిబింబాలనే మిషతో నోటి మీద వ్రాలడమే తార్కాణం. నాసిక చంపకం లాగా, దంతాలు మొల్ల మొగ్గలు లాగా- ఉన్నాయి. ఆమె నిశ్వాసంలోను, నోటి మారుతంలోను దివ్యసౌరభాలు ఉన్నాయి. దంతాలు స్వచ్ఛంగా ఉన్నాయి. కాబట్టి తమలో తుమ్మెదల ప్రతిబింబాలు కనిపించేట్లు నిగనిగా మెరుస్తున్నాయి[16].

కమల దళాక్షి అయిన గోదాదేవి కంఠం పుట్టుకతో శంఖంతో సరి పోలుతూ ఉండేట్లు-మొదట బ్రహ్మ సృజించాడు. తర్వాత యౌవనంలో చందనపు పూతవల్ల నిజమైన శంఖంగానే సాక్షాత్కరించింది-అంటే యౌవనం బ్రహ్మ సృష్టినే మించినదని భావం.[17]

గోదాదేవి పాటపాడడానికి అనువుగా మంద్రస్వరం ఇంత వరకు- దానిపైన మధ్యస్వరం ఇంత వరకు ఆ పైన తారస్వరం ఇంత వరకు-అని మూడు స్వరాలకు తీర్చిన రేఖల క్రమంలో ఆమె కంఠం మీద రేఖాత్రయం అమరింది.[18]

గోదాదేవి మృదువైన బాహుద్వయం అనే తామరతూడులు తామరతూండ్ల శ్రీల నన్నిటిని హరించాయి. అందువల్లనే తామరతూండ్లు పాపం నూలు వడకుకొని జీవికను వెళ్ళబుచ్చుతున్నాయి [19] (తామరతూండ్లను విరిస్తే సన్నని తంతువులు దారాల్లాగా వస్తాయి )

గోదాదేవి బాహువుల్లో బాహుపురులున్నాయి. వాటిలో వజ్రాలున్నాయి. ఆ వజ్రాల కిరణాలు ఆమె కుచాలమీది పూలసరాల కలికలలోనికి సూత్రాల్లాగా చొచ్చుకొని ఉన్నాయి. అందువల్ల ఆ పూలసరాలు ఈ బాహువు నుండి ఆ బాహువు వరకు తాపువులనంటి కుచాల మీద ఉన్నాయి కుచాల పైన గళం వరకు ఉరోభాగం వెడల్పు తక్కువగాను. అదే బాహువుల నడుమ ఉరోభాగంలో దీర్ఘంగాను బంగారు సింహాసనంలాగా వెలుగుతూ ఉంది. అందువల్ల ఉరోభాగంలో కింది భాగం రతీ మన్మథుల వివాహంలో రతీదేవి యొక్క బోద కాపికంగాను, ఆమె భుజాలు ఆ కాపికవు దండలుగాను ఒప్పారుతూ ఉన్నాయి.[20]

గోదాదేవికి యవ్వనం రాగానే స్తనాలు పొటమరించాయి వాటిని ఇతరులు చూస్తారని ఆమెకు సిగ్గు కలిగింది అందుకోసం వాటిని పైటతో కప్పుకొనింది. తర్వాత ఆమె స్తనాలు రొమ్ముకిరువైపుల కుదురొంది-క్రమంగా రొమ్ము నడిమికి వచ్చి దట్టమై-అటు తర్వాత పైకి పొడుచుకొని వచ్చాయి. ఈ ప్రకారం ఎలా ఉందంటే-చనులు పొటమరించడం అనేది యవ్వనం ఆమె దేహంలో నుండి స్తనాలను వెలికి నెట్టడంగాను-అవి వక్షం పక్కల్లో మెరవడం సిగ్గుకు, పైటకు ఒదిపి ఎడమెడంగా ఒదిగి ఉండడం గాను-రొమ్ము నడుమ భాగానికి వ్యాపించి దళమెక్కి కూడా చప్పుటగానే ఉండడం సిగ్గుకు, పైటకు అణిగి ఉండడంగాను-తర్వాత ప్రవృద్ధాలై ఉన్నతి పొందడం క్రమంగా బలంరాగా-సిగ్గును, పైటను ధిక్కరించి విర్రవీగడం గాను-కవి వర్ణించాడు.[21] (బలవంతులైన వైరివల్ల భీతులైన వాడు-బలం లేనపుడు అణిగి మణిగి ఉండి-బలం కూడగానే విజృంభించినట్లు అనే భావం అంతర్గర్భితంగా ఉంది.)

గోదాదేవి కుచ యుగ్మం తెగవ్వ కొనంతో ఎలా ఒప్పాయి. అంటే-శ్రీరాముడు సీతా వియోగ శోకార్తుడై ఉన్న తన ఎదుట కామ క్రీడ తేలుతూ ఉన్న చక్రవాక మిథునాన్ని-రాత్రి అంతా వియోగం పొందండి అని శపించాడట శాపం క్రమక్రమంగా తగ్గు మొగం పట్టగా-కొంత కొంతే దగ్గరికి చేరుతున్న చక్రవాక మిథునంలాగా-ఆమె స్తనాలు ఒప్పాయి. బాల్యంలో దూర దూరంగా ఉన్న స్తనాలు-యవ్వనంలో క్రిక్కిరిసి దగ్గరగా వచ్చాయి. చూచుకాల నైల్యం చక్రవాకాల ముక్కుల్లాగా ఒప్పాయి. రొమ్ములో దూరం దూరంగా ఉన్న స్తనాలు-రొమ్మెల్ల ఆక్రమించాయి [22]

లోకంలో ఒద్దిక కలిగి ఉండే గొప్పవారు- తమ స్నేహితుల్ని గూడా తమలాగే ఒద్దిక కలవారినిగాను-గొప్ప వారుగాను ఉండేట్లు చేస్తారు. అలాగే గొప్పవైన ఆమె కుచాలు తమలో తాము ఎలా వేర్వేరుగా ఉండక ఒద్దిక కలిగి ఒక దానితో ఒకటి క్రిక్కిరిసి ఉన్నాయో అలాగే తమను ఆశ్రయించి ఉన్న-తాను ధరించిన ముత్యాల సరాలను కూడా ఒద్దికతో కలిసి మెలిసి ఉండేట్లు-సరాలు ఎడమెడంగా ఉండకుండా-ఒకటిగా కలిసిపోయేట్లు చేశాయి. స్తనాలు క్రిక్కిరియగానే-వాటపై ఉండే ముత్యాల సరాలు వాటి సందులో బడి-పేటలన్నీ కలిసి ఒకటే అయ్యాయి.[23]

మన్మథుడు విరహసమూహం మీద అతికోపంతో-కత్తిని పైడి ఒరనుండి లాగడానికి అయ్యే ఆలస్యం ఓర్వక-అతి తొందరలో పైడి ఒరతోనే విసిరి వేయగా దానికుట్లు తెగిపోయి-లోపలే ఉండే నల్లని కత్తి వాదర పైకి కనబడుతున్నదేమో అన్నట్లు-గోదాదేవి బంగారు వన్నె నడుం తీగ మీద నూగారు అలరుతూ ఉంది.[24]

హంసయాన అయిన గోదాదేవి యొక్క నూగారు-ఆమె శ్వాస వాయువుల పరిమళం ఆస్వాదించడానికి-నాభి అనే కన్నంలో నుండి వెడలి-చనుగొండల నడుమ ప్రాకుతూ ఉండే పామేమో అన్నట్లు-సొంపు మీరుతూ ఉంది.[25]

గోదాదేవి నిలుచున్నప్పుడు సన్నదనం వల్ల-బాహువులు, నడుము సమానాలైనందు వల్ల వాటి భేదం మరుగున పడినా-ప్రక్కలం ఉండడం వల్ల

మణిమయాలైన బాహుపురులు ఉండడం వల్ల అవి బాహాపులని - నడుము ఉండడం, మాగారు, మొలనూలు ధరించినందువల్లఅది నడుము అని-లోకానికి తెలుస్తూ ఉంది.[26]

యవ్వనవతి అయిన గోదాదేవి దేహం నడుము వళిత్రయం అనే విరుపులు కనబడగా, వాటిని కలిపి బిగించడానికి, అవి ఏ వన్నెబంగారమో, ఆ వన్నె బంగారు రేకను వత్తి రేకుగా పెట్టి మన్మథుడు అంటించాడేమో అన్నట్లు-ఆమెకు నడుము నందు పదారువన్నె బంగారు ఒడ్డాణం మెరుస్తూ ఉంది.[27]

నడుమనే లేదీగ-పిరుదు బిగువుచేత తెగిపోగా చూసి. ఆ బిగించ డంలోనే-ఆ తీగతెగి మళ్ళీ ముడికందదేమో అనే జంకుతో-వదులుగా వేసిన ముడి అన్నట్లుగా గోదాదేవి లోతయిన నాభి ఒప్పారింది.[28]

నదులలోని ఇసుక తిన్నెలలో . ఒక తిన్నె-గోదాదేవి కటి అనే మిషతో వచ్చి-ఇక్కడ నేలమీదే నిలిచిపోయింది. ఆ విధంగా ఒక దిన్నె నదులలో నష్టమై పోయిందని తెలవడానికి గాను-బ్రహ్మదేవుడు ఆ తిన్నెల మీద హంస పాదులు వ్రాసి అక్కడనే స్థిరంగా పెట్టారు.[29] (వ్రాతలో ఏదైనా ఒకపంక్తి నష్టమైపోతే అక్కడ + గుర్తువ్రాస్తుండడం వాడుకగా ఉంది. ఈ + గుర్తునే హంసపాదు-అంటారు నదుల్లోని ఇసుక దిన్నెల్లో హంసలు సంచరిస్తాయి. కాబట్టి హంసపాదాల గుర్తులుంటాయి.)

'కదళి' (అరటి) అనే దొంగల రాణి గోదాదేవి తొడల సౌందర్య లేశాన్ని మునిపాదాల దాకా దొంగలింపించి తెప్పించుకొంది దానికి గుర్తేమి అంటే-దొంగిలించిన వస్తువుతో పాటు దొంగలు, దొంగల పనిముట్లు కదళి వద్దనే లభించాయి. అది ఎలాగంటే-అరటి పొరలను ఒలిచి సోదాచేసి చూడగా (వస్త్రాల మడతల్ని విప్పి సోదా చేయడం) ఆ పొరల లోపల ఆమె ఊరువుల అదోక పాటు ఆకారం కనిపించింది. (అవి తొడ పైన లావుగా ఉండి కిందికి వచ్చే కొద్ది సన్నగా ఉంటుంది-అలాగా ఉండడం అదోక పాటు) ఆ అరటి యొక్క కొవ్వులాంటి పువ్వుమ దొప్పలు విడదీసి చూడగా (అదే అరటి అనే దొంగ ఇంటి పై కప్పును విడదీసి ఆ వెలుతుర్లో అటకలో శోధిం

చడం) గోళ్ళు. గర్దగోళ్లు అనే పేర్లు గలిగిన అరటి పుష్పావయవాలు-గోళ్ళు. గర్దగోళ్ళు అనే దొంగల పనిముట్లు లభించాయి. 'దొంగలు' అనే పేరు గల అరటి పుష్పావయవాలనే దొంగలు దొరికారు. 'అరటి దొప్పల ఎర్రదనం' అనే ఆమె పాదపద్మాల కెంపు-ఆమె ధనంలోని పద్మరాగం లభించాయి.[30]

సేవకులు ప్రభువుకు గొడుగుపట్టడం, జలకలశం తెచ్చి సేవించడం ప్రసిద్ధమే. అలాగే భూమిలో ఎలాంటి శ్రీలు గలిగిన వారి కరభాలు అయినా సరే గోదాదేవి ఊరువులకు దాస్యాలు చేస్తాయి. ఎలాగా అంటే-మహా భాగ్యవంతురాండ్ర కరభాలలో రేఖా రూపంగా గొడుగులు, కలశాలు కనబడతాయి (కరభ అంటే మణికట్టు మొదలు చిటికెన వ్రేలి వరకు ఉండే చేయి బయటి భాగం). ఊరువులు కరభ సదృశాలు అని భావం. మహాభాగ్యవంతురాండ్రకే గోదాదేవికి సేవచేసే అదృష్టం దక్కుతుందని భావం.[31]

బంగారు రంగుతో విలసిల్లే గోదాదేవి పిక్కలు-నాతెకాండ్లలో నాతెకాడయిన మన్మథుని కుటుంబానికి - భోజ్యమైన ఉత్తమోత్తమమైన కాంచనపు పరిపొట్టల్లాగా-పిక్కలచుట్టూ ఉండే అందియలనుండి పైకి ప్రసరించే దట్టమైన మరకత కాంతులు-ఇంకా పసిమి తిరగని పరి ఆకుల్లాగా అలరారాయి.[32]

గోదాదేవి స్నిగ్ధమైన రోమరహితమైన పిక్కల సామ్యాన్ని కోరి-పరిపొట్టలు ముళ్లను చేర్పుతో తమలోనే అణచుకొంటాయి. అముళ్లులోపల ఉమదకశైటికి వస్తూనే పిక్కలతో సాముసాటి అని ఇన్నాళ్ళు విర్రవీగడమంతా హాస్యాస్పదమయింది. కదా - అని పరిపొట్టలు అవమానంతో తలవంచుకుంటాయి.[33]

మేము లోకంలోని అన్ని వస్తువులకూ మాస్వాభావిక పాటల కాంతితో ఎర్రవన్నె ఇస్తాము. అలాంటి మాకు ఇంతకన్నా ఎక్కువ కాంతి ఏ ఉపాయం వల్లా కలుగదు. ఆ విషయం తెలియక-మాకు వన్నె హెచ్చుతుందని లత్తుక నీరు పూయిస్తూ ఉన్నది. ఎంత ముగ్ధ ఈమె! అని అంతఃకరణ కోసం లత్తుక నీటివి పూత పొందుతున్న గోదాదేవి పాదాలు వ్రేళ్లు అనే ముఖాల్తో నవ్వుతున్నట్లుగా-ఆమె కలుకు గోళ్ళ ధవళ కాంతితో ఒప్పారుతూ ఉన్నాయి.[34]

గోదాదేవి మీగాళ్ళు అనే తాబేళ్లు - ఏనుగులు యొక్క నడక అందాన్ని బలాత్కారంగా హరించినందువల్ల - ఆ నాటి నుండి లోకంలో గజకచ్ఛప కలహం అనే పేరుతో ప్రసిద్ధమైన యుద్ధం ఏనుగు తాబేళ్ళకు కలిగింది. ఆమె మీగాళ్లు తాబేళ్లులాగా, నడక గజగమనంలాగా ఉన్నాయి. (గజకచ్ఛపాలు పోరాడుతూ ఉండడం-వాటి రెండింటినీ గరుత్మంతుడు అమృతం తేవడానికి పోతూ ఆహారం కోసం ఎత్తుకొని పోవడం భారతంలోని కథ).[35]

తరుణి అయిన గోదాదేవి శరీరకాంతికి పాటిరాలేక - తూనికకు తాలేక-పసుపు మిక్కిలి మలినమైంది. ఎండి, ఆపైన నల్లనయింది, ఆ కారణం వల్లనే గదా-పసుపునకు చేష్టాహీనత, అంధకారం ఇత్యాది దోషాలు గలదైన రేయి యొక్క పేర్లు వర రాత్రి (పసుల్ని తగ్గించేది) అని, తమిస్ర (చీకటి గలది) అని, నిశీథిని (అర్ధ రాత్రం గలది) అని, క్షప (చేష్టను క్షయింప చేసేది) అనే పేర్లు కలిగాయి.[36] (రాత్రి పేర్లన్నీ పసుపునకు పేర్లని నిఘంటువు చెపుతుంది)

చంద్రవదన అయిన గోదాదేవి పూర్వజన్మలో భూదేవి కాబట్టి- ఆ జన్మలో చెలికత్తెలయిన మరాళిక, ఏకావళి, హారిణి- మనోజ్ఞ, ప్రగ్విణి అనే నాగకన్యలు ఆమెను ఎడబాయక-పొరుగిండ్ల భాగవతుల కూతుళ్ళుగా జన్మించి-గోదాదేవికి చెలులయ్యారు. అందరూ కలిసి బొమ్మ పెండ్లిండ్లు చేసేటప్పుడు-వారు లక్ష్మీదేవి పరిణయ గేయాల్ని పాడారు. ఆ పాటలలో గోదాదేవి-శ్రీమన్నారాయణుని కల్యాణ గుణాల్ని ఆశ్చర్యపడ్తూ-అనునిత్యం వింది. పూర్వ జన్మ సంస్కారం వల్ల ఆమెకు శ్రీమన్నారాయణుని వివాహమాడాలనే కోరిక కలిగింది. ఆమె చెలులతో మాటిమాటికి శ్రీహరి అవతారాల విలాసాలను చెప్పుకుంటూ కాలం గడుపుతూ ఉంది [37]

విష్ణుచిత్తుడు మహావిష్ణువు ప్రసాదించిన సంపదలు ద్రవ్య తండాలుగా-ఇంట్లో అక్షయంగా నిండి ఉన్నా-గర్వితుడు కాలేదు. ఎప్పటిలాగానే భగవంతునికి తోమాలలు కడుతూ-విష్ణు మహిమ ప్రతిపాదకాలైన పురాణాలకు వ్యాఖ్యానాలు రచిస్తూ-కాలం గడుపుతూ ఉన్నాడు. గోదాదేవి భగ

కాంతుని కోసం తండ్రి కట్టిన పూల మాలల్ని-తాను ధరించుకొని.. నెమలి పురుల్లో మదనుని కోసం చేయబడిన-అందరి చేతిలోనున్న బాణమో అని ఒప్పేట్లు కొంచెం ఎడమ పక్కకు ఒరిగేట్లు గుండ్రని కొప్పు పెట్టుకొంటుంది. ఆ కొప్పుకింద ఆ తోమాలను ధరించి-కొంచెం సేపు ఉంచుకొని- బావి నీటిలో తన నీడను చూచుకొని సంతోషించి - మళ్ళీ పూల బుట్టలో ఉంచుతూ ఉండేది.[38]

గోదాదేవి అతిశయంగా పసుపు పూసుకొని జలకమాడి, దుకూలం ధరిస్తుంది. గుండ్రనయిన కుచాగ్రాల మీద కుంకుమ రేఖలు దాల్చుతుంది. కర్పూరంతో తిలకం తీర్చుకొంటుంది. స్వామికోసం తండ్రి కూర్చి పెట్టిన విరి దండను ప్రియపడి కొప్పులో ధరించి, కొంచెం సేపుంచి తర్వాత తీసివేసి వేడి నిట్టూర్పు నిగిడిస్తూ-చెలివైపు చూసి,[39] (ఇలా అంటూ ఉంది)

## గోదాదేవి విరహ వర్ణన

తొయ్యలులారా! మీరు పాడిన హరివిలాసాలు ధర్మంగా ఎలా తలప వచ్చు? వంతి తనను పైకొన్న పసతుల్ని ఇతడు చెలిమి వహించి కాపాడాడు?[40]

ఆ హరి తాను ప్రతి చతుర్యుగంలోను దేవ, తాపస, రాజావతారాలు (అంటే వామన, పరశురామ, శ్రీరామావతారాలెత్తి) విరహ దుఃఖంలో ముంచడం కంటే-చేప, తాబేలు, వరాహం, సింహంలాగానే అవతారాలెత్తడం మేలు.[41]

మత్స్య, కూర్మ, వరాహ, నరసింహావతారాల్లో శాశ్వతంగా ఉండి పోతే-అతడు తనను ప్రేమించిన ప్రేయసుల్ని ఉడికించే పని ఉండదు. ఆ శరీరాల్ని అతను ధరించినపుడు అతనికి ప్రేయసులు ఉండరు గదా! అలాగాక ఆ అవతారాల్లో ఆ జాతి జంతువులు హరికి ప్రేయసులుగా ఉన్నా-వారికి నర జాతి స్త్రీలకున్నంత కామాతిరేకం ఉండదు గదా! ఆ! ఉంటుంది! నేను తెలియక ఇలా అంటున్నాను. ఇది పొరపాటు,[42]

తనకు ఎలాగో అన్ని ప్రాణులకు అంతే అని [ఆత్మవత్సర్వభూతాని] అనే మాట కొంచెం కాదు నాకెలాగో ఇతరులకు కూడా అంతే! వలకాని యువతులకు కలిగే విరహతాపం ముచ్చటల్లో, ఆట పాటల్లో, కథల్లో కొంత శమిస్తుంది మరి నోరులేని జంతువులకే నొప్పి ఘనంగదా![43]

శ్రీ హరి పూర్వచతుర్యుగాల్లో తనను వలచిన యువతులు-వారి విశాలనేత్రాల శ్రేణుల్లో బాష్పజల ప్రవాహాల్ని సృష్టించాడు వారి శరీరాల్లో పులకల్ని నింపాడు. అలాచేస్తూ-వారిని వియోగదుఃఖం పాలు చేసిన గొప్ప పాపం వల్ల-తనకు నీటి జంతువుల జన్మం, వరాహజన్మం, సింహజన్మం సంభవించగా-వాటిని అవతారాలు అనే మిషతో ప్రౌఢంగా కప్పిపుచ్చుకున్నాడు[44].

ఈ హరి వామన, పరశురామ, శ్రీరామ జన్మల్లో-ఎలా తనను ప్రేమించిన జలజాక్షుల్ని దయలేక ఏడ్పించిందీ-ఆ వృత్తాంతాన్ని మీ పాటల్లోనే తెలుపుతాను వినండి![45]

పూర్వం ఈ హరి ఉపేంద్రుడై భృగుపత్నిని సంహరించాడు. తనలాగానే పతివిరహం పొందమని భృగువు శాపం పెట్టగా - ఆ శాపం కూడా దేవకార్యానికి పనికి వస్తుందని-భార్యా వియోగాన్ని ధరించాడు. ఈ విధంగా హరి వామన, పరశురామావతారాల్లో బ్రహ్మచారియై-లక్ష్మీదేవి మనస్సులో శాశ్వతమైన వ్యథను నింపాడు[46]

పరశురాముడు శత్రువులు, మిత్రులు, ఉదాసీనులనే మూడు రకాల సింహాసనాసీనులైన రాజుల్ని-ఒక్కొక్క తెగను ఏడుమార్లుగా ఇరవై ఒక్కమార్లు-ప్రళయ కాలపు సూర్యుని లాగా తీక్ష్ణమైన గొడ్డలి వాదరతో, దావానలంతో సరికి భూమి అంతటా వారి రక్తం పారించాడు. ఆయన కీర్తి అన్నిచోట్లా మారుమ్రోగి-నిఖిల భూమి అతని వశమైంది. అలా వశమైన భూమిని పరశురాముడు కశ్యప ప్రజాపతికి దానం చేశాడు అప్పటి నుండి-భూమి కశ్యపుని కూతురై 'కాశ్యపి' అనే పేరుతో పిలువబడుతూ ఉంది.- ఈ సాహస వృత్తాంతాన్ని గోదావరి రోషంగా-ఎత్తి పాడుతూ ఉంది.

ఎలాగంటే-పరశురాముడు మంద్ర మధ్య తారములనే మూడు స్వర స్థానాల్లో సరిగమపదని అనే సప్త స్వరాల్ని మొత్తం ఇరవై యొక్క మూర్ఛ ప్రయోగాల్ని ప్రళయకాల సూక్ష్మవిలాగా - తీక్ష్ణమైన గొడుపుతో-కీర్తి అనే వీణను-వాయించాడు. ఆ హస్త లాఘవానికి, ఆ వాదనకు మెచ్చి-అనురక్త అయి వశ్య అయిన భూదేవిని-చివరికి స్వీకరించకుండానే-దూరం తోసివేస్తూ-కశ్యప ప్రజాపతికి ఇవ్వగా-ఆమె విరహ దుఃఖంతో కశ్యపునికి బద్ధమై వెళ్ళిపోలేదా![47]

శ్రీహరి కకుత్స్థ వంశంలో శ్రీరాముడుగా అవతరించినపుడు-అతని గుణ సంపన్నతను మెచ్చి-అతనికి అనురక్తితో ప్రజలు రాజ్యలక్ష్మిని కూర్చడానికి ప్రయత్నించారు. పట్టాభిషేక మహోత్సవం సర్వసిద్ధమై ఉండగా-(రాజ్యలక్ష్మి అతని సౌందర్యం చూచి-మరులుగొని వస్తేట్లు మోహన కమలంతో వేసి రప్పించడం) ఆ రాజ్యలక్ష్మిని క్రూర హృదయుడై పట్టి వేసి-అరణ్యానికి వెళ్ళి-ఆమెకు (ప్రజలకు) వెక్కిరేట్లు చేయలేదా! ఆలా శ్రీరాముని అవతారమెత్తిన హరి ప్రకారాల్ని మీరే చక్కగా ఆలోచించండి అతని కఠినత మీకే తెలుస్తుంది.[48]

రావణుని చెల్లెలు శూర్పణఖ శ్రీరాముని వలచి-అతడు తనను కామించడానికి తగినట్లు రాక్షస రూపం వదిలి-అద్భుతమైన సుందర రూపం దాల్చి-అతన్ని పొందడానికి సమీపించింది. అలా చేరిన శూర్పణఖను నలుపురూ నవ్వేట్లు అలా చేయక-ముక్కు చెవులు కోయించకుండా-ఏలుకొని ఉంటే, రావణుడు వియ్యమంది-సీతమీద కోపించి ఆమెను తీసుకొని వెళ్ళేవాడుకాదు ఆ సీత కేవలం లోకమైనా-శ్రీరాముడు ఆలోచించలేదు -వృథా కలహంతో తనను ఎడబాసి ఉండే విరహానికి, ఆ రావణుని విరోధానికి సీత లోన యేట్లు చేశాడు గదా![49]

శ్రీరాముని ఆజ్ఞతో లక్ష్మణుడు కత్తి చేతబట్టి శూర్పణఖ ముక్కు-ముదావి మూలంలోని ఎముకతో సహా "ఫెట్" అనే శబ్దం వచ్చేట్లు . తెగనరి కోసేశాడు. అలా చేసినపుడు-ఆమె ముక్కు నుండి నెత్తురు పెదవి మీదికి

ప్రవహించింది. ఆమె పెదవి కంపించింది. ఆమె ముఖం వర్షాకాలం మేఘ గర్జనల్లాగా బిగ్గరగా వినిపించాయి. తన ముక్కు కోయనీకుండా అడ్డానికి కోసం-శూర్పణఖ లక్ష్మణుని చేతిని-తన చేతుల్లో గట్టిగా చుట్టి పట్టుకొంది. కత్తి పట్టుకొని ఉన్న లక్ష్మణుని చేయి-లత అల్లుకొని ఉన్న చందన వృక్షం లాగా-దాన్ని చుట్టుకొన్న శూర్పణఖ చేయి ఆ చందనపు కొమ్మను చుట్టుకొన్న వల్లి త్రాచులాగా ఒప్పారింది. అదీ రాజ సింహాలకై హరి చేయించిన వని![58]

శూర్పణఖ తన వద్దకు వచ్చినపుడు శ్రీరాముడు 'ఒల్లనమ్మో' అని చెప్పి ఉంటే వెళ్ళిపోయేది గదా! ఆమె రాక్షసి కావడమే దోషమా? ఆమెను పరిహాసాల్తో ఎందుకు బాధించాలి? పాత స్త్రీలు తలవంచుకొనేట్లు తానే వంచి వచ్చింది - అలా రావడమే ఆమెకు అవమానం - అదది అని ఇంత అల్లరి చేయాలా.[61]

శ్రీరామావతారంలో - అతని సౌందర్యం పురుషుల్ని సైతం మైమరపించింది. ఆ అవతారంలో మునులు సయితం అతన్ని పొందగోరారు. వారి కోరికను తర్వాతి జన్మలో తీరుస్తానని వరమిచ్చి, కృష్ణావతారంలో వారిని గోపికలుగా జన్మింపజేసి-వారితో శృంగార క్రీడల్లో తేలాడాడు. అలా తానే లోకంగా తన మీద అనురక్తులైన ఆ గోపికా స్త్రీలను ఉన్నట్లుండి-అక్రూరుని బోధనతో-మధురాపురానికి వెళ్ళడం అనే మిషతో - వదలి పెట్టి వెళ్ళిపోయాడు.[62]

మోహితులైన అయోముఖి అనే రాక్షసిని, విశ్రవసుని పుత్రిక అయిన శూర్పణఖను కొట్టించి పంపడానికి కారణం వారు 'విరూపలు' అయినందువల్లనందామా? కాదే! శ్రీహరి తాను బలరాముడై పెద్ద నిట్టకాలి వంటి అతిశ-తనకన్నా వయసులో పెద్దదైన రేవతిని రమించాడు. ఆ మునుల అమె-కోసం తాను కూడా-మునులు (వృద్ధుడు-ముసలం-పరశువు-ధరించిన వాడు) అయ్యాడు గదా! ఇక పోతే కుబ్జ ఒక దాసి. మరుగుజ్జు. ఆమె కోసం-ఉగ్రసేనుని సేవకత్వం పొందింది. త్రివక్ర అయిన ఆమెను వంకర పోగొట్టి పెండ్లి కొన్నాడు గదా![63]

(అయోముఖిని లక్ష్మణుడు ముక్కు, చెవులు స్తనాలు కోసి పంపాడు. రేవతి బలరాముని కన్నా ఇరవైఏడు చతుర్యుగాలు వయసులో పెద్దది. కకుద్మి అనే అతని కూతురు. బ్రహ్మనియోగంతో ఆమెను బలరామునికిచ్చారు )

ఈ శ్రీహరి బృందావనంలో గోపికలు తన మీద అత్యంత అనురక్తలై ఉండగా, తాను వారిలో పక్షపాతం వహించి, కొందర్ని రతిలో తేల్చాడు. మరి కొందర్ని విరహాగ్నిలో పేల్చాడు. ఇలా చేస్తూ - రాధకు మాత్రం మేలువాడై - శ్రీకృష్ణుడు ఇతర స్త్రీలందరికీ మదిలో దుఃఖాన్ని నింపాడు గదా![54]

అని ఇలా లజ్జాతిశయంతో ఉపాలంభం (నింద) అనే నెపంతో - శ్రీహరిని పునః పునః స్మరణ చేస్తుండే గోదాదేవి మనస్సులో శ్రీహరిపైన ఉండే అనురాగం తేటపడగా చెలులు తెలుసుకొన్నారు. ఈమె హరి మీద నాటుకొన్న 'కన్నెరికం'ని సిగ్గుకు వశమైనదై బయలు పడనీక, పుటపాక నికాశం అయిన (పుటం పెట్టి వండడంతో సమానమైనది) విరహాగ్నిలో చీకాకుపడి నానాటికి నవ్వుతున్నట్లే ఉన్నా కృశిస్తూ ఉంది. ఈ యింతి-మనస్సు వేరుగా చూస్తూ ఉండడాన్ని మాన్పి, ఆమె మనసులోని గుట్టు తెలుసుకొని-చింత తీర్చక పోతే ప్రమాదం అని భావించిన చెలులు-గోదాదేవితో నర్మ గర్భంగా ఇలా అన్నారు [55]

'చెలీ! ఏ స్త్రీలు అయినా దూరంగా ఉండే ప్రాణ భర్తల్ని-విరహ తాపం వల్ల ఇలాగే నెరసులెన్నక మానరు. మరి ఆ ప్రాణ భర్తలు పక్కలవుతూనే-వారితో ఒక్కటైతే చెలుల్ని ఎవర్నీ పట్టించుకోకుండా తమ ప్రాణ ప్రియుల్ని-ఇంద్రుడు, చంద్రుడు అని పొగుడుతారు, చెలికత్తె-తామ ఇవతల చేరకత్తె అయిపోతుంది ఈ పదవదులు నీ తలలోనే మోసలేను చెలీ!'[56]

అలా గోదాదేవిని చెలులు ఎత్తిపొడవగా ఆమె పెల్లు నవ్వు అణచుకుంటూ, కాస్త కోపం తెచ్చుకొని, క్రింది పెదవి కరుచుకొంటూ తాళిని బంతుల్తో కొడుతూ, పక్కలకి చూస్తూ ఇలా పలికింది.[57]

'వెన్నెలా! నీ గానం అద్భుతంగా బాగముగా ఉన్నందున వల్ల ఇంకా [illegible] అన్నావు. అది తప్పా? తొలిది (ప్రాణమునం) [illegible] చేస్తావా? ([illegible] రెండు పాట్లు [illegible] అంగ తప్పు) నా మీద నిందలు వేస్తు కంటే అతన్ని (శ్రీహరితో) నాకేంపని?'

'[illegible]' [illegible] అన్నారు. సఖీ! [illegible] ఎప్పుడైనా [illegible] కొండ [illegible] కాని! [illegible] (శ్రీహరి) [illegible] [illegible] గాని [illegible], [illegible] ఎక్కిన్ని [illegible]?"

చెలీ! నీవు దాచినా రాత్రుల్లో నీవు పడే అవస్థ మాకు తెలుస్తూనే ఉంది. అ[illegible] మాకు తెలియకుండదానికి అవతలి వైపు [illegible] పెట్టి [illegible] కన్నీళ్ళు [illegible] [illegible] నీ కన్నీటి [illegible] తెలుస్తూ ఉంది.

నీవు [illegible]ంగా [illegible] నీ [illegible] [illegible] తెలుస్తూ ఉంది. మేము [illegible] [illegible] గద్గద స్వరాన్ని తెలుపుతూ ఉంది.

నీవు విరహ శోకం భరించలేక వహించే వైరాగ్యాన్ని [illegible] [illegible] తెలుపుతున్నాయి. నీ విరహాయాసం పాన్పుపై నీవు [illegible] తెలుస్తూ ఉంది. [illegible] నీవు చేసే [illegible] నీవు [illegible] తెలుస్తూ ఉంది. నీవు మా మీద చూపించే [illegible] [illegible] తెలుపుతూ ఉంది. ఇలా రాత్రుల్లో నీవు పడే అవస్థ నీ విరహ తాపాని[illegible]?"

[illegible] గోపాలుని గురించి [illegible] ([illegible]) దిగుడు బావిలో [illegible] [illegible]. [illegible] దిగాను. [illegible] ముత్యాల[illegible]

ఆమె స్నానంచూడి తిరిగి వచ్చిన తర్వాత-నన్ను కలికలు పెట్టి తన సొమ్మును గురించి అడుగుతుంటే గాని-తనఆర్తి ఎంతటిదో తెలుసుకోలేదు[61] (ఆమె విరహ తాపంతో ముత్యాలు కాగి పోయి-నీళ్ళు తగుల్తానే సున్నం అయ్యాయి. తానెంత కాకకు లోనయిందో-ఆమె తెలుసుకోలేదు)

అది ఆ చెలి చెపుతూనే మరో అనే చెలి ఇలా అంటున్నది: 'హారిణీ! ఈ సంగతి నీవు వినలేదా? ఒకనాడు గోదాదేవి కూర్మితో కస్తూరి నా చేతికిచ్చి బొట్టు పెట్టమంది- నేను ఆమెకు బొట్టు పెడుతూ ఉంటే- 'దుష్టని' నా మొగాన కొట్టినట్లుగా-ఆమె ఊర్పులతో మాటిమాటికి ఇంకి ఇంకి పేట్లు పేట్లుగా లేచి పోతూ ఉన్న కస్తూరిని-మాటి మాటికి తీయడానికే సరి పోయింది. అంతే గాని బొట్టు పెట్టడం కుదరలేదు. ఇంతటికీ విషయం ఆమెకు తెలియదు[62]

ఇలా మరో చెపుతూనే ప్రగల్భ ఇలా అంటూ ఉంది. 'చెలులారా! ఆమెను నేను తీగె ఉయ్యాలలో కూచో బెట్టి విసుగుగా ఊపుతూనే-ఉయ్యాల తెగి ఆమె క్రిందపడ బోయింది ఆమె స్తనభారం నేనెలా మోయగలనో గదా అని భయపడుతూ పడకుండా-సందిట్లో పట్టుకున్నాను ఆమె మధ్యాహ్న సూర్యకాంతికి వాడిపోయిన పూల గుత్తుల్లాటి పాలిండ్లతో-బెండు బొమ్మలాగా నా సందిట్లో చులకనగా ఉంది'[63]

అని ఆమె అవస్థ తెలిసేట్లు ఆ సఖులు పలకగా ఆమె 'అనాదర' లాగా వారితో ఇలా అంది.[64]

'ఓ చెలులారా! అర్పడానికి తీర్పడానికి మిక్కిలి నేర్పుగల వయస్యల్లాగా-మీ మీ నేర్పుతో ఆదరం స్పష్టమయేట్లు మాట్లాడుతున్నారు. ఎందుకు మీకీ విచారం'?[65]

అని పరిహాసంతో వారి మాటల్ని తేలిపోనిచ్చి. పుటపాక ప్రకార మైన వియోగ తాపాతిశయాన్ని సమూదత్నం అయిన గోదాదేవి అణచుకొని ఉండీ ఉండలేక-రాత్రి సమయాల్లో ఒక్కొసారి అంటోనే-[66]

'గోవిందా! నీవు వికసిస్తూ ఉన్న నల్ల కలువలాగా శ్యామలం. కోమలం అయిన నీ ఎడమ భుజం మీద ఎడమ చెవిలోని మకర కుండలం

అను కునేట్లు-తలనుఎడమ వైపునకు వంచుకొని ఉన్నావు సాటిలేని నీ ముఖ శోభను-ఎవ్వరికీ ప్రకాశిస్తూ ఉండేట్లు-స్తంభనం చేసే వేషాలతోగాటు పెప్పే నీ కను బొమ్మను-కొద్దిగా నిక్కించావు చుబుకంలో ఉన్న మంకెన పూవు వంపునకు తలవంపు తెచ్చే వంపు గలిగినదైన నీ కెమ్మోవి-సింధూరం వర్షిస్తున్న దాని లాగా ప్రకాశిస్తూ ఉంది. నీ విశాలమైన మెరుగు కన్గవ చూపు దిక్కుల మీదికి ప్రసరించి-చెవుల్లోని కుండలాల కాంతితో పోటీ పడుతూ ఉంది.

సప్తలోకాల అనురంజనం కోసం-సప్త విధాలైన కళల ద్వారా గాన సుధను ప్రవహింపచేయడమో అన్నట్లు-వేణువు మీద వ్రేళ్లు మార్చి మార్చి సప్తస్వరాలు పలికించి-గోపికలను మరులు కొలిపావు గదా![67]

అయ్యో రాధా! ఇది నీకు న్యాయమా? ఈ ముకుందుని మధుర మైన వేణు వాదపు తళకు కామోద్రేకం పొంది-తమ భర్తల్ని, అత్త మామల్ని వదిలి-వేటగాని గీతానికి లోబడి లేళ్ళ మొత్తం వాని వద్దకు వచ్చినట్లు-కలియయించే కాంక్షతో ఆత్రుతలతో గోపికలు రాగా-వాళ్లని దుఃఖం పాలు కావించి-శ్రీకృష్ణుని రుచిర భోగాన్ని-నీ వొక్క దానివే గుత్తగా అనుభవించడం నీకు తగునా?[68]

ఆ శ్రీకృష్ణుడు ఒక యువతిని భుజాన పెట్టుకొని యమునా తీరంలో పొదరిండ్ల సమూహం వైపు తీసుకొని పోగా-ఇతర యువతులు యమునా నది వెంబడి-కృష్ణుడు, అతడు మోసుకెళ్ళిన యువతి ఇద్దరి బరువువల్ల-లోతుగా దిగబడ్డ అతని అడుగుజాడను బట్టి పోయి వెదకి-అక్కడ ఆ పొదరిండ్లలో ఏమి చూస్తారో? వారికి అభిమానం ఉండవద్దా![69]

ఓ ఉగ్రమయూఖ నందినివైన యమునా! కలలోనైనా ఇలు వదలి వెలువడని మానవతులను తాపకర్త్రివై (కుంచెన కర్త్రివై)-వారి అంకు తీర్చి శ్రీకృష్ణుని తమ యోగపు రుచిని ఆస్వాదింపజేసి-అటు పిమ్మట మిక్కిలిగా అలమే వియోగాగ్నిని-నీ నడుమ (యమునా నది నడుమ) మున్న ఇసుక దిబ్బలపై దుఃఖాల్లో పొర్లించావు గదా! నీవు యముని సహోదరివి కావడం నిశ్చయం[70].

ఆ రాత్రుల్లో ఒంటి పాటున తనలోతాను పలికే పలుకుల్ని-పొంచి ఉన్న చెలులు విన్నారు. విని తమ ముఖాల్లో అవహాస్యపు వెన్నెలలు నిండగా-గోదాదేవిని కదిపించి "భామా! ఏమేమి? నీ మనస్సు తెలిసే కాదా! ముందు ముందు అతని మాటలు మాటలాడుతున్నారు." అని ఆక్షిప్తం చేయగా-కొంచెం తలవంచుక 'నీ-నెమ్మొగం వెల వెలపాటును తేటపుతో అణుచుకొని-ఇంకా దాచడానికి వీలుపడక అందరిని కూడుకొని (వారిని తనతో కలుపుకొని) వారితో ఇలా అంది.[71]

పూబోడులారా! వాడు (ఆ గోపికా కృష్ణుం సహవాస కాలంలో) మనం ఒంటి ఉంటే ఎలా ఉండేదో!' అని గోదాదేవి అంది 'ఇంతి! నీవు నాడు ఉండకుండా ఎక్కడ పోయావు?' అన్నారు-వారు. ఆ మాటలకు ఆశ్చర్యపడి వారితో గోదాదేవి ఇలా అంది.[72]

'సఖియలారా! త్రైకాలిక జ్ఞానవంతులైన ఋషుల్లాగా పలుకుతున్నారు.-అంత జ్ఞానం మీ హృదయాలలో ఉంటే 'నేను మొదట ఎవ్వతెనో' చెప్పండి' అంటూనే ఆమె సఖులు ఇలా అన్నారు.[73]

'రుక్మిణీ దేవి ఇంట్లో శ్రీకృష్ణునికి నారదుడు ఒక పారిజాత పుష్పాన్ని కానుకగా ఇచ్చారు. దానిని శ్రీకృష్ణుడు రుక్మిణీదేవికి ధరించడానికి ఇచ్చాడు. ఒక చెలి ద్వారా సత్యభామ ఆ వృత్తాంతాన్ని తెలుసుకొని, ఈర్ష్యాక్రోధాలు సందడించగా శ్రీకృష్ణుని మీద అలిగి 'మందంచే మాకంతా తెమ్మన్నట్లు' ఒక పారిజాతం పువ్వుకు బదులు పారిజాతం చెట్టునే తెప్పించుకొని తన పెరటిలో నాటించుకొంది. అలా చేసిన సత్యభామవు నీవే కదా' అని చెప్పారు.[74]

ఇలా చెలికత్తెలు అంటూనే గోదాదేవి తలాలయన స్ఫుటంగా ఉదయించిన జ్ఞానం కలద్ద-గృహదీపికను ఉంచుకొనే గృహంలో ఉండే పదార్థాలు ఒక్కసారిగా దృగ్గోచరాలైనట్లు-అనంతమైన శ్రీకృష్ణుని కేళి క్రీడా ప్రపంచం అప్పుడే అనుభవించినట్టిదిగా కాగా-[75]

తాను సత్యభామ అని తెలియగానే గోదాదేవికి శ్రీకృష్ణుని తోటి క్రీడల స్మరణతో పింక తీగలో మొగ్గలు పొటమరించినట్లు-ఆమె దేహమంతటా పులకలు కలిగాయి. ఆయన తోడి ఇప్పటి వియోగం మనసులో తోచి దుర్భరమై ఆమెకు బాష్పాలు ఉప్పతిల్లి - వేటుకతో వలువులై విశాల నేత్రాంతముల నుండి ప్రవహించి కర్ణ రంధ్రాలు నిండి, కర్ణాల దగ్గర నున్న ఆమె శిరోజాల తననీలిమను పెంచుతూ ఉండగా, ఆమె సోలి పడిపోయింది. అప్పుడు ఆమె చెలులు వారి హృదయాలు 'చుఱ్ఱుమనగా' 'హా' అని దిగులుతో-[76] (శైత్యోపచారాలు చేశారు )

'తామరసాక్షి అయిన గోదాదేవి చేతులు ఎంతకు తెద్వాయి.' వాటి మీద ఆమె అభ్యంతరంలోని ప్రవర్తనము ఎచ్చరించి-ఆమె బాధను గోరంతలు కొండంతలయ్యేట్లు మనమే చేశాం'-అంటూ కూజాలోని పన్నీటిని చల్లి, విసనకర్రతో చల్లగాలి వీచి ఆమెను మూర్ఛదేర్చారు.[77]

గోదాదేవి మూర్ఛదేరి, కళ్లు తెరచి మళ్ళీ ఆ హరి పాదాల ధ్యాన నిశ్చలత్వంతో కళ్లు మూసుకొంది కన్నీరు రెప్పల్ని తోయగా మళ్ళీ కళ్ళు తెరచి సఖులతో-[78] (ఇలా అంది)

'మీరెవ్వరు' అని గోదాదేవి అడుగుతూనే-వారు 'శృంగారిణి! మేము నాగకన్యలము. ఇంతకు పూర్వమే భూలోకానికి వచ్చాము.' అన్నారు. అలా చెప్పిన ఆ చెలులను కౌగిలించి గోదాదేవి ఆర్తితో ఇలా పలికింది.[79]

'అనంత కళ్యాణ గుణుడైన ఆ హరికి అప్పుడు ఆ విధంగా ప్రేయసినై ఉండి, మరి ఈ కలియుగంలో మళ్ళీ పుట్టి వియోగ వేదనతో పొక్కే ఈ వ్రతము ఏల? ఇలాంటి నన్ను మా తండ్రి మరొకరికి ఇవ్వక ముందే ఈ శరీరాన్ని యోగ శక్తితో నశింపజేస్తాను. అలా చేసి మళ్ళీ ఉపేంద్రుని పాద పద్మాల్నే ఆశ్రయిస్తాను.[80]

ఏ స్త్రీ అయినా ప్రియుని ఎడబాసినపుడు అతని వియోగ మహాభీతితో తక్షణమే దేహం త్యజిస్తే అలాంటి ఆమె చిత్తవర్తనము భక్తి అంటారు. అలాగాక ఉండే మిగతా అనురాగాలన్నీ మాయలే'[81]

అని గోదాదేవి పలుకగానే వారు, 'ఆయన శ్రేష్ఠుడయిన కృష్ణుడు ఎక్కడ వెళ్లాడు? విను! శ్రీరంగంలోనే ఉన్నాడు. వేగపాటు ఏల? అతడు నీ విభుడవడానికి అర్చవాదుల్తో ఈ విలియత్తూరులోని హానిని భరించు.[82] నువ్వేమీ కలత పడవద్దు' అని చెలులు చెప్పగానే గోదాదేవి తేరుకుంది. కానీ, అప్పటి నుండి-'నీకు శ్రీరంగ నాధుడు భర్త అవుతాడులే'! అని చెలులు కలిగించే తెలుపులు, మళ్లీ వెంటనే కమ్ముకొనే వియోగ దుఃఖం అనే చీకట్లు-అంధకారం ఇష్టపడని ఆ నిర్మలాంగికి ఆ కృశావస్థలో హృదయం మీద ఇలాల్ని ఎడమెడంగా గుచ్చి కూర్చిన బన్నసరంలాగా ఒప్పుతున్నాయి.[83]

పొంచి ఉండి ఏ ప్రొద్దూ ఆమెను నిద్రపోనీకుండా మన్మథుడు చంపాలి అయి కలవానికి కాలు దువ్వుతున్నాడు అందువల్ల శుక్లకృష్ణ పక్ష రాత్రుల వరుసలు ఆమెకు ఇంటిలోపి పసు ముల్లులాగా అయ్యాయి. ఆమెకు రాత్రులలో విరహతాపం అధికమై నిద్రరాలేదు[84] (ఏదు పంది ముంద్లున్న ఇట్లో కలహాలు తరగవు అని అంటుంటారు)

సూర్యోదయాల్లో తామర కొలమల్లోని పద్మాంపై సూర్య కిరణాలు ప్రసరించడం, తామరలు వికసించడం, వాటి నుండి తుమ్మెదలు వెలువడడం ఎలా ఉందంటే-మన్మథు నాజ్ఞచే వేటువ అనే ఫిరంగివాడు గోదాదేవి ధైర్యం అనే కోటను కూల్చడానికి-ప్రతి దినం కోపంతో కాల సూర్యుని కిరణం అనే వన్నివి దీవకళికను- తన చేతితో ఆ తామరలనే ఫిరంగుల చెవులకు అంటించి- తామర నాళాలు అనే ఫిరంగి గొట్టాల ద్వారా-ఆ తుమ్మెదలనే ఇనుప గుండ్లను ప్రయోగిస్తున్నాడా అన్నట్లు ఉంది. అందువల్ల ఆమెకు విరహ తాపం అధికమై ధైర్యం తూలిపోతూ ఉంది. రాత్రుల్లో లాగానే వేటువ కాలంలో కూడా వియోగ భారం దుస్సహమైంది.[85]

మధ్యాహ్న వేళలో మధ్యాహ్నం అనే 'మంత్రవాది' గోదాదేవికి సమీపంలోనే ఘట యంత్రం (కుండల పీఠం) అనే జపమాలను త్రిప్పుతూ ఉన్నాడు మంచువలె చల్లనైన ధారా గృహం అనే శరీరం గలవాడయ్యాడు.

సుదు చిరమైన మేలు కట్టనే మిషతో-కుసుమ వర్ణం అద్దిన వస్త్రాన్ని ధరించిన వాదయ్యారు ధారా గృహ జల బిందువులనే జలోద్వారణతో-గోదాదేవి ధైర్యాన్ని చెదరగొడుతూ ఉన్నారు. మధ్యాహ్న సమయంలో శీతలత్వం కోసం-ఘట యంత్రాలతో తోడే చల్లని నీరు. ధారాగృహాలు శీతలోపచారాలకు వనికి వచ్చేవి. ధారా గృహంలో కట్టిన కాషాయరంగు మేలుకట్లు. చలువలు వెదజల్లే చల్లని కేళాకూళులు. వాటిలో తొణకుతున్న చల్లని నీటిబొట్లు ఆమె విరహతాపాన్ని అగ్రుదానికి తోడుగా పెంచాయి[86]

గోదాదేవికి సంధ్యవేళ కూడా బాధాకరంగా పరిణమించింది. కలలో కోతి కనబడడం చెరుపు. అలానే పీడాకరమే కాబట్టి సంధ్యవేళ కోతిగా వర్ణింపబడింది. ఎర్రకలువల పుప్పొడి మొత్తమే దాని దేహం. సాయం సూర్యుడు దాని ఎర్ర మొగం. మల్లెపువ్వులు దాని దంతాలు. తేనెరంగు నక్షత్రాలు దాని కనుగుడ్లు. ఆకాశం అది ఉండే చెట్టు. ఆకాశంలో అది ప్రసరించడం దాని కొమ్మలపై దుమకడం. ఎగుస్తూ ఉండే చక్రవాకాలు దాని శిశువులు. ఆ గోదాదేవి యొక్క చింతవ్యాధ ఆమె నిద్ర. ఆమె నిద్రలో ఆ సాయం సంధ్యలోచదమే కోతి రావడం.[87]

పద్మముఖి అయిన గోదాదేవి ప్రతిదిన ప్రభాతంలో-మౌన నియతితో మేల్కొంటుంది. సఖులు ఆమె ముందు బంగారు పళ్ళెంలో పసుపు. ఉసిరిక అటకలి మొదలైన స్నానార్హ వస్తువుల్ని. ఉదికిన మడుగు వస్త్రాలు. తడి యొత్తులు తెస్తుండగా-తమ ఇంటి తోటలోనే లోపలి దారిలో వెళ్ళి-దాని లోని దిగుడు బావిలో-ద్రావిడ వేదం పఠిస్తూ జలకమాడుతుంది. తాను పూసుకొని స్నానమాడిన పసుపునకు-తన దేహ కాంతి పూర్ణ సౌభాగ్యాన్ని ఇస్తూ ఉంటుంది. చలనం వల్ల ఆమె అవయవాలు 'చకచక'లు (నిగనిగలు)-నీరెండతో పోటీ పడుతూ ఉంటాయి. ఆమె నిడు వెంద్రుకల గుంపును వెనక్కి తోసుకొని, తడి యొత్తులో పదివరిగా తడి తుడుచుకొనేది. ఆ తర్వాత విద్యుక్తంగా-[88] మొల్ల మొగ్గల్లాంటి దంతాల చివర్లు గల గోదాదేవి అందమైన నొసటి మీద గుమ్మడి గింజ రూపంలో పాండుర వర్ణమైన మట్టితో తిలకం దిద్దుకొంటుంది. గజకుంభాలకు సిందూరం పూసిన రీతిగా కటిపై

చంతురకావి తిలగు వలువ ధరిస్తుంది. కేశపాశం తడి సువాసనలు వెద జల్లుతూ ఉండగా దాని చివర ముడిలో అలదుకొన్న పునుగు-స్నానంలో తడిసి ఇవుడు చలువ వాసనలు కమ్మదనం వల్ల - తుమ్మెదలను విందుల్లో తేలుస్తాయి.—[90] గోదాదేవి తాను రచించిన చెంగల్వ పూదండను, చెట్టులోనే పండిన పెద్ద అరటి గెలను తీసుకుని వెళ్ళి-గుడిని వంటి విర్జనం చేయగా- లోపల ప్రవేశించి - స్వామికి మ్రొక్కి వేదిక మీద పలువన్నె ముగ్గు పెడుతుంది.[91]

గోదాదేవి కపిల గోవు నేయితో గొప్ప దీపకళికను తీర్చి, ద్వయ మంత్రోచ్చారణ పూర్వకంగా స్వామి వక్షం మీద కలువదండను చేర్చి అగరు ధూపాన్ని వేసి-చక్కెరతోను నేతితోను కూడుకొన్న హృద్యమైన కదళీ ఫలాల్ని నైవేద్యం ఇస్తుంది.[92]

తునకలు గావించిన పోకచెక్కలు (వక్కలు), సొంటి తునియలు, పెద్ద కర్పూరపు తునియలతో కూడుకొన్న తాంబూలాన్ని అఖండ స్థిర భక్తితో-స్వామికర్పించి చెలులతో కదలి తరలి,[93] గర్భగృహ ప్రదక్షిణం చేస్తుంది ఆమె భక్తిలో వంగి-తలపై శఠకోపం స్వీకరించి-స్వామి చరణ తీర్థం పుచ్చుకొని, స్వామిప్రసాదలబ్ధమైన పూలదండను దాల్చి ఇంటికి వెళ్తుంది[94]

గోదాదేవి ప్రతిదినం ఇలా హరిపూజ చేసి తిరిగివచ్చి-వియోగం వల్ల జారిపోయిన ధైర్యం-తో-శ్రీకృష్ణుని గుణాలు ద్రవిడ భాషలో పాడుతూ ఉంటుంది.[95]

## వసంతఋతువు

అప్పటికే ఆముక్తమాల్యద యొక్క మదన తాపం అనే సూర్యుని సెగ వెట్టతో వేగిన దక్షిణ దిక్కు-తాను (సూర్యుడు) చేసిన వేడిక తుద ముట్ట మాడి పోతుందేమోనని-ఉత్తర దిక్కుకు సూర్యుడు మళ్ళాడా అన్నట్లు సూర్యుడు ఉత్తర దిక్కుకుమళ్లాడు.[96]

సూర్యుడు అప్పుడు దక్షిణ దిక్కు వదలి ఉత్తర దిక్కుకు వెళ్ళిన కారణం తెలిస్తూ ఉంగి-ఏమంటే-గోదాదేవి విరహ తాపం వ్యాపించిన దక్షిణ దిక్కులో తాను కూడా ఉంది నందువల్ల-ఆమె దేహతాపం తనకు కూడా

తగులగా ఓర్వలేక-సూర్యుడు ఆవేడిని ఉపశమింపజేసుకోవడానికి పలాయితుడై-కరుడు గట్టిన జలమే అయిన హిమవత్పర్వతపు కోనల్లోని చలువలో-తన తాపం తీర్చుకోడానికి వెళ్లాడు [97]

విరహుల మీద కోపం పూని - మన్మథుడు దాడివెళ్ళేటప్పుడు_ అతని కేతనం అయినందువల్ల-మీనం (మీనరాశి) భూమితో కనిపించడం న్యాయమే మరి మేషం (మేషరాశి) రావడానికి ఏమిపని? అని అడగపన్లేదు విరహం అనే పేరుతో అగ్ని పాంథుల భార్యల్ని (వియోగినులు) కాల్చడానికి రాగా-అగ్ని దేవుని వాహనం అయిన మేషం ఎందుకు రాకుండా ఉంటుంది? [98]

(సూర్యుడు మొదట మీనరాశిలో, తర్వాత మేషరాశిలో ప్రవేశించడాన్ని ముందు మీనరాశి రావడంగా-తర్వాత మేషరాశి రావడంగా చెప్తారు ఉత్తరాయణం వచ్చినప్పటినుండి మన్మథునికి బలం హెచ్చి-విరహుల బాధ ఎక్కువైంది అని భావం)

చలికాలంలో చెలువలు 'ఇటు తర్వాత వసంత ఋతువు వస్తుంది- చలిచేత ఇప్పుడు లభించే ప్రియుల గాఢాలింగనాలు అప్పటి వేడి దినాల్లో సడలి పోతాయి' అని భయంతో పెదవులు తడుపుకొంటూ ఉన్నారు ఇలా ఉండగానే వసంత ఋతువు-సంపూర్ణ విజృంభణతో రానే వచ్చింది ఆ ఆపద రాక ముందు భయపడి ఆ యువతుల-ఆపద వచ్చిన తర్వాత ధైర్యాన్నే అవలంబించి-పెదవులు తడుపుకోవడం మానారు విపత్తు వచ్చినప్పుడే ధైర్యం వహించాలి (విపది ధైర్యమ్) అనే సూక్తి ఉచితమైనదే కదా! (వారు పెదవులు తడుపుకోవడం పెదవులు చలికి పగిలినందు వల్లనైనా-భయంతో అని- కవి చమత్కరించాడు )[99]

యువతులు శీతాకాలంలో తమ పెదవుల మీద పెక్కువగుళ్లురాగా మైనం (మధూచ్ఛిష్టం) పూసుకొన్నారు. నిజానికి తమ మోవిచిగురు యొక్క ఎంగిలిని ఈ మధువు (తేనె) తినుకొంది. ఇసీ! ఆ తేనె ఉచ్ఛిష్టం (ఎంగిలి.ది) అయిన మైనం ఎలా పూసుకొనేది? అని ఏవగించుకోకుండా పూసుకొన్న దోషాన్ని-మన్మథుడు వసంతకాలం తెప్పించి పోగొట్టాడు.

అలా మన్మథుడు చేసిన మేలును గుర్తు పెట్టుకొని-వసంతునికి ఊరట కలిగేట్లు చెట్లకు దోహదాలు చేశారు-చెట్లు పూచేట్లు మన్మథుడు చేస్తూ ఉండగా. అతనికి సాయంగా-యువతులు పాద తాడనం మొదలైన దోహదాల్తో-చెట్లను పూయిస్తున్నారు.[100]

పుష్పబాణుడైన మన్మథునికి-ముందే చంద్ర బలం ఉంది. మలయ మారుతం అనే సువాసన భరితమైన పిల్లవాయువు అనే తేరెక్కి వస్తూ ఉండే మన్మథునికి-సూర్యుడు భూమి మీద కొత్తగా అనుకూలించాడు విరహిణీ ప్రాణాప హారం పగపట్టి చేసే విధాతకృత్యం ఏ సమయంలో నైనా ఎలా తప్పుతుంది[101] (సూర్యుడు శిశిర ఋతువులో మంద ప్రకాశుడై-ఇప్పుడు మునపటి కాంతి తెచ్చుకున్నాడు)

మలయాద్రి నెత్తంలోని పర్ణశాలలో నివసించే అగస్త్యున్ని సేవించడం ద్వారా-ఆ దక్షిణ దిక్కునుండి వచ్చే మలయమారుతం ఈ విద్యను నేర్పిందేమో అన్నట్లు-మందంగానే చరిస్తూ మంచు సముద్రాన్ని అపోశనించింది.[102] (అగస్త్యునికి సముద్రపాన విద్య తెలుసు. అతని శుశ్రూష చేసిన మలయాద్రిలోని గాలి కూడా ఆ విద్యను అతని వద్ద నేర్చుకొని మంచును కరిగించింది)

మలయ పర్వతంలోని చందన వృక్షాల న్యాయమే (పరిమళ గుణమే)-భూమి మీద ఉన్న అన్ని చెట్లుకు కలిగించడానికి వీచిందా అన్నట్లు-మలయమారుతం సువాసన భరితంగా వీచింది.[103] (చెట్లన్నీ పుష్పించి ఉన్నందు వల్ల గాలి పరిమళ భరితమైంది)

వసంత ఋతువులో కామినులు కప్ప చెట్లను తమ దోహద చర్యల ద్వారా పుష్పించేట్లు చేసి. వాటి పూల సువాసనను తమ వైపు తెస్తున్న వేకువ గాలితో-ఉద్దీపిత కాములై రవికల్ని విప్పి-భర్తను కలిసి వలి గుబ్బలతో ఒత్తారు. ఆ కౌగిలింత వల్ల స్వేదం కమ్మగా దోమ తెరల్ని మంచపు మేలు కట్టుపైకి ఎత్తేశారు. వేడిమి ఎక్కువకాగా ఘంచాల క్రింద ఉంచుకొనే అనువ కుంపట్లను తీసేశారు.[104]

అరుణాంశుడైన సూర్యుడు హిమ ఋతువు అనే రాత్రిలో డీలుపడి అస్తమించి-పుష్పఋతువు అనే పగటి ప్రాతఃకాలంలో ఉదయించిన వాడయ్యాడు. అలా ఉదయిస్తూ పూర్వం (తాను అస్తమించేప్పుడు-అంటే చలికాలం మొదట్లో) తాను ఇల్లడ ఉంచిన జవ్వనుల కుచాలకు అలదే కలపంలోని సాంద్రమైన కుంకుమ పువ్వు అనే అగ్నికీల యొక్క అరుణ ప్రభను వెనక్కి తీసుకొన్నాడు. అలా తన కాంతిని వెనక్కి తీసుకోవడం వేకువ అనకపోతే-ఈర్ష్యచేత కోపగించుకొన్న స్త్రీల కర్ణాంతక-కోకిల అనే కోడి కూత పిడుగులాగా-ఎందుకు ఉద్ధృతమౌతుంది?[105] (కామినులు చలికాలంలో కుచాలకు కుంకుమ తోడి అంగరాగాన్ని పూసుకోవడం-వసంతం రాగానే అంగరాగం అయిన కుంకుమను పూసుకొనక పోవడం-తెల్లవారు జామున కోళ్ళు కూయడం-వసంతం రాగానే కోకిలలు కూయడం ప్రసిద్ధాలు. సూర్యుడు హేమంత ఋతువులో తేజస్సు మందగించి ఉంటాడు. వసంతంలో మళ్ళీ తేజస్సు పెంచుకుంటాడు అలాగే దినాంతంలో సూర్యుడు తన తేజస్సును అగ్నిలో ఇముడ్చుతాడు)

వసంత ఋతువులో స్త్రీలు పూర్వం చలికాలంలో వెచ్చదనం కోసం సేవిస్తున్న వాటిని-ఇప్పుడు మాని, సమశీతోష్ణమైన వాటిని ధరించనారంభించారు వారు అగరు చందనంతోడి కలపం అందుకోవడం మొదలుపెట్టి-కస్తూరి కలపం మానేశారు శిశిర ఋతువులో చన్నుగవ మీద ధరించడం మానివేసిన ముత్యాల హారాన్ని-ఇప్పుడు వసంతంలో ధరించడానికి ఇష్టపడ్డారు కొప్పులో ధరించే పూదండలలో-కురువేరు పోచను కొద్దిగా చేర్చుకోడానికి అప్రియపడలేదు.[106]

చందన శైల వాయువులు వీచేందుకు మొదలయ్యాయి. ఆ సమయంలో చెట్ల ఆకులు రాలిపోవడంవల్ల చెట్లు వట్టి మ్రోళ్ళు అయి-చిగిర్చి సొంపువహించడం ఎలా ఉందంటే-చందన శైలంలోని చందనపు చెట్లలోని ఆడు పాములు-అమృతరసాల మోవి మండి-వాటి పుక్కిళ్ళ పరిమళం వల్ల చందన శైల వాయువులు మాధుర్యాన్ని పొందాయి. ఆడుపాముల పరిమళాన్ని-తమ

ప్రియుల పుక్కిట పరిమళం అయినందువల్ల-ప్రేమతో ఆస్వాదించిన వాటి ప్రియపతులైన పాముల నోటి విషజ్వాలలతో కారమెక్కాయి. అందువల్ల ఆ చందన శైల వాయువులు ఒకవైపు తీపు, మరోవైపు కారం అనే రెండు గుణాలు కలగలిసి ఆ చెట్లకు సోకడం వల్లనే వాటి ఆకులు రాలాయి. మళ్ళీ చిగిర్చాయి అన్నట్లు ఒప్పారాయి.[107]

చందన శైలం నుండి వీచే మంద మారుతం-చెట్లనుండి, తీగల నుండి, తమ తొడిముల గండ్లనుండి ఊడి, తామర దుద్దుల కాంతితో, పసుపు కొమ్మును విరిస్తే ఆ విరుపులో మెరిసే కాంతితో-ప్రకాశిస్తూ ఉండే పండుటాకులనే బంగారు బండి చక్రలే గిరగిరా తిరుగుతూ చేసే ఛీత్కార శబ్దంతో మన్మథునికి రథమైన తన పనిని చాటుతున్నట్లు ఒప్పింది.[108] (మలయమారుతం మన్మథుని రథం అని కవి సమయం. అది కామోద్దీపకం. దాని సుళ్లు చక్రాల్లాగ ఉంటాయి )

ఆ తర్వాత-[109] చిగురాకులు మొలిచాయి. ఆ చిగురాకులు భూమి అనే ఆడేనుగుకు ఎఱ్ఱ కంబళి. మహారణ్యమనే విలాసినికి మధుమాసాగమనం అనే మద్యపానంవల్ల అయిన ఎరుపుదనం. తీగలనే పాములు కోస్తూ ఉన్న నాలుకలు. చెట్లనే గరుత్మంతునికి రెక్కల సమూహాలు. క్రీడా పర్వతాలనే మేఘాల్లోని ఇంద్ర ధనుస్సులు. కొత్తగా వచ్చిన తుమ్మెదలు అనే అతిథులకు (మకరంద) భోజనానికి రమ్మని పిలుస్తూ ఇచ్చే మంగళాక్షతలు కాకులతో వేరు పాట్లు పోయిన కోకిలలకు విభాగ పత్రికలు మాలతిని ఒడిపించడానికి తోసిన పచ్చి రక్తం. ప్రమదవన వనదేవతలు ధరించిన మైపూతలు దక్షిణానిలం అనే సానలో బెట్టగా, పండుటాకులు అనే పైపై పేట్లు ఎగిరిపోగా వన్నె మీరిన పద్మరాగ శలాకలు - అలాంటి చిగురాకులు ఎక్కడ చూసినా మొలిచాయి [110]

మన్మథునికి మాఘ మాసంలో ఉండే మొగ్గలు అనే బాణాలు అమ్ముల పొదల్లో అయిపోయాయి. ఇలాంటి అదనులో కదా ఒకన్ని జయిద్దామని పెద్దలు క్రూరతిథి అయిన కృష్ణ చతుర్దశి రాత్రిలో (శివరాత్రినాడు)

మన్మథుని వైరి అయిన శివుని సందర్శనం చేసుకొన్నారు అయినా మన్మథునివల్ల చిగురాకు వంకతోనే పెట్లు తిన్నారు.[111] (వసంతంలో చిగురాకు అతికామోద్దీపకంగా ఉన్నదని భావం.)

ఆ వసంత ఋతువులో భూమి మీద కొత్తగా పుష్పబాణ సమృద్ధితో వచ్చిన అభ్యుదయం అనే జననం పొందిన (అభ్యుదయంతో అప్పుడే పుట్టిన) మన్మథ శిశువుకు పుష్ప ఋతువు అనే మంత్రసాని బొడ్డుకోసిన కొడవలేమో అన్నట్లు-మోదుగు పూవు మొగ్గ వియోగుల హృదయాల్ని కోయడానికి ప్రారంభించింది. వారికి దుస్సహ తాపం కలిగించింది.[112]

మోదుగు పువ్వుల మొగ్గలు ఇతర పువ్వుల్లాగా కామినులు తమల్ని కొప్పులో ధరించలేరు. అనే సిగ్గుతో వంపుగలవై పుట్టాయి. అయినా తమల్ని నూరి నీటిలో కలిపి జీవితేశ్వరులు-చిమ్మన గ్రోవంతో కామినుల కుచాలపై వసంతాలు చల్లడం వల్ల ఆ కుచాల మీద క్షణకాలమైనా తాము మైపూతగా ఉండే మహాభాగ్యం కలిగింది గదా-అనే గౌరవంతో రాగిల్లాయా అన్నట్లు ఎర్రబారాయి [113]

వసంత ఋతువులో అంతకు ముందు ఋతువుల్లోలేని పరిమళంతో-గుండ్రని ఆకారంతో-కొత్త మొగ్గలు అన్ని చోట్లా పుట్టడం ఎలా ఉందంటే-దక్షిణావిలుడు తోటమాలిగా తన జన్మస్థలమైన చందనశైలంలోని తామ్రపర్ణి నదిలోని ముత్యాల్ని మొత్తం మొత్తంగా తెచ్చి-వాటిని చందనాల పరిమళ ఆహాకుల్లో చేర్పుతో నానబెట్టి-అన్ని చోట్లా చేరివల్లకంగా వెదజల్లగా (విత్తనాలు చల్లగా)-ఆ ముత్యాలే సపరిమళంగా గుండ్రని కొత్త మొగ్గలుగా పుట్టి ఉంటాయి. ఇది నిశ్చయం! లేకుంటే ఇప్పటి మొగ్గలకు-పూర్వ ఋతువుల మొగ్గలకు లేని యీ గుండ్రదనం, పరిమళం ఎలా వస్తాయి? అన్నట్లు వికసిల్లాయి[114]

లత అనే సతిని వృక్షమనే పతిని కూర్చడానికి - మన్మథుడు బాణాల్ని ప్రయోగించగా-అవి అంతా వృక్ష దంపతుల దేహాల్లో ఇటువైపు నుండి అటువైపు వరకు దూసుకుపోగా-అక్కడ వాటి ఆ బాణాల అలుగు

ఆ దేహాలకన్నా పైన పసరువన్నె వార-తమకు మూత అయినట్లు పొటమరించినట్లుగా కొత్త మొగ్గలు విప్పారాయి.[115]

వనలక్ష్మి అనే మహాలక్ష్మి-భూమి అనే తన గర్భంలో జన్మించిన వృక్షాల వరుస అనే సంతతికి, చిగుళ్ళ కాంతి అనే ఎర్రని కాంతి పెరిగి, కోల్కొని, మొగ్గలనే దంతాల్ని కొంచెం పొందగానే-శోభాతిశయం అనే సంతోషాతిశయం పొందింది. అలా సంతోషాతిశయం పొందడం ఉచితమే! ఎందుకంటే-అప్పటి నుండి వసంతుడనే హరితో-పొందు సమృద్ధిగా కలుగుతుంది.[116] (కాబట్టి స్త్రీలు తమకు పిల్లలు పుట్టి-దంతాలు మొలిచిన తర్వాత-మళ్ళీ భర్త సంగమం పొంది సంతోష పడతారు.)

వసంత ఋతువు మొదట్లో-తుమ్మెదల సమూహం ఆకలిగొని తిండి కోసం తిరుగుడూ-ముందుగా మొగ్గల మీదికి పోయి-వాటిని ముందుకాళ్ళతో పట్టుకొని, వాటిలోని రసాన్ని తమ జంట తొండంతో పీల్చి-దానిలో పసరు వాసన, పసరు రుచి రాగా మొగ్గల్ని విడిచి పెట్టాయి.

తర్వాత, తుమ్మెదలు మొగ్గంలో మంచిరసం ఉండదని వాటిని ఉపేక్షించి-గొంది గొంది వెదకి-విచ్చిన్న పుష్పాలుండే గొందికనిపెట్టి-బారుగట్టి-పొదల్లో దూరే గుంపుతో కలిసి వెళ్ళాయి ఆ గొంతిలో ఒక తుమ్మెద ఒక క్రొవ్విరిని కనిపెట్టి దానిపై వ్రాలేలోగానే అవి ఆ తుమ్మెదను నేం పడేట్లు తటాలున త్రోసి-తాము ఆ పువ్వులోని రసం తాగేశాయి ఆ తర్వాత తొడిమంతో కూడా ఆకులురాలిపోగా, ఆ తొడిమలుండిన గండ్లలో ఊరిన బంకమ రసం అనుకొని తుమ్మెదలు దానిని త్రాగడానికి ఆ గండ్లలో కాళ్ళు మోపి, ఆ బంక అంటుకోగా, చిగుర్కొని రాకపోగా అంగలార్చి ఎలాగో కాలులాక్కొని ఎగిరిపోయాయి.

ఎట్టకేలకు ఒక పరిపక్వపుష్పం లభించగా-దాని రసం పొట్టనిండా త్రాగి-అంతలో ఆ పుష్పం గాలికి కదలగా-పొట్ట బరువుతో కిందికి కూలాయి ఇదే సమయమని ఉద్యాన వనపాలికలు తుమ్మెదలు తమ చేతికి దొరికాయి అని-సంతోషంతో పట్టుకొనేట్లు కైవసమౌతూ కూలుతూ ఉంటాయి.[117]

వసంత ఋతువులో వనాల్లో సంచరించే తుమ్మెద గుంపులు ఎలా ఉన్నాయంటే-ఈ తుమ్మెదల గుంపులు దక్షిణపు గాలి తెచ్చిన మలయశైలం లోని చందన వృక్షాల్లోని పాముల విష ధూమ సమూహాలా? మన్మథుని రథ చక్రం నుండి జారిపడుతూ ఉండే కందెన ముద్దలా? వసంతానికి భయపడి ఏడుస్తూ పలాయనం అవుతూ ఉన్న శిశిర ఋతువు అనే యువతి యొక్క కాటుక కన్నీళ్ళా? కోకిలలు పంచమ స్వరంతో పాడుతూ వాయించడానికి తగిన పరిమాణం కలిగి, దానికి తగిన రంగు కలిగిన వీణలా? మకరందపు జడి అనే వర్ష ఋతువులో పుట్టిన నేరేడు పండ్లా? యువతులు పాడే హిందోళ రాగానికి మెచ్చుకొని ప్రత్యక్షమైన వారి దేహకాంతులా? అభిసారికలు అదృశ్యకరణిగా తమ బట్టల్లో ధరించిన నర్మోసిలిమను కలిగించే సిద్ధసీల గుళికలా? జాతి తీగలు తమల్ని వసంతుడు పూయనీ లేదని పెట్టిన శాపపరంపరలా? చైత్రమనే సంజీవ నౌషధిసోకగా మళ్లీ ప్రాణం పొందిన వైరమకు కారణ భూతాలైన వృక్షాల్ని గూర్చి మళ్ళీ వస్తూ ఉన్నట్టనై -యువతులు చలిలేనందువల్ల ఇండ్ల బయట పారవేసిన కొయ్యబొగ్గులా? అన్నట్లు- తుమ్మెదల పంక్తులు (వరుసలు) వనాల్లో సంచరించడానికి మొదలు పెట్టాయి[118]

బ్రహ్మహత్య, సురాపానం, స్వర్ణ చోరత్వం, గురుపత్నితో శృంగారం అనేవి, ఈ నాలుగు పాతకాలు చేసిన వారితో సహవాసం అనేవి పంచ మహాపాతకాలు. తుమ్మెదలు ద్విజత్వం (బ్రహ్మజత్వం, అండజత్వం) పొంది కూడా మధు సీవ వీడలేదు. అంటే సురపానం అనే మహాపాతకం అవి చేశాయి. అందువల్ల తుమ్మెదలు జాతిని (జాతి-కులం) వదిలాయి. అలాంటి పంచ మహాపాతకాల్లో ఒకటి చేసి, జాతి వదిలిన తుమ్మెదల శబ్దాన్ని కూడా కొన్నందువల్లనేమో-కోకిల శబ్దానికి కూడా పంచమత్వం (పంచమహాపాతకం) అబ్బింది.[119]

వసంతుని వద్ద-వికసించిన మామిడి చెట్లనే పన్నెమారిన గుర్రాలు ఉన్నాయి గుర్రాలకి పన్నెమారికె (ఎర్రవెంట్రుకల నడుమ తెల్లని వెంట్రుకల

ఉండడం) అది యజమానికి కీడు అంటారు అందువల్ల తనకు కీడు కలుగుతుందని భావించి ఆ గుర్రాలను - వసంతుడు మన్మథునికి అమ్మేశాడు. అతడు వికసితమైన మామిడి చెట్లు అనే ఆ వన్నెవాసిన గుర్రాల్ని తీసుకొని పాంథ సమూహాల్ని జయించాడు ఇది ఉచితమే-ఎందుకంటే-దైవం అనుకూలంగా ఉన్నపుడు-వైరికి మేలుకాలం తీరిపోయినపుడు-తప్పుకార్యం వల్ల కర్తకు కీడు కలగదు. అలాగే ఈ సందర్భంలో మన్మథునికి గుర్రాల్ని అమ్మిన మాధవుడు (వసంతుడనే నారాయణుడు) అనుకూలుడు కాబట్టి-పరులైన పాంథులకు మంచికాలం తీరిపోయినందువల్ల - (అంటే పాంథుల కార్యాలు వారిని చేరలేదు కాబట్టి) - ఆ పూచిన మామిళ్ళను కొన్న దోషం మన్మథుణ్ణి బాధించలేదు. పైగా జయసాధనమే అయ్యాయి.[120]

వసంతకాలం అనే దోగ్ధ (పాలుపితికేవాడు)-వెన్నెల రాత్రి అనే ఆవుని మిక్కిలి బలంగా పిదుకగా-చంద్రుడనే పెద్ద కొలుగు నుండి వెన్నెల అనే చిక్కని పాలవెల్లువ వచ్చింది దానితో గొజ్జంగి పూల పొదలు కురిసే మకరందం అనే మంచినీటి ప్రవాహం-భేదం తెలియనట్లు కలిసిపోయింది. ఆ సందర్భంలో తుమ్మెదలనే హంసలు 'ఇదిపాలు-ఇది గొజ్జంగి నీరు' అనే భేదాన్ని స్పష్టీకరిస్తున్నాయి [121]

ఉద్యానవనంలో ఒక దిగుడుబావి ఉంది. దాని గట్టు నుండి ఒక చెరకు గడ ఆ బావి మీదికి వంగి ఉంది. ఆ చెరకు ప్రక్కనే వికసించిన పొన్న చెట్టు ఒకటి ఉంది. హంస ఒకటి ఆ దిగుడు బావిలో నుండి ఒక తమ్మికాడ త్రుంచి, పైభాగాన్ని నోటకరచుకొని, ఆ తామర తూడు రెండు తునియల నడుమ సాగుతూ ఉన్న దాని సూక్ష్మమైన నూలు పోగులాంటి మున్నది త్రాడు ఆ చెరకు చివరకు తగిలేట్లు ఎగిరిపోయి,-ఆ పొన్న చెట్టు మీద కూర్చుంది. ఆ సూత్రం వెంటనే దిగుడు బావిలోని తుమ్మెదలు-పొన్న పూల మకరందం తాగడానికి-వరుసగా పైకి పోవడానికి ఆరంభించాయి. అలాగే పొన్న చెట్టులోని తుమ్మెదలు దిగుడు బావిలోని తామర పూల తేనెను తాగడానికి ఆ సూత్రం వెంటనే దిగుతున్నాయి. అందువల్ల ఆ తుమ్మెద బారులు

రెండూ మన్మథుని విల్లయిన ఆ వంకర చెరకుకు జంటనారిగా ఒప్పుతూ ఉన్నాయి.[122]

మలయమారుతం-పొడవైన తేనె ధారలను నేలపడక ముందే గ్రహించి వీస్తూ ఉంటుంది. ఆ తేనె ధారలను నేలపడనందువల్ల తెగిపోకుండా-సన్న సన్నగా గాలితో కలిసి సాగుతూనే ఉంటాయి. గాలి చిన్న చిన్న సుళ్లుగా తిరుగుతూ ఉంటుంది అప్పుడు స్త్రీల చేతుల్లోని మట్టిగాజుల ఆకారంతో-గోరోజనం రంగుతో-చుట్టలు చుట్టుకొంటూ ఉండే తేనె ధారల సుళ్ళుకలవై-మలయ మారుతాలు సంచరిస్తూ ఉన్నాయి-ఇది ఎలా ఉందంటే ఆ మలయానిలాలకు పాంథుల నిట్టూర్పు నిప్పులు ఎదురుపడగా - వాటిచేత వీటి వేగం తగ్గి-ఇవి చురచుర మండిపోతూ- సుళ్లు చుట్టుకొని-ముడుక్కుపోయాయేమో అన్నట్లున్నాయి.[123]

ఆ వసంతంలో చెట్ల నిండా పూలు వికసించి ఉన్నాయి. మెట్ట తామర వికసించి ఉంది. చెట్లలోని పూల నుండి పూధూళి-వానలాగా కిందికి దట్టంగా రాలాయి. వాటిని గాలిసుళ్లు-పైకి ఎత్తాయి. ఆ పూల ధూళులు కలిపిన ఆ గాలి సుళ్లు-గిరగిరా తిరుగుతూ చెట్ల మీదికి ఎగుస్తూ ఉన్నాయి అప్పుడు ఆసుళ్లు ఎలా ఉన్నాయంటే-వనలక్ష్మి అనే మహాలక్ష్మి. తనకూ వన భూమి అనే భూదేవికి-ఇద్దరికి పతి అయిన వైశాఖ మాసం అనే విష్ణువు రాగా-అతని ఎదుట మనోహర ఆభరణాలై కనిపించడానికి-తన పుష్పాభరణాల్ని కొన్నిటిని ఎరువుగా భూదేవికి ఇవ్వడానికి-భూదేవి దగ్గరున్న మెట్ట తామర ఆభరణాన్ని తాను ఎరువుగా పుచ్చుకోడానికి-వాటిని తమ దేహాల నుండి తీయడానికి తిప్పే బంగారపు మరచుట్లలాగా ఉన్నాయి [124]

వసంతంలో-ఇప్ప చెట్లలో మకరందంతో నిండిన పుష్పాలు ఎలా ఉన్నాయంటే-తరుణులు తమ బుగ్గలను సురతో నిండించుకొని పొగడ చెట్ల మొదళ్ళలో ఉమిసి-వాటిని పుష్పింపజేశారు. అది చూసి పోటీకి వన దేవతలు-'మేం మాత్రం తరుణులం కామా'? అని పోటీకి-భూలోకంలోని పొగడ చెట్లన్నిటినీ పుష్పింపజేయడానికి-సురతో నింపుకున్న బుగ్గలేమో అన్నట్లు - మకరందాలతో నిండిన ఇప్పపూలు ఒప్పారుతూ ఉన్నాయి.[125]

వసంతకాలంలో గోరంట (కురవకం లేదా కొరవి చెట్టు) పూస్తుంది. 'కురవకం తరుణులు ఆలింగన దోహదం చేస్తే పూస్తుంది' అని దోహద శాస్త్రం తెలుపుతుంది. అలాంటి తరుణీ ఆలింగన భాగ్యం కలగనీకుండా వసంతుడు-ఆ కొరవి చెట్లను పూల భారం కలిగి ఉండేట్లు చేశాడు. వాటి పుష్ప సమృద్ధి వల్ల-తుమ్మెదల గుంపులు ముసురుకొంటున్నాయి. పుప్పొడి మిక్కిలిగా పుట్టి-మకరందం ధారలుగా పారుతూ ఉంది. ఇదంతా ఎలా ఉందంటే-తరుణీ ఆలింగనం కోల్పోయినందువల్ల జ్వలించిన మన్మథాగ్నితో-ఆ కొరవి చెట్లు కాలిపోయి పొగలుపుట్టి, బూడిద కప్పి, మండని చివర్లలో కట్టె చమురు కక్కుతూ-అగ్గి కొరవులయ్యాయేమో - అన్నట్లు ఒప్పాయి [126]

యువతులు అప్పటికే చిగిర్చి కాసి ఉన్న మామిడిని-చేతితో తాకారు. మామిడికి 'కరస్పర్శ' దోహదం కాబట్టి-అది ముందున్న మామిడి కాయల్ని, చిగుళ్ళను రాల్చేసి-కొత్తగా పూసింది. అందువల్ల తుమ్మెదలకు పూదేనె ఆహారం దొరికింది చిలుకలకు కాయల భోజనం-కోయిలలకు చిగుళ్ళ భోజనం కష్టమయ్యాయి ఆ కారణంగా కోపం కలిగి-చిలుకలకు మొగం, కోయిలలకు కన్నులూ ఎర్రబారాయి. [127]

భర్తపై అత్యంత ప్రేమార్ద్ర హృదయ అయిన యువతి ఒకామె-అతణ్ణి కూడడానికి సంకేత స్థానానికి పోయింది. అతడు వచ్చి కూడా పరిహాసానికి దాగి ఉన్నాడు. అప్పుడు ఈమె తక్షణమే కలిగిన వియోగ వ్యథనుండి పుట్టిన మదన జ్వరంతో ఉన్మాదావస్థ పొంది - అక్కడి ఒక చెట్టుతో 'ఓ వృక్షమా! నా ప్రియున్ని చూశావా'? అని అడిగింది. అది ఒక గోగు చెట్టు. గోగు చెట్టుకు యువతి సల్లాపమే దోహదం. కాబట్టి ఆ సల్లాపానికి ఆనందించి-ఆ గోగు వికసించింది. గోగు పూలు బంగారు వన్నెవి కాబట్టి-ఆ వెలుగు వల్ల చాటున దాగి ఉన్న భర్త కనబడ్డాడు. ఆ చిట్టకానికి ఆమె నవ్వింది. నవ్వు సురపొన్నకు దోహదం కాబట్టి ఆమె నవ్వుకు ఆ ప్రక్కనే ఉన్న సురపొన్న కూడా పూసింది.[128]

కన్నప్ప (తిన్నడు) అనే మగవాడు-శివలింగాన్ని స్నానం చేయించడానికి-ఏ మాత్రం జంకు లేకుండా పుక్కిటి జలాన్ని ఉమిసాడు అయినా శివుడు ఫలమిచ్చాడు. పద్మవదన నోటసురను ప్రేమతో ఇస్తే-'పుష్పిస్తున్నా ఈ పద్దా' అని-పొగడ చెట్టు పూలు పూసింది.[129] (నోటసుర ఉమిస్తే-అది పొగడకు దోహదం)

మధువు అనే పేరు అటు చైత్రమాసానికి-ఇటు కాంతల పుక్కిటి సురకు-పేర్లు సమానమైనందు వల్ల-రెండిటి మధ్యా ఈర్ష్య పెరిగింది. అప్పుడు తమ తమ విశిష్టత్వాన్ని నిరూపించుకోడానికి-రెండూ పొగడ చెట్టు మీదికి వ్యాపించాయి. చైత్ర మాసం వల్ల-ముందున్న పొగడ ఆకులు రాలిపోయాయి. కాంతల పుక్కిటి మధువు వల్ల-విరుల జడికురిసింది. రెండిటిలో - 'కాంతల పుక్కిటి మధువే గెలిచింది' అని ఉప్పొంగి - తుమ్మెదలు హర్షధ్వానాలు కావించాయి.[130]

భృగు మహాముని-నారాయణుని శాంతం పరీక్షించడానికి కావలిసే తన్నాడు. భగవంతుడు మెచ్చి-అతడిని సత్కరించి పంపాడు. ఆ నారాయణుడు రామావతారం ఎత్తినపుడు-ఆయన భార్య అయిన సీతాదేవికి-లంకలో నివాసమై ఆమెతో చెలిమి చేసినందుకే ఆమె ప్రశాంతి అశోక వృక్షానికి అబ్బింది. అలా కాకపోతే ఒక యువతి తనను తన్నగా - వికాసం పొంది మెప్పుగా-ఆమెకు పుష్పాదితో కనకాభిషేకం ఎలా చేస్తుంది?[131] (అశోకానికి తన్ను దోహదం)

సంపెగ చెట్టులో - చైత్రమాసం వల్ల పుట్టిన పూలు ఉండనే ఉన్నాయి. ఇలా ఉండగా, ఒక తరుణి సంపెగ చెట్టు వైపు వెమ్మోము ఎత్తగా 'ముఖరాగంతో చంపకం పుష్పిస్తుంది' అనే దోహద శాస్త్ర ప్రకారం-ఆమె ముఖ చంద్రరాగంతో సంపెగ చెట్టులో-కొత్తగా పువ్వులు పుట్టాయి. ఆ పూలు ముఖ చంద్రరాగం వల్ల పుట్టినవి కాబట్టి-వాటి తేనెలు సుధా గుణం కలిగా ఉంటాయి. అంటే ఒక వైపు మధుర తరాలుగాను, మరోవైపు జరామరణ నివారకాలుగాను ఉంటాయి చైత్రుని వల్ల పుట్టిన సంపెంగల్లాగా-చేదుగా

ఉండవు. తమల్ని తరమవు-అని ఆశపడి సంపెంగ పూల కోసం - తుమ్మెదలు వచ్చాయి. కానీ, తరుణి ముఖరాగం వల్ల పుట్టిన సంపెంగ పూలు కూడా చేదై - తుమ్మెదల మొగాన కొట్టి - తరిమేశాయి తండ్రి అయిన ముఖ చంద్రుని గుణం ఆ పూలకు రాలేదు-మరి, తల్లి అయిన సంపెంగ దుర్గుణమే వచ్చింది. లోకంలో తల్లి పోలిక గల బిడ్డలకు తల్లి గుణాలే వస్తాయిగదా![132]

ఒక యువతి తనకు ప్రియమైన వసంతరాగం పాడి-'గానం దోహదంగా ఉండే ప్రేంకణపు చెట్టు (ప్రియాళువు)ను-పుష్పింప జేసింది. దానికి ఈర్ష్యతో ఓర్వలేక-ఆమె సవతి ఆదోహద సిద్ధికి కొరత చూపింది. ఎలా కొరత చూపింది. ఎలా కొదవ పెట్టిందంటే 'వేల్పులు భక్తికి మెచ్చుతారు. అందువల్ల ఈమె వసంతరాగం పాడడం అనే మిషతో-వసంతుని గురించి పాడగా-ఆ వసంతుడు అనుగ్రహించి-ఈమె యత్నించిన దోహదం ఫలించి నట్లు అగపడనీలే అని ప్రేంకణ చెట్టును పూచేట్లు చేశాడు అంతేగానీ, ఈమె పస మాకు తెలియదా? అని ఆ పసకు కొదువ పెట్టింది[133]

ఒక వావిలి చెట్టులోని పూలు రాలిపోయాయి. అప్పుడు ఒక లతాంగి దోహదంగా-ఆ వావిలి చెట్టు మీదికి-తన ముఖ వాయువును ప్రసరింప జేసింది అప్పుడు ఆ వావిలి చెట్టు నిండా పువ్వులు పూచాయి. అలాకావడం ఎలా ఉందంటే-ఆ యువతి బులాకీ ముత్యం-ప్రాణి అయిన ముత్యపు చిప్ప కడుపున పుట్టినది కాబట్టి-ఇపుడు ఆమె అధరామృతం సోకుతూనే మళ్ళీ ప్రాణం పోసుకొని. ముత్యాల గుర్ల పరంపర పెట్టిందేమో అన్నట్లు ఒప్పింది.[134]

తిలక వృక్షానికి 'వీక్షణం' దోహదం. ఒక తిలక వృక్షం ఆకులన్నీ రాలిపోయి కేవలం రిక్తంగా ఉండగా, ఒక యువతి కనికరించి 'చూపు' దోహదంతో-దానిని పూవుల్తో తటాలున నిండ జేసింది. ఆ వింత ఎలా ఉందంటే- ఈమె ఈ తిలక వృక్షాన్ని తాక కుండా. ముట్టకుండా, ఒక్క చేష్ట కూడా చేయకుండా వికసించేట్లు జేసింది అనడం అబద్ధం- ఇది చూపు దోహదం ద్వారా పూచేట్లు చేయడం కాదు-మరేమంటే-ఈమె తన కనుగవతో - మన్మథుడు

దాచుకొని వెళ్ళిన అతని తిలక పుష్పబాణాలే-ఆ తిలక వృక్షం మీద ప్రసరింప చేసింది అన్నట్లు ఒప్పారింది.[135]

వామనుడు మూడడుగుల్తో ముల్లోకాల్ని ఆక్రమించి బలిచక్రవర్తి ప్రతాపాన్ని అణచివేసినట్లుగా-వసంతుడు మకరంద వర్షంతో పాతాళ లోకాన్ని-రాలిన పూల మొత్తంతో భూలోకాన్ని. పుప్పొడితో బలవంతుడై ఉన్న సూర్యుని వెట్టను-అణచివేశాడు[136]

ఆ వసంత కాలంలో చెట్లనుండి మకరందం జడివానలాగా కురిసింది. దానితో తోటలోని నేల అంతా జవుకు పట్టి-ఇంకిన తేనె ఊరుతూఉంది. ఆ తేనె ఊటును తాగడానికి-తుమ్మెదల గుంపులు దాని మీద కమ్ముకొని ఉన్నాయి. అందువల్ల ఆ తుమ్మెద గుంపులున్న తావుల్లో చెట్ల నీడలు జరిగి పోయి కూడా-జరిగి పోనట్లే ఒప్పారాయి[137]

చైత్ర మాసంలోని వెన్నెల-రాత్రుల్లో తెల్ల తామరల రాసుల్ని అంతటా పేర్చినట్లు-అతి తెల్లగా కాస్తూ ఉంది. ఆకాశాంతాన్ని తాకేంతటి ఉన్నతాలైన ఉద్యాన వనాల చెట్లు-పువ్వుల నుండి పుప్పొడిని అమితంగా స్రవిస్తూ ఉన్నాయి. అలాగే కొండల మీది అడవులలోని ఇందుపు చెట్ల నుండి-పుప్పొడి కూడా రాలుతూ ఉంది. ఆ అచ్ఛమైన వెన్నెలలో కామినీ కమనులు (వలపు కత్తెలు, వలపు కాండ్రు) పరమాహ్లాదంతో క్రీడల్లో తేలుతూ ఉన్నారు. ఆ దృశ్యాన్ని కవి ఇలా వర్ణిస్తున్నాడు ఆ వెన్నెలలు అనే జల ప్రవాహాల్లో ఆ చెట్ల పుప్పొడి అనే మట్టి దుమ్ము కలిసి-దానిచే వెన్నెలల ప్రవాహం అడుసయింది. ఆ అడుసును-చిల్ల పుప్పొడి అనే చిల్లగింజల పొడి-తేర్చినందు వల్లనే- ఆ నిర్మల వెన్నెల ప్రవాహంతో - కామినీ కమనులు 'వెన్నెల క్రీడలు' అనే జలక్రీడల్ని అనుభవించారు![138]

మంచు వాళనమైనందువల్ల-దాని చల్లదనం దట్టమైన చీకట్లులాగా కమ్ముకొన్న ద్రాక్ష పందిళ్ళలో చేరింది. మంచు శ్వేతత్వం విరుల్లో చేరింది. విరహిణుల కృశత్వం వల్ల చేతి గాజులు ఊడిపోయాయి. వారి పాటలు నిలిచి పోయాయి. మలయపు కమ్మని గాలులు-విరహిణుల గాజుల వంటి సుళ్లతో

పిస్తున్నాయి. విరహిణుల గానం తుమ్మెదల్లో చేరింది. జాజుల సౌరభం-కొదమ క్రోవుల్ని (గున్నగోరింటల్ని) చేరింది. జాజిపూల ఉల్లాసం-చంద్రుని వికాసంలో చేరింది. యతులు కామాతురులై తమ వ్రతాన్ని కాపాడుకోలేక జటా బంధనం, వేణుదండం వదిలేశారు. వారి జటలకు బదులు-జువ్వి చెట్లలో ఊడలు దిగాయి. వారి వేణు దండాలకు బదులు-కంచెల్లో వెదుళ్లు కట్టబడ్డాయి. మామిడి చెట్లు-మానవతులు పెంచిన కోకిలల చేత క్రొఖిల్లుతూ ఉన్నాయి. ఆ వృక్షాల మధ్య వారు ప్రతి దినమూ రహస్య క్రీడల్లో గడిపి-అలిసిపోతూ ఉన్నారు. వారి ఆ అలసటను-కొలనులోని తామర పూల సువాసన గాలి తీరుస్తూ ఉంది.[139]

చిలుకలు-మాటి మాటికీ పండ్లతో ఉండే తియ్యమామిడి కొమ్మల మీదికి-పోతూ ఉన్నాయి ఆ చిలుకలు కొట్టినపుడు-ఆ పండ్ల నుండి కారే అమృత ప్రాయమైన రసాన్ని తాగడానికి-తుమ్మెదలు ఆ చిలుకల్ని వెంబడించి వెళ్తూ ఉన్నాయి. అలా పండ్లు సుష్టుగా తిన్న చిలుకలు మిక్కుటంగా రొద చేస్తూ ఉన్నాయి. ఈ దృశ్యం ఎలా ఉందంటే-వనలక్ష్మి కూడా మనుష్యుల లాగానే-ఆ చిలుకల అమృత మధుర వాక్కుల్ని ఆస్వాదించాలనుకొని-వాటిని ఆ తుమ్మెదల దారులనే సంకెళ్ళతో (సరపిణులతో) కట్టి ఆ మామిడి వనాల్లోని మామిడి పండ్లతో పెంచుతూ ఉందేమో అన్నట్లుంది. ఆ వనలక్ష్మి ఇచ్చే గౌరవంతో. పెంపకంతో ఆనందించిన చిలుకలు అలా రొదచేస్తూ ఉన్నాయేమో అన్నట్లుంది.[140]

మంచు అనే ధవళ దేహుడైన శివుడు-రతీదేవి మీద జాలితో-మన్మథుని చలికాలుతో తన్ని విడిచి వెళ్ళగా - మన్మథుడు బతికిపోయాడు. మన్మథుకు వ్రతుల్ని చంపినందువల్ల పొందిన కీటక జన్మం పోయిన తర్వాత తుమ్మెదల సమూహం అనే అవయవాల్తో వేరే దేహం ధరించాడు.

యమ దిశ నుండి (దక్షిణ దిశ) వచ్చిన గాలే ప్రాణంగా కలిగిన వాడై. తనకు అవయవాలైన ఆ తుమ్మెదలకు నాట్య ప్రదేశంగా ఒప్పే మెట్టతామర తీగల్లో మెట్టతామర పూవునే కన్నుగా తెరిచాడు ఆ ప్రాంతంలో

వికసించిన మామిడిని-ఆశ్రయించిన ఆ తుమ్మెదల సమూహం-హఠాత్తుగా లేవడం వల్ల తాను కూడా లేచి-(మామిడి చెట్టు మీద తుమ్మెదలు తటాలున లేవడం-తుమ్మెదలే మన్మథునికి దేహం అయినందువల్ల మన్మథుడే లేవడం) చెలికాడైన చైత్రుణ్ణి కౌగిలించుకొన్నాడు [141]

మన్మథుడు విస్తీర్ణమైన పూధూళి అనే వస్త్రంతో ఉద్దండమైన బావిలోని కలువ పూవు నుండి స్రవించే మకరందం అనే రతీదేవి కన్నీళ్ళను తుడిచి వేశాడు. మళ్ళీ మోదుగు మొగ్గ అనే కటకా ముఖంతో (బాణం వేసే టప్పుడు బాణాన్ని పట్టుకొనే ఆకృతి విశేషం గల పిడికిటితో)-చిలుకలు కదిలించిన కొమ్మ మీద నుండి-అశోక పుష్పం అనే బాణాన్ని తొడిగాడు.[142]

సురభి (వసంత ఋతువు) కోకిలల గుంపునకు చిగుర్లు ఇచ్చింది. చిలుకల గుంపునకు ఫలాలు ఇచ్చింది. తుమ్మెదలకు మకరందం ఇచ్చింది. అలాగే గాలికి సువాసనను, విటీ విట సమూహానికి పూలు మిక్కిలిగా ప్రసవించి (ఇచ్చి)-తాను కామధేనువుగా రూఢికెక్కి స్త్రీత్వం చూపింది. అలా అందరి కోర్కెలు తీర్చే తనకు-తాను కోరుకుంటే పుంస్త్వం మాత్రం కలుగదా? తప్పక కలుగుతుంది-అన్నట్లు పాంథుల పట్ల మాత్రం పౌరుషాన్ని చూపించింది-అంటే వసంతం శుకపికాదులకు శుభకరమైనా పాంథులకు మాత్రం (తమ భార్యల్ని వదిలి దూరదేశంలో ఉన్నందువల్ల) దుఃఖకారకంగా ఉంది.[143]

స్త్రీలు మామిడి పండ్ల రసం తాగి, సుర సేవించినందువల్ల-ఆ రెండింటి సువాసనలు వారి నోట మిశ్రమమై-పరిమళిస్తూ ఉంది. చందనం పూసుకొన్నందువల్ల-నిమ్మపండు రంగుతో శ్రీమించే చెవుల్లో - గొజ్జెన పూలు ధరించారు. కర్పూరపుటరటిలోని మోసుల్లాగా మృదువులు ధవళాలు అయిన తమ తొడల చక చకలతో భాగం కోసం పెనగే పావడల్ని ధరించారు తమ ఎద్ద ఉండే నానా పరిమళాలకు ముసురుకునే తుమ్మెదలు-తమ మీద వ్రాలకుండా వాటికి కాకలు పుట్టించడానికి-కొప్పులో సంపెంగలు ముడుచుకొన్నారు. వారు భుజించిన చేతులకు పట్టిన కలవంటకపు వాసనను పోగొట్టు

గోదావికి-దట్టంగా పులిమిన కుంకుమ పూవులు ప్రకాశిస్తూ ఉన్నాయి. పూల భారంతో సొంపారుతూ ఉన్న వాయువులు-సురపొన్న పుప్పొడిని వారి అంగాలపై దట్టంగా బూజులాగా కుడుస్తూ ఉండగా-పూపొదరిండ్లలో పతుల్ని కలిశారు [144]

అలాంటి సమయంలో-ఒక కామిని 'మేఘరంజిత రాగం' పాడి వసంతుని గర్వం అణగిస్తాను' అని తన క్షేమం కోరిపాడింది. అప్పుడు వణు అవలె పలువన్నెలు గల ఇంద్ర ధనుస్సుల్తో, మెరుపుల్తో కూడుకొన్న మేఘాలు ఉత్పన్నమయ్యాయి, వాటివల్ల కదంబ చెట్లు, మొగిలి చెట్లు వికసించాయి. వాటి పరిమళం కలిసి ఉత్కటమైన వాయువులు ఆమెపై దెబ్బతీసి, ఆమెకు మొదట వసంతుడు పెట్టిన మదన తాపం కంటే ఎక్కువ మన్మథ తాపం కలిగించగా-ఆమె మూర్ఛిల్లి పడిపోయింది.[145]

గోదాదేవి పూర్ణ చంద్రుని భీతితో చంద్రకాంత శిలామయమైన భవనంలో శయనించింది. ఆ భవనం చంద్రకాంత శిలల భవనం కాబట్టి-చంద్రుడు ఇమ్మడియై (మింటి చంద్రుడొకడు ఇంటి చంద్రుడొకడు కలిసి ఇద్దరయ్యారు) వేడిమి చూపగా 'మింటిపైన ఉండే చంద్రుణ్ణి ఇంటిపైకి తెచ్చుకున్నానే' అనుకుంటూ అధికమైన దిగులతో బయటికి వెళ్ళిపోయింది [146]

గోదాదేవి భ్రమరాల గీతిక వినలేక దానిని మాన్పడానికి వీణ వాయించింది. ఆ వీణావాదంవల్ల శ్రుతి కలిసి-భ్రమరగీతి మరింత స్వారస్యంగా అతిశయించింది ఆమె వెంటనే వీణ మీటడం మానివేసి 'దైవికం ముందు యుక్తులు ఫలించవు' అంటూ నిట్టూర్పు వదిలి నవ్వింది [147]

గోదాదేవికి విరుల పొన్న మిక్కిలి తాపకారి అయింది. ఇది న్యాయమే! ఎందుకంటే-పూర్వం ఈమె చేత దోహదాలలో తన్నులు మొదలైన తిరస్కారాలు పొందిన అశోకాది వృక్షాలలో పుట్టిన పూలు-తమ సమయం వచ్చినపుడు మిక్కిలి బాధించి-పగతీర్చుకుంటాయే కానీ ఈమెకు ఎలా మేలు చేస్తాయి?[148]

గోదాదేవి తన విరహ తాపం పోగొట్టుకోడానికి తన వల్లభుడైన శ్రీహరి పటాన్ని పూజకోసం అనే మిషతో, తూలికతో చిత్రువు రాసింది తర్వాత తన హృదయ ప్రీతికోసం-లజ్జా పూర్వకంగా తదేక ధ్యానంతో-శ్రీహరి ఒక్కొ అంగాన్ని పరీక్షించింది - అలా చూస్తూ ఉండేటప్పుడు శ్రీహరి వక్షం మీద నివసించి ఉన్న మహాలక్ష్మి కనబడింది. ఆమెను చూస్తూనే సవతి మీద ఈర్ష్యతో కాక చెంది ఆరాటపడింది[149]

గోదాదేవి పూర్ణిమల్లో కోయిలలు తన ప్రాణం 'కుహూ' ధ్వనుల్తో హరిస్తూ ఉండగా 'మీకు పుణ్యం కలుగుతుంది. నా ప్రాణం అంతా హరించకండి కొంచెం నాకు వదలండి' అనివేడుకొంది. కోయిలలు 'ధర్మపుదార పట్టు శేషం'లాగా - ఆమెకు కొంత ప్రాణాన్ని దానంగా ఇచ్చాయి. ఆ కొర ప్రాణంతో - ఆమె రాత్రుల్లో తెల్ల కలువ కొలను తీరంలో-స్ఫటికపు గట్టు పై -అప్పుడే వికసించిన కలువ పూల శయ్యపై-మేను వాల్చింది. అప్పుడు వికసిత మల్లికల్లోని మకరంద పాన మంత్రాలైన తుమ్మెదలు-తమ నాదాలతో ఆమె కొర ప్రాణాన్ని కూడా హరించడానికి పూనుకొన్నాయి. కానీ, రేయంతా ఆమె కనుగోనల నుండి స్రవించిన బాష్పాలు-చెవి రంధ్రాల్లో నిండి-ఆ తుమ్మెద ఝుంకారాలు ఆమెకు వినిపించకుండా చేయబట్టి - ఆమె మరునాటికి ప్రాణంతో ఉండగలిగింది[150]

కుండలను సాయంగా ఉంచుకొని ఈదినీళ్లు దాటవచ్చు అయినా ఆ కుండలలోని నీళ్ళు పోతే-అవే తేల్చకుండా ముంచుతాయి. అలాగే కుచాలనే జంట కుంభాలు ఉండి కూడా గోదాదేవిని వియోగ జలధి ఈదింప లేక పోయాయి. కారణం-ఆమెకు చలువ గొలుపడానికి పోసిన పన్నీరు వాటిలో ప్రవేశించింది. కాబట్టే.[151]

చంచల నేత్ర అయిన గోదాదేవి విరహ వ్యధతో చాలా కాలం నవ్వనే లేదు. ప్రస్తుతం ప్రాణ సంశయదశకు చేరుకొంది. అందు వల్ల చెలికత్తెలు-ఆమె ఏమైపోతుందో అని భయపడుతూ ఉన్నారు. అప్పుడు ఆమె చలువ కోసం ధరించిన తామరతూండ్ల హారాలు కూడా-ఆమెకు వేక్కిరించి

నందువల్ల-వాటిని తీసి పారవేసింది. అవి ఆమె శరీరంపై ఉండిన స్వల్ప కాలంలోనే ఆమె విరహ వేడిమికి ఉడికి పోయాయి. ఆ తామర తూండ్లు తమకు ఆహారం కాబట్టి పెంపుడు రాజహంస వచ్చి కబళించింది. అందువల్ల దాని నోరు కాలి అంగలార్చింది. అది హాహాకారం చేస్తూ చేసిన వికృత చేష్ట-వింతగా హాస్యం కలిగించేట్లున్నందువల్ల-ఆమె లేనగవు నవ్వింది. ఆ లేనగవు చూచిన చెలికత్తెలు - తమ చెలికి ఇక ప్రాణ భయం లేదులే అని ఊపిరి పీల్చుకున్నారు.[152]

శ్రీపతి మీద గీతాల్ని ప్రేమతో గోదాదేవి పాడడానికి-విపంచికను మీటగానే-ఆమె చేయి వేడిమి సోకి-వీణ మెట్ల మైనం కరిగి పోయింది. దానిని అవతల పెట్టి శ్రుతి మాత్రమే ఉండే తంబురాను తీసుకొని పాడుతుంది. పెన్నెమాటల్తో తంబురా తంతులు సరిగా శబ్దింపక జబ్బువడగా-మధుర వాణి అయిన ఆమె తానే (వాయిద్యం ఏమీ తీసుకోక) గాత్రంగా పాడుతుంది. అలా పాడను మొదలు పెట్టగానే-కంఠం గద్గదమయ్యేటప్పటికి విశ్చేష్టురాలౌతుంది.[153]

గోదాదేవి శయనించిన ప్రతిపూల పరుపు మీదా - ఆమె చేతుల కంకణాలు-దేహతాపంతో కాగి, కృశత్వంవల్ల చేతుల నుండి జారి కింద పడుతున్నాయి. కాగిన ఆ కంకణాలు తగిలిన చోట్లంతా-పూసెజ్జలో మాడిన నల్లని గుర్తులు రెండు-ఏర్పడుతున్నాయి. ఆ నల్లని చిహ్నాలు ఎలా ఉన్నాయంటే-ఆమె చెలులతో తన మన్మథ వ్యథను చెప్పుకోడానికి సిగ్గుపడి-తనకు మౌనం తక్కదు. ధైర్యత జారిపోయింది. కాబట్టి తనకు మాన ధైర్యాలు సున్నలని చెప్తూ ఉన్నట్లున్నాయి.[154]

గోదాదేవి దురంత వేదనతో పొల్లాడినందువల్ల-ఆమె సొమ్ములు, వస్త్రాలు మాటి మాటికి నలిగ పోయాయి. వాటిని ఆమె వెంట వెంటనే తీసి-వేరవి ధరిస్తూ ఉండేది. భగవంతుని సేవలో ప్రతి అవసరానికి - వస్త్రాలు, ఆభరణాలు వేరు వేరుగా ఉండాలని-అందువల్ల అలా మారుస్తున్నట్లు ఉత్సవ శోభాంతేలా నిరంతరం తెచ్చుకొన్న తెలివితో - భగవత్సేవ విమర

కుంగా చేస్తూ ఉంది. ఈ ఉపాయం వల్ల ఆమె తన విరహ వేదనను దాస్తూ ఉన్నా-అది దాగడం లేదు. అప్పుడు ఆమె తండ్రి ఆ యువ విష్ణుచిత్తుడు ఆమె అవస్థను చూచి-[155] తాను పుత్ర వంతుడు కానందువల్ల ను. ఉండే ఒక్క కూతురు ఇలా ఉండడానికి-మన్మథ వేదన విషయం తెలియని-విష్ణుచిత్తుడు ఆమె స్థితి తపమో ఏమో అనుకున్నారు.[156]

అలా ఆలోచించి-దిన దిన ప్రవర్ధమానమైన కూతురు దేహాయాసానికి అత్యంత దుఃఖితులై-దానికి కారణం తెలుసుకోలేక-శరీరాన్ని శుష్కింపచేయడం వద్దని-కూతురును అమాయకత్వంగా వారించి చూశాడు. అయినా ఆమె బాధ అంతకంతకూ అధికం కావడంతో-గుడికి వెళ్ళి స్వామికి పూజ చివరి నమస్కారం చేసిన తర్వాత-తన మనసులోని వేదనను విలిపుత్తూరి వాసియైన మన్నారు స్వామికి విన్నవించాలనుకొని-మళ్ళీ నమస్కారం చేసి ఇలా అన్నారు. "దేవా! దేవారదాసియైన నా పుత్రిక దేనికోసమో-విచిత్రమైన వ్రత చర్యతో శరీరాన్ని శుష్కింపజేస్తూ ఉంది. వద్దు అంటే వినటం లేదు. అపుత్రకుణ్ణి అయిన నాకు కొడుకైనా కూతురైనా ఆమే! నేనేమి చేసేది? మరి ఆమె తపశ్చర్య విధం మా తపశ్చర్య విధంగా లేదు. మేము నీ దినం (హరి వాసరం). నీ జన్మదినాల రాత్రుల్లో తప్ప పెక్కు రాత్రులు జాగారం ఉండం. మాకు తామర బీజాల్తో చేసిన మాలలు తప్ప-తామర తూడుల మాలికలు తెలియవు. (గోదాదేవి తాపోపశమనం కోసం బిసవలయాల్ని ధరించింది.) మేము ప్రసాద కుసుమం చెవిలో పెట్టుకుంటామే గానీ, పూలను కప్పుకోవడం-వాటి మీద శయనించడం-మాకు తెలియదు. మేము చెంబుల్తో మీ తీర్థం తాగుతుంటే-ఆమె మీ తీర్థంతో తన అవయవాల్ని తడుపుకుంటూ ఉంది. మేము చాంద్రాయణ వ్రతాల్లో చంద్ర వృద్ధిని బట్టి దిన దినమూ కడి ఎక్కువ చేసి భోంచేస్తాము. (చంద్ర వృద్ధిని క్షయాన్ని బట్టి అన్నంకడి తగ్గించడం ఎక్కించడం చేసే వ్రతం. అమావాస్య నాడు పూర్తి ఉపవాసం-శుక్ల పాడ్యమినాడు ఒక కడి. విదియనాడు రెండు కళ్లు-ఇలా ఎక్కిస్తూ పున్నమి నాడు పూర్తి భోజనం. కృష్ణ పాడ్యమినాడు ఒక కడి తగ్గించి-అలా తగ్గిస్తూ

అమావాస్యనాడు పూర్తి ఉపవాసం-ఇలా ఒక నెల చేస్తే అది చంద్రాయణ వ్రతం అవుతుంది ) ఆమె చంద్ర వృద్ధిని బట్టి తగ్గిస్తూ వస్తుంది. (శుక్లపక్షంలో చంద్రుడు వృద్ధి అయ్యేకొద్దీ ఆమె విరహం పెరిగిపోతుంది-కాబట్టి విరహ వేదనతో భోజనం తగ్గించి వేస్తుంది.) మేము బ్రహ్మధ్యానంలో నిశ్వాస నిరోధం చేస్తుంటే-ఆమె ఆ ధ్యాన దశలో నిశ్వాసం వెలికి వదుల్తుంది. (నిట్టూర్పులు వదులు తుంటుంది) మేము యోగంలో జ్ఞాన ముద్ర కోసం హృదయం మీద చేతులు చేరుస్తాము ఆమె చెక్కిలి మీద చెయ్యి చేరుస్తుంది. మేము నారతో చేసిన ఉత్తరీయాలు ధరిస్తుంటే ఆమె లేత ఆకుల్నే ఉత్తరీయాలుగా ధరిస్తుంది. మేము శుక్లపక్ష నూతన చంద్రున్ని కీర్తిస్తే తాను పున్నమి చంద్రున్ని నిందిస్తుంది ఆమె ఈ విధంగా ప్రవర్తిస్తూ ఉంది. ఇది ఏమి తాపం? ఉన్మాదం కావచ్చు. నీ భక్తి ఎంత కలిగి ఉన్నా-మా బోటివారికి సంసార బంధం విడువలేదు. సర్వాంతర్యామివి. నీకు తెలియంది లేదు. ఆమె ఈ ప్రవర్తన విధం ఏమిటో తెలుపు అని విష్ణుచిత్తుడు అనగానే-అతని ఛాందసానికి మందహాసం చేసి-కరుణాశయంతో మన్ననారు స్వామి ఇలా అన్నారు [157]

## ఆశ్వాసాంతం

నీల మేఘ శ్యామా! మధుకైటభులనే పాములకు గరుత్మంతుడైన స్వామీ! యోగి నాభిలోని మణిపూర చక్రంలో నాగాంగనా రూపంలో నిద్రిస్తూ ఉండే కుండలినీ శక్తి యోగ విశేషంతో మేల్కొని లేచి-హృదయ గ్రంథిని ఛేదించుకొని-యోగి శిరస్సులోని సహస్రార కమలాన్ని పొడుస్తుంది. అప్పుడు దానిలో నుండి అమృతం పాల సముద్రంలాగా ఉప్పొంగుతుంది. దానిలో క్రీడానక్తుడై ఉండే స్వామీ! రావణుని సోదరుడైన విభీషణునికి శరణునిచ్చిన స్వామీ! అలాంటి నారాయణుడివైన వేంకటేశ్వరా![158]

నీ పాదాగ్రాలకు నిత్యం మొక్కుతూ ఉండే ఇంద్రాది అమర శ్రేష్ఠులు కల స్వామివి. దానవుల చేటుకోసం భూపుత్రికగా సీత పుట్టడానికి కారణమైన రామావతార మెత్తిన స్వామీ! సంసార బంధాలకు శత్రువైన

ప్రఖ్యాత నామంగల స్వామీ! (హరి నామోచ్చారణతో భవ బంధాలు తొలగి పోతాయి.) అలాంటి నారాయణుని వైన ఓ వేంకటేశ్వరా![159]

బ్రహ్మాండ కటాహాల భారాన్ని వహించే ఉదరం గలిగిన స్వామీ! కుమారస్వామి దుర్భర తపస్సుకు ఫలంగా పుట్టిన కపట బాలుడా! జల సమృద్ధమై మనోహరమైన స్వామి పుష్కరిణి వద్ద నున్న సౌధంలోకి వేంచేసే వేంకటేశా![160]

## కృతికర్తను గురించిసపద్యం

ఇది-తెనుగు మాటవల్ల సార్థక నామమైన యవనుల రక్తంతో నిండినదైన 'కెంపాపి' (ఎర్రని బావి-రక్తంబావి) పట్టణం యొక్క మేఘాల్ని అడ్డగించేంత ఎత్తుగా ఉన్న కోట చుట్టు గోడల వరుసను పడగొట్టే వనిక అప్పరమైన సేనకు-అగ్రభాగంలో నడిచే కృష్ణరాయ పృథివీపతి అనే పేరు గలిగిన నా (చేత రచించబడ్డ) ఆముక్తమాల్యదలో పంచమాశ్వాసం హృద్యమైన పద్యాలతో అమరుతూ ఉంది [161]

## షష్ఠాశ్వాసం

సంపదల్ని అనుగ్రహించే కృపాకటాక్షం గల స్వామీ! వైకుంఠా! అకుంఠా! భక్తవరదా! గంగాదేవిని పాదకమలాలకు మకరందంగా చేసుకొన్న స్వామీ! శేషశైలం అనే ఉదయ పర్వతానికి సూర్యుడైన స్వామీ![1] అనంతర వృత్తాంతం శ్రద్ధగా వినండి-[2]

## దాసరి కథ

(మన్నారు స్వామి చెపుతున్నాడు) నా భక్తుడు పూర్వం ఒకడుండేవాడు. అతనిది పేరు చెప్పడానికి వీలుగాని కులం. అతడు-పూర్వం నేను వామనావతారంలో నివసించిన పుణ్యభూమి ఉండే 'కురుంగుడి'-దానికి కూడా మడల దూరంలో నివసిస్తూ ఉండేవాడు. ప్రతి దినం బ్రాహ్మ వేళల్లో

(రాత్రి చివరి జాములోని మొదటి అర్ధకాలాన్ని బ్రాహ్మ ముహూర్తం అంటారు.) వచ్చి-లాలసతో మంగళ నామకైశికీరాగంతో-నన్ను గురించి పాడేవాడు [3] దినం దినం-ఆ మహాత్ముడు[4]

నా ప్రీతికోసం జాత్యుచిత ప్రవర్తనను అవలంబించి తన హృదయం నిత్యం శుచిగా ఉండేట్లు చూసుకుంటూ ఉండేవాడు అతను ఆ చండాల తనువులో - మసిపాత్రలోని మాణిక్యంలాగా ఒదిగి ఉన్నాడు [5]

ఆ చండాల భక్తుడు చమురైన తోలు చొక్కా, టోపీ ధరిస్తాడు. అతని చెవుల్లో ఇత్తడితో చేసిన శంఖం ప్రతిమతో ఒక కుండలం, చక్ర ప్రతిమతో చేసిన ఒక కుండలం అమరాయి. చేతిలో దివె దారికొమ్ము (దీపస్తంభం) తోలుతిత్తి, కోడమ్ము (చేయమ్ము) మెడ మీద మొగలాకు గొడుగు ఒప్పుతుంటాయి. నా (స్వామి) పాదరక్ష, గుర్రపు పొదవాటి వెంట్రుకతో కుట్టిన ఓటిదైన అల్పమైన కిన్నెర ఒప్పుతుంటాయి. అతని నడక వేగంలో-చంక పుటికలో ఉన్న చిటి తాళాలు- ఒక దానితో ఒకటి తగిలి శబ్దిస్తుంటాయి.

అతనికి పెద్ద పెద్ద తులసి పూల హారమే కంటెగా ఉంటుంది. అతనిది మలినమైన (నల్లనిదైన) తనువు. పట్టె తిరుమణి ధరిస్తాడు ఎరుపు పేరుతూ ఉండే బెదురు చూపులు చూస్తూ ఉంటాడు పసుపుపొడి ఉండే తోలుసంచి ఉంటుది ఇవన్నీ ఒప్పారుతుండగా-నన్ను (కురుంగుడి స్వామిని) పూజించడానికి వస్తుండేవాడు [6]

చండాలుడు కాని వారి శీలం కలిగిన ఆ దాసరి, దేవాలయం వద్ద తన పరికరాలు దించి-పులకలు పొటమరించిన దేహంతో చండాలికను మీటుతూ-చెక్కిళ్ళ నిండా సంతోషాశ్రు ప్రవాహాలు పారగా - గుండ్లు కరిగేట్లు స్వామి స్తుతులు పాడతాడు. ఎండ, గాలి, ఆకలి లెక్క చేయకుండా భక్తిజనితమైన ఉధృత తాండవం మధ్యాహ్నం దాకా ఆడతాడు.[7] ఆ విధంగా చాలా సేపు స్వామిని సేవించి, సాష్టాంగం చేసి, గర్భమంటపి కడగగా-లోని రాతి తొట్టి నిండి కాలువగా సాగి - గుడి వెడలివచ్చే కలక జలాన్ని-శూద్రుడు ఇవ్వగా-తీర్థంగా తాగుతాడు.[8]

ఆ దాసరి ఉత్తమ జాతివారు కనిపిస్తూనే-దూరంగా తొలగుతాడు. ఎండ గాలి లెక్కచేయకుండా ఎంత సేవయినా సరే స్వామి ప్రసాదం ఉత్తమ జాతుల వారికి పంచేవరకు వేచి ఉంటాడు. తర్వాత శూద్ర జాతి వ్యక్తులు మెచ్చి-దయతో ఇచ్చే ప్రసాదాన్ని-కిన్నెరను సాచి. అందుకొని-శ్రద్ధాతిశయంతో భుజిస్తాడు. ప్రసాదం ఇచ్చిన వాడు పోసే తీర్థాన్ని తాగుతాడు."

ఈ విధంగా తన చండాల జన్మం వల్ల అయిన పరమ ఇబ్బందికరమైన నీచత్వం వల్ల-సకల జనులు బాధపడేట్లుగా, గుడి లావరా తూపరాణి (లావరా = జల నిర్గమ ద్వారం మూసే రంధ్రం తోడి శిలాఫలకం కలిగి ఉన్న నీరు బయటికి వచ్చే తూము) వద్ద నిలబడి - బయటి ప్రాకారాన్ని మాత్రమే ప్రదక్షించి-పొద్దెక్కగా తన చండాల వాడకు తిరిగి వెళ్తూ ఉండేవాడు. ఇలా ఉంటూ ఒకనాడు-[10]

ఆ దాసరి అర్ధమరేయి-ఆ సమీపంలోని పిల్లిచొరబడిన ఇంట్లోని కోళ్ళ ఉండ్రుడ ధ్వని విని-(పూజకు వెళ్ళ సమయమైందని పాడడానికి పోతూ తోవలో-[11] మరులు తీగ తొక్కి, 'మ చీకటి' అంటే 'ట' అనే చీకటి రాత్రిలో దారి తప్పి-విభ్రమతో అని చోట్లూ తిరిగాడు. ఆ తర్వాత శూన్యమైన ఒక అడవి ప్రదేశంలో ప్రవేశించి వెళ్తూ ఉన్నాడు-[12] ద్వార పార్శ్వాలు కూలిపోగా ఆ ప్రదేశంలో పొట్టనేను, కసింద, కొరింద పొదలు బలిసి ఉన్నాయి. పడిపోయిన గాదెం కింద ఉండే గోరియల్లో ఆకటితో కృశించి, ఆదవకాపురం ఉండే పందికొక్కుల గుంపులు ఉన్నాయి. సగము దుమ్ముతో పూడిపోయి చిగిరి త గడ్డి మూయగా-నూతులు, వడ్ల పాతర బొరియలు ఉన్నాయి. చీమలు గింజల్ని ఈడ్చుకొనిపోగా చివికిపోయిన కంచెల తావుల్లో-పండి ఎండి కుంగిపోయిన గుమగు ధాన్యం ఉంది.

పెంట దిబ్బలలోని వొగ్గలి చెట్లలో కడుపు వెన్నుకు అంటుకొని పోయి-మీసాల కదలికను అణచుకొంటూ ఉన్న ముసలి పిల్లులున్నాయి. చేలలో బలిసిన కలుపు మొక్కలతో - మళ్ళలో పెరిగిన పొరుదుబ్బులతో-నిట్రాడు మాత్రం మిగిలిన వశాలతో పాడు పడిన ప్రదేశంలో-[13] తప్పు దారిలో వెళ్తూ-

దారిలోని ఉత్తరేణి ముండ్లను కాళ్ల నుండి ఎదురుగా గాని పద్ధతిలో తీసుకొంటూ-వల్లేరుల్ని నేర్పుగా ఊడలాగి పారవేస్తూ ముందుకు వెళ్తూ-[14] ఆ వైష్ణవుడు ఒక పెద్ద మర్రి చెట్టును చూశాడు. అది ఎలా ఉందంటే-దానికి అర్ధ యోజనం పొడవు గలిగిన ఊడలు దిగి ఉన్నాయి. వాటి పై భాగాల నుండి కొమ్మలు మొలిచాయి. ఆ కొమ్మల నుండి మళ్ళీ కొమ్మలు మొలిచాయి ఈ మహా సమూహంలో గాలి కదలాడుతూ ఉంది గాలి వేగం వల్ల చెట్టు నుండి పురుగులు తొలిచిన గీరల తోడి ఆకులు ఎగిరిపోతూ-దూరంలో వస్తూ ఉన్న బాటసారుల వద్ద పడుతూ ఉంటాయి. వారు ఆ మర్రి ఆకుల్ని చూసి-ఆ మర్రి చెట్టులో బ్రహ్మరాక్షసి ఉందనే ప్రతీతి తెలిసిన వారు కాబట్టి-చెట్టును సమీపించకుండా-దూరంగా వెళ్ళిపోతారు. ఆ మర్రి ఆకులలోని గీరలు 'అయ్యా! మీరు నా వద్దకు రాకండి! నా మీద ఒక బ్రహ్మరాక్షసుడు ఉన్నాడు. వాడు మిమ్మల్ని తినేస్తాడు' అని ఆ బాటసారులకు మర్రి చెట్టు రాసిన హెచ్చరిక జాబులేమో అన్నట్లున్నాయి. అలా హెచ్చరించి తన దగ్గరికి రానీయకుండా ఆపి-వారి ప్రాణాల్ని రక్షించిన మహా పుణ్యఫలాలేమో అన్నట్లు-చెట్టు నిండా అసంఖ్యాకంగా మర్రిపండ్లు ఒప్పుతూ ఉన్నాయి. అలాంటి మర్రి చెట్టును దాసరి చూశాడు.[15]

అలా దాసరి దూరంగా మర్రిచెట్టు చూచిన తర్వాత-ఆ దగ్గరనే కనబడిన కాలిత్రోవ కనిపిస్తూనే-దారి దొరకడమే పరమలబ్ధిగా భావించి త్వరితమైన నడకతో ఆ మర్రిచెట్టును క్రమ క్రమంగా సమీపించాడు [16]

ఆ దాసరి మరుగైన త్రోవలో ఆ మర్రిని సమీపించాడు ఆ ప్రాంతం ఎలా ఉందంటే-ఎలనీటి బొండ్లాలలాగా-మెదడంతా జుర్రి వేసిన డొల్లు పుర్రెలగములున్నాయి. అలాగే పండ్లతో మాంసం నిశ్శేషంగా గీరి గీరి తినగా-జీరలు కనిపించేలా చీకివేసిన మలిపచ్చి ఎముకలున్నాయి. దొవ దొవ మనే-ఈగెతుట్టెల వల్ల స్వరూపం కనిపించకుండా-కంపలకు వేలాడే పచ్చి తోళ్లున్నాయి. దుమ్ము నిండి మకిల పట్టి మంగళ్ళ తిప్పలు రేగినట్లు-గాలిలో

అదే మానవుల తల వెంట్రుకలున్నాయి. తునిగి పోయిన మనుషుల అవయవాల్ని నోటకరుచుకొని పోతూ-పొత్తులు కుదరక ఒక దాన్తో మరొకటి పోరుతూ పీకులాడే క్రూర మృగాలున్నాయి. వాటి పాదాల తొక్కుడు వల్ల నలిగి నానిన (నరుగు = ఎండు మాంసపు తునియలని ఒక అర్థం. నరుగు= ఒక జాతి గద్దలు అని మరో అర్థం) దట్టంగా లేగే దుర్గంధమైన త్రోవలో నడుస్తూ దాసరి ఎదుట-[17]

ముంగాళ్ళ మీద సాగి దొంగ చూపులు చూస్తూ-బొమికలెత్తుకొని పారిపోయే వెంటి కుక్కల్ని చూశాడు. మాంస తోరణాల్ని అలాగే పట్టుకొని వేగంగా ఎగిసి-కొమ్మలు కొట్టుకొని రొదలుచేసే గద్దలు కనిపించాయి. అడ్డంగా తిరిగి అరచేతి దెబ్బతిని రొండిమీద చేతులు పట్టుకొని అంగలార్చే కోతుల్ని చూశాడు. ఉన్నట్లుండి ఒక చోట కనిపించిన దృశ్యాలు మాయమై-మరోచోట కనిపించడం చూశాడు. అవన్నీ చూసి-ఈ చెట్టు మీద ఎవరో ఒకడున్నాడు. వాడు నరుడు కాడు. ఒక వేళ కట్టెలు మొదలుగునవి తెచ్చుకోవడానికి వచ్చిన వాడందామా, అందుకోసం తగిన వేళకాదు. పైగా మాంసపు గాలి వీస్తూ ఉంది. నేను పోవలసిన దారి దూరంగా ఉంది.' అని వెతపడుతూ సంశయిస్తూ ఉండేవేళ-[18] ఒక బ్రహ్మరాక్షసుణ్ణి చూశాడు. వాడు ఎలా ఉన్నాడంటే-చచ్చిన మనుష్యుల్ని వాడు గోచిగా పెట్టుకోగా అది పొడవు చాలక నెత్తురు రంతిల్లుతోంది. అతనికి పెద్ద నూతి లాంటి నోరు, మొలత్రాడు ఉన్నాయి.

ఆ రాక్షసుడు పల్ల (పాటల వర్ణం) చీమలతో ఉండే వంపు గింజల జీడి చెట్టులాగా-ఎర్ర దుప్పటితో ఒప్పే కర్రెవాడు, తలకిందు చేయబడిన ఏనుగు తల తీరుగా పాయ అయిన గడ్డం, కోరల్తో కూడిన మొగంతో ఒప్పుతున్నాడు. అతడు కందిరీగల పొడవాటి తుట్టెలాగా చెంగలి తెల్లదనం మించే గోరోజన వర్ణపు మీసాలు, గడ్డం-కలవాడు.

అతడు ఆహారం వెదకడం కోసం కాటసారిని చూడడానికి కొమ్మ తెక్కుతూ ఉండగా జారుతూ ఉండే త్రేవు జంధ్యాన్ని కపిలి పైన వేసు

కుంటూ ఉన్నాడు. వ్రేలాడే బొజ్జగలవాడు. ఏనుగు పాదం. చెంబుతల కల వాడు. అతనికి పెడతల మీద మాత్రం వెంట్రుకలున్నాయి.[19]

ఆ రాక్షసుడు కంత కన్నులవాడు. ఆకలితో చే తాళలేక మాటి మాటికి బండ తిట్లు తిట్టున్నాడు. అతడు కొండలాగా ఉన్నాడు. 'కుంభ జానువు' (కుండలాంటి మోకాలు గలవాడు) అనేది ఆ బ్రహ్మరాక్షసునికి సార్థక నామధేయం.[20]

ఆ బ్రహ్మరాక్షసుడు దాసరిని చూశాడు. 'కూశాము! వెళ్ళిపోకు' అని-మఱ్ఱి చెట్టు కొమ్మలు నుగ్గయేట్లు కిందికి వాలాడు - (దుమికాడు). ఈ దాసరి కూడా-పూర్వం రేపగటి వేళకు కూరుడు అయినందువల్ల-యుద్ధంలో పౌరుషంతో కొంతకాలం ప్రసిద్ధి పొంది ఉండినందువల్ల-జావరి అయినందు వల్ల-నిలిచి తన వద్ద ఉన్న వాడి బాణంతో రాక్షసుని కొట్టాడు. అతడు ఆ దెబ్బను త్రుంచేశాడు అప్పుడు దాసరి ఉద్ధతితో-[12] రాక్షసుడు తనను లాగగా-అడుగులు ఉన్న చోట నుండి కదలనీకుండా-రాక్షసుని రొమ్ముపై చరిచి-అవతలికి తొలగి దుమికాడు.

రాక్షసుడు తనను చరచగా-వంచించి వాని వెన్ను వైపు తిరిగి-తన చేతకు తగిన దృష్టి నిలిపి-రాక్షసుడు మీద పడగా వాని చనుమొనల పట్లకు పిడికిళ్ళు గురి పెట్టుతూ ఉండే తన పిడికిళ్ళ బలంతో-రక్కసునికి లోబడ కుండా నిలిచాడు రాక్షసుడు తన రొమ్ముమీదికి ప్రవేశించడానికి చూడగా కుంగి-తన ముష్టులు బిగిసే కోటగా చేసి-వాడు తిరిగినట్లే తిరిగాడు. రాక్షసుడు తనను చంపడానికి ఏదో ఒక సాధనం వెదికే సమయంలో-దాసరి గుద్ది. తన్ని-వాడు ఇటు తిరగగానే పిడికిలి బిగించి-దగ్గరగా నిలిచాడు దొరికిన సందుకు తగినట్లు వెనుక నడకతో రాక్షసుని కొట్టి-నా (హరి) పాద ధ్యానం ఆత్మలో ఏమరకుండా దాసరి-[21] రాక్షసుణ్ణి తన్ని త్రోసివేశాడు. రాక్షసుడు 'వీడు పోతున్నాడు! రండి రండి' అని తన రాక్షస సమూహాన్ని పిలిచి. వారూ, తాను కలిసి దాసరిని పట్టుకొన్నారు.[22]

జంటోతు (బలిసినవాడు) అయిన దాసరి అప్పుడు కొక్కెకాపులతో- చేతిపోట్లతో ఇరువైపులా పొడుచుకుంటూ-పెనుగుతూ పోతూ ఉండగా- పట్టుకొని దాసరిని మర్రిచెట్టు చేర్చి రాక్షసుడు ఇలా అన్నాడు.[24]

నా వంటి ప్రాణాల-శ్రేష్ఠమైన రుచితో దప్పి తీర్చుకొని సంతర్ప ణతో విజృంభిస్తూ ఉండగా-బాగ లెక్కిన నీతం కత్తితో నరికి-వేడి ఆరని నీ రక్తం ఇంపారగా తాగుతాను. నా పిశాచి భార్య నీ కలుకుల్లు (కణుకు కట్టి కాల్చిన మాంసపు ముక్కలు) అందిస్తూ ఉండగా-వాటిని నంజుకుంటూ- ఈ తాటి తోపులోని మనుషుల పుర్రెలనే కుండలలోని తాటికల్లు తాగుతాను[25]

'నన్నింత శ్రమ పెట్టిన దుష్టుణ్ణి, నిన్ను నేను సుంకు వద్దతిలో చంపుతాను'? అని వింగి అంచేట్లు పెడబొబ్బలు పెడ్తూ- ఆ నీచుడైన బ్రహ్మ రాక్షసుడు-దగతో వెలువడే అవ్యక్తమైన మాటలతో-[26] కత్తి, పాత్రను తేవ డానికి పిశాచుల్ని పంపి, తీగవంటి పేగుతో కట్టవేసి కొంగగ్గెర తోయగా- దాసరి ఆ చెట్టు మీదికి ఒరిగి ఏ మాత్రం దైన్యం లేనట్లుగా-ధర్మం తెలిపే సూక్తిని ఇలా పలికాడు [27]

'నిశాచరా! ఒక మాట విను! తొందరేల? నిన్ను దేవతలైనా అయుతచగలరా? నేను పాత్రలోని భోజనాన్ని' ఎక్కడికి పోతాను? పెనుగు లాడకుండా ప్రాణ రక్షణను ఉపేక్ష చేయడం పాపం కాబట్టి-నేను చేసిన పనికి కోపగించుకోవద్దు. నాకు శరీరం మీద కోరిక లేదు. ఈ శరీరం నశించడమే మంచిది [28]

హీన జన్మ నశించడం-ఎవ్వడో ఒక ప్రాణి సంతసించడం - ముక్తి సామీప్యం కలగడం మేలే కాదా? శిబి చక్రవర్తి మేల్బంతి (ఆదర్శం) కదా! అశాశ్వత దేహం అమ్మి-మోక్షం కొనడానికి - శిబి చక్రవర్తి మేల్బంతి (ఆదర్శం).[29]

తెగులుగానీ, గ్రహంగానీ, తేలయినా, విషమైనా, గొప్ప మనో వ్యాధి అయినా, జలమైనా, బందిపోటైనా, క్రూరమృగాలైనా, అగ్ని అయినా, దుర్వ్యసనమైనా, ప్రమాదమైనా, ప్రాచయినా, పిడుగయినా, తెలవ

మైన తనువును నాశనం చేస్తాయి అలా ఊరకే తనువు చెడకుండా-ఆకలితో కృశించిన వాణ్ణి ఒకణ్ణి రక్షించడం సముచితం గదా![80]

అది అలా ఉండనీ! ఇంకొక హితం చెప్తాను విను. అది ప్రాణ భయంతో కార్యనిమిత్తం చెప్పే మాటగా అనుకోకుండా మధ్యస్థమైన మాటగా భావించి విను ఒక వేళ నీవు వినకున్నా ప్రాణుల హితం కోరి నేను ఉచ్చరించే మాటకు ఈశ్వరుడైనా మెచ్చుకొంటాడులే! నీవు పులి, సింహం, అడవిపంది, తోడేలు, నక్క మొదలైన క్రూర మృగాల్లో ఒక జంతువ్వికావు. దేవతా జాతుల్లో ఒకవివి. నీవు కూడ మాలాగే కళ్లు, చేతులు, ముఖం మొదలైన అవయవాలు కలవాడివి. మాటలు మాలాగే ఇది కర్తవ్యం అని విచారించడం మాకు మీకు సమానమే. హా! మరిచిపోయి అన్నాను, అచేతనాల కంటే కీటకాదులకు, వాటి కంటే మృగాదులకు, వాటి కంటే పశు పక్ష్యాదులకు, వాటి కంటే మాకు, మాకంటే మీకు-ఇంద్రియాలు, దేహం మొదలైన వాటిలో పాటవం ఎక్కువ. విజ్ఞానం కూడా ఎక్కువే. ఇలాంటి నీకు కేవలం నిందాకరమైనది, భీకత్వమైనది అయిన-చంప తగినది, చంపదగనిది - ఉచిత మైనది ఉచితం కానిది-తినదగినది, తినదగనిది-తాగదగినది, తాగదగనిది అనే-వివేకం లేక పోవడం ఉచితమేనా? ఈ దురాహారం రుచిగాదు- శుచికాదు. ఇది కూడా సకల దురితాల్లో గొప్పది అయిన హింసతో సమకూడేది. హింస పరలోకంలో కదా బాధకం! పరలోకం ప్రాణాంతంలో గదా! చిర స్థిర ప్రాణులమైన మాకు ఏం హింసా భయం? అనవద్దు ప్రాణ భయం మనుష్యులైన మాకు ఈనాడైతే-మీకు మరునాడైనా-అవతలినాడైనా-చివరికి యుగాంతంలోనైనా-దూరమో దగ్గరో ఎప్పుడో తప్పదు మరణానికి తారతమ్యం లేదు. సముద్రంలో మునగడంలో పర్వతానికి పరమాణువుకు అంతర భేదమేముంది? భవిష్యత్తును గురించి ఆలోచించుకోవద్దా? పూర్వం తపో లబ్ధ వరాదులతో దేవతల గర్వం అణచిన హిరణ్యకశిపుడు, రావణుడు లాంటి వారు-శత సహస్ర సంవత్సరాలు జీవించి కూడా మరణించి-మళ్ళీ తాము ఇంతకు ముందు జయించిన యముని చేతిలోనే చిక్కరా? ఇక్కడ మీరు

ప్రబలులు అయితే-అక్కడ యముడు ప్రబలుడు. సకల ప్రాణి తారతమ్యం-తమ తమ స్థాన విశేషం బట్టే ఉంటుంది ఆ సూర్యసుతుడైన యముని పురంలో మేర తప్పితే - మాకు తప్పని అట్లు మీకూ తప్పదు. మీరూ, ఆ యముడు- మొదలైన దేవతలు-జాతిలో సోదరులు అలా అయి ఉండి-పరలోకంలో మీరు బాధింపబడుతున్నారు. వారు బాధించే స్థితిలో ఉన్నారు. ఈ తేజస్సంబంధి తారతమ్యానికి మీ తమోగుణం, వారి సత్త్వగుణం హేతువులు. ఆ గుణాలకు ఆహారాలు హేతువులు ఆ ఆహారాలతో దేవతలు-యజ్ఞాల్లో భూర్భువస్సువరాది మంత్రాలతోను, అన్నం, హవిస్సుల ఆహుతులతోను పవిత్రులై అమరత్వం పొంది-మీ కంటే అతి దీర్ఘకాలం జీవిస్తారు వారి పావనత చూచి కదా! సదా బ్రహ్మాంశలో పుట్టిన చంద్రుడు కరిగి-సకల రసాలకు శ్రేష్ఠమైన అమృతంతో దేవతలకు ఆప్యాయనం (తృప్తి) చేస్తున్నాడు. దాని అర్థం (వేదాల అర్థం) మేము (చండాలులు) ఉచ్చరించరాదు కానీ, చంద్రుని ప్రథమ కళ అగ్ని తాగుతాడు అని, ఇంకా చంద్రుని ఆయా కళలు క్రమంగా ఆయా వేల్పులు తాగుతారు అని వేదం చెప్తుంది ఇదంతా ఆలోచించి-నీకు రుచించినట్లు-నడువు-అని జానరి అంటూనే, రాక్షసుడు 'కహ కహ' నవ్వి ఇలా అంటున్నాడు.[31]

'మమ్మల్ని నీ చదువుల్తో చంపకు మేము పఠించని శాస్త్రాలున్నాయా? మేము పఠించని వేదాలున్నాయా? అవి నాకు రుచించవు. 'మొదటి కళ అగ్ని తాగుతాడు' (ప్రథమాం పిబతే వహ్నిః) అనే మాట నిజమే గదా![32]

'ఓహో నిజ! మమ్మల్ని దేవతల భ్రాతలంటివి. వారు అమృత హారులు. అవని త భోజ్యాలు కాదంటివి? పాడ్యమి నాటి చంద్రుని కళను అగ్ని తాగుతాడంటివి ఇక ఒక విషయం అడుగుతాను ఆ అగ్ని సర్వాశనుడు కాదా! ఆ న్యాయమే మాకు చాలు పెద్దల్ని అనుసరించడం మాకు పాపమా'?[33]

హరికి సఖుడు రథమూ అయిన గరుడుడు, దొరికిన అమృతం దేవతలకు మళ్ళీ ఇచ్చేసి, పాముల్ని కూడు గా అడిగి వరం పుచ్చుకోడా? అమృతమైనా రుచిలో జాత్యన్నంతో సమానమౌతుందా?[34]

ఇదుర కూడు వదలుకొని చదివి నేను సాధించినదేమి? ఉదాహరణాల కోసం చేసే మిథ్యా కల్పనల్ని విని ఎవరు మోసపోతారు? నీవు నా వద్ద చదువులు మాటలాడి ఒక మెప్పు కూడా పొందలేవు-ఒక్కటే మెప్పు దల ఏమంటే-'ఈ చలివిన కూర ఎంత రుచిగా ఉంది-'చాలేట్లుతే' అనే మెప్పు మాత్రమే పొందుతావు.'[35]

అని చార్వాకమతం అవలంబించి, దాసరి మాటల్ని హేళన చేస్తూ ఉన్న రాక్షసుని కుతర్కాలైన వాక్కులకు-దాసరి కృష్ణస్మరణం చేశాడు. ఈ మాటలకు తగినట్లు ప్రత్యుత్తరాలిచ్చి వాణ్ణి రెచ్చగొడితే బుద్ధిక్షోభంగా ఇంతకంటే ఏమి అబద్ధాలు వినబడుతాయో? తర్వాత కార్యం ఉండే నాకు అతని మాటల్ని కాదనే పనిలేదు అని అతను కూడా రాక్షసున్తో చేరి-వాని ఇష్టం ప్రకారం ప్రవర్తించాలనుకొని, హీన స్మరణకు సవగించి, వాని ముఖ ప్రీతికోసం శబ్దవ్యాజంతో మనస్సులో బుద్ధుణ్ణి ఉంచుకొని 'నీవు సర్వజ్ఞునివి నేను వరుణ్ణి. హీనకులుణ్ణి శాస్త్రాలు అభ్యసించని వాణ్ణి నీకు ఉత్తరం ఇవ్వడానికి శక్తున్నా' నా మాటల్లో తప్పుల్ని సహించి దయచేసి నా ప్రార్థనను అంగీకరించు [36]

మొదటే నీవు దైత్యుల్లో ప్రఖ్యాతుడివి. ఆ పైన నీకు కీర్తి శోభను నేను చేకూర్చుతాను నా దేహం నీ కర్పించడాన్ని వదలను. నేను ఒక వ్రతాన్ని ప్రధానంగా ఆచరిస్తున్నాను. దాన్ని సఫలం చేయలేవా? 'సఖ్యం సాప్తపదీనమ్' (ఏడడుగులు నడిస్తే సఖ్యం అవుతుంది) అనే మాటను బట్టి మన ఒండొరుల చెలిమిని భావించి సఫలం చేయవా?[37]

అదేమంటే-ఈ దగ్గర్లోనే ఉన్న కురుంగుడి వైకుంఠుణ్ణి గానంతో వ్రతంగా స్తుతించి వస్తుంటాను. ఆసేవాకార్యం తర్వాత నీకు ఆహారం అవుతాను. ఇదే శ్రేష్ఠం. ఆ భగవంతుని సేవ తర్వాత నీకు ఆహారం కావడమే నేటికి తుదికార్యం అవుతుంది.[38]

దాసరి ఇలా అంటూనే-చిరునవ్వుతో రాక్షసుడు అతని చెక్కిలి పైన కొట్టి 'తెప్పసండించితివి (వంచించితివి) దాసరీ! ఒడవుల్లో దారులు కొట్టి కొట్టి మేను పెంచి నిన్ననే గదా దాసరి వయ్యావు. ఈ నన్ను కొంచెం చేసి తాడుకొరికేసుకొని తప్పించుకుపోవాలను కుంటున్నావు. నిన్ను మెచ్చు కుంటున్నా'![40]

ఏ రాజ్యం నరుడు నోటికడి పోగొట్టుకొని నీ బోధ వింటాడు? మరే రాజ్యంగా నరుడు తానకోసం శరీరం ఇవ్వడానికి నవకు తానే తిరిగి వస్తాడు? నీకు సంతోషం కలిగేట్లు నేను వంచనూ పంపను ఒకవేళ నేను పంపినా నీవు రామూరావు. ఇది తేటతెల్లం. అంత్యజుడా! రచ్చరేల" పలు పల్కులు ఏల? చింత ఏల? మాయలేల'?[41]

అని రాక్షసుడంటూనే-దాసరి చెవులు మూసుకొని 'నారాయణా' అంటూ 'నన్ను నమ్మవా! రాక్షసా! ఒక శపథంతో నమ్ము' అని రాక్షసుడు అంగీకరించగా-వేలకు వేల సత్యాలు పలికినా అతడు వినలేదు[42]

'ఎవ్వని చూపుతో జగం జన్మిస్తుందో' ఎవ్వనియందు నివసిస్తుందో, ఎవ్వని యందు నశిస్తుందో అలాంటి విష్ణువుతో-మరొక దేవుణ్ణి సాటి పలికిన పాపాత్ముణ్ణవుతాను-ఎలాగైనా నేను నీ వద్దకు రాక పోతే'-అన్నాడు దాసరి. ఆ మాటలు విని రాక్షసుడు దాసరి బంధం విప్పేశాడు.[43]

ఆ దాసరి రాక్షసుని బంధం ద్వారా తన పాపలేశాన్ని పోగొట్టు కున్నాడు. భగవంతుని దర్శనానికి అయిన ప్రతి బంధకం తీరిపోయింది. కురుంగుడి వెళ్ళి కమలనేత్రుడైన శ్రీహరికి సాగిలబడి మొక్కాడు. విపంచి వాయిస్తూ స్తుతుల్తో కూడిన ప్రబంధాల్ని (గేయాల్ని) స్వామి చొక్క పోయేట్లు పాడాడు. అసత్య భీతి భారంతో త్వర త్వరగా వచ్చి-వ్రతపూర్తి అయినందు వల్ల పీడ పోగొట్టుకున్న దాసరి రాక్షసునితో ఇలా అన్నాడు.[44]

'ఓ రాక్షసా! నీ చెంత వాకిలి పోయి-నేను చకివి భజించగా-మోహాను భవం వర్ధిల్లినది. ఇప్పుడు నాకు ఏ చెర భయమూ లేదు నువ్వు నన్ను తింపేటప్పుడు-ఏ చరణాలు, ఏ ఉదరం. ఏ ఉరం. ఏ శిరం. ఏ భుజాలు

ఉన్నాయో-అవే చరణాలు, అదే ఉరం, అదే శిరం, అవే చేతులున్నాయో లేవో చూసుకో![45]

అని దాసరి ఇలా చెప్పగానే, అతని సత్యానికి ఆనంద బాష్పాలు ప్రవహిస్తూ ఉండగా,-హర్షంతో పులకించిన గాత్రం గలవాడై-బ్రహ్మరాక్షసి సూర్యుని మధ్యాహ్నపు ఎండ తన పెద్ద జట్టతం మీద మెరవగా, దాసరి వద్దకు పరుగెత్తుకొచ్చాడు.[46]

రాక్షసుడు కొండలాగా దాసరికి భక్తితో ప్రదక్షిణం చేస్తూనే-తనను కట్టివేసిన చెట్టు చుట్టూ పాకల వ్యాధి గ్రస్తమైన ఏనుగు లాగా తిరిగి-అతని నొసలు దాసరి పాదాల మీద ఉండేట్లు-కొండలు మారు మోగేంత ధ్వనితో అతన్ని స్తుతిస్తూ సాగిల పడి, తన కోరలతో దాసరి పాదాలు ఒకటొకటి ఎత్తి తన శిరంపై పెట్టుకొన్నాడు.[47]

ఈ లోకంలో దేవతలు, దానవులు, రాజులు, మునులు ఇలాంటి శరీర దానంలో కాక-వేరే కార్యాల్లో తమ వాగ్రూప వ్రతాన్ని తీర్చుకున్నారు గానీ-నీలాగా శరీర దానం అనే దారుణ ప్రతిజ్ఞను తీర్చుకున్న వారులేరు నేను ఎంతో వృద్ధుడిగా చిరకాలం జీవించిన వాణ్ణి నీలాంటి ప్రతిజ్ఞా నిర్వాహకులు జగంలో లేరని ప్రతిన చేస్తున్నాను[48]

ఓ దాసరీ! ఈ నీ ధైర్యం, నీ స్ఫూర్తి, నీ సత్యభాషితమైన గతి యందలి చరిత్ర ఎవ్వరికీ లేవు. నీవు మురారి పద సేవనమే జీవన మతిగా ఉండేవాడివి. కురుంగుడి నంబి కృప ఆధారంగా కలిగిన వాడివి, మధుర మైన హరి స్తోత్రగానం అనే సముద్రపు అలల్ని-దివ్య నామ ప్రవదంగా కుంటి కట్టిన నీ వీణ అనే తెప్పతో-దాటుతున్నావు. అలాటి నీకు ఇతరులు సమానమా

అని రాక్షసుడు ఇలా అంటూనే-అతణ్ణి భాగవత శ్రేష్ఠుడైన దాసరి కౌగిలించి-ఇలా అన్నాడు 'రజనీచరేంద్ర! అనఘుడా! నా వ్రతం ఈ దినం పూర్తి చేయించావు నీ అత్యంత కృపా కటాక్షం వల్ల ధన్యుణ్ణయ్యాను.'[49]

"బండి కండ్లలా అస్థిరమైనవి కావవి. అదీ ప్రాణ భయంతో ఒక బాసలు చేసి గా-కష్ట సాధ్యమైన మోక్షాన్ని ఎవరైనా వదులుకుంటారా?

లా వమలుకోడం నీకే చెల్లింది బ్రాహ్మణ వంశంలో పుట్టిన రాక్షసా క్షసులకు 'పుణ్యజనులు' అనే పేరు-నీ వల్లనే ఆ రాక్షస కులానికి వమ రాడింది.[51]

మహా ఆకలితో కడుపు నకనకలు పడుతూ ఉండగా - నన్ను మ్యణ్ణి చేయడానికి వదిలావు మేము జాతి ధర్మంగా మీకు బ్రహ్మ విధించిన డు-నీకు ఏ పాపం కూడా అంటదు ఇకేమన్నా నా మీద ఒట్టు! నా మీద మాత్రం స్నేహం ఉన్నా బడలిక తీరేట్లుగా నా శరీరాన్ని పారణ ్క![52]

ఓ సురవిరోధీ! ఈ నా మాటలో పొరపొచ్చెం లేదనడానికి శ్వరుడే సాక్షి. నా శరీరంలోని మెదడు నిండుగా గలిగిన, క్రొవ్విన ంసాన్ని భక్షించు అని దాసరి అంటూనే రాక్షసుడు ఆర్తితో-[53]

"ఓ పుణ్యాత్మా' ఇలా దయలేకుండా పలకడం బాగుందా! ్నళ్ళు ఈ కూడే-రః పొట్టను బెట్టుకొని-మహా పాపబుద్ధితో ఈ తనువును షించాను. ఎన్నాళ్ళకైనా ఎలాగైనా ఒక తపస్వి గానీ, ఒక వ్రతిగానీ దా! నన్ను చూడడా! అతని కృపతో ఈ పుట్టువును బోగొట్టుకుంటాను-అని చి ఉండగా నీవు వచ్చి కూడా ఇలా అంటున్నావే![54]

మీ వంటి భాగవతులు కూడా మా వంటి వారిని పావనులుగా యకపోతే మరి మాకేమి గతి? మా చెనుకటి హేయ వృత్తిని పట్టించుకో డా దయతో కటాక్షించు'[55]

పరుసవేది నిరపరాధి అయిన గొడ్డలిని గానీ, ద్విజుణ్ణి చంపిన స్త్రీన్నయినా సరే (అవి రెండూ ఇనుమే కాబట్టి)-రెండింటినీ సమంగానే ారు చేస్తుంది. మా బోటి వాళ్ళ విషయంలో మీ బోటివాళ్లు ఈ ఆసా ి ణ న్యాయాన్ని అవలంబించవద్దా?![56]

అని రాక్షసుడు అంటూనే - తన దేహార్పణను అంగీకరించక ్తో పలికే దీనత్వానికి నీ తాత్పర్యమేమి? అని దాసరి అడిగాడు. 'సి శరీ

రాన్ని పాకిస్తాను అనడం తగికాదు! నా ఆత్మ కాలుష్యాన్ని పోగొట్టడమే దయ![57]

నా కర్మం ఘంటాకర్ణుని కర్మమ మించిందా? అతడు మౌనీంద్రుల్ని తుంటలు చేయలేదా? ఆ పాపం మాన్పి భగవంతుడు అలాటి మోక్షశ్రీని దయచేశాడే! దేవుడిచ్చిన మోక్ష సామ్రాజ్యం కంటే భాగవతుడు మించుగా ఇవ్వగలడే! మరి నా మేలు కాకంటించరాదా! ప్రాణిమేలు చక్రికి పూజ గాదా![58]

అని రాక్షసుడన్నాడు. అది విని దాసరి 'ఆ విధం ఎలాగ సాధ్యమవుతుంది' అన్నాడు. బ్రహ్మ రాక్షసుడు ఇలా అంటున్నాడు! నేను ఒ బ్రహ్మ రాక్షసుణ్ణి. నా పేరు కుంభ జానువు పాప కర్ముణ్ణయి ఈ మర్రిచెట్టు నాశ్రయించి-వంచనతో బాటసారి జనాన్ని తింటూ ఉంటాను. పూర్వజన్మలో నేను సోమశర్మ అనే బ్రాహ్మణుణ్ణి. పూర్వజన్మలో విప్రుణ్ణి కాబట్టి - దయ చేయుణ్ణి ఒక దుష్కర్మవల్ల ఇలా అయ్యాను నీవు విష్ణువును పాడిన ఆ పాట ఫలం సకలంగా నాకిస్తే భీభత్సమైన నిందకరమైన ఈ నా జన్మ పోతుంది. నీకు అర్థ రక్షణంతో వచ్చే అనంత సుకృతం సిద్ధిస్తుంది. అత్యంత ధర్మసాధనమైన నీ దేహం ఇల్లు చేరుతుంది'-అని రాక్షసుడు పలికిన శరీర కోసమైన ఆ మాటలకు కల కల నవ్వి ఆ విష్ణుదాసుడు ఇలా అన్నాడు.[59]

'నేను ఇలాంటి దేహాల్ని, ఇంతకన్నా ఉత్కృష్ట దేహాల్ని, ఇం కన్నా అధమ దేహాల్ని ఎన్నో పొందాను. ఆ శరీర పరంపరల్లో ఈ దండ దేహామూ ఒకటి. ఈ శరీరం కోసం ఒక నాటిది కాదు కదా-ఒక క్షణం గీ ఫలం కూడా ఇవ్వను.[60]

నేనూ, నీవు ఎన్నిమార్లు దిక్పాలకతను పెత్తలేదు? వెంటనే కీ తనువు ఎత్తలేదు? ఎన్నిమార్లు సింహం తనువు ధరించలేదు? వెంటనే కీ శరీర మెత్తలేదా? ఏనుగు శరీరాలు ఎన్నిసార్లు తాల్చలేదు? వెంటనే దో తనువు ఎన్నిసార్లు తాల్చలేదు. ధరణీశ తనువు ఎన్నిమార్లెత్త లేదు? వెంట

దాన తనువు ఎత్తలేదా? ఎన్నిసార్లు సోమయాజులం కాలేదు? చండాలులము, పశువులము ఎన్నిసార్లుకాలేదు? పాములము. పిశాచులము ఎన్నిసార్లుకాలేదు. ఒక హరి భక్తులం మాత్రమే కాలేదు గానీ![61]

ఈ శరీరం చేవల్ని పట్టే ఊత (ఒక సాధనం)లో వచ్చిన నీళ్లు లాంటిది. పాతెపురుగు నేతలో ముడిచి ఉంచిన బూరుగు దూది. ఎండలోని పసుపు. దూలంలో పురుగు తొలచిన తొర్రి అతరం. అలాంటి మేను మీద మమతతో పుణ్యం అమ్ముకోవడం ఎలాంటిదంటే-కప్పురం ఇచ్చి ఉప్పు కొనుక్కున్నలాంటిది'[62]

అని దాసరి అన్నాడు. దానికి రాక్షసుడు ఇలా అన్నాడు. 'ఓదాసరీ! ఈ పాటి సంగీత ఫలంలో సగమైనా దయతో ఈవా? చేపమింగే గుక్కెడు నీటితో సముద్రానికి తక్కువవుతుందా? నీవిచ్చే సంగీత ఫలంతో నీ విష్ణుకీర్తనకు కొరత ఏమి వస్తుంది?'[63]

ఇలా రాక్షసుడు అంటూనే దాసరి- 'ఇలా దేహంకాని దాన్ని అడిగి నన్ను ఏల నొప్పిస్తావు? నీకు నేనిచ్చిన మాట నా శరీర మాంసమా? లీలా వలువైన విష్ణు కీర్తన ఫలమా? పాతాళ ప్రశ్నలు మానేసి-నా శరీరాన్ని గ్రహించు! పిశాచ జాతికి సాధారణమైన వంకర మాటల్తో నన్ను మాయ చేద్దామనుకుంటున్నావా? అలా నీవు భావిస్తుంటే-బావిని త్రవ్వితే భూతం పుట్టినట్లు అవుతుంది సుమా'[64]

ఇలా దాసరి అన్న మాటలకు రాక్షసుడు చాలా కటకట బడ్డాడు. పని మీద కొరెక్కతో కన్నీరు గ్రుక్కుకున్నాడు 'కటకటా! చక్రికి నన్ని హిత దాసులు దయాళువులు కావద్దా! పూర్వం మత విశ్వాసాకుడై బ్రహ్మ సూత్రాల్ని వివరించి, హరి యొక్క విశిష్టాద్వైతం ప్రతిష్ఠించిన లక్ష్మణుడు (రామానుజుడు) అనే యోగీంద్రుడు-చిరకాలం శుశ్రూషకు సంతుష్టుడై పూర్ణాచార్యులు అనే తన గురువు గీతా చరమార్థం (గీత చివరి శ్లోకం-సర్వ ధర్మాన్ పరిత్యజ్యమామేకం శరణం వ్రజ! అహంత్వా సర్వపాపేభ్యోమో

చయిష్యామి ఖారత' అని గీత చరమ శ్లోకం) విధియుక్తంగా ఉపదేశించి 'అనధికారులకు (అయోగ్యులకు) ఇవ్వవద్దు' అని చెప్పాడు. అయినా రామానుజుడు వినకుండా దయా సముద్రుడైన (దామోదర) అనే పేరు గలిగిన శ్రీరంగనాథుని గుడి బంగారు గోపురం ఎక్కి, ఉచ్చైస్స్వరంతో ఆ గీతా చరమార్థం ఉచ్చరించాడు. గురువు అలిగాడు. దానికి రామానుజుడు గురువుతో 'దేవా! దేవర ఆజ్ఞ మీరి నేనొక్కణ్ణే రౌరవ నరకంలో పడడం మేలో! భాగవత పరిషత్తుకు పరమ పదం లభించడం మేలో? అని విత ర్కించి నీవు ఉచ్చరించినట్లుగా భావించి గీతాచరమార్థం ఉచ్చరించాను'-అని చెప్పి గురువు చేత అభినందితుడయ్యాడు.

ఆ రామానుజుడే-తన శిష్యసమూహానికి ప్రతి దినం ఉదయం వెల తీసుకోకుండా పాలు, పెరుగు, నేయి (గవ్యం = గోసంబంధమైనవి) సమర్పించి-తనను వేడుకొన్న యాదవ స్త్రీ పురుషులకు ముక్తి ప్రసాదించాడు

ఆ రామానుజుడే బంధరహితుడై కూడా మరో అవతారంలో-మరో కాలంలో-సంచిత జ్ఞానులైన భోగిలాంఛనులైన మానవులకు ముక్తి మీద తీపు పుట్టేట్లు-'సుందర జామాత' అనే పేరుతో అర్చిరాదిగతిని (ముక్తులైన వారు సూర్యమండలం ఛేదించుకొని వెళ్ళే మార్గప్రకారం) విశదీకరించాడు.

ఆ రామానుజుడే ఇక మీద యాదవగిరి మండలం (తిరునారాయణ పురప్రాంతం) పాషండులతో నిండినపుడు, వారి నాశనానికి శఠకోప యతి అనే పేర్తో ఉద్భవించి, ఆంధ్ర మొదలైన దేశాల పండిత జనాల్ని విష్ణు సంబంధమైన వాద భిక్షకు అర్థించి దిగ్విజయం చేస్తాడు. అహోబల గుహాలో అప్రతిమానుడైన నరసింహుడు కుహనా యోగిగా దర్శనమిచ్చి - జపాస నాన్ని. కాషాయాన్ని. కమండలువును ప్రసాదించగా - శఠకోపయతి సన్యాసాశ్రమం స్వీకరిస్తాడు శేషుడు, కణాదుడు, గౌతముడు, వేదవ్యాసుడు, కపిలముని, జైమినుల మతాల్ని-తనమతంలోని వంట బ్రాహ్మణుల్తో సహా తన శిష్యులకు ఎంతో చక్కగా బోధించి-పరమ హంసల అనుష్ఠానానికి పర మావధి అవుతాడు. తన పాద ద్వంద్వానికి ప్రపత్తి చేసిన లోకంలోని సతుం హృదయ భవనాల్లో పల్లేర్లు (కామక్రోధాది అరిషడ్వర్గాలు) తుడిచి శ్రీలక్ష్మీ నారాయణుల్ని నెలకొనేట్లు-భక్తిని ఉపదేశించి భూమిని పావనం చేస్తాడు.

విష్ణుపద పద్మారాధకుడైన వేంకటేశుడు (వేదాంత దేశికులు) అనే మరో మనిషి విష్ణు ప్రతిపాదకమైన నూరు ప్రబంధాలు (గ్రంథాలు) రచించి శిలా (కోతకోసిన మళ్ళలో రాలిపడిన వెన్నుల్ని ఏరుకొని జీవించే వర్తనం) వర్తనంతోను, ఉంఛ (రాలిన నీవారాది ధాన్యం ఏరుకొని బతికే వర్తనం) వర్తనంతోను బతికే తనకు ముదురాకుల్ని ఇచ్చిన అగిసె చెట్టుకు మోక్షం ఇవ్వగలడు.

ఇలాంటి భవిష్యద్వర్తమానాలు - దివ్యజ్ఞానంతో నాకు తెలుసు. ఇలాంటి త్రైకాలిక జ్ఞానం ఉన్నందువల్ల 'నా ఈ శరీరం మావనీయం గదా' అంటావేమో! ఆ త్రికాల జ్ఞానం జాతి ధర్మంగా వచ్చిందే గానీ-శమదమాదులవల్ల లభించింది కాదు, ఎరుకల స్త్రీ భవిష్యద్విషయాలు చెపుతుంది-ఆమె ఋషియా? గుడ్లగూబ, డబ్బగాటి, గబ్బిలుగు, కముంజెంటి, పైడికంటి లాంటి పక్షులు-బల్లి లాంటివి మొదలైన పశు పక్ష్యాదులు-భవిష్యత్తులో జరిగే ప్రయోజనాల్ని సూచిస్తాయి అవి తపస్వులా? అలాగే రాక్షసుడైన మా విజ్ఞానం కూడా! ఎలాగంటే నాస్తికత్వం వల్ల శాస్త్రాల్లో చదవడం, గ్రహించడం తప్ప-ఆచరణగానీ ప్రచారంగానీ లేనందువల్ల-మాకు ధర్మం దూరం అది కారణంగా-ఈ మార్గం తెలియక పోయినందువల్ల-భవబంధాల నుంచి బయట పడలేము. కలుషరహిత శరీరం వల్లగానీ - మోక్ష సుఖం లభించదు. కాబట్టి ఈ వికృత రూపం గల శరీరాన్ని-అనుగ్రహంతో పోగొట్టి-ధన్యుణ్ణి చేయి' అని దాసరి పాదాల మీద పడి పాటలో పాతిక పాలైనా రాక్షసుడు ఇవ్వమన్నాడు అతడు అది కూడా ఈలేనన్నాడు. 'పోనీ ఈ ప్రభాత సమయంలో పాడిన చివరి పాట ఫలమైనా ఇచ్చి-శరణాగతుడైన నన్ను ఆపదలేని వానిగా చేయి' అని దాసరి పాదాల మీద నుంచి లేవకుండా అలాగే ఉన్నాడు. అలాంటి రాక్షసునిపై పరమ దయార్ద్రుడైన దాసరి 'అలాగే కానీలే' అని, అతన్ని లేవనెత్తి, ఆ రాక్షస తను ప్రాప్తి విషయం వివరంగా చెప్పమన్నారు. 'చిత్తగించండి' అని రాక్షసుడు దుఃఖార్తుడై ఇలా అన్నాడు.[66]

## ఆశ్వాసాంత పద్యాలు

'స్వామీ! నీవు శ్రీకృష్ణావతారంలో ఉన్నపుడు నీ మహిమ పరీక్షించడానికి బ్రహ్మ గోకులంలోని గోవుల దూడల్ని గోప బాలకుల్ని మాయ చేశాడు అలాటి బ్రహ్మ గర్వం అణచడానికి నీవే గోవుల దూడలై, గోప బాలకులై గోవుల్ని, గోప వనితల్ని సంవత్సరం పాటు సంతోష పెట్టావు అప్పుడు బ్రహ్మ వచ్చి-నిన్ను స్తుతించి-తానపహరించిన గోవుల దూడల్ని, గోప బాలకుల్ని తిరిగి ఇచ్చి వెళ్ళాడు. అశ్వత్థామ పాండవ వంశ నాశకరమైన అస్త్రం ప్రయోగించగా-దాని జ్వాలలు అభిమన్యుని భార్య అయిన ఉత్తర గర్భంలో ప్రవేశించి-గర్భస్థ శిశువు రూపంలో ఉండే పరీక్షిత్తుని కాల్చబూనగా-నీవు మహిమతో ఆ అస్త్రాగ్నిని నీటి జడిలాగా చల్లార్చావు నారాయణుడవైన నీవు సూర్యచంద్రులే విశాల నేత్రాలుగా గలవాడివి.[67]

నిరంతరం నవనవ రతిక్రీడల్లో గోపభామినులు నీపై ఉత్కట ప్రేమను కలిగి ఉంటారు. ధ్యాన తత్పరులైన మౌనుల మానసాలనే సరసుల్లో వసించే రాజ హంసవు నీవు ఉత్తమమైన పీతాంబర ధారివి నీవు [68]

నలుడు మొదలైన చక్రవర్తులు తమ కాలాల్లో కానుకలుగా కొత్తగా సమర్పించినవి, అమూల్య మనోహరాలు అయిన కిరీటాదుల్ని ఇప్పటికీ ధరించే శ్రీ వేంకటాచలపతీ! దేదీప్యమాన విగ్రహా! మురారి సంహరణా! సకల బ్రహ్మాండ నాథుడా! అనంత కళ్యాణ గుణ సంపన్నా! ఇంత అని ఎరుగరాని విశ్వరూపంతో అర్యుల్ని సంతోషపెట్టి రక్షించే స్వామీ!'[69]

## కృతికర్త స్వవిషయం

ఇది-నైరామనపురం సుల్తాను యొక్క మణి మయాలైన మహోన్నతాలైన సౌధాల్ని-తాను వదువుకొని పోయిన ఏనుగుల దండుతో-పడగొట్టించిన కృష్ణరాయ ప్రభువు అనే నేను రచించిన ఆముక్తమాల్యదలో-ఆశ్వాస శ్రేష్ఠం ఆరవది-హృద్యమైన పద్యాలతో కూడినది[70]

## సప్తమాశ్వాసం

శివునికి బాణంగా-లక్ష్మికి నివాసంగా-సులభంగా లభ్యమైన దేహం గల స్వామీ! కువలయాపీడం అనే కంసుని ఏనుగును చంపిన స్వామీ! మకరాన్ని సంహరించిన చక్రాయుధం గలవాడా! సాధుజన సమూహానికి క్షేమంకరమైన పాదపద్మాలు గలవాడా! ఉజ్జ్వల బంగారు వస్త్రధారీ! వేంకటాచల రమణా![1] (ఆశ్వాసాంత పద్యం)

## బ్రహ్మరాక్షసుని వృత్తాంతం

సావధానంగా వినండి! ఆ రాక్షసుడు దుఃఖార్తుడై ఇలా అన్నాడు.[2]

'చోళ భూమిలో ఒక ఊళ్లో నేను పదునాల్గు విద్యల్ని నేర్చి యాగ తంత్రజ్ఞుల్ని తప్పు పట్టుతుండేవాణ్ణి. ఖండకారికల పుస్తకాల్ని-షోడశ కర్మలు చేయించడానికి-స్మార్తులు విప్పగా పరిహసించేవాణ్ణి. విద్వాంసుల సమూహం యొక్క గ్రాంథికత్వాన్ని జల్పవాదినై అవమానం చేసేవాణ్ణి.[3]

కలాంటి నదవరితో మదించిన ఏనుగులాగా మదాంధుణ్ణి అయి-నాకు-అంతవడిన-అల్ప విద్యాలబ్ధికై-విడవడానికి ముడవడానికి వేసారిపోని పీసం (కొద్ది పాటి ద్రవ్యం) ఉండే రెడ్డిలాగా-ఆ చదువే పరబ్రహ్మంగా పెద్దలతో-చెప్పి ఓడిపోయికూడా సరి అయ్యానని, సరిపోయి జయించానని అబద్ధాలాడి-పిల్లల ప్రభువుల్ని భ్రమింపజేస్తూ ఉండేవాణ్ణి. ఇలా ఉండగా దీక్షితుల్ని (యజ్ఞం చేయడానికి పూనుకొన్న వారిని) చూసి నాకు కూడా యజ్ఞాలు చేయాలి అనే కోరిక పుట్టింది. యజ్ఞాల కోసం ద్రవ్య భిక్షను కోరుకుంటూ మధురకు వెళ్ళి ఆ పురంలో-[4]

వెలివేయబడ్డ బ్రాహ్మణునికి అల్పప్రాయశ్చిత్తం చేసి-వాడిచ్చే బంగారం కోసం-వాని బంతిలో భోంచేశాను. వైశ్యుల పురోహితుల్తో కలిసి-

పుణ్యాహ వాచనాల్లో పురోహితునికి వచ్చే బియ్యం కోసం మొత్తులాడాను. సూర్యచంద్ర గ్రహణ కాలాల్లో నేను చేసే జపాలు స్నానాలు మొదలైన కర్మల ఫలాన్ని-దొరల వాకిండ్లకై ధారపోశాను. పచ్చి జింక తోళ్ళను, బర్రెల మేకల ఆవుల తోళ్ళ పాదరక్షలు-దానంగా గ్రహించడానికి ఊరంతా నేనే గుత్త పట్టాను[5]

దర్భపోటుల్ని (శ్రాద్ధ భోజనాల్ని) తిని, శ్రాద్ధాలు లేనప్పుడు శ్రాద్ధ కర్తల్లో స్నేహం చేసుకొని వారిండ్లకు వెళ్ళి-పిత్ర శేషం (పితృదేవతల కోసం వడ్డించి శ్రాద్ధ భోక్తలకు పెట్టగా మిగిలిన అన్నం) భుజించాను. అదీ లేనపుడు-అక్కవాడల్లో (పూటకూళ్ళ వాడలలో) అరకూళ్ళు మెక్కాను. వీటన్నిటినీ మించి ఒక తులాభార దానం గ్రహించాను[6]

ఈ విధంగా డబ్బు కూడబెట్టి - ఒక వైశ్యునికి వడ్డీకిచ్చి-మా ఊరికి పోవడానికి తిరిగి పూనుకొన్నాను ఆ డబ్బును చోళాలు (నాలుగేసి)గా లెక్కవేసి, వడ్డీ లెక్కలు కట్టి-'నేనమ్మిన బియ్యం మొదలైన వాటికి తక్కువ ధర గట్టావు' అని వైశ్యునితో ఘర్షణ పడుతూ, అతడు కోపంతో 'ఇస్తాన-ఇవ్వను' అని తిప్పి కొట్టి నడు రచ్చకెక్కి కూతలు పెట్టేంతలా జగడం చేస్తూ ఉండగా-ఒకడు కనిపెట్టి చూస్తూ ఉన్నాడు[7]

వెలివాడ నుండి నాణమైన కొత్త చెప్పుల్ని నేను కొని నూనె పూసి తంగేడాకు తహ తహతో కట్టుతుండేవాణ్ణి. మాసిన మీసాల్ని, గడ్డాన్ని గొరిగించుకొని-వేణ్ణీటి అంగళ్లలో నిదానంగా-తలగడుగుకుంటూ ఉండేవాణ్ణి (అభ్యంగన స్నానం చేయడం) పాలు పెరుగు నేయి, కూరలు-వంట పుట్టి (పూట కూటి) ఇంటికి-ఎప్పటికప్పుడే ధారాళంగా పంపుతుండేవాణ్ణి అడపం దులిపివేసి తమలపాకులు పోకలు దానిలో దండిగా చేర్చుతుండేవాణ్ణి. నా శిష్యుడైన బ్రహ్మచారి భుజం మీద అసిమి నంచి కోసం-వండేందుకు సిద్ధంగా బాగుచేసి ఉంచిన సడింపు బియ్యాన్ని సర్దుకునే వాణ్ణి ఆనందంతో నా భార్య కోసం మేలు చీరలు కొన్నాను ఇతర బాటసారుల్ని ప్రయాణ విషయం ప్రశ్నలు వేసి తెలుసుకొనేవాణ్ణి ఇవన్నీ చూసి ఒకడు నా ప్రయాణ సంగతి తెలుసుకొన్నాడు.[8]

వాడు నా తోటి బాటసారుల్లో ఒకడుగా కలుసుకొని వచ్చాడు. దారిలో మమ్మల్ని అటకాయించడానికి కొంతర్ని పంపాడు. బాటసారులంద ల్లాగా తానూ ఒక సంచి తీసుకొని-మాతో పాటు ప్రయాణం చేస్తూ ఉండగా ఒక చోట నిద్రించాం. ఆ నిద్రలో ఒక పొద్దుకాడ లేచి 'ఉత్తరం, ఉత్తరం'- అని తాను లేచి పోయాడు [9]

అలా వాడు లేచి పోతుండగా-తత్తరం అతిశయించి తోటి వారు వెళ్తూ ఉండగా-నేను మూట బరువును నా శిష్యుడైన బ్రహ్మచారి కెత్తి-వస్తు న్నాను. ఆ దొంగ 'ఇలా రండి' అని అడవిలోకి దారితీసి-ఒక వాగులోకి మేం దిగగానే ఈల వేశాడు [10]

అరచేతిలో గీతలు కనబడే వేకువ జామున-ఒక బాణం మా మీద పడింది. మా బాటసారుల సమూహం అలాగే నిల్చిపోయింది. రాళ్లు చిర్రు చిర్రున వచ్చాయి. ఆ రాళ్ళ వర్షంలో ముందుకు వెళ్ళడానికి తెరపిలేక-తెరు వరుల గుంపు తొక్కట పడసాగింది.[11]

ఇలా ఆ బాటసారులు తొక్కట పడుతూ ఉండగా - వారిని ఆ అడవిలో - అతి వేగంతో ఒక దొంగల దండు వచ్చి ఆక్రమించింది. ఆ దొంగల దండు ఎలా ఉందంటే-ప్రళయ కాలంలో ప్రాణి కోట్లను భక్షించ డానికి మహా ఆకలి తొందరతో-ముక్కంటి వక్త్రం నుండి ఉల్కలు మొద లైన వాటితో పాటు దుముకుతూ-దిట్టతనంలో ఆక్రమిస్తున్న పిశాచుల దండు లాగా ఉంది. ఆ దొంగల కత్తుల మిలకాంతి హాలా హలంతో పోటీ చేస్తూ ఉంది. ఆ నల్లని కాంతుల శ్రేణుల్ని చూసి-అవి రాహువులని భయపడి-సూర్యులు దద్దరిల్లి పోతూ ఉన్నారు ఆ కిరాతులైన దొంగల దండు-రాక్ష సుల సేనని గెలవ గలిగినట్టిది ఆ అడవిలో అతివేగంతో 'పొదు పొదు' అనే పలుకుల్తో పాటు-బాణాలు కూడా వేస్తూ-ఆ దొంగల దండు బాటసారుల్ని కమ్ముకొంది.[12]

ఇలా చెట్లనుండి బయటికి వచ్చి-విండ్లు వంచుకొని ముందుకొని వస్తూ ఉన్న ఆ నల్ల జనుల్ని చూచి-బాటసారులు అల్లకల్లోలమై పలాయనం పరిస్తూ ఉండే సమయంలో-[13]

ఆ బాటసారుల స్థితి ఎలా ఉండంటే-దొంగల గుంపులో 'వసలేదు విడవండి! పాపులారా!' అని దేశాయుధాన్ని (కత్తిరాయి రప్ప ఇలాంటి జాతిది) కొందరు బాటసారులు విప్పుతూ ఉన్నారు.

బంగారు ఉండే జాలెను చెట్లలో పడవేసి-దుడ్డుకర్ర పెట్లకు పరుగెత్తుతూనే - పైపంచెల్ని కొందరు పారవేశారు.

'తాము మోస్తున్న భారాన్ని దింపేసి-కటారితో వైరిని చీల్చి నిలబడి.'ఇలా ఎక్కడికి వస్తారు'? అని కొందరు దొంగల్ని ఎదిరించారు.

'దేవతార్చన పెట్టెకు కట్టిన వస్త్రం తీసుకోండి' దేవరా! ఈ దేవతా విగ్రహం మీరు తీసుకోకండి. ఇది పోతే మేం ఉపవాసం ఉండాల్సి వస్తుంది' అని దయ కలిగేట్లు కొందరు దొంగలను వేడుకొన్నారు

'మా గుంపులో ఉండేవన్నీ ఇచ్చేస్తాం. పక్కకు తొలగండి. ఒక విషయం ఏమంటే! గుంపులోని స్త్రీల మీద చేయి వేయకండి' అని పెద్దతనం. అభిమానం తోచేట్లు పలికి-తమ వస్తువులన్నీ దోపు ఇచ్చి-అక్కడి నుండి కొందరు వెళ్ళిపోయారు [14]

ఆ దొంగలు బాటసారుల నుండి ఎలా దోచుకున్నారంటే-విల్లెక్కు పెట్టుకొని ముందుకు దూసుకు వచ్చే 'తొడు వింటవాడు' అయిన బాటసారి వెళ్ళిపోవకుండా అడ్డపడకుండా దొంగలు వెళ్లి-తక్కిన వాళ్లు ఎదురు పడినపుడు-తత్తర పడేట్లు గబ గబా కొడిచారు. పిసివారి తన చేతి వద్ద ఉన్నది ఇవ్వకుండా పెనగగా-వాణ్ణి పెద్దగా బాధించకుండా-ఎర్రబడేట్లు గాయంచేసి-వాని వద్ద ఉన్నది నాకుకొన్నారు.

తమ చేత చిక్కకూడా తప్పించుకొని దూసుకొని పారిపోయే వాడు-తమ వేటుకు అందనంత దూరం వెళ్తూనే-వాణ్ణి వెంబడించడం మానేశారు. చేతిలో సొమ్ము లేకున్నా పుట పుటగా ఉండేవాణ్ణి-శోధించడానికి పక్కకు తీసుకెళ్లారు.

బాటసారులు పొదల్లో దూరతోగా-ఈ చెల్ని పొదల్లోకి దాపి బయటికి వచ్చేట్లు చేసి-వారి కట్టుబట్టలు లాక్కొని-దయతో గోచులు పెట్టు

కొనేందుకు పాత బట్టలు ఇచ్చారు. చెప్పుటట్టల్లో గల వరాహులు నిగిడించి, సిగలు విప్పి శోధించారు.[15]

ఈ విధంగా దొంగలు పెచ్చు పెరిగి-విచ్చలవిడిగా నానా విధాలైన బాటసారుల సిరిసంపదల్ని కొల్ల కొట్టే సందడిలో-[16]

ఒక ప్రచండ చండాల చోర భటుడు నన్ను తరిమాడు - వాడు పిరుదు నుండి చను మరలు హద్దుగా ఉండేట్లు నిడుపైన సిలికాసె మెరిసేట్లు బిగించి కట్టుకొన్నాడు అతని పిల్లి గడ్డాన్ని మించి మీసాలు - కుండలాంటి కడుపు మీద ఉయ్యాల లూగుతున్నాయి. బూడిద పూసుకొన్న మొగం మీద చెంపలను మూసేట్లు కట్టిన గొదకట్టు మైనపు మడ్డితో పూసిన పాత కుళ్లాయి లాగా ఒప్పుతూ ఉంది. చిటికిన ప్రేలి పూవ పిడికి వచ్చేట్లు వదులొడులుగా పట్టుకొని చిమ్ముల సురెకత్తి ధరించి-దాని కాంతులు ముమ్మరంగా వచ్చేట్లు-పట్టుకొని ఉన్నాడు. వాని పేరు కాళశ్మశ్రువు. అతడు ఊరి నుండి నన్ను కనిపెట్టుకొని ఉన్నవాడే వాడు నన్ను తరిమాడు.[17]

నాతో వస్తున్న బ్రహ్మచారిని వదిలేసి-నేను గునుకు పరుగు తీశాను. ఆ చండాల చోరభటుడు సురెకత్తి నా కొంకులకేశాడు. నేను కూలిపోతూనే-నా నిగిడిన బొజ్జ మీద వాడెపు దోవతి, దట్టి తెగిపోయేట్లు లాగాడు. నేను పెనిగాను. నా 'వల్లువం' (వరాల సంచిని) తెంచుకున్నాడు. గొదకట్టు. తాళ్లు కట్టిన కుళ్ళాయిలో ఏముందోనని వాడు లాక్కున్నాడు. ఆ లాక్కోవడంతో నా చెవుల్లోని 'అనంతుని గంట్లు' (నాగుపడగ అంటుపోగులు) తో పాటు నా చెవులు కూడా తెగి పోయాయి. ఇలా నన్ను దోచుకొని వాడు వెళ్తూ ఉండగా-[18] నా 'నోటికని'తో ఊరుకోక 'ఓరోరి! మాసమీపపు ఊరు లోనే ఉండి కూడా ఇలా చేస్తావా? అయినా ఎంత దూరం పోతావులే. పొమ్మో రీతిని నీకు దక్కుతుంది-కానీరా' అన్నాను.[19]

అలా నేను పలకగానే ఆ దొంగ ఇలా అనుకున్నాడు. 'ఇతడు అధికంగా ధనం పోగొట్టుకున్నారు కాబట్టి రెడ్డిని, రాజును చూస్తాడు' అనుకొని-నా ప్రాణం తీయడానికి తిరిగి వచ్చాడు. ఇంతలో పైనుండి వచ్చే బాట సారుల గుంపునకు భయపడి పారిపోతూ 'వెడ బొట్లు' పొడిచి వెళ్ళాడు.[20]

ఆ సమయంలో పెద్ద బాటలో వస్తూ ఉండే జన సందోహంలో- నా భార్య సోదరుడు కూడా వస్తూ-బాటసారుల సమూహం దోపిడీపాలైన విషయం విని-నన్ను వెదకి కనుగొన్నాడు. ఆర్తితో తానొక్కడే - ఎంతో అలసి పోయిన నన్ను కావిట్లో పెట్టుకొని - చీవాట్లు పెడుతూ ముందుకు సాగాడు.[21]

అలా వెళ్తూ ఉండే సమయంలో - దోపిడీ దొంగల బారిన పడిన బాటసారుల అవస్థ ఎలా ఉందంటే-'దొంగవాలుకత్తి' నరుకుల్ని వేళ్ళతో బిగబట్టుకొని-బొబ్బల్ని 'అంటుకట్టు' వేసే వైద్యుల కోసం-కొందరు వెదుకుతున్నారు. తల మీద గుదియకఱ్ఱ దెబ్బల్తో చీలికలైన తావుల్లో-పాత గుడ్డ మసి పెట్టుకొని-ఇండ్ల ముందు కొందరు ఆంబలి, గంజి భిక్షమెత్తుతున్నారు

కొందరు తమ కష్టాన్ని చెప్పుకొని - దయతో ఎవరైనా వస్త్రం చించియ్యగా-వారిని దీవిస్తూ ఉన్నారు. కొందరు కపటులు-తాము దోపు పోయిన వృత్తాంతం ఆధారంగా 'కలలేని సిరి' చెప్పుకుని-చుట్టాల ఇండ్లమీద దాడి చేశారు

ఇలాంటి బాటసారులతో ఆ ఊర్లు నిండిపోయాయి ఆ ఊళ్ల మీదుగా నన్ను ఇక్కడికి తెచ్చి-ఈ నీడలో దించి-ఏటినీళ్లు తాగడానికి-తాను వెళ్లాడు ఇంతలో నా ఊపిరి పోయి-అతడు తిరిగి వచ్చేలోగా - నాకు ఈ బ్రహ్మరాక్షసి రూపు వచ్చింది.[22]

కయ్యంలో పారిపోతూ పారిపోతూ ఉండగా గాయంచేసి-భయంతో జ్వరం వచ్చేట్లు చేసిన కాకశ్మశ్రుడనే ఆ చండాలుని భీకర వ్యూహం కన్నులకు కట్టినట్లుండగా చూస్తూ చనిపోవడం వల్ల-నాకు ఈ భయంకర వేషం వచ్చింది. కైశికీగాన దాన ఫలంతో-ఈ రూపాన్ని పోగొట్టవా? అని రాక్షసుడన్నాడు దాసరి నాకు ఫలం విషయం తెలియదు పరమేశ్వరుని ముఖోల్లాసమే భక్తునికి ఫలం-ఆజ్ఞలుగా దేవునికి చేసే కైంకర్యాలకు అనుమతిగా చేసే కైంకర్యాలకు ఫలం ఇంత అని లెక్క పెట్టడం-ప్రసన్నులైన భక్తులకు తగదు. అలా అనడం బంధకం అవుతుంది కాబట్టి-'ఫలం ఇంత। అంత!

అందుకే కొంత తీసుకో' అనటానికి భయపడకామ భగవంతుడే రక్షిస్తాడు పిల్లల్ని అనే మాటలు దాసరి నోటిలో ఉండగానే బ్రహ్మరాక్షసుడు-[23]

సోమ శర్మగా వైష్ణవుడై నిలబడ్డాడు. అతని ముఖ ముఖ్యాతిక భాగం మున్నగా క్షవరం చేయబడి-నిగ నిగలాడుతూ ఉంది. తక్కిన భాగంలో పిలకవుంది. అతడు మంచులా తెల్లనైన వస్త్రాలు ధరించాడు. దేహం మీద పవిత్రమైన పన్నెండు నిలువు నామాలు ఒప్పుతూ ఉన్నాయి. తులసి పూసల హారాలు, తామర పూసల హారాలు అలంకరిస్తూ ఉన్నాయి. అతడు గోచి, మొలత్రాడు. కావికోటి ధరించాడు. శుభకరమైన జల పూర్ణ కమండలం ధరించి ఉన్నాడు. అతని చేతిలో 'దివ్యప్రబంధాల సంపుటి' (ద్రావిడ వేదం అనే విష్ణుస్తుతి గ్రంథాలు) ఉంది. అతడు 'ద్వయ మంత్రం' యొక్క ఉత్కృష్ట వాక్యాన్ని జపిస్తూ ఉన్నాడు.

అతడు బంగారు వన్నె దేహంతో - బ్రహ్మ వర్చస్సు ప్రకాశించే వైష్ణవ తేజం కలిగిన తన దేహం మధ్యభాగ మొత్తం నుండి వెలువడే అగ్ని జ్వాలలాగా వెడలి సోమశర్మ అయి దాసరి ఎదుట నిలిచాడు.[24]

ఈ విధంగా భాగవతుడైన దాసరి పరిచయ ప్రభావంతో అతనికి బ్రాహ్మణత్వమే కాక వైష్ణవలోక కూడా నాయకం ఇప్పించింది 'కొండంతలు ఉపకారమంతగా' అతడు ఆత్మానంద భరితుడై తన రూపానికి తగ్గినట్లు-దాసరికి పూజ చేశాడు.[25] ఆనంద మధుర ప్రవాహంలో తామరాకు మీది నీటి బొట్టు లాగా, అతిశయించే వైష్ణవా జయ! గాయక సార్వభౌమా జయ! విష్ణు కథా రసజ్ఞ జయ! పుణ్యరసజ్ఞ జయ! పరమాత్మతత్వానికి సంబంధించిన సందేహాలకు కొడవలి లాంటి వాడా జయ! హీనకులంలో పుట్టి మాయచేసేవాడా జయ! గురుచరణ శరణ జయ! తప్పక కాని నేంకట్టుకొనడానికి దేహాన్ని తృణప్రాయంగా ఎంచేవాడా జయ! భగవంతుని ఆజ్ఞను నిర్వహించేవాడా జయ! నరలోకంలో సమచిత్తులైనవారికి జయ! దయార్ద్రి జయ! ముకుందుణ్ణి గాక ఇతర దేవతల్ని గురించి చెప్పే శాస్త్రాల్ని వినకుండా విముఖుడైన వాడా జయ! అష్టవిధ భక్తి చిహ్నాలతో నిండిన దేహం గలవాడా జయ! మురారి పాద పద్మాలకు ముఖ్యుడు అయిన వాడా జయ!'[26]

అని రాక్షసుడు బ్రాహ్మణుని ప్రశంసించి-ప్రదక్షిణం చేసి - పునర్జన్మభయంతో ఇల్లు ఇల్లాలు మొదలైన ప్రముఖ సుఖాలకు విముఖుడై - బదరీవనం మొదలైన హరి నివసించే పుణ్య భూములకు పావనపుణ్యంగా (మళ్ళీ మళ్ళీ) తీర్థయాత్ర చేస్తూ-మోక్షం పొందాడు.

ఈ పుణ్యకథను భూదేవిని వహించే సమయంలో మహా వరాహస్వామి భూదేవికి వినిపించాడు. ఆ కథ ద్వారా విష్ణు భక్తోచిత ఉపచారాల్లో విశేష ఫలం ఇచ్చేది గానమే అని భావించి-తాను వైష్ణవి కూడా కాబట్టి-ఆ గానం మీద కుతూహలంతో-నీకు కూతురై పుట్టి-నిన్ను చదువూ విరహా వేదంతో పాడబడిన గంభీరమైన గాథల (పాటల)లోని గాన మాధుర్య రసంతో పొద్దు పుచ్చుతున్నది గాని మరొకటి కాదు.

ఏమి తపం చేస్తున్నదో అంటివి-ఇంత కంటే పరమ తపం ఉందా? అన్నీ మేలవుతాయి. శ్రీరంగానికి రంగేశుణ్ణి సేవించడానికి తోడుకొని పోయిరా!' అని మన్నారు స్వామి శెలవిచ్చారు. 'ప్రసాదం' అని స్వామికి ప్రణామం చేసి-బంగారు పల్లకిలో బాలికారత్నం అయిన గోదాదేవిని ఎక్కించుకొని-శత పరిచారికలు, వైష్ణవ సమూహం సేవిస్తూ ఉండగా-ప్రయాణాలు చేస్తూ-స్వామి మీద పరమానురాగంతో వెళ్లాడు.[27]

అలా వెళ్లి విష్ణుచిత్తుడు శ్రీరంగాన్ని సందర్శించాడు. కావేరి అనే నామాంతరం గలిగిన విరజానది తీరంలో-నందన వనంలా చుట్టూ వ్యాపించిన చెట్ల సమూహం మధ్య-అరటి సందుల్లో నుండి దూరానికి శ్రీరంగనాథస్వామి ఆలయ సువర్ణప్రాకారం కొద్ది కొద్దిగా కనిపిస్తుంది. ఆ ప్రాకారాల శిఖరాలు-బంగారు కిరణాల్తో ఆకాశం స్పృశిస్తూ ఉంటాయి. ఆ ఏడు ప్రాకారాల్ని చూడగానే - సమస్త పాపాలు సంపెంగ పువ్వుల్ని చూసిన తుమ్మెదల్లా దూరంగా తొలగి పోతాయి. ఆ శిఖరాలు-దూరానికి దీపకళికల్లాగా మెరుస్తూ ఉంటాయి.[28]

ఆ విష్ణుచిత్త మునికి చోళ సుందరీ మణుల కొప్పుల్లోని పుష్పకల వల సుగంధ పరిమళాల కోసం మూగే తుమ్మెదల వినాదాలు-నామోదావికం

హాలికుల వివాదాలు వినబడ్డాయి. వాటిని ఆయన వద్దకు తెచ్చిన మలయమారుతం-అతని మార్గాయాసాన్ని శమింప చేసింది.[29]

విష్ణుచిత్తుడు కావేరి నీటిలో అఘమర్షణ స్నానం (పాపం పోగొట్టుటానికి మంత్రోచ్చారణ పూర్వకంగా చేసే స్నానం) చేశాడు. మాధ్యాహ్నికం (మధ్యాహ్న సంధ్యా వందన-బ్రహ్మయజ్ఞ పితృ తర్పణాదులు) మొదలయినవి తీర్చుకొన్నాడు. స్నానంచేసి, అలంకృత అయిన తన కుమార్తె గోదా దేవిని తీసుకొని-వైష్ణవ సమూహం సేవిస్తూ ఉండగా ముందుకు సాగాడు.[30]

శ్వేత ద్వీపంలాంటి ఆ శ్రీరంగంలోని భాగవతుల ప్రవర్తన ఎలాంటిదంటే-స్త్రీల పాదాల అందెల మోతలు వింటూనే-ఏనుగులు ఎదురు వస్తే తొలగినట్లుగా-స్త్రీలకు దూరంగా తొలుగుతారు. తమ ఇండ్ల ముందుకు భాగవతులు రాగానే గృహస్థులు - మణులనే పిడికిళ్లతో పెడతారు వాటిని భాగవంతునికి హారతి ఎత్తి గృహస్థులు వాకిట పోసిన కెంపులతో కలిసి పోయేట్లు ఆ మణుల్ని భాగవతులు వారి వాకిండ్ల వద్దనే చల్లుతూ ఉంటారు పువ్వులు మొదలైన వాటి పరిమళం ఆఘ్రాణించకుండా - భగవంతునికి నైవేద్యం కోసం పెట్టిన పక్వాన్నపు పరిమళం కోసం లాగా-ఊపిరి పీల్చటం ఆపుకుంటారు. నృత్యంతో పాట వినబడగానే-చిలుకల గోరువంకల హరి నామోచ్చారణలాగా అర్ధాంగీకారంతో వింటారు-ఆ పాటలకు వారి సమ్మతి లేకున్నా వాటిలో హరి నామ స్మరణ ఉంది. కాబట్టి భక్తితో అంగీకరిస్తారు. ఇండ్ల చూరులలోని రత్నాల కాంతులు-ఆ వైష్ణవుల ధవళ వస్త్రాలపై పడి-వాటికి చిత్రవర్ణాన్ని కలుగజేస్తాయి. అలా చిత్ర వస్త్రధారణ తమకు తగదు కాబట్టి ఆ భాగవతులు-ఆ రత్నాల కాంతుల రంగుల్ని తప్పించుకోవడానికి త్వర త్వరగా తొలగిపోతారు. అలా వెళ్తూ 'అమ్మలారా! రత్నాలు పెట్టకండి! ధాన్యమే భిక్షంగా పెట్టండి' అని భిక్ష అడుగుతుంటారు. భక్తికి ప్రతిబంధకం అయినందువల్ల ధనాన్ని తమ వద్దకు రానీరు. అలాంటి విరక్త భాగవతుల సమూహంతో-శ్రీరంగం శ్వేత ద్వీపంలాగా ఒప్పారుతూ ఉంది. అలాంటి శ్రీరంగంలోకి విష్ణుచిత్తుడు ప్రవేశించాడు.[31]

పిల్లగాలులు చంద్రపుష్కరిణి నీటి తుంపురులతో తడిసి-గుహల్లాంటి పురగోపురాల సమూహాల వద్దకు వ్యాపించి - ప్రోగవుతూ ' ఊగే మేలుకట్ల ఘంటాల చిరుగంటల అవ్యక్త మధుర ధ్వనుల్తో - విష్ణుచిత్తమునికి 'సుఖ ప్రయాణం జరిగిందా' అని అడుగుతూ-స్వాగతం పలికాయి. స్వామి దర్శనం అనే తీవ్రకాంక్షతో గుడి ద్వారం ప్రవేశించి-ఆ ద్వారం వద్ద తొందర పడుతూ ఉండే దేవతా సమూహాన్ని చండుడనే ద్వార పాలకుడు అదిలిస్తూ-ఆపుతూ ఉండగా చూశాడు.[32]

అక్కడ మణిమయ వేదికపై [illegible]వాసీ మీద విష్వక్సేనుడు తన అధికార చిహ్నమైన బెత్తాన్ని చేతిలో ధరించి-శ్రీరంగనాథుని ప్రతిమ ఉండే ముద్దుటుంగరాన్ని వేలికి ధరించి కూర్చొని ఉన్నాడు. అతని ఇరుపక్కలా వినమ్రులై కొద్దిగా వంగిన దేహంతో-ముగ్గురు దంత వక్త్రులు వినయంతో కొలుస్తూ ఉన్నారు. అలాంటి విష్వక్సేనుణ్ణి దర్శించి-విష్ణుచిత్తుడు వందనం చేయగా-అతను కూడా విష్ణుచిత్తుణ్ణి పూజించాడు[33]

వేద స్వరూపుడైన గరుత్మంతుడు అక్కడే ఉన్నాడు ఇంద్రుని వజ్రాయుధం సోకనందువల్ల మెరిసిపోయే బంగారు పర్వత శిఖరంలాగా అతని రెక్కల కాంతులు - అన్ని దిక్కుల్లో ఆకాశంలో - పసిరెండలాగా మెరుస్తూ ఉన్నాయి. ఆ వినతాసుతుణ్ణి నమస్కారంతో దర్శించి-విష్ణుచిత్తుడు తిరిగి అతని నమస్కారం పొందాడు[34]

## శ్రీరంగనాథస్వామి వర్ణన

విష్ణుచిత్తుడు శ్రీరంగనాథ స్వామికి గరుత్మంతునితో విజ్ఞాపన చేయించి అనుమతి పొందాడు. అక్కడ ఉండే ముక్తులు నీల మేఘ శ్యాములు, శరత్ పత్రాలైన పద్మనేత్రులు. మెరుపు లాంటి పీతాంబర ధారులు. వనమాలికలు కౌస్తుభం ఎద ధరించిన వారు. విష్ణువు ప్రతిబింబాల్లాగా ఉండే పొంకపెత్తులైన నమ్మాళ్వారు మొదలైన అలాంటి ముక్తుల్ని సేవిస్తూ-వారి చేత అభివందితుడై ముందుకు సాగారు. మహావిశాలమైన మణిమయ ఛత్రంశాల చేత భరింపబడింది-బంగారు కలశాలతో అలంకృతాలైన శిఖరాలు గల అయి

పలురంగుల వస్త్రాలతో తయారైన మేలుకట్లలో వ్రేలాడే నానా విధాలైన పూలదండలు, ముత్యాల గుత్తులు, అచ్చ రామ రాళ్ళు కలిగింది-మేరమీరిన నల్లని అగరు ధూపంతో ధూపం వేయబడింది అయిన మహాగర్భ గృహం లోని చంద్రకాంత వేదికపై-పాదాలు మొదలయిన ఆయా అవయవాల్లో ప్రతీకలుగా ఉంచబడిన ధర్మవర్మ మొదలైన నిత్యసూరుల సమూహంతో-తేజోమయమైన విపులమైన విమలమైన సింహాసనం మీద-పరిమళాల కోసం సంచరిస్తూ ఉండే తుమ్మెదల సమూహంతో కూడిన కమలం యొక్క బంగారు రంగు కలిగి ఉన్న విస్తీర్ణమైన కర్ణిక మీద-క్షీర సముద్రానికి అతిశాతమైన అది భూతంలాగా (సూక్ష్మావస్థలో ఉండే పాలులాగా) పాదరసం, మణులు, శ్రీగంధం, చంద్రుడు, తెల్ల తామరల యొక్క ధావళ్యానికి మన మనస్సుని ఆపాదిస్తూ ఉన్న కాంతి గలిగిన శేషుని పడగ భాగానికి గుణోత్కర్ష అతిశయించేట్లు-అశేష శరీరమయమైన తలగడ మీద మహార్హమైన కేయూర మణులతో-చిత్రవర్ణమైన మోకాలిని ఊరుకొని-ధ్యాన పరులైన మునుల మనస్సుల్లోని అనురాగ రసంతో తడపబడడం చేత - పిగుల ఎర్రదనం వహించిందేమో అన్నట్లున్న-ఎర్రని హస్తం-చెక్కిలిని సమీపించి -చెంపకింద శ్రీ హస్తాన్ని పెట్టుకొని ఉన్నారు. కల్పవృక్ష పుష్పాలతో కప్పబడిన శేషుని ఉడుసమే ఆయన దుకూలమైన వలువ మీద ఒత్తిగిలి ఉన్నారు. గజేంద్రుణ్ణి బాధించిన-కఠినమైన తన చక్రంతో ఖండితమైన మొసలి-పూజ్యమైన సాయుజ్యాన్ని పొందిందేమో అన్నట్లు పైభాగంలో తెప్పగా కనవచ్చే-గండస్థలంలో ఉండే మణిమకర కుండలాల ప్రతిబింబ కాంతుల ఆధిక్యంతో-పరమ సౌందర్యమైన మకరందాన్ని కురిసే ముఖార విందాన్ని రెప్పవాల్చని దృష్టితో-ప్రయాసపడి చూసేటప్పుడు నల్లని తెల్లని వర్ణం కలిగింది - రెప్ప వాల్చే సమయంలో అధికంగా నేత్రాలకు ఎదురయ్యే వెండితీగలాగా-మిక్కిలి తెల్లనైన మహాతేజః ప్రవాహంలో మునిగి-దుర్నిరీక్ష్యమైన, మనోహరమైన దివ్యమంగళ విగ్రహంతో ఉన్నారు. ఆ స్వామి నిరాకారుడై కూడా సేవించే వారికి తన రూపాన్ని చూపడానికి సాకారుడై దీపించేవాడు.

సముద్ర మధ్యం కారణమైన రాత్రివేళ, ఛాయాదేవిచేత ప్రేమతో పొందబడినవి. నల్లనివి దీర్ఘాలు అయిన కంటికొలుకుల సహితంతో ఒప్పే-చంద్ర సూర్యమయాలైన, విశాలాలైన, దీర్ఘాలైన, ప్రసన్నం అయిన కన్నులతో-కెందమ్మి రేకుల్ని వ్యాపింప చేస్తున్నాడు.

మంకెన పుష్పం వికాసాన్ని శంకించే అధరారుణిమ అనే నెపంతో జనించే నెమ్మోము నుండి-ఉత్పన్నుడైన అగ్నిహోత్రంతో - అతని సఖుడైన వాయువును కూడా కలిగి ఉన్నాడేమో అన్నట్లు. కొద్దిగా నిక్కి చొక్కమైన పూలతో విలసిల్లినదై-నవ్వు పువ్వు విలాసాన్ని అనుకరించే నాసికతో-స్వామి ప్రకాశిస్తూ ఉన్నాడు.

నాభిలో పుట్టిన శ్వేత కాంతిగల పద్మాన్ని చూసి-గొప్ప ఆశ్రయాన్ని పొందిన పూర్ణుడు చంద్రుడు అనే సందేహంతో-ఆ చంద్రునికి, రాహువైన తనకు వైరం మాన్పమని-ఆ చంద్రుని సహోదరి అయిన శ్రీదేవికి తన్న కాంచనాలు లంచాలుగా సమర్పించి-స్వామి పాదాలు ఒత్తుతూ ఉండే శ్రీదేవికి 'వశమై పడి ఉండే' రాహువేమో అన్నట్లు-భుజకీర్తులతో, కడియాలతో, రతనాల ముద్దుటుంగరాలతో చిహ్నితమైన పరిఘాయుధం వంటి భుజాన్ని - కటి పార్శ్వంలో ఉంచుకొని ప్రకాశిస్తూ ఉన్నాడు.

వక్షస్థలం మీద ఉంచబడిన తుంటేని గొప్పదైన కౌస్తుభమణి కాంతుల సమూహంలో-చిందు పడ దీపకమం నివాసిని అయిన లక్ష్మీదేవి దేహకాంతేమో అన్నట్లు-నిక్కిన స్వచ్ఛమైన శ్రీవత్స అనే మచ్చతో-స్వామి కన్నుల పండువు చేస్తూ ఉన్నాడు.

కస్తూరి సువాసనలతో ఆయించిన వాటి నేత్రానికి ఎగసి వచ్చే-తరచైన తుమ్మెదల వరుసేమో అన్నట్లు-మెరుస్తూ ఉండే నల్లని లేత తులసీ దళాల వనమాలికతో-అభిరామ కోమలమైన అలంకరణ కలిగి ఉన్నాడు.

మాయా సింహమై హిరణ్యకశిపుని ప్రాణం హరించి-మళ్ళీ మను లోకాన్ని గ్రహించేటప్పుడు జ్ఞప్తి కానందువల్ల - అలాగే ఉన్నాడేమో అన్నట్లు-సూక్ష్మమైన మేలిమి వలువతో-కడు శృంగారమైన వాడై ఉన్నాడు

ఘనమైన అహంకారం అనే ఉదయ పర్వత 'ఊర్ధ్వ ప్రదేశంలో-బంగారు మొలనూలులోని మణి శ్రేష్ఠం అనే సూర్యుడు కాసే మెండైన పిరులత పిమ్మో అన్నట్లు-ఒప్పుతూ ఉండే మెరుగు పీతాంబరంతో అలంకరింపబడి-దాని సన్నిధానం వల్ల తొడల సన్నిధానం మెరుపుల కాంతిరాగా - బంగారు, పుష్య రాగాల సంబంధం గలిగిన కెరటాలు గలిగిన వైడూర్య మణిస్తంభాల లాగా కొంచెం కప్పబడిన నీలిమమైన తొడ దోయి కలిగి ఉన్నాడు.

త్రివిక్రమావతార సంబంధి అయిన నెమ్మోముతో - అగ్రహంతో (మీదికి) ఆకాశానికి లాచేటప్పుడు-చంక్రమణ వేగంవల్ల పుట్టి కదిలిన-మణి మయమైన స్వర్గలోకం యొక్క బంగారు వలయం లాంటి ప్రాకారమో అన్నట్లు- మెరిసే ఉద్దండ గండ పెండేరంలో పుట్టే అఖండకాంతుల సమూహం వల్ల-కూర్పబడిన ముత్రిపండుల్లాంటి మడమల్తో ప్రకాశించి-తవిస్మృత్తులో తన కూర్మావతారానికి సూచకాలులాగా - కేతకాబేళ్ళ మేలిమిని పరిహసించే మీగాళ్ళతో-స్వామి ఒప్పారుతున్నాడు.

ఎర్రకలువల్లాగా మృదువైన గర్భాలు (అరగాళ్లు) అమరగా- మెరుగు చుక్కల జిగిని తెంగపరిచే గోళ్ల మండలాల (చక్రవాళాల) వెన్నెల్లో-భక్తుల మనస్సుల్లోని శోకమనే చీకటిని ఛేదించే హలం, కులిశం, శంఖం, కమలం, మకరం, అంకుశం మొదలైన రేఖలచేత చిహ్నితాలైన - లక్ష్మీ కుచం మీది కుంకుమ పూతతో అరుణారుణాలైన చరణాల్తో - స్వామి ఉన్నారు.

అధ్యాత్మికాధి దైవికాది భౌతికాలనే తాపత్రయాన్ని రూపుమాపే నారాయణుణ్ణి, పురాణ పురుషుణ్ణి, పురుషోత్తముణ్ణి, ప్రణత ఆర్తిహరుణ్ణి, వాసుదేవుణ్ణి, హృషీకేశుణ్ణి, ఈశ్వరమకుటుణ్ణి, విభీషణ వరదుణ్ణి, మన్మథ జనకుణ్ణి అయిన శ్రీరంగనాథుణ్ణి దర్శించి-తనతో పాటు వచ్చిన భాగవత పరివారసమేతంగా-తానూ తన కుమార్తె అయిన గోదాదేవి కూడా సంతోష భరిత చిత్తులై-జయ జయ శబ్దాల్తో సర్వావయవాలు నేలను స్పృశించే వారై నమస్కారాలు చేసి-లలాట ప్రదేశంలో అంజలి ఘటించారు. తర్వాత విష్ణుచిత్తుడు స్వామిని ఇలా వినుతించారు:[35]

బ్రహ్మ గృహంలో అక్షయమైన ధనానికి నిక్షేపమైన నీకు (శ్రీహరికి) శరణు! (శ్రీరంగ నాథుణ్ణి బ్రహ్మ తన లోకంలో తన గృహ దేవతార్చనగా పూజిస్తూ ఉంటాడు.) దీర్ఘకాలం ఫలించబడిన (కూడ బెట్టబడిన) ఇక్ష్వాకుల పుణ్యరాశి అయిన నీకు ప్రణామం! కుబేరుని సోదరుడు విభీషణుని కులదేవత అయిన నీకు జోహారు! ప్రణతులైన శివుడు మొదలైన దేవతలు గలవాడైన నీకు నమస్సు![36]

సర్వేశుడు, సర్వాత్మకుడు, అనంతుడు, అప్రకాశుడు (గోచరించని వాడు), అభేద్యుడు, సమస్త లోక సముదాయ ఆధారుడు, అణు సమూహంలో సూక్ష్మతముడైన వాడు, అనాధారుడు, నిత్యుడు, సత్యుడు అయిన నిన్ను సేవిస్తాము.[37]

కాలాయణుడు (సర్వాంతర్యామి నారాయణుడు), భూమి మొదలైన జడువుగల పదార్థాల సమూహం కంటే హెచ్చుగా, అతిశయించే గరిష్ఠత కల పరమ పురుషుడు అయిన నిన్ను శరణువేడి స్తుతిస్తాము.[38]

బ్రహ్మ, శివుడు మొదలైన వారితో కూడిన ఈ సమస్త జగం ఎవ్వనిలో పుడుతుందో, ఉంటుందో, లయిస్తుందో-అలాంటి మహిమకు చోటైన నిత్యుడు, సమస్త భూతమయుడు దేహేంద్రియాదుల కంటే, సర్వజీవుల కంటే పై వాడయిన నిన్ను - మహామహుణ్ణి (గొప్ప తేజం కలవాణ్ణి) స్తుతిస్తాము.[39]

ఇతరు (దేహేంద్రియాలకు ఇతరుడైన జీవుడు) కంటే ఇతరుడు అనబడే వాణ్ణి, పరమాత్ముణ్ణి, ముక్తికోసం పరమ యోగి సమూహంతో సదా భావింపబడే వాణ్ణి, ఎవనిలో ప్రాకృత గుణాలు అయిన సత్త్వాదిగుణాలు సంతతి ఉండవో అలాంటి విమలుణ్ణి, సర్వప్రాణుల కంటే అధికుణ్ణి, శుద్ధుడు అయిన వాణ్ణి, విభుణ్ణి, కళాకాష్ఠాది భేదం మొదలైన కాల సూత్రం అయిన ఎవని శక్తి ఇంద్రియ గోచరం కాదో, ఏమీ అంటని వాడై వర్తించడం వల్ల అతివిశుద్ధుడు తానై కూడా, తన వ్యాపారం వల్ల పరమేశుడై ఉన్నాడో అలాంటి విష్ణువైన నిన్ను భావిస్తున్నాను.[40]

అవి నిత్యముక్తులకు సేవనీయమైన పరస్వరూపులైన వేల్పులకు సేవ్యులైన వాని యొక్క - శశ్యమైన దివ్యమైన మంగళ అవతారాంశాలని ప్రస్తుతించారు. కౌస్తుభాభరణుడైన హరి కరుణా తరంగితాలైన కడగన్నులతో-ఆ మునిని చూసి, ఇలా ప్రశ్నలు వేశారు. కంకణాలంకారాల నుండి కల నాదాలు వినిపించగా-తన పాద పద్మాలకు కుసుమాంజలుల్ని సమర్పించే సకల సీమంతినీ తిలకమైన ఆముక్తమాల్యద రూపును, ఎల ప్రాయాన్ని సాభిప్రాయంగా చూచి హరి తనలో ఇలా అనుకున్నారు.[41]

'ఈ గోదాదేవి చూపు ఎదురెక్కినందువల్లే-యుద్ధం చేయడానికి మన్మథునికి 'బిరుదు టెక్కెం' (మీనం మన్మథుని జెండా గుర్తు) కలిగింది. ఈమె నడుము విలాసంగా అల్లాడడం (కదలాడడం) వల్లనే - భూమి మీద చైత్రునికి కాలు మోపడానికి అవకాశం కలిగింది. (ఆమె నడుము లతలాగా సన్నగా అందంగా ఉంది. లతలు వికసించడం వసంత ధర్మం) ఈమె పాలిండ్లు ఉబ్బినందువల్లే-రతి చేతి కిన్నెర మ్రోతకు వన్నె కలిగింది. (తుంబివల్ల కిన్నెరకు మంచినాదం వస్తుంది. గోదాదేవి పాలిండ్లు తుంబీ ఫలాల్లాగా నిండారుతున్నాయి ) ఈమె మోము ఒప్పారినందువల్ల-వాణి వాహనం అయిన రాజ హంసకి గూడు కలిగింది. (వాణి హంసకి తెల్లతామర నివాసం-గోదాదేవి ముఖం సిత పద్మంలాగా ఒప్పారుతూ ఉంది ) ఈమె నిడుపాటి వెంట్రుకలు పసారినందువల్లే-పెంపుడు నెమలి విరహం పొందగలిగింది. (మయూరి మేఘాన్ని ప్రేమిస్తుంది. ఆమె నిడుపాటి శిరోజాలు కాఱు మబ్బుల్లాగా అతిశయిస్తున్నాయి.)

ఈమె అడుగులు ఎఱుపు మీరినందువల్లనే-తప్పిగొన్న తుమ్మెదలకు మెట్టవంట కలిగింది. (తుమ్మెదలు సులువుగా తేనె ఆస్వాదించడానికి-మెట్టతామరలలాగా రంజిల్లుతున్నాయి.)[42]

ఇలా అనుకుంటూ రంగనాథస్వామి ఉవ్విళ్లూరి-తమకం ఆపుకో లేక ఆమెను తన శుద్ధాంతఃపురానికి చేర్చాడు. ఆమె స్థానంలో - ఒక మాయా గోదాదేవిని కావించాడు. గోదాదేవి తమ వద్దే ఉందని-అందరూ అనుకుంటున్నారు.[43]

పూజకుల చేత పాద తీర్థం, ప్రసాదం, పరివేష్టవాలు (గుడిలో పూజాది విశేషాల్లో శిరానికి చుట్టే వస్త్రం) విష్ణుచిత్తుడు మొదలైన వారికి- రంగనాథుడు ఇప్పించి విడిదికి అంపాడు. గుడి వెడలి మాయా యువతిని పల్లకిలో పెట్టి విడిదికి వెళ్ళి పంజరం ముసుగును సడలించి విష్ణుచిత్తుడు చూశాడు. ఆమె కనిపించలేదు[44]

'అబ్రహ్మణ్యం! అన్యాయంగా నా కూతుర్ని అపహరించాడు. ఈ రంగభర్త తాను బ్రహ్మాది దేవతల్ని వారివారి హద్దుల్లో నిలిపి, ప్రభుత్వం వహించి కూడా ఈ విధంగా దోచుకుంటాడా? ఈ బక్క బ్రాహ్మణుణ్ణి 'దయ చూడండి' అంటూ-దుఃఖ సముద్రంలో మునిగి కన్నీరు అడ్డుపడిన స్వరంతో-కృశించిన ఎండు గడ్డిలాంటి బాహువులు పైకెత్తి విష్ణుచిత్తుడు మొరపెట్టాడు.[45]

ఆ రంగ భర్తకు అంత వేడుక అయితే గోదాదేవిని పెండ్లి కావడానికి నేనే ఇవ్వనా? నా దేహం, ప్రాణం, సంతానం, ఇల్లు, ధనం, పంటలు పశుశ్రేణులు-ఇవన్నీ ఆయన భక్తులకివ్వడానికే గదా! అలాంటప్పుడు ఈ బిడ్డను ఆయనకు ఇవ్వడం ఏమి గొప్ప? నన్ను ఇలా కురుచగా విస్తే ఆయన్ని ఎవరైనా మెచ్చుకుంటారా?[46]

ఓ కేశవా! శివుడు, బ్రహ్మ, ఇంద్రుడు నీకు చెప్పడానికి అశక్తులు- ఎందుకంటే వారు నిన్ను సేవించే వారు కాబట్టి విరంకుకుడివని ధర్మం తప్పడం చెల్లుతుందా? ఈ ప్రపంచాలన్నీ నీవయినా-నీ వద్ద దయానిధి అమ్మ (మహాలక్ష్మి) లేదా? భాగవతులు లేరా? వారు నా కోసం చెప్పగలరు.[47]

లోకాతీతలైన శ్రీలక్ష్మీదేవి, నీళాదేవి, భూదేవి ఇల్లాండ్రుగా ఉండగా ఈ 'నైష్టికస్త్రీల' (సదాచార పరతంత్ర) మీద నీవు మనసు నిల్పడాన్ని ఏమనాలి? పేదవాణ్ణయిన నన్ను వెర్రివాణ్ణి చేసి పరిహాసం చేయాలని కాక పోతే-నా కూతురిలో అంత అతిలోక సౌందర్యాన్ని చూశావా? నడుం వంకరల్ని, నీటి డొంకల్ని ఎవరు దిద్దగలడు?[48]

అని ఇలా బ్రాహ్మణుడైన విష్ణుచిత్తుడు మొరపెట్టగా, విష్ణుచిత్తుని శోకను భువన భర్త అయిన శ్రీరంగనాథుడు దయవడి-అతని చాందసానికి గేలి చేస్తున్నాడు-అనే భావం అతనికి తోచేట్లు-మకర కుండలాలతో తేజరిల్లే అద్దాల్లాంటి చెక్కిళ్ళ మీద చిరునవ్వు వికసించగా ఇలా అన్నాడు.[49]

'ఓ ముని ముఖ్యా! ముదిమి వల్ల నీకు మతి తప్పింది కాబోలు! నీ కూతుర్ని ఇంటిలోనే పదిలం చేసి వచ్చి-బట్టబయలులో పెట్టినింద నా మీద మోపుతున్నావు. ఆ ఇల్లు మరొకసారి చూసి వచ్చి, చంచలలోచన అయిన నీ కూతురు కనిపించక పోతే అప్పుడు నిందస్తువుగానీ! విపరీత బుద్ధిమాని వెళ్ళి చూచి రావో'![50]

అని శ్రీరంగనాథస్వామి అనగానే-'నా తండ్రీ! అయిందా! మేము ఎప్పుడూ దుఃఖాన్ని ఎరుగం. కడుపు చల్లగా పలికి కరుణ చేశావు! విజయవిభా'! అంటూ విష్ణుచిత్తుడు కన్నీరు అపుకుంటూ ఇంటికి వచ్చాడు.[51]

ఇంటి వద్ద మ్రొక్కిన తనయ శిరస్సును మూర్కొని - ఆనంద బాష్పాలు ప్రవహిస్తూ ఉండగా-విష్ణుచిత్తుడు తన కూతురు వెన్ను నిమిరి-'నా తల్లి నిన్ను చూడగలిగాను' అని ఆనందిస్తూ-ఆమెతో పాటు ఇంటివద్దనే ఉన్నాడు[52]

రంగపతి తనకు ఆ కన్య గోదాదేవిని అడగడానికి సరస్వతీ బ్రహ్మల్ని, గౌరీ శివుల్ని పంపించాడు వారు విష్వక్సేనునితో కూడా రాగానే-విష్ణుచిత్తుడు సంభ్రమంతో కూడుకొన్నవాడయ్యాడు[53]

విష్వక్సేనుడు మొదట రాగా వెంట వచ్చిన బ్రాహ్మీ బ్రహ్మలకు, శివానీ శివులకు వినయంగా అతిథ్యాలిచ్చి-ఉచితాసనాల మీద ఆసీనులై ఉన్న వారి రాకకు కారణం ఏమిటో అడిగి తెలుసుకొని-ఆనందరస భరిత అంతరంగుడై ఇలా అన్నాడు.[54]

## గోదాదేవి రంగనాథుల కళ్యాణం

'విష్వక్సేనా! బ్రహ్మదేవా! శంకరా! రంగభర్తకు ఈ కన్యక గోదాదేవిని ఇచ్చే భాగ్యం కలిగి ధన్యుణ్ణయ్యాను. భృగువు గౌరవం, సముద్రుని కీర్తి నాకు అబ్బింది, ఇలా అడిగి పెండ్లాడడం అన్యాయం కాదుకదా![55]

(లక్ష్మి మొదట భృగువు కూతురుగా ఉండి తర్వాత సముద్రునికి తనయగా ఉద్భవించింది. అందువల్లనే లక్ష్మి భార్గవి, క్షీరసాగర సుత అయింది)

ఇయ్యరగిన సంబంధాన్ని గురించి సామాన్య జనులు ఇతడు 'ఈమెను కని మోసి శ్రీరంగానికి తెచ్చి ఇచ్చారు' అని ఘనతగా భావిస్తారు. కాబట్టి మాపురం అయిన విల్లిపుత్తూరుకు స్వామి వారు విజయంచేస్తే పుత్రికనిస్తాము.[56]

ప్రభుత వల్ల పరమేశ్వరుడైనా తన ఆశ్రిత జనం అయిన మీకు ఈ చనువు ఇస్తాడు. కాకి తానే కట్టిన ఈ పెండ్లి కొడుకు వేషం వేయడం మాకు గొప్ప. ఆ గౌరవాన్ని మాకు దక్కించడం అతని ఘనత'![57]

అని విష్ణుచిత్తుడు చెప్పగా దయారసార్ద్రచిత్తుడై-విశ్వభర్త పక్షి ప్రధానమైన గరుత్మంతుణ్ణి అధిరోహించి - బ్రహ్మాది దేవతలు తమ తమ వాహనాలెక్కి సేవించిరాగా-[58] విష్వక్సేనుడు తాను ముందు వెళ్తూ - పెండ్లి వారి సందర్శి పరనలు తీర్చి - తన వెంట తీసుకెళ్లాడు. అలా పౌజు తీర్చిన (వ్యూహం పన్నిన) బలం భూషణాలం ఖడ్గం. వజ్రాయుధం యొక్క శతకోటి సూర్యుల ప్రభలు-దిక్కుల్లో అధికంగా అలముకున్నాయి[59]

అలా శ్రీవిల్లిపుత్తూరుకు వారు వెళ్ళి-విశ్వకర్మ మణిమయంగా కట్టిన విడిది పట్టులో ప్రవేశించారు. ఆ ఆదిమ పెండ్లి కొడుకు అయిన శ్రీహరి - దివ్యాభరణలు పసుపు మొదలైన స్నానీయ మంగళ ద్రవ్యంతో అలంకారం చేయగా-పెండ్లికొడుకయ్యాడు. దేవ దుందుభులు. నారదాది దివ్య మునుల గానాలు శబ్దిస్తున్నాయి.

రంగనాథస్వామి వెండిలాంటి ధవళ దివ్యమేఘాలు కురిసే అమృత ధారలతో-అభిషిక్తుడయ్యాడు. ముత్యాల సరాల తోని కౌస్తుభ రత్నంతోను అలంకరింపబడిన శంఖంలాంటి కంఠంతో, కేయూర కంకణాలతోను అలంకృతుడయ్యాడు. మకర కుండలాలు, కిరీటం మొదలైన భూషణాలతో విభూషితుడయ్యాడు. దివ్యమైన అంగరాగం (మైపూత) అలదుకొన్నాడు. పీతాంబరాన్ని ధరించాడు. తులసీ కల్పవృక్షాల పూలమాలకు ఆశ్రితమైన వక్షం కలవాడయ్యాడు.

ఇక్కడ ఇలా ఉండగా అక్కడ విష్ణుచిత్తుడు గృహ ప్రవేశం చేసి-సంభ్రమాయత్తుడైన విష్ణుచిత్తుని ప్రయత్నంతో -[60] పార్వతి, వాణి మొదలైన దేవతా స్త్రీల సమూహం-పూర్వం ఆచరించబడిన సీతా రాముల కళ్యాణానికి సంబంధించిన అతిశయాలైన గీతాల్ని వైభవంగా పాడారు.[61] మైత్రితో ఏకావళి, ప్రగ్విణి ఇరువైపుల వింజామరలు వీస్తూ ఉండగా-గోదాదేవిని పెండ్లి కూతుర్ని చేసి-ఋషి పత్నులు ఆశీస్సహితంగా పసుపు ద్రవంతో నలుగులు పెట్టారు.[62]

అలా వివాహ దీక్ష జరగ్గా, వాసన నూనెతో గోదాదేవికి తలంటి, శిరోజాల్ని గంధంతో పులిమి, స్వర్ణ మణిమయమైన కడవల్తో చల్లని జలంతో జలకమాడించారు. దేవతా స్త్రీ ఒకామె[63] ప్రేమతో తడి తుడిచి నాడెమైన సన్న చీర కట్టించింది ఒకామె మణిపీఠం మీద కూర్చున్న గోదాదేవి మెరిపే పొడవాటి శిరోజాలు ఆరబెట్టి-ధూపం వేసి కొప్పు తీర్చింది.[64]

ఒక అతివ లత్తుక నీళ్లని గోదాదేవి ఎర్రని పాదాల గోర్ల వరుసలకు పూసింది. ఒక పడతి గోదాదేవి నయమైన వేళ్ళకు మట్టెలు, పిల్లాండ్లు-పాదాలకు అందెలు అమర్చింది ఒక వెలది కుచ్చిళ్లు పెట్టి బంగారు నీటివ్రాత చెరగు ఉండే తెల్లని పట్టు చీరను-ప్రేమతో గోదాదేవికి కట్టించింది. ఒకామె గోదాదేవి కటిసీమలో బంగారు మొలతాటిని, కంఠంలో తారహారాల్ని అమర్చింది.

కంకణాలు, హస్త సరాలు, భుజకీర్తులు, ఉంగరాలు, తీగెలాంటి బాహువులకు, వ్రేళ్ళకు అమర్చారు-కమ్మలు, ముత్తెపు ముక్కర పెట్టారు. పాపటలో పాపట బొట్టును ఒకామె నిలిపింది.[65] ఒకామె గోదాదేవి తెల్లని కన్నుగవకు కాటుక రేఖలు తీర్చింది-శరీరానికి కస్తూరి పూసింది. చేర్చుక్క పెట్టి, కొమ్ముడికి చెంగలువలు కూర్చింది.[66]

ఈ విధంగా గోదాదేవి అలంకృతయై ఉండగా, లగ్నం సమీపించిందని విన్నవించడంతో-శేషశయనుడైన హరి బయలుదేరాడు. చంద్ర సూర్యమండలాలు దివ్వెలై వెలుగుతున్నాయి తారకల గుంపు గొడుగు

చుట్టూ ఉండే ముత్యాల జాలర్లు కాగా-పద్మ విరోధి అయిన చంద్రుడు గొడుగయ్యాడు, సముద్రుడు సౌగంధిక పుష్పదళాల కానుకతో కూడా-విపణి వీధిలో కల్లాపివి చిలికించాడు - ప్రకృతికాంత - సురస్త్రీలతో కలుసుకొని (కూడుకొని) ఆ సమీప ప్రదేశాన్ని సవరణ పరిచింది. అగ్నిదేవుడు అగరు ధూపం వేశాడు. మేఘుడు ఉల్లెడ పట్టాడు. వేదాలు వంది మాగధ సంఘాలై-బిరుదు కైవారాలు పఠించాయి. నారదసనందనాది మునులు - సంగీత మంగళత్వంతో అంతరంగానికి ఇంపుచేకూర్చారు. పక్షి శ్రేష్ఠుడైన గరుత్మంతుడు-మదగజంగా స్వర్ణరత్నమయమైన పల్యాణాన్ని వహించాడు. అలా శ్రీరంగనాథస్వామి అలౌకిక సామాన్యమైన వైభవంతో వెళ్ళగా, భాగవత శ్రేష్ఠుడైన విష్ణుచిత్తుడు పరమ సంభ్రమంతో భక్తిసహిత ప్రణామ పూర్వకంగా-స్వాగతం చెప్పడానికి వచ్చాడు. స్వామివారు తన వాహనం దిగి-విష్వక్సేనుని కైదండ గ్రహించి నడిచి వెళ్తుండగా ద్వారాల్లో - చంచలాక్షులు కడిగే స్వామి పాదాల జలం కోసం పైపైన పడుతూ-దేవతలు సిద్ధ సంఘాలు మేము ముందంటే మేము ముందని-భూమిని నిర్జలం అయ్యేట్లు ఊడ్చుకొని-ఆ పాద జలాన్ని పుచ్చుకొన్నారు అలా స్వామి పెండ్లిపందిరి ప్రవేశించి విష్ణుచిత్తుడు నిర్దేశించిన స్వర్ణ పీఠంపై ఆసీనుడయ్యాడు. విష్ణుచిత్తుడు బంగారు చెంబుల్తో-పసిడి పళ్లెంతో ఉంచబడిన తామర పూలలాగా-మృదువులైన చిగుర్లలాంటి స్వామి పాదాల్ని కడిగాడు. షోడశోపచార సహితంగా-సాలంకారమైన మధుపర్కాన్ని సమర్పించగా-స్వామి గ్రహించాడు. విష్ణుచిత్తాళ్వారు, ఆయన దేవేరి ధారపోయగా కన్యకారత్నమైన గోదాదేవిని పరిగ్రహించాడు తర్వాత-[67] వేల్పు పెద్దలు బంగారు పిటి చిత్రాలు మెరవగా ముత్యాలు కూర్చబడిన వల్లవి అంచులు గల పెద్ద తెర పట్టి, లగ్నం సమాసన్నంకాగా-బ్రహ్మాది వేల్పు పెద్దలు-ఆ తెరను కిందికి దించేశారు వధూవరులైన గోదా శ్రీరంగనాథులు ఉప్పొంగుతున్న ప్రీతితో-కనుల తళ తళలు చిద్రుముద్రాడగా-ఆసక్తితో ఒకరి శిరంపై మరొకరు జీలకర్ర బెల్లం ఉంచుతున్నారు.[68]

అనంతరం రంగనాథుని శిరసుపై-గోదాదేవి ముత్యాల తలంబ్రాలు పోసేటప్పుడు-మెరిసే ఆమె చిగుళ్ళలాంటి వ్రేళ్ళ స్పర్శకు చక్రి చెమర్చగా-అతని దేహం నుండి స్వేద బిందువులు దట్టంగా రాలాయి. ఆ దృశ్యం ఎలా ఒప్పిందంటే స్వామి స్వేద బిందువులు మేఘం నుండి జారిపడే వర్షధారల లాగా, తలంబ్రాల మణులు వడగండ్లులాగా ఒప్పారాయి.[69]

గోదాదేవి దోసిలితో తలంబ్రాలు ఎత్తి పోసేటప్పుడు-శ్రీరంగనాథ స్వామి ఆమె గుబ్బపాలిండ్ల పార్శ్వాలపై తటాలున కన్ను వేశాడు. ఇది గమనించిన గోదాదేవి సిగ్గుతో-బాహువులు స్వామి శిరస్సు మీదికి ఎత్తకుండానే-కొన చేతులతోనే తలంబ్రాలు పైకి ఎగరజల్లింది.[70]

హరి గోదాదేవి గళంలో మంగళ సూత్రం కట్టగా-ఆమె శరీరంలో పులకలు పొటమరించాయి. సతి అయిన గోదాదేవి, పతి అయిన హరి-ఒకరి మణికట్టుకు మరొకరు కంకణాలు కట్టారు.[71]

హరి గోదాదేవితో లాజలతో (పేలాల్తో) హోమం వేల్పించి-సప్తపదుల్ని నడిపించారు ఆమెతో కూడి అరుంధతి దర్శనం చేశాడు. దేవతలు చదివించిన కట్నాల్ని దయతో స్వీకరించి-వారిని తన అనుగ్రహానికి పాత్రుల్ని చేసి-వారి వారి నివాసాలకు పంపాడు. గోదాదేవిని తోడుకొని శ్రీరంగానికి విజయం చేశాడు. కావేరీ నదీ తీరం ఉద్యాన వనాల్లోని-చందన వృక్షాల పొదల నీడల్లో-నీలవేణి అయిన గోదాదేవిని ఉపలాలనలు చేసి, మన్మథ సామ్రాజ్యం ఏలిందాడు. తన చిత్తంలో కరుణ ప్రసరించగా లోకాల్ని ఏలుతూ ఉన్నాడు.[72]

## ఆశ్వాసాంత పద్యాలు

స్వామి పుష్కరిణి తీరాల్లోని రమణీయ గుహల యొక్క చందన వనం, మొల్లవనంలో నుండి వీచే మంద మారుతం వల్ల చలించే వనమాల గలిగిన వాడా! నిర్మల దివ్య విగ్రహం యొక్క స్థిరమైన కాంతితో నింగి నేల మను తళుకుందుల చేసిన స్వామీ! యాదవాంగన సమూహం ఆత్మగౌరవాన్ని, ధైర్యాన్ని విచ్ఛేదనం చేసే-మంజులమైన పిల్లనగ్రోవి నాదనగల స్వామీ![73]

చక్రధారతో ఖండితమైన సురారి సంఘం కలవాడా! పక్షివాహనా! నీ బొడ్డు అనే దొన్నెలాంటి తెల్ల తామరలో నిండిన మకరంద ప్రవాహంలో పిడి పావలాగా ఒప్పే బ్రహ్మ గలిగిన స్వామీ![74]

వాలిని రేబడకా! పద్మనేత్రా! పార్వతీ స్తుతా! శార్ఙ్గం వల్ల కలిగే కిణాలు కలిగిన స్వామీ! ముక్కంటి, బ్రహ్మ, దేవేంద్రుని ప్రకాశించే మౌళి మాణిక్యం కాంతుల్తో-అలంకృతమైన పాదద్వయా![75]

## కవి స్వవిషయం

ఇది నీలాద్రి పూరీ జగన్నాథ క్షేత్రంలోని బలరామునితోను, సుభద్ర అనే చెల్లెలితోను కూడుకొన్న నల్లకలువ కాంతిలాంటి కాంతి గలిగిన శ్రీకృష్ణుని కంటే ఎదుట చూపుల్తో - ఒప్పుతూ ఉన్న బాహాబలం యొక్క సమర్థమైన జయ సన్నాహపు మ్రోతతో కూడిన వాద్యాల రీతితో-కటక పుర రాజైన గజపతిని పలాయనం పాలు చేసిన-కృష్ణరాయ మహీపతి చేత నిర్మితమైన 'ఆముక్తమాల్యద' కావ్యంలో [illegible]ల్లో ఏడవ ఆశ్వాసం అలరారుతూ ఉంది.[76]

CENTRAL LIBRARY RESEARCH CENTRE TIRUPATI

